
www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI



రైలు వేగం గంటకు 1000 కి.మీ.

విజయవంతంగా పరీక్షించిన చైనా
అయస్కాంత శక్తితో నడిచే మాగ్లెవ్ రైలు
పట్టాలను తాకకుండా గాల్లో తేలుతూ పరుగు
పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో మాగ్లెవ్ టెక్నాలజీని అభివృద్ధి చేసిన డ్రాగన్ 2

గురువారం | 8-8-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 131 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, శుక్లపక్షం; తిథి: చవితి రా. 12.37 తదుపరి పంచమి; నక్షత్రం: ఉత్తర రా. 11.37 తదుపరి హస్త వర్జ్యం: శేషం ఉ. 6.25 వరకు, దుర్ముహూర్తం: ఉ. 10.13-11.04, మ. 3.18-4.08, అమృతఘడియలు: మ. 3.26-5.15, రాహుకాలం: మ. 1.30-3.00, సూర్యోదయం: 6.00, సూర్యాస్తమయం: 6.41 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem |Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

కొంపముంచిన 100 గ్రాములు

పతకం దూరం!

ఫైనల్ బౌట్‌కు ముందు వినేశ్ ఫొగట్‌పై అనర్హత వేటు

నిర్ణీత బరువు 50 కిలోలకన్నా 100 గ్రాములు ఎక్కువున్నట్లు నిర్ధారణ
నిబంధనల ప్రకారమే పోటీ నుంచి తప్పించారన్న వరల్డ్ రెజ్లింగ్ చీఫ్
స్పందించిన మోదీ.. ఐవోసీ ఎదుట నిరసన తెలపాలని పీటీ ఉషకు సూచన
వినేశ్.. చాంపియన్లలో చాంపియన్‌వి.. దేశమంతా నీవెంటే: ప్రధాని ట్వీట్
సాంకేతిక కారణాలతో పోటీ నుంచి తప్పించడం దురదృష్టకరం: రాహుల్
12 గంటల్లో బరువు తగ్గించడానికి చేయాల్సిందంతా చేశాం: జట్టు వైద్యుడు
వినేశ్ అనర్హతకు గురవడం బాధించింది: బ్రిజ్‌భూషణ్ కుమారుడు కరణ్
పూర్తి విచారణ జరగాలి.. పార్లమెంటు ఉభయసభల్లో విపక్షాల పట్టు
క్రీడామంత్రి వివరణపై అసంతృప్తి.. వాకౌట్.. న్యాయం చేయాలంటూ నిరసన

కోచ్‌లు, న్యూట్రిషనిస్ట్, సహాయ సిబ్బంది నిర్లక్ష్యమే కారణమా?

మంగళవారం ప్రీక్వార్టర్స్‌కు ముందు 49.9 కిలోలున్న ఫొగట్
అదే రోజు 3 బౌట్లు అయ్యాక ఆమెకు స్వల్పంగా ఆహారం, నీళ్లు..
కొన్నిగంటల్లోనే 52.8 కిలోలకు చేరిక.. తగ్గేందుకు రాత్రంతా కసరత్తులు
స్కిప్పింగ్, జాగింగ్, జుత్తు, జెర్సీ కొంతమేర కత్తిరింపు..
ఆఖరికి శరీరంలోంచి కొంతమేర రక్తం తీసివేత.. అయినా తప్పని నిరాశ



నిర్ణీత బరువుకన్నా 50 గ్రాములు, 100 గ్రాముల బరువు అధికంగా ఉన్నా కూడా రెజ్లర్లను గతంలో కొన్ని టోర్నీల్లో అనుమతించారు. ఒలింపిక్స్‌లో నిబంధనలు వేరు. పారిస్ ఒలింపిక్స్‌లో వినేశ్‌కు ఇలా జరిగిందని అభిమానులు నిరాశ చెందొద్దు. ఏదో ఒకరోజు ఆమె కచ్చితంగా పతకం సాధిస్తుంది. తదుపరి ఒలింపిక్స్ కోసం ఆమెను సన్నద్ధం చేస్తా.

- వినేశ్ ఫొగట్ పెదనాన్న, దిగ్గజ రెజ్లర్ మహావీర్ ఫొగట్



న్యూఢిల్లీ, ఆగస్టు 7: పారిస్ ఒలింపిక్స్‌లో స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగట్ ఫైనల్ బౌట్ ఎప్పుడెప్పుడా అని ఎదురు చూసిన భారత అభిమానుల గుండెపగిలింది. ఆమెకు స్వర్ణపతకం.. లేకపోతే రజతం ఖాయమని సంబరపడుతున్న వేళ షాక్ తగిలింది. వినేశ్‌పై ఫైనల్ బౌట్ ముంగిట అనర్హత వేటు పడింది. యాభై కిలోల విభాగంలో బరిలోకి దిగిన ఆమె, 50 కిలోలకు మించి 100 గ్రాముల బరువున్నట్లు గుర్తించారు. ఆ వెంటనే.. ఒలింపిక్ కమిటీ ఓ ప్రకటన చేసింది. అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ నిబంధనల మేరకు వినేశ్‌పై అనర్హత వేటు వేస్తున్నట్లు ప్రకటించింది. ఫలితంగా ఆమె ఫైనల్ బౌట్‌లోకి దిగే అవకాశమే లేకుండా పోయింది. వినేశ్‌పై అనర్హత వేటు విషయం తెలిసిన వెంటనే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పందించారు. భారత ఒలింపిక్ సంఘం (ఐవోఏ) అధ్యక్షురాలు పీటీ ఉషతో ఫోన్లో మాట్లాడారు. వినేశ్ విషయంలో అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐవోసీ) ముందు భారత్ నిరసనను వ్యక్తం చేయాలని సూచించారు. అయితే వినేశ్ అనర్హతపై పునఃసమీక్షించాలంటూ ఐవోసీని ఐవోఏ కోరినా ఫలితం లేకపోయింది. నిబంధనలు అందరికీ ఒకేలా ఉంటాయని, వినేశ్ విషయంలో ఏమీ చేయలేమంటూ వరల్డ్ రెజ్లింగ్ చీఫ్ నెనాడ్ లలోవిక్ స్పష్టం చేశారు. అనంతరం.. వినేశ్‌ను పోటీల నుంచి తప్పించారన్న వార్తను

మిగతా 2వ పేజీలో...



ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడు అజయ్ బంగాతో సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రి శ్రీధర్‌బాబు, సీఎస్ శాంతికుమారి

నాలుగు గ్యారెంటీలు

తెలంగాణకు ప్రపంచ బ్యాంకు హామీలు

హైదరాబాద్ 4.0, మూసీ సుందరీకరణ, స్కిల్ యూనివర్సిటీ, ప్రజారోగ్య రంగాల్లో సహకారం
వరల్డ్ బ్యాంకు అధ్యక్షుడితో సీఎం చర్చలు సఫలం.. నిపుణులతో ఉన్నతస్థాయి కమిటీకి నిర్ణయం
ఆర్థిక సహకారానికి ప్రపంచబ్యాంకు సిద్ధం.. వివింట్ కంపెనీ రూ. 400 కోట్ల పెట్టుబడులు
వెయ్యి మందికి ఉద్యోగాలు.. ఆవిష్కరణల అభివృద్ధికి ముందుకొచ్చిన కార్నింగ్ కంపెనీ

హైదరాబాద్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర భవిష్యత్తుకు సంబంధించి కీలక నిర్ణయం.. అమెరికా పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఘనవిజయం. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న కీలకమైన నాలుగు ప్రాజెక్టులకు ప్రపంచబ్యాంకు సహకారం లభించింది. తెలంగాణలోని నాలుగు కోట్ల మంది ప్రజల జీవన ప్రమాణాలను పెంచేందుకు సహకారం అందిస్తామని ప్రపంచబ్యాంకు అధ్యక్షుడు అజయ్ బంగా హామీ ఇచ్చారు. బుధవారం అమెరికా రాజధాని వాషింగ్టన్‌లోని ప్రపంచ బ్యాంకు ప్రధాన కార్యాలయంలో అధ్యక్షుడు అజయ్ బాంగాతో సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ఉన్నతాధికారుల బృందం సమావేశమైంది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన నాలుగు ప్రాజెక్టుల గురించి ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడికి సీఎం రేవంత్‌రెడ్డి వివరించారు. ఇందులో

మిగతా 13వ పేజీలో...

14న కాగ్నిజెంట్ విస్తరణ

శంకుస్థాపనకు హాజరుకానున్న సీఎం 13
విదేశాల్నుంచి రాగానే తొలి కార్యక్రమం ఇదే

గాంధీ, ఉస్మానియా ఆస్పత్రుల్లో 235 వైద్య పోస్టుల భర్తీ

కాంట్రాక్టు ప్రాతిపదికన నియామకం
రేపు వాకిన్ ఇంటర్వ్యూల నిర్వహణ 12

బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రధానిగా

నేడు యూనస్ ప్రమాణం

ఢాకాలో బీఎన్‌పీ భారీ ర్యాలీ
హింసను వీడాలని ఖలీదా పిలుపు
ప్రజలనుద్దేశించి ప్రసంగించిన యూనస్
అవామీ లీగ్ లేకుండా ఎన్నికలు జరగవు..
కార్యకర్తలకు హసీనా కుమారుడి భరోసా
బంగ్లాలో హిందువుల మీద దాడులపై కేంద్రం రంగంలోకి దిగాలి: జగ్గీ వాసుదేవ్
సనాతన ధర్మ పరిరక్షణకు పోరాడాలి: యోగి
హిందువులపై దాడిని ఖండించిన బంగ్లాదేశ్‌లోని 31 సామాజిక సంస్థలు
భయంలో 40వేల మంది తెలుగు సంతతి ప్రజలు
స్వేచ్ఛ అందరిదీ.. కొందరిది కాదు
'ఆంధ్రజ్యోతి'తో తెలుగు మూలాలున్న బంగ్లా విద్యార్థి నాయకుడు మిఖా పిరెగు



ఢాకాలో బీఎన్‌పీ నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న ప్రజలు

ఢాకా, ఆగస్టు 7: తాత్కాలిక ప్రధానిగా మహమ్మద్ యూనస్ ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లను పూర్తిచేసినట్లు బంగ్లాదేశ్ ఆర్మీ చీఫ్ వకార్-ఉజ్-జమా వెల్లడించారు. గురువారం రాత్రి బంగ్లాదేశ్ కాలమానం ప్రకారం 8 గంటలకు యూనస్ ప్రమాణ స్వీకారం ఉంటుందని పేర్కొన్నారు. తాత్కాలిక ప్రభుత్వంలో 15 మంది

మిగతా 2వ పేజీలో...

బంగ్లా.. ఓ గుణపాఠం!

భారత్‌లో కూడా జరగవచ్చు: సల్మాన్ ఖుర్షీద్
నిరంకుశత్వాలు ఎంతోకాలం కొనసాగవు: మెహబూబా
ప్రజలే సుప్రీం.. వారి ఓపికను పరీక్షించవద్దు: ఉద్ధవ్
ఖుర్షీద్‌పై బీజేపీ ధ్వజం 2



రైతన్నకు గడువు!

2 లక్షలకు పైనున్న అప్పు చెల్లించేందుకు 4-6 నెలల సమయం

రుణమాఫీపై రాష్ట్ర ప్రభుత్వం యోచన
గంపగుత్తగా కాకుండా ఎవరు చెల్లిస్తే వారికే రూ.2 లక్షల మాఫీ
మూడో విడతలో 6 లక్షల మందికి..
రూ.6 వేల కోట్ల నిధులు సర్దుబాటు



హైదరాబాద్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): రెండు లక్షల రూపాయలకు పైగా పంట రుణ బకాయిలున్న రైతులకు.. ఆ పైనున్న మొత్తాన్ని చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్దిష్టమైన గడువు విధించాలనే యోచనలో ఉంది. పంద్రాగస్టు వరకు మూడో విడత రుణమాఫీ పూర్తయిన తర్వాత.. రూ.2 లక్షలకు పైనున్న విభాగంలోని రైతులపై ప్రభుత్వం దృష్టి సారించే అవకాశాలున్నాయి. రుణమాఫీ మార్గదర్శకాల ప్రకారం అర్హులైన రైతుల వివరాలను ప్రకటించి.. రూ.2 లక్షల కంటే ఎక్కువగా ఉన్న మొత్తాన్ని చెల్లించడానికి 4 నుంచి 6 నెలల గడువిచ్చే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం. రుణమాఫీ జీవో 567 ప్రకారం.. రూ.2 లక్షలపైన ఎంత ఎక్కువ ఉంటే అంత మొత్తాన్ని రైతులు ముందుగా చెల్లించాలి. ఆ తర్వాత ప్రభుత్వం రూ.2 లక్షలు మాఫీ చేస్తుంది. దాంతో రైతులు రుణవిముక్తులవుతారు. ఆ తర్వాత మళ్లీ కొత్తగా పంట రుణం తీసుకునే అవకాశం ఉంటుంది. ఇప్పటికే రూ.2 లక్షలపైన స్వల్పమొత్తంలో అప్పున్న రైతులు కొందరు..ఆ మొత్తాన్ని చెల్లించేందుకు ముందుకు వస్తున్నారు. రైతులు ఎప్పుడు చెల్లించినా తీసుకోవాలని ప్రభుత్వం బ్యాంకర్లకు ఆదేశాలు జారీ చేసింది. గంపగుత్తగా కాకుండా రైతులు ఎప్పుడు చెల్లిస్తే అప్పుడు పైమొత్తాన్ని కట్టించుకొని రూ.2 లక్షలు నగదు బదిలీ చేసి రుణ విముక్తులను చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. అంటే రైతులు తమ వీలును బట్టి డబ్బు సర్దుబాటు చేసుకొని.. రూ.2 లక్షలకు మించి ఉన్న మొత్తాన్ని చెల్లిస్తూ ఉంటే, ప్రభుత్వం మిగిలిన మొత్తాన్ని మాఫీ చేస్తూ పోతుంది. అయితే ఈ ప్రక్రియను నిర్ణీత కాలపరిమితిలోపు పూర్తిచేయాలని ప్రభుత్వం భావిస్తోంది. పలు సంక్షేమ

మిగతా 13వ పేజీలో...



కాంగ్రెస్ రాజ్యసభ అభ్యర్థి

అభిషేక్ సింఘ్వీ!

రాష్ట్రం నుంచి ఏఐసీసీ కోటా కింద తీసుకునే యోచనలో కాంగ్రెస్ అధిష్ఠానం
9 రాష్ట్రాల నుంచి రాజ్యసభ స్థానాల ఖాళీ
కేకే రాజీనామాతో తెలంగాణ నుంచి ఒకటి
12 స్థానాలకు సెప్టెంబరు 3న ఉప ఎన్నికలు
14న నోటిఫికేషన్.. 21 వరకు నామినేషన్లు

న్యూఢిల్లీ/హైదరాబాద్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): రాజ్యసభలో ఖాళీ అయిన స్థానాలకు ఉప ఎన్నికలు నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం సిద్ధమైంది. తొమ్మిది రాష్ట్రాలకు సంబంధించి ఖాళీ అయిన 12 స్థానాలకు సెప్టెంబరు 3న ఉప ఎన్నికలు నిర్వహించనున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు బుధవారం ఎన్నికల షెడ్యూలు విడుదల చేసింది. దీని ప్రకారం.. ఉప ఎన్నికలకు ఈ నెల 14న నోటిఫికేషన్ జారీ కానుండగా.. నామినేషన్ల దాఖలుకు ఈ నెల 21 వరకు గడువు ఉంటుంది. కాగా, ఈ 12 స్థానాల్లో తెలంగాణ నుంచి బీఆర్ఎస్ సభ్యుడు కె.కేశవరావు రాజీనామా చేయడం వల్ల ఖాళీ అయిన స్థానం కూడా ఉంది. కేశవరావు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరడంతో జూలై 5న రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఆయన స్థానంలో ఎన్నికయ్యే నేత 2026 ఏప్రిల్ 9 వరకు కొనసాగుతారు. కేకే స్థానంలో ఏఐసీసీ అధికార ప్రతినిధి, ప్రముఖ న్యాయవాది, అభిషేక్ మనుసింఘ్వీకి అవకాశం దక్కనున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. రాష్ట్రంలో

మిగతా 14వ పేజీలో...



పీపుల్స్ ప్లాజాలో పిల్లాటు చేసిన సభలో మంత్రి తుమ్మల 13

నేతన్నకు అండగా చేనేత వాడుదాం

జాతీయ చేనేత దినోత్సవంలో మంత్రి తుమ్మల పిలుపు
నేతన్న బీమా పథకం ప్రీమియం కింద ఎల్ఐసీకి 6 కోట్ల చెక్కు

జగన్ అక్రమాస్తుల కేసులో..

ఏమిటీ కాలయాపన?



డిశ్చార్జ్ పిటిషన్లకు, ట్రయల్‌కు సంబంధం లేదు
మేమూ అనేక వ్యాజ్యాలు విచారించి డిశ్చార్జ్ చేస్తున్నాం
సీబీఐ అఫిడవిట్‌లో విషయం లేదు
మా మార్గదర్శకాల ప్రకారం దర్యాప్తు కొనసాగాలి
సత్వర విచారణకు ఇప్పటికే ఆదేశాలిచ్చాం: సుప్రీంకోర్టు
తదుపరి విచారణ నవంబరు 11కి వాయిదా

న్యూఢిల్లీ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): అక్రమాస్తుల కేసుల్లో అసలు విచారణ ప్రారంభంకాకుండా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి దాఖలు చేసిన డిశ్చార్జి పిటిషన్ల ఎత్తుగడ సుప్రీంకోర్టులో చిత్తయింది. డిశ్చార్జి పిటిషన్లకూ, అసలు కేసుల విచారణకూ మధ్య సంబంధం లేదని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. కేసుల సత్వర విచారణకు ఇదివరకే స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని... కొత్తగా



మళ్లీ ఆదేశించాల్సిన అవసరం లేదని తెలిపింది. విచారణలో ఎందుకు జాప్యం జరుగుతోందో తమకు తెలియడంలేదని పేర్కొంది. అదే సమయంలో... జగన్ అక్రమాస్తుల కేసులో సీబీఐ అఫిడవిట్‌లో పొందుపరచిన అంశాలు ఆశ్చర్యకరంగా ఉన్నాయని సుప్రీంకోర్టు పేర్కొంది. ట్రయల్‌కు డిశ్చార్జ్ పిటిషన్లు అడ్డంకి కానే కాదని స్పష్టం చేసింది. సర్వోన్నత న్యాయస్థానం గతంలో ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం విచారణ సాగించాలని ఆదేశించింది. జగన్ అక్రమాస్తుల కేసు విచారణను వేగవంతం చేయాలని, కేసుల ట్రయల్‌ను తెలంగాణ నుంచి మరో రాష్ట్రానికి బదిలీ చేయాలని, జగన్ బెయిల్ రద్దు చేయాలని కోరుతూ టీడీపీ ఎమ్మెల్యే

మిగతా 3వ పేజీలో...



భద్రాచలం ఆలయ ప్రాంగణంలో భారీగా నిలిచిన వరద నీరు

వణికించిన వర్షం

భద్రాచలంలో 2 గంటల్లోనే 6 సెంటీమీటర్ల వాన

డ్రైనేజీ ప్రవాహంలో కొట్టుకుపోయి ఓ వ్యక్తి మృతి
గద్వాల జిల్లా గట్టులో అత్యధికంగా12.6 సెం.మీ.
కృష్ణా బేసిన్‌లో శ్రీశైలం, నాగార్జున సాగర్‌కు తగ్గిన వరద

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో కుండపోత వర్షం కురిసింది. మంగళవారం రాత్రి ప్రారంభమైన వాన.. బుధవారమంతా కొనసాగింది. కొన్ని చోట్ల అతి తక్కువ వ్యవధిలోనే భారీ వర్షం పడడంతో వాగులు, వంకలు పొంగి పొర్లాయి. రోడ్లపైన నీరు ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. భారీ వర్షాలతో ఉమ్మడి ఖమ్మం జిల్లా వణికిపోయింది. ముఖ్యంగా భద్రాచలంలో రెండు గంటల వ్యవధిలోనే ఆరు సెంటీమీటర్ల వర్షం కురవడంతో రామాలయ పరిసరాలు, నిత్యాన్నదాన సత్రంలోకి

మిగతా 3వ పేజీలో...


14

ప్రైవేటు స్కూళ్లలో పేద విద్యార్థులకు 25% సీట్లు ఇవ్వండి

తెలంగాణ సహా 4 రాష్ట్రాలు ఆర్‌టీఈ నిబంధన అమలు చేయడం లేదు: కేంద్రం
విద్యార్థుల ఫీజును ఉమ్మడిగా భరించాలి
తనవాటాపై కేంద్రం స్పందన లేదు: రాష్ట్రం

భయంలో 40 వేల మంది తెలుగు సంతతి ప్రజలు


బంగ్లాదేశ్‌లో తెలుగు సంతతి ప్రజలు


(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

బంగ్లాదేశ్‌లో తెలుగు సంతతి ప్రజలు ఉన్నారనే సంగతి మీకు తెలుసా ? బంగ్లా పౌరుల్లో తెలుగు రాష్ట్రాల్లో కుటుంబ మూలాలున్న వారు 40 వేల మంది వరకు ఉన్నారు. దేశంలోని అల్పసంఖ్యాకవర్గాల్లోనూ అత్యంత స్వల్ప జనాభా కలిగిన వర్గంగా ఏళ్లుగా అక్కడే ఉంటున్నారు. తెలుగులో మాట్లాడటమే కాకుండా.. తెలుగు పండుగలను చేసుకుంటూ, సంస్కృతిని కాపాడుకుంటున్నారు. అంతేనా, ఓ తెలుగు పాఠశాలను కూడా నిర్వహించుకుంటున్నారు. బంగ్లాదేశ్ పౌరులైన ఈ తెలుగు సంతతి ప్రజలు ప్రస్తుతం భయాందోళనలో ఉన్నారు. దేశంలో శరవేగంగా మారుతున్న పరిస్థితులతో ఏ క్షణం ఏం జరుగుతుందని భయం భయంగా గడుపుతున్నారు. భారతదేశంలో బ్రిటీష్ పాలన సమయంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రాంతాలకు చెందిన చాలా మంది ఢాకా వచ్చారు. వీళ్లలో సింహభాగం దళితులు కాగా ఢాకాలో పారిశుధ్య పనులు, రైల్వే స్టేషన్లు, తేయాకు తోటల్లో కార్మికులుగా పని చేసేవారు. క్రమంగా వీరి కుటుంబాలు బంగ్లాదేశ్‌లో స్థిరపడిపోయినా నేటి తరం వారు తెలుగు మూలాలను మరచిపోలేదు. ప్రస్తుతం ఢాకా శివారులోని ధల్పూర్, తికతులీ, గోపిబాగ్ మరియు కళ్యాణ్ పూర్ ప్రాంతాల్లో వీళ్లంతా నివసిస్తున్నారు. వీళ్లలో చాలా మంది నేటికి పారిశుధ్య కార్మికులుగా పని చేస్తున్నారు. మరుగుదొడ్ల శుభ్రం చేసే మెహెతర్ వృత్తిలో తెలుగు సంతతి ప్రజలే అధికంగా ఉన్నారు. అల్పసంఖ్యాక వర్గంగా బంగ్లాలో ఉన్న వీరంతా ఒకప్పుడు తమ హక్కుల కోసం ఢాకాలో పోరాటం చేశారు. కానీ నేడు దేశంలో నెలకొన్న పరిస్థితులతో ఆత్మరక్షణలో పడ్డారు.

సమన్యాయం కోసమే పోరాటం: మిఖా

దేశ ప్రజలందరికీ సమన్యాయం జరగాలనే షేక్ హసీనాకు వ్యతిరేకంగా పోరాటం చేశామని బంగ్లాదేశ్ స్టూడెంట్స్ యూనియన్ ఉపాధ్యక్షుడు, జహంగీర్ వర్సిటీ విద్యార్థి సంఘం నేత, తెలుగు సంతతికి చెందిన మిఖా పిరెగు 'ఆంధ్రజ్యోతి'తో అన్నారు. మత ఛాందసవాదులను తీసుకొచ్చి దేశాన్ని కొందరి కోసం చేయడానికి మాత్రం కాదని తెలిపారు. స్వేచ్ఛ అందరిదీ అని కొందరిది మాత్రమే కాదని మిఖా పేర్కొన్నారు. హసీనా పలాయనం తర్వాత దేశంలో హిందూ ఆలయాలు, ఆస్తుల పరిరక్షణలో విద్యార్థి సంఘాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని మిఖా చెప్పారు. గతంలో తెలుగు సంతతి ప్రజలు నివసిస్తున్న ధల్పూర్‌లోని ఔట్ఫాల్ కాలనీ విస్తరణలో భాగంగా పునరావాసం కోసం జరిగిన పోరాటంలో మిఖాతో పాటు బంగాలోని హక్కుల సంఘాలన్నీ ప్రశ్నించడంతో ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టింది.

లోకం తీరు



బంగ్లా.. ఓ గుణపాఠం!

- కేంద్రాన్ని హెచ్చరించిన ఇండియా కూటమి నేతలు
- భారత్‌లో కూడా జరగొచ్చు: సల్మాన్ ఖుర్షీద్
- నిరంకుశత్వాలు ఎంతోకాలం కొనసాగవు: మెహబూబా

న్యూఢిల్లీ, శ్రీనగర్, ఆగస్టు 7: పొరుగుదేశం బంగ్లాదేశ్‌లో జరుగుతున్న పరిణామాలను ఒక హెచ్చరికలాగా తీసుకోవాలని, ప్రజల్లో ఉన్న అసంతృప్తిని తొలగించేలా చర్యలు చేపట్టాలని కేంద్రప్రభుత్వానికి ప్రతిపక్ష ఇండియా కూటమి నేతలు సూచించారు. విద్యావేత్త ముజిబుర్ రెహ్మాన్ రాసిన 'షిక్వా-ఎ-హింద్: భారతీయ ముస్లింల రాజకీయ భవిష్యత్తు' అనే పుస్తకం ఆవిష్కరణ సందర్భంగా బుధవారం ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి సల్మాన్ ఖుర్షీద్ ఈ అంశంపై స్పందించారు. 'బంగ్లాదేశ్‌లో జరుగుతున్నది ఇక్కడా జరగవచ్చు. అయితే, భౌగోళికంగా మన దేశం చాలా పెద్దది కాబట్టి.. బంగ్లాదేశ్‌లో జరిగినట్టుగా ఇక్కడ ప్రజల అసంతృప్తి ఒక్కసారిగా పెల్లుబికటం లేదు' అని పేర్కొన్నారు. ఆర్జేడీ ఎంపీ మనోజ్ ఝా మాట్లాడుతూ, ఢిల్లీలో సీఏఏ, ఎన్నార్సీలకు వ్యతిరేకంగా దీర్ఘకాలంపాటు జరిగిన షహీన్‌బాగ్ ఉద్యమాన్ని గుర్తు చేశారు. పార్లమెంటు నిస్తేజంగా మారినప్పుడు వీధులు చైతన్యంతో వెలుగొందుతాయన్నారు. బంగ్లాదేశ్ పరిణామాలను భారత్ ఒక గుణపాఠంలా తీసుకోవాలని.. నిరంకుశత్వాలు ఎక్కువకాలంపాటు కొనసాగవని పీడీపీ అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తీ చెప్పారు. బుధవారం మెహబూబా శ్రీనగర్‌లో మీడియా సమావేశంలో మాట్లాడారు. ఉద్యోగాలు కల్పించకుండా, పెరుగుతున్న ధరలను అరికట్టకుండా యువతను నిరుత్సాహపరుస్తూ.. అణిచివేస్తుంటే ఇలాంటివే సంభవిస్తాయన్నారు. 'ప్రజా వ్యతిరేక విధానాలను, చట్టాలను తెస్తూ ఉంటే ప్రజలు విసిగిపోతారు. అటువంటప్పుడు షేక్ హసీనాలాగా పారిపోయే పరిస్థితి వస్తుంది. జమ్మూకశ్మీర్‌లో కూడా బంగ్లాదేశ్‌లో ఉన్నటువంటి పరిస్థితులే నెలకొని ఉన్నాయి' అని మెహబూబా ముఫ్తీ పేర్కొన్నారు. షేక్‌హసీనా పదవీచ్యుతి పరిణామాలు ప్రపంచానికే ఒక సందేశం ఇచ్చాయని, ప్రజలే సుప్రీం.. వారి సహనాన్ని పరీక్షించవద్దని శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్ ఠాక్రే హెచ్చరించారు. ఢిల్లీలో ఆయన మాట్లాడుతూ.. బంగ్లాదేశ్‌లో ప్రజాకోర్టు తీర్పునిచ్చిందని.. శ్రీలంక, ఇజ్రాయెల్‌లో కూడా ఇటువంటి నిరసనలు సంభవించాయని, ఆయా దేశాల ప్రధానులు ఇల్లు దాటి బయటకు రాలేకపోయారని గుర్తు చేశారు. బంగ్లాదేశ్‌లో హిందువుల మీద దాడులు జరుగుతున్న అంశాన్ని ప్రస్తావిస్తూ, రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపానంటూ ప్రచారం చేసుకున్న మోదీ ఇప్పుడు బంగ్లాదేశ్‌లో హిందువులను కాపాడాలని ఉద్ధవ్ సూచించారు.

ఖండించిన బీజేపీ నేతలు

సల్మాన్ ఖుర్షీద్ వ్యాఖ్యలను బీజేపీ నేతలు ఖండించారు. ఆ పార్టీ సీనియర్ నాయకుడు, మధ్యప్రదేశ్‌లో మంత్రిగా ఉన్న కైలాశ్ విజయవర్గీయ మాట్లాడుతూ, 'ఇది మోదీ దేశం. భారత్. నిరాశతో కూడిన కొందరు నేతలు అరాచకత్వాన్ని వ్యాప్తి చేయాలని ఇటువంటి వ్యాఖ్యలు చేస్తున్నారు. ఇది సిగ్గు చేటు. దీనిని ఖండించాలి. భారత్ శక్తిమంతమైన దేశం. దేశ నాయకుడు మోదీ అత్యంత శక్తిమంతమైన నేత. ఇక్కడ ఇటువంటి అరాచకత్వం కుదరదు' అని హెచ్చరించారు. పాకిస్థాన్‌కు ప్రతినిధుల్లా మాట్లాడుతున్న వారికి ఇప్పుడైనా భారత్, పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లలో పరిస్థితులేవిటో అర్థమై ఉండాలన్నారు. ఖుర్షీద్ వ్యాఖ్యలు దేశద్రోహం వంటివని బీజేపీకే చెందిన మరో నేత రాజీవ్ ప్రతాప్ రూడీ ఆరోపించారు. ఎన్నికల్లో గెలవలేని కాంగ్రెస్.. దేశంలో బంగ్లాదేశ్ వంటి పరిస్థితులు ఏర్పడాలని కోరుకుంటోందా? అని బీజేపీ ఎంపీ సంబిత్ పాత్రా ప్రశ్నించారు.

అసదుద్దీన్ వెర్సెస్ తృణమూల్ ఎంపీ జవహర్ సర్కార్

'షిక్వా-ఎ-హింద్: భారతీయ ముస్లింల రాజకీయ భవిష్యత్తు' పుస్తకావిష్కరణ సభలో ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ, చట్టసభల్లో ముస్లింల ప్రాతినిధ్యం చాలా తక్కువగా ఉంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలో బీజేపీయేతర ప్రభుత్వం ఉంటే పరిస్థితిలో తేడా ఉండేదా? అని ప్రశ్నించారు. సమాజంలో ఉన్న భావోద్వేగాల ఆధారంగానే హిందూ మతతత్వం పెరిగిపోయిందని వ్యాఖ్యానించారు. తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ జవహర్ సర్కార్.. తమ పార్టీలో పలువురు ముస్లిం ఎంపీలు ఉన్నారని, లోక్‌సభ ఎన్నికల్లో బెంగాల్‌లో ఎంఐఎం పోటీ చేసి ఉంటే అన్ని సీట్లూ బీజేపీకే వెళ్లి ఉండేవన్నారు. దీనికి అసదుద్దీన్ స్పందిస్తూ.. సమస్య మీ మానసిక ధోరణి.. అంతేగానీ నేను కాదు అని తిప్పికొట్టారు.

బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రధానిగా

నేడు యూనస్ ప్రమాణం

(మొదటి పేజీ తరువాయి)

మంత్రులుగా ఉంటారని, వారి నియామకంపై అన్ని రాజకీయ పార్టీల భేటీలో నిర్ణయం తీసుకుంటామన్నారు. బుధవారం ఆయన ఢాకాలోని ఆర్మీ హెడ్ క్వార్టర్స్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మరోవైపు ఢాకాలో బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ(బీఎన్‌పీ) భారీ ర్యాలీ నిర్వహించగా.. దేశంలో పరిస్థితులు ఇంకా కుదుటపడలేదు. కొన్నిచోట్ల హత్యలు, లూటీలు కొనసాగగా.. మరో నాలుగు జైళ్ల నుంచి ఖైదీల పరారీ ఘటనలు నమోదయ్యాయి. అధికారుల మార్పులు.. రాజీనామాలు బుధవారం కూడా కొనసాగాయి.


బీఎన్‌పీ భారీ ర్యాలీ

ఢాకాలోని నయాపల్టాన్‌లో బీఎన్‌పీ బుధవారం భారీ ర్యాలీ నిర్వహించింది. ఈ ర్యాలీలో ప్రజలు, బీఎన్‌పీ నాయకులు, కార్యకర్తలు వేల సంఖ్యలో పాల్గొన్నారు. బంగ్లాదేశ్ ప్రధాన న్యాయమూర్తి నివాసం మొదలు.. నయాపల్టాన్‌ను దాటుకుని.. ఆరాంబాగ్ వరకు రోడ్లన్నీ కిక్కిరిసిపోయేలా ప్రజలు ఈ కార్యక్రమానికి తరలివచ్చారు. ఈ సందర్భంగా బీఎన్‌పీ చైర్ పర్సన్, మాజీ ప్రధాని ఖలీదాజియా వీడియో సందేశాన్నిచ్చారు. "చాలా కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న నేను.. ఇప్పుడు మీ అందరితో మాట్లాడడం సంతోషంగా ఉంది. నేను జైలులో ఉన్నప్పుడు నా విడుదల కోసం పోరాడిన వారు.. నేను అనారోగ్యం నుంచి కోలుకోవాలని ప్రార్థనలు చేసినవారికి కృతజ్ఞతలు" అంటూ ఆమె తన సందేశాన్ని ప్రారంభించారు. విద్యార్థులు, ప్రజలు హింసను వీడాలని పిలుపునిచ్చారు. "విధ్వంసం, ప్రతీకారాన్ని వదిలి.. ప్రేమ, శాంతితో కూడిన సమాజాన్ని నిర్మించుకుందాం. ఈ పోరాటంలో అసువులుబాసిన వందల మంది అమరులకు నా నివాళులు. రక్తం ధారపోసిన యువత కలల సాకారానికి ప్రజాస్వామ్య బంగ్లాదేశ్‌ను నిర్మించాల్సిన అవసరం ఉంది" అని ఆమె వ్యాఖ్యానించారు.

మరో నాలుగు జైళ్ల నుంచి ఖైదీల పరార్!

సోమవారం అర్ధరాత్రి షేర్పూర్, సత్ఖిరా జైళ్లను ఆందోళనకారులు బద్దలు కొట్టడంతో.. ఖైదీలు పారిపోయిన విషయం తెలిసిందే.! తాజాగా కుష్టియా జిల్లా జైలు మెయిన్‌గేట్‌ను బద్దలు కొట్టిన 50 మంది ఖైదీలు.. పారిపోయారని అధికారులు చెప్పారు. గాజీపూర్‌లోని కాశీంపూర్ హైసెక్యూరిటీ జైలులో 209 మంది ఖైదీలు పరారయ్యారు. వీరు కొందరు గార్డులను బందీలుగా తీసుకెళ్లినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటన జరిగినప్పుడు పోలీసులు జరిపిన కాల్పుల్లో ఆరుగురు ఖైదీలు మరణించారు. సిరాజ్‌గంజ్ జైలు నుంచి 150 మంది ఖైదీలు తప్పించుకున్నారని బంగ్లాదేశ్ పత్రికలు పేర్కొన్నాయి. అటు చిట్టాగాంగ్ జైలులోనూ ఇలాంటి ఘటనే జరిగిందని బుధవారం సాయంత్రం వరకు కూడా ఇక్కడ ఘర్షణలు జరిగాయని తెలిపాయి. ఈ ఘటనల నేపథ్యంలో దేశంలోని జైళ్లను సైన్యం తమ అధీనంలోకి తీసుకుంది. మరోవైపు దేశవ్యాప్తంగా పలు చోట్ల హింస, లూటీలు కొనసాగాయి. బుధవారం ఢాకాలో 34 మంది అవామీ కార్యకర్తల మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. భారత్‌లో ఆశ్రయం పొందేందుకు వేల సంఖ్యలో మైనారిటీలు సరిహద్దుల్లో వేచిఉన్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. మరోవైపు.. హసీనా రాజీనామాకు దారి తీసిన కోటా ఉద్యమాన్ని విద్యార్థులే నడిపినా.. ఇప్పుడు వారి పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. కొన్ని విద్యార్థి సంఘాలు సంయుక్తంగా కలిసి.. సమన్వయకర్త నహీద్ ఇస్లాం నేతృత్వంలో నెలరోజుల పాటు ఉద్యమించాయి. అయితే.. బుధవారం తాజాగా దేశవ్యాప్తంగా ఉన్న అన్ని వర్సిటీలు.. "విద్యార్థి సంఘాలు ఉండడానికి వీల్లేదు" అని ఆదేశాలు జారీ చేశాయి. దీంతో.. చిట్టాగాంగ్, ఢాకా సహా.. పలు వర్సిటీల విద్యార్థి సంఘాల నాయకులు తమ పదవులకు రాజీనామాలు చేశారు. అటు అధ్యాపక సంఘాలు కూడా ఇదేవిధంగా రాజీనామాల బాట పట్టాయి.


ఢాకాలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ కార్యకర్తలు



తప్పిదాలతో మన విజయాన్ని కోల్పోకూడదు: యూనస్

తాత్కాలిక ప్రభుత్వాధినేతగా నియమితులైన నోబెల్ గ్రహీత, ఆర్థికవేత్త మహమ్మద్ యూనస్ బంగ్లాదేశ్ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. "బంగ్లాదేశ్‌కు ఇది రెండో విక్టరీ డే. ఈ ఘనతకు కారణమైన విద్యార్థులను, వారి ధైర్యాన్ని అభినందిస్తున్నాను. విద్యార్థుల ఉద్యమానికి సంపూర్ణ మద్దతు తెలిపిన దేశ ప్రజలకు అభినందనలు తెలియజేస్తున్నాను. ఈ విజయాన్ని మనం సద్వినియోగం చేసుకోవాలి. ఏమాత్రం తప్పిదాలు చేసినా.. మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది. తప్పిదాల వల్ల మన విజయాన్ని కోల్పోకూడదు. ప్రస్తుత పరిస్థితుల్లో అంతా హింసను విడనాడి, విధ్వంసాలకు దూరంగా ఉండాలి. శాంతిని నెలకొల్పాలి" అని పిలుపునిచ్చారు. కాగా.. కార్మిక చట్టాల ఉల్లంఘన కింద యూనస్‌పై గతంలో నమోదైన కేసులను లేబర్‌కోర్టు కొట్టివేసిందని ఆయన తరఫు న్యాయవాది అబ్దుల్లా-అల్-మామూ వెల్లడించారు. ఫ్రాన్స్‌లో ఉన్న యూనస్ బుధవారం సాయంత్రం బంగ్లాదేశ్‌కు తిరిగివచ్చారు. కాగా, బంగ్లాదేశ్ చేరుకున్నాక మహమ్మద్ యూనస్ నేరుగా అధ్యక్షుడు షహబుద్దీన్‌ను కలిశారు. తాత్కాలిక ప్రభుత్వ ఏర్పాటుకుగాను 31 మందితో కూడిన జాబితాను ఆయనకు అందజేశారు. కాగా.. ఇప్పటికే ఆర్మీ చీఫ్ వకార్.. మంత్రుల సంఖ్య 15గా ఉంటుందని స్పష్టం చేసిన విషయం తెలిసిందే.! మరోవైపు బంగ్లాదేశ్ పరిణామాలపై పాకిస్థాన్ స్పందించింది. దేశప్రజల బలమైన స్ఫూర్తి, ఐక్యత ఆ దేశ సామరస్యపూర్వక భవిష్యత్‌కు దారితీస్తుందని విశ్వసిస్తున్నట్లు పాక్ విదేశాంగ శాఖ ఓ ప్రకటనలో తెలిపింది.

కార్యకర్తలు ధైర్యంగా ఉండాలి

- హసీనా కుమారుడు

బంగ్లాదేశ్‌లో పరిస్థితులపై షేక్ హసీనా కుమారుడు సజీబ్ వాజిద్ జాయ్ బుధవారం ఓ వీడియో సందేశాన్ని విడుదల చేశారు. "అవామీ లీగ్‌ను అంతం చేయడం ఎవరితరం కాదు. నాయకులు, కార్యకర్తలు ధైర్యంగా నిలబడాలి. ప్రస్తుతం దేశంలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. దేశమంతటా విధ్వంసాలు, దోపిడీలు జరుగుతున్నాయి. అవామీ లీగ్ నేతలు, కార్యకర్తలను హతమారుస్తున్నారు. మైనారిటీలకు రక్షణ లేకుండా పోయింది. అవామీ లీగ్ అతి పురాతన, అతి పెద్ద ప్రజాస్వామ్య పార్టీ. అవామీ లీగ్ ఉనికి ఎప్పటికీ ఉంటుంది" అని ఆయన వ్యాఖ్యానించారు. తమ కుటుంబం రాజకీయాల్లోకి రాబోదని ఇటీవల ప్రకటించిన ఆయన.. బంగబంధు కుటుంబం ఎక్కడికీ పోదని తాజా వీడియోలో కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. అవామీ లీగ్ లేకుండా బంగ్లాదేశ్‌లో ఎన్నికలు సాధ్యం కాదన్నారు.

హసీనా వెనక్కి రావాలి: అవామీ లీగ్

బంగ్లాదేశ్ క్లిష్ట పరిస్థితుల్లో ఉందని, ఈ సమయంలో మాజీ ప్రధాని షేక్ హసీనా దేశానికి తిరిగి రావాలని అవామీ లీగ్ నాయకులు కోరారు. బుధవారం వారు గోపాల్‌గంజ్‌లోని తుంగిపారాలో ఉన్న బంగబంధు షేక్ ముజీబుర్ రెహ్మాన్ సమాధి వద్ద పుష్పగుచ్ఛాలను పెట్టి, నివాళులర్పించారు.

బంగ్లాలో హిందువుల మీద దాడులపై కేంద్రం రంగంలోకి దిగాలి

ఈ దాడులు ఆ దేశ అంతర్గత వ్యవహారం కాదు: జగ్గీ వాసుదేవ్

న్యూఢిల్లీ, ఆగస్టు 7: బంగ్లాదేశ్ వ్యాప్తంగా హిందూ ఆలయాలు, హిందువుల దుకాణాలు, ఇళ్లపై దాడులు, లూటీలు జరిగినట్లుగా బంగ్లాదేశ్ వార్తాసంస్థలు వెల్లడించడం తీవ్ర ఆందోళన రేకెత్తిస్తోంది. హిందువుల ఇళ్లపై ముష్కరులు మారణాయుధలతో ఎగబడి హత్యలు, లూటీలకు పాల్పడ్డట్టు, దినాజ్‌పూర్‌లోని బోచాగంజ్‌లో హిందువులకు చెందిన 40 దుకాణాలు ధ్వంసమైనట్లు తెలుస్తోంది. బంగ్లాదేశ్‌లోని కనీసం 27 జిల్లాల్లో హిందువుల ఆలయాలు, నివాసాల్లో అల్లరి మూకలు లూటీలకు పాల్పడినట్లు అక్కడి వార్తా సంస్థలు వెల్లడించాయి. ఈ పరిణామాలపై ఈశా ఫౌండేషన్ ఆధ్యాత్మిక నేత సద్గురు జగ్గీ వాసుదేవ్ ఆందోళన వ్యక్తం చేశారు. బంగ్లాదేశ్‌లో హిందువులకు మద్దతుగా నిలవాలని, ఈ దిశగా వెంటనే చర్యలు తీసుకోవాలని భారత ప్రభుత్వాన్ని కోరారు. బంగ్లాలో హిందువుల పట్ల జరుగుతున్న అరాచకాలు ఆ దేశ అంతర్గత వ్యవహారం కోణంలో చూడటానికి వీల్లేదని స్పష్టం చేశారు. ఒక్కప్పుడు మన దేశంలో భాగంగా ఉన్న బంగ్లా దురదృష్టంకొద్దీ మన పొరుగు దేశమైందని.. అక్కడి హిందువులను కాపాడాల్సిన బాధ్యత మనపై ఉందని.. ఒకవేళ మనం వారికి మద్దతుగా నిలవకపోతే భారత్ అనేది మహా భారత్ అవ్వలేదని స్పష్టం చేశారు. బంగ్లాలో ముష్కరులు హిందువులను లక్ష్యంగా చేసుకోవడం, వారిపై దాడులకు పాల్పడటాన్ని యోగా గురు బాబా రామ్‌దేవ్ ఇప్పటికే తీవ్రంగా ఖండించారు. దీన్ని నివారించేందుకు తీసుకోవాల్సిన చర్యలను వెంటనే చేపట్టాలంటూ ఆయన కేంద్రాన్ని డిమాండ్ చేశారు. కాగా బంగ్లా నాటోర్‌లో సుమారు 15వేల మంది హిందువులు, 7వేల మంది క్రిస్టియన్లు నివసిస్తున్నారు. సోమవారం రాత్రంతా బిక్కుబిక్కుమంటూ గడిపామని వారు అంతర్జాతీయ మీడియాకు చెప్పారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై లక్షిత దాడులు జరుగుతున్నాయని యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ అన్నారు. సనాతన ధర్మానికి ఎదురవుతున్న ముప్పును తిప్పికొట్టడానికి సమైక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. కాగా, హిందువులు తదితర మైనారిటీ వర్గాలపై, వారి ప్రార్థన స్థలాలపై జరుగుతున్న దాడులను బంగ్లాదేశ్‌లోని 31 సామాజిక, సాంస్కృతిక సంస్థలు ముక్తకంఠంతో ఖండించాయి.

జాతీయ విపత్తుగా ప్రకటించండి

వయనాడ్ విలయంపై కేంద్రాన్ని కోరిన రాహుల్

న్యూఢిల్లీ, ఆగస్టు 7 : కేరళలోని వయనాడ్‌లో కొండ చరియలు విరిగిపడి సృష్టించిన విలయాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ బుధవారం కోరారు. లోక్‌సభ జీరో అవర్‌లో మాట్లాడిన ఆయన వయనాడ్ విపత్తుతో నష్టపోయిన ప్రజలకు పరిహారం కూడా అధికంగా ఇవ్వాలని కోరారు. "అక్కడ జరిగింది నేను నా కళ్లతో స్వయంగా చూశాను.. అనేక చోట్లకు వెళ్లాను... కుటుంబాలకు కుటుంబాలే అదృశ్యం అయ్యాయి.. కొన్ని కుటుంబాల్లో ఒక్కొక్కరే మిగిలారు.. పిల్లలు లేదా.. పెద్దలు ఇలా ఒక్కరే మిగిలారు" అని రాహుల్ పేర్కొన్నారు. ఈ విపత్తులో 200 మందికి పైగా చనిపోగా ఎంతోమంది కనిపించకుండా పోయారని చెప్పారు. ఈ సందర్భంగా కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలు, అలాగే కేంద్ర దళాలు, సైన్యం బాధితులకు అందించిన సేవలకు, సహకారానికి అభినందనలు తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు బాధితులకు అండగా నిలిచిన తీరును కొనియాడారు.

హమాస్ చీఫ్‌గా యహ్యా సిన్వర్?

గాజా, ఆగస్టు 7: పాలస్తీనాకు చెందిన తీవ్రవాద సంస్థ హమాస్ తదుపరి చీఫ్‌గా 61 ఏళ్ల యహ్యా సిన్వర్‌ను ప్రకటించనున్నారు. గత ఏడాది అక్టోబరు 7న ఇజ్రాయిల్‌పై హమాస్ జరిపిన దాడిలో యహ్యానే కీలక సూత్రధారిగా భావిస్తున్నారు. అది ఇజ్రాయిల్ చరిత్రలోనే అతి పెద్ద దాడి. దానికి ప్రతీకారంగా ఇజ్రాయిల్ జరుపుతున్న వైమానిక, భూతల దాడుల్లో ఇప్పటి వరకు 39,653 మంది పాలస్తీనియన్లు మరణించినట్టు హమాస్ ఆరోగ్య మంత్రిత్వశాఖ ప్రకటించింది. హమాస్ చీఫ్ ఇస్మాయిల్ హనియా గతవారం ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో హత్యకు గురైన విషయం తెలిసిందే. హనియాను తమ భూభాగంలో హత్య చేసినందుకు ఇజ్రాయిల్‌పై ప్రతీకారం తీర్చుకోవాలని ఇరాన్ రగిలిపోతుండటంతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరిగిపోతున్న వేళ హమాస్ నుంచి తాజా ప్రకటన వెలువడింది.

కొంప ముంచిన 100 గ్రాములు

పతకం దూరం

(మొదటి పేజీ తరువాయి)

పంచుకోవడం అత్యంత బాధాకరం అని భారత ఒలింపిక్ సంఘం ప్రకటన విడుదల చేసింది. తర్వాత దేశవ్యాప్తంగా రాజకీయ, సినీ తదితర రంగాల్లోని ప్రముఖులు ఫొగట్‌కు సంఘీభావం ప్రకటించారు. 'వినేశ్.. చాంపియన్లకే చాంపియన్‌వి నువ్వు. దేశానికి నువ్వు గర్వకారణం. ప్రతి ఒక్కరికి స్ఫూర్తి. ఈ సమయంలో మేమంతా నీ వెంటే ఉన్నాం' అని ప్రధాని మోదీ ఎక్స్‌లో ట్వీట్ చేశారు. సాంకేతిక కారణాలతో వినేశ్‌ను తప్పించడం దురదృష్టకరం అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విచారం వ్యక్తం చేశారు. దేశమంతా ఆమె వెంటనే ఉందని, మున్ముందు ఆమె మరింత కసితో బరిలోకి దిగి సత్తా చాటుతారని ఎక్స్‌లో రాహుల్ పేర్కొన్నారు. కాగా షెడ్యూల్ ప్రకారం బుధవారం రాత్రి జరిగిన ఫైనల్లో అమెరికా రెజ్లర్ సారా హిల్డెబ్రాంట్‌తో వినేశ్ పసిడి కోసం పోరాడాల్సి ఉంది. వినేశ్‌పై వేటుపడటంతో సెమీఫైనల్లో ఆమె చేతిలో ఓటమిపాలైన క్యూబా బాక్సర్ గుజ్మన్ లోపెజ్ వినేశ్ స్థానంలో ఫైనల్లో తలపడింది.

కొన్ని గంటల్లోనే 2.8 కిలోలు బరువు పెరుగుదల

వినేశ్ ఫోగట్ 50 కిలోల విభాగంలో బరిలోకి దిగింది. నిబంధనల ప్రకారం బౌట్‌లు మొదలయ్యే రోజు రెజ్లర్ల బరువు కొలుస్తారు. నిర్ణీత బరువు, అంతకన్నా తక్కువ ఉంటేనే బరిలోకి అనుమతిస్తారు. మంగళవారం వినేశ్.. తన విజయ పరంపర కొనసాగిస్తూ మూడు బౌట్లు ఆడింది. తొలి పోటీకి ముందు ఆమె బరువు 49 కిలోల 900 గ్రాములుగా ఉంది. ఆ వెంటనే ఆమె ప్రీక్వార్టర్స్, క్వార్టర్స్, సెమీఫైనల్ ఆడింది. సెమీస్ బౌట్ ముగిశాక.. వినేశ్ బలహీనంగా కనిపించడంతో ఆమె మితంగా ఆహారం, నీళ్ల తీసుకుందని తెలిసింది. తర్వాత కొన్ని గంటల్లోనే ఆమె బరువు చెక్ చేసుకుంటే 52 కిలోల 700 గ్రాములుగా వచ్చింది. దీంతో ఆమె బరువు తగ్గించుకునేందుకు తీవ్రంగా శ్రమించింది. రాత్రంతా స్కిప్పింగ్, జాగింగ్ చేసింది. శరీరంలోంచి కొంత రక్తాన్ని కూడా తీసేయించుకుంది. చివరికి జుట్టు కూడా కత్తిరించుకుంది. రెజ్లింగ్ పోటీల్లో వేసుకునే డ్రెస్‌ను కూడా చిన్నగా వేసుకుంది. అయినా ఫలితం లేకపోయింది. ఫైనల్ బౌట్ కోసం బుధవారం ఉదయం ఒలింపిక్ నిర్వాహకులు బరువు తూచగా ఫొగట్ 50 కిలోల 100 గ్రాములు ఉన్నట్లు తేలింది. స్వర్ణ పతక వేటలో ఉన్న వినేశ్‌లాంటి అథ్లెట్ విషయంలో ఎప్పటికప్పుడు బరువు సరిచూడాల్సిన కోచ్‌లు, న్యూట్రిషనిస్ట్, సహాయ సిబ్బంది నిర్లక్ష్యం ఉందన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. వినేశ్ అనూహ్యంగా బరువు పెరిగిన విషయం తెలియగానే.. తగ్గించేందుకు అన్నివిధాలుగా ప్రయత్నించామని భారత బృందంతో వెళ్లిన వైద్యాధికారి దిన్షా పర్దివాలా వెల్లడించారు.

కుట్ర కోణముందా?

వినేశ్ ఫొగట్‌పై కుట్రకోణం ఏమైనా ఉందా? ఆమెను పోటీల నుంచి తప్పించేందుకు ఎవరో కావాలని చేశారా? ఇదే అనుమానాన్ని మాజీబాక్సర్, ఒలింపిక్ పతక విజేత విజేందర్ వ్యక్తం చేశారు. పారిస్ క్రీడల్లో భారత రెజ్లర్లకు వ్యతిరేకంగా పెద్ద కుట్ర జరుగుతోందని ఆరోపించారు. ఈఆరోపణలను భారత అథ్లెటిక్స్ సమాఖ్య ఖండించింది. ఇది కేవలం సాంకేతికకు సంబంధించిన అంశం అని, దీన్ని రాజకీయం చేయొద్దని అథ్లెటిక్ సమాఖ్య కోరింది.

రాజకీయ రగడ...

రెజ్లర్ వినేశ్ ఫొగట్‌పై అనర్హత అంశం రాజకీయ రగడకు దారితీసింది. ఈ అంశంపై పార్లమెంటు ఉభయసభల్లో చర్చకు విపక్షాలు పట్టుబట్టాయి. వినేశ్ అనర్హత ఘటనపై పూర్తి విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశాయి. ఈ క్రమంలో లోక్‌సభలో క్రీడాశాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ ప్రకటన చేశారు. వినేశ్ అనర్హతపై అంతర్జాతీయ ఒలింపిక్ సంఘాన్ని భారత ఒలింపిక్ సంఘం గట్టిగా ప్రశ్నించిందని.. తన అసంతృప్తిని వ్యక్తం చేసిందని, ఐఓఏ చీఫ్ పీటీ ఉషతో ప్రధాని మోదీ స్వయంగా మాట్లాడారంటూ వివరించారు. ఈ వివరణతో సంతృప్తి చెందని విపక్షాలు సభ నుంచి వాకౌట్ చేశాయి. ఇదే విషయంలో రాజ్యసభ నుంచి కూడా విపక్షాలు వాకౌట్ చేశాయి. అనంతరం విపక్షాల ఎంపీలంతా వినేశ్‌కు న్యాయం చేయాలని కోరుతూ పార్లమెంటు ముందు నిరసన చేపట్టారు.

ఏం చేయాలో చేస్తాం:కరణ్ భూషణ్

వినేశ్ అనర్హతకు గురవడం బాధించిందని బ్రిజ్‌భూషణ్ కుమారుడు, ఎంపీ, యూపీ రెజ్లింగ్ అసోసియేషన్ చీఫ్ కరణ్ భూషణ్ పేర్కొన్నారు. ఈ అంశమ్మీద భారత రెజ్లింగ్ సమాఖ్య కచ్చితంగా అప్పీలు చేస్తుందని చెప్పారు. వినేశ్ విషయంలో అసలేం జరిగింది? ఇక ముందు ఏం చేయాలన్నదానిపై తెలుసుకొని చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

12 గంటల్లో చేయాల్సిందంతా చేశాం కానీ..

వినేశ్ బరువును నిర్దేశిత పరిమితిలోపు ఉంచేందుకు భారత బృందం అన్ని చర్యలు తీసుకుంది. కోచ్ అన్ని చర్యలు తీసుకున్నారు. వ్యాయామం చేయించాం. నీరు పరిమిత స్థాయిలో ఇచ్చాం. చెమటకోసం వ్యాయామాలు, ఆవిరి స్నానంలాంటి పన్నీ చేయించాం. చివరకు జుట్టు కూడా కత్తిరించాం. అయినప్పటికీ బరువు తూచే సమయానికి 100 గ్రాములు అధికంగా ఉన్నట్టు వెల్లడైంది. ఇది దురదృష్టకరం. బరువు తగ్గించడానికి చాలా సమయం పడుతుంది. మా చేతిలో 12 గంటల సమయమే ఉంది. మరికొంత ఉండుంటే ఆ బరువును కూడా తగ్గించేవాళ్లం

- భారత ఒలింపిక్ సంఘం జారీ చేసిన ప్రకటనలో జట్టు చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దిన్షా పార్దీవాలా

ఆమె ఎప్పుడూ 53 కిలోల విభాగంలోనే..

వినేశ్ విషయంలో కుట్ర ఏమీ లేదు. అధిక బరువు ఉన్నట్లు తేలింది అంటే ఎక్కువ బరువు ఉన్నట్టే. ఇది సాంకేతికతకు సంబంధించిన అంశం. ఆమె ఎప్పుడూ 53 కిలోల విభాగంలో పోటీ పడేవారు. తాజాగా 50 కిలోల విభాగంలోకి మారింది. బరువు మారిన పరిస్థితుల్లో ఈ సమస్యకు ఎప్పుడూ అవకాశం ఉంటుంది. అధిక బరువు విషయంలో సడలింపు ఏమీ లేదు

- భారత అథ్లెటిక్ సమాఖ్య అధ్యక్షుడు ఆదిల్ సుమరివాలా

రైలు వేగం గంటకు 1000 కి.మీ

విజయవంతంగా పరీక్షించిన చైనా

బీజింగ్, ఆగస్టు 7: చైనాలోని ప్రధాన నగరాలైన బీజింగ్, షాంఘై మధ్య దూరం 1000 కిలోమీటర్లు పైనే ఉంటుంది. విమానంలో వెళితేనే రెండు గంటలు పైనే పడుతుంది. అయితే.. ఇంత దూరాన్ని ఒక్క గంటలోనే చేరుకునేలా గంటకు 1000 కి.మీ వేగంతో ప్రయాణించే ఆల్ట్రా హై స్పీడ్ (యూహెచ్ఎస్) రైలుని చైనా రూపొందిస్తోంది. మాగ్లెవ్ టెక్నాలజీతో అభివృద్ధి చేస్తున్న ఈ రైలుకు స్పీడ్ ప్రదర్శన పరీక్షను విజయవంతంగా పూర్తిచేసింది. చైనా పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో ఈ మాగ్లెవ్ టెక్నాలజీని అభివృద్ధి చేసింది. అయస్కాంత శక్తితో నడిచే మాగ్లెవ్ రైలు పట్టాలను తాకకుండా గాల్లో తేలుతూ మెరుపు వేగంతో దూసుకెళ్తుంది. గ్లోబల్ టైమ్స్ నివేదిక ప్రకారం.. ఈ పరీక్షను రెండు కిలోమీటర్ల పైప్‌లైన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ రైలు వేగం, సస్పెన్షన్ నిర్దేశిత ప్రమాణాలను అనుగుణంగా ఉన్నాయి. గంటకు వెయ్యి కిలోమీటర్ల వేగాన్ని అందుకునే లక్ష్యంతో చేపట్టిన ఆల్ట్రా హై స్పీడ్ మాగ్లెవ్ రైలు నిర్మాణం 2022 ఏప్రిల్‌లో యాంగ్‌గావ్ కౌంటీలో ప్రారంభమైంది. చైనా ఏరోస్పేస్ సైన్స్ అండ్ ఇండస్ట్రీ కార్పొరేషన్ లిమిటెడ్, సాంగ్జీ సంయుక్తంగా దీన్ని రూపొందిస్తోంది. ఇది అందుబాటులోకి వస్తే ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన రైలుగా నిలవనుంది.

కుటుంబ వీసాలకు ఆదాయ పరిమితి పెంపు లేదు

- బ్రిటన్ ప్రభుత్వ నిర్ణయం.. భారతీయులకు ఊరట

న్యూఢిల్లీ, ఆగస్టు 7: కుటుంబ వీసాలకు కనీస వార్షిక ఆదాయ పరిమితిని పెంచకూడదని బ్రిటన్ ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి సంబంధించిన ఆర్థిక నిబంధనలను ప్రభుత్వం సమీక్షిస్తుందని, మైగ్రేషన్ అడ్వైజరీ కమిటీ(ఎంఏసీ) సమీక్ష పూర్తయ్యేవరకూ ఇందులో ఎలాంటి మార్పులు ఉండబోవని ఆ దేశ హోంమంత్రి వైవెట్ కూపర్ ప్రకటించారు. బ్రిటన్‌లో నివసించేవారు కుటుంబ వీసాకు స్పాన్సర్ చేయాలంటే ప్రస్తుతం వారి వార్షికాదాయం కనిష్ఠంగా 29 వేల పౌండ్లు (సుమారు రూ.30,21,174) ఉండాలి. ఈ పరిమితిని పెంచుతూ గత రుషి సునాక్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ప్రస్తుత కీర్ స్టార్మర్ ప్రభుత్వం పక్కన పెట్టింది. ఈ నిర్ణయం బ్రిటన్‌లో నివసిస్తున్న ఎందరో భారతీయులకు ఉపశమనం కలిగించనుంది. గతంలో ఈ పరిమితి 18,600 పౌండ్లు (రూ.19,37,718) ఉండగా వలసలను అడ్డుకోవడంలో భాగంగా దాన్ని ఈ ఏడాది ఏప్రిల్‌లో 29 వేల పౌండ్లకు (55 శాతం) పెంచారు.

కలుషిత ఆహారంతో 49 మంది విద్యార్థులకు అస్వస్థత

- అల్పాహారం తిన్న తర్వాత వాంతులు, కడుపునొప్పి
- జడ్చర్ల మైనారిటీ గురుకుల పాఠశాలలో ఘటన
- 9 మంది విద్యార్థులకు ఏరియా ఆస్పత్రిలో చికిత్స

జడ్చర్ల, ఆగస్టు 7: కలుషితాహారం తిని 49 మంది గురుకుల విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. వాంతులు, కడుపునొప్పితో బాధపడ్డారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలోని మైనారిటీ బాలుర గురుకుల పాఠశాలలో బుధవారం ఈ ఘటన చోటుచేసుకుంది. పాఠశాలలో ప్రస్తుతం 250 మంది విద్యార్థులు ఉండగా.. మెనూ ప్రకారం ఉదయం అల్పాహారంగా కిచిడీ, కట్టా (పచ్చిపులుసు) వండి పెట్టారు. తిన్న తర్వాత విద్యార్థులు తరగతి గదులకు వెళ్లారు. సుమారు గంట తర్వాత మొదట 6వ తరగతి విద్యార్థి ఒకరు వాంతులు చేసుకున్నాడు. అనంతరం మరికొంత మంది విద్యార్థులు కడుపులో నొప్పితో బాధపడుతూ వాంతులు చేసుకున్నారు. మొత్తం 49 మంది అస్వస్థతకు గురయ్యారు. ఉపాధ్యాయుల సమాచారంతో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీధర్‌రెడ్డి, జడ్చర్ల పట్టణ ఆరోగ్య కేంద్రం డాక్టర్ మనుప్రియ, ఆర్‌బీఎస్‌కే వైద్యులు డాక్టర్ సునీల్, డాక్టర్ హరీశ్ తమ సిబ్బందితో పాఠశాలకు చేరుకుని విద్యార్థులకు చికిత్స చేశారు. 9 మంది తీవ్ర అస్వస్థతకు గురికావడంతో 108 అంబులెన్స్‌లో జడ్చర్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. వారి ఆరోగ్యం నిలకడగా ఉంది. జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి పాఠశాలను పరిశీలించారు. ఆవరణ అపరిశుభ్రంగా ఉండడంతో ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు వండిన అన్నం, కూరలను పరిశీలించారు. ఈ ఘటనపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు. పాఠశాలలోని మిగతా విద్యార్థులకు భరోసా కల్పించేందుకు అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ వారితో కలిసి భోజనం చేశారు. పాఠశాలను డీఎంహెచ్‌వో డాక్టర్ పద్మజ, జడ్పీ సీఈవో వెంకట్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పరిశీలించారు.


పాఠశాలలో కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురైన విద్యార్థులు

బీఆర్‌ఎస్ విలీనం అంటూ దుష్ప్రచారం: కేటీఆర్

హైదరాబాద్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మరో పార్టీలో బీఆర్‌ఎస్ విలీనం అంటూ దుష్ప్రచారం చేయడం సరికాదని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. అలాంటి తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని బుధవారం ఎక్స్ వేదికగా హెచ్చరించారు. ఉద్దేశపూర్వకంగా ప్రచారం చేస్తున్న మీడియా సంస్థలు, వ్యక్తులు వెంటనే ప్రజలకు వివరణ ఇవ్వాలని, లేదంటే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కాంగ్రెస్, బీజేపీ పాలనలో చేనేత కార్మికుల బతుకులు ఛిద్రమవుతున్నాయని కేటీఆర్ ఆరోపించారు. ఆర్థిక ఇబ్బందులు తాళలేక నేతన్నలు ఆత్మహత్యలకు పాల్పడుతున్నా పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. ఎన్డీయే హయాంలో తొలిసారి చేనేత వస్త్రాలపై జీఎస్టీ వేశారని, హ్యాండ్లూమ్ బోర్డును రద్దు చేశారని, త్రిఫ్ట్ పథకం రద్దు చేశారని విమర్శించారు. నూలుపోగులపై రాయితీని 40 నుంచి 15 శాతానికి తగ్గించడం బాధాకరమన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కేసీఆర్ పాలనలో చేనేత రంగాన్ని ప్రోత్సహించడంతోపాటు నేతన్నల సంక్షేమానికి పలు పథకాలను అమలు చేశారని తెలిపారు. రేవంత్ పాలనలో చేనేత రంగం మళ్లీ సంక్షోభంలో కూరుకుపోయిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు కళ్లు తెరిచి, చేనేత రంగాన్ని గట్టెక్కించాలని డిమాండ్ చేశారు. నేతన్నలకు ఆయన ఎక్స్ వేదికగా జాతీయ చేనేత దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

కోమటిరెడ్డికి అమెరికాలో ఘన స్వాగతం

హైదరాబాద్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి అమెరికాలో ఘన స్వాగతం లభించింది. డల్లాస్ ఫోర్ట్ వర్త్ విమానాశ్రయంలో మంత్రి కోమటిరెడ్డికి స్వాగతం పలికిన తెలంగాణ ఎన్‌ఆర్‌ఐలు.. భారీ కాన్వాయ్‌తో ర్యాలీ నిర్వహించారు. కాగా, ఇప్పటికే అమెరికాలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి, ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలిసి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వివిధ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు.

వణికించిన వర్షం

(మొదటి పేజీ తరువాయి)

మీటరు మేర వర్షపు నీరు చేరింది. రామాలయం పడమర మెట్ల వైపు నుంచి ఆలయంలోకి ప్రవేశించేందుకు భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చప్టా దిగువ ప్రాంతంలోని విస్తా కాంప్లెక్స్ స్లూయిజ్ వద్దకు భారీ వరద చేరడంతో ఈ పరిస్థితి తలెత్తింది. రామాలయం సమీపంలోని కుసుమ హరినాథబాబా కల్యాణ మండపం ఒక వైపునకు ఒరగడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఆ శిథిలాలు ఇళ్లపై పడకుండా ఇనుప వైర్లు, పుల్లీల సహాయంతో చర్యలు చేపట్టారు. పట్టణంలోకి నీరు చేరడంపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. నీటిని మోటార్ల ద్వారా తోడి గోదావరిలోకి పంపాలని అధికారులకు సూచించారు. కాగా, భద్రాచలానికి చెందిన సున్నం సతీష్(45) ప్రమాదవశాత్తు డ్రైయినేజీలో పడి కొట్టుకుపోయాడు. రాత్రి 8 గంటల సమయంలో అతడి మృతదేహాన్ని ఎన్డీఆర్‌ఎఫ్ సిబ్బంది బయటకు తీశారు. మరోవైపు.. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనూ భారీ వర్షం కురిసింది. సత్తుపల్లి మండలం గంగారంలో అత్యధికంగా 10.4, వేంసూరు మండలంలో 6.6, పెనుబల్లిలో 5.9, ఖమ్మం అర్బన్‌లో 5.5 సెం.మీ. వర్షపాతం నమోదైంది. సత్తుపల్లి మండలంలోని కిష్టారం-చెరుకుపల్లి, యాతాలకుంట-దిబ్బగూడెం, కొణిజర్ల మండలంలోని పల్లిపాడు-గుబ్బగుర్తి మధ్య వాగులు పొంగడంతో రాకపోకలు నిలిచిపోయాయి. సత్తుపల్లి రాజీవ్‌కాలనీలో రోడ్లపైకి భారీగా వరదనీరు చేరింది. కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలం గరిమెళ్లపాడులో అత్యధికంగా 7.5సెం.మీ వర్షపాతం నమోదైంది. కిన్నెరసాని, తాలిపేరు ప్రాజెక్టులకు వరద పోటెత్తడంతో గేట్లు ఎత్తి నీటిని కిందికి వదులుతున్నారు. గద్వాల జిల్లాలోని గట్టులో 12.6 సెం.మీ. వర్షం కురవడంతో చెరువులు, కుంటల్లోకి నీళ్లు వచ్చాయి. వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలంలో 7.1, నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలంలో 7.1, నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలంలో 6.4 సెం.మీ. వర్షం కురిసింది. ములుగు జిల్లాలోని వెంకటాపురంలో 8.2 సెం.మీ. వర్షపాతం నమోదైంది. ఏటూరునాగారం మండలంలోని కొండాయి, మల్యాల, దొడ్ల గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మహబూబాబాద్‌లో భారీ వర్షం కురవడంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. పాకాల, ఆలిగేరు, కత్తెర, మున్నేరు, పందింపుల వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి.


భద్రాద్రి రామాలయం పడమర మెట్ల వైపు నడుంలోతులో వర్షపు నీరు

ప్రాజెక్టులకు తగ్గిన వరద

కృష్ణా బేసిన్‌లోని ప్రాజెక్టులకు వరద క్రమంగా తగ్గుతోంది. సుంకేసుల, తుంగభద్ర, జూరాల నుంచి శ్రీశైలం ప్రాజెక్టుకు 2.8లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. దిగువకు 3.74లక్షల క్యూసెక్కులను వదిలిపెడుతున్నారు. సాగర్‌కు అంతే మొత్తంలో నీరు చేరుతుండగా.. దిగువకు 2.7లక్షల క్యూసెక్కులను వదులుతున్నారు. పులిచింతల ప్రాజెక్టు నిండుకుండలా మారడంతో మట్టపల్లి ఆలయ సమీపానికి నీరు చేరుకుంటోంది. ప్రాజెక్టు నుంచి 2.78లక్షల క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. మరోవైపు గోదావరిలో వరద నిలకడగా కొనసాగుతోంది. మేడిగడ్డ బ్యారేజీకి 3.62లక్షల క్యూసెక్కుల వరద వస్తుండగా.. వచ్చింది వచ్చినట్టే కిందకు వదిలేస్తున్నారు. ఎగువన శ్రీరాం సాగర్ ప్రాజెక్టులోకి 11వేల క్యూసెక్కుల వరద వస్తోంది. కాగా, శ్రీపాద ఎల్లంపల్లి నుంచి మిడ్ మానేరుకు ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి.

బీసీల హక్కుల కోసం ఉద్యమిస్తాం: ఓబీసీ నేతలు

హైదరాబాద్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి):దేశ జనాభాలో 60 శాతం ఉన్న బీసీలను ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు విస్మరిస్తే రైతు ఉద్యమం తరహాలో బీసీ ఉద్యమాన్ని చేపడతామని ఓబీసీ సంఘాల నేతలు ప్రకటించారు. మండల కమిషన్ సిఫారసుల అమలు కోసం మరో మహా మండల్ ఉద్యమాన్ని నిర్మించాలని ఇందుకోసం ఓబీసీలు ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో అఖిల భారత తొమ్మిదో జాతీయ బీసీ మహాసభ బుధవారం జరిగింది. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్, రాష్ట్రీయ ఓబీసీ మహాసంఘ్ అధ్యక్షులు ప్రొఫెసర్ బాబాన్ రావ్ తైవాడే నేతృత్వంలో జరిగిన ఈ సభలో దేశంలోని 18 రాష్ట్రాల ప్రతినిధులు, జాతీయ బీసీ కమిషన్ చైర్మన్, వివిధ రాజకీయ పార్టీల నేతలు పాల్గొన్నారు. ఈ సభలో వక్తలు మాట్లాడుతూ.. కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వం ఉన్న నేపథ్యంలో బీసీల హక్కుల సాధనకు రాజకీయ పార్టీల మీద ఒత్తిడి తెచ్చేందుకు ఓబీసీలంతా ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ ఆన్సర్ గంగారాం మాట్లాడుతూ.. బీసీల క్రిమిలేయర్ విషయంలో ఆదాయ పరిమితి పెంపు అంశం కమిషన్ పరిశీలనలో ఉందని వెల్లడించారు. దేశవ్యాప్తంగా ఓబీసీలు ఎదుర్కొంటున్న సమస్యలపై కేంద్ర ప్రభుత్వానికి త్వరలో నివేదిక సమర్పిస్తామని తెలిపారు.

కన్నప్రేమను మరిచి రోకలిబండతో కొట్టి...

- మానసిక వికలాంగుడైన కొడుకును చంపిన తండ్రి
- మద్యం మత్తులో ఘాతుకం.. మెదక్ జిల్లాలో దారుణం


ప్రదీప్(ఫైల్)

పెద్దశంకరంపేట, ఆగస్టు 7: కొడుకు మానసిక వైకల్యాన్ని కన్నతండ్రే భరించలేకపోయాడు. కన్నకొడుకు అనే మమకారం కూడా లేకుండా మద్యం మత్తులో రోకలిబండతో కొట్టి ప్రాణం తీశాడు. మెదక్ జిల్లా పెద్దశంకరంపేటలో ఈ దారుణం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. పెద్దశంకరంపేట ఇందిరా కాలనీకి చెందిన పిరయిల సాయిలు, భాగమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడికి వివాహమవ్వగా భార్యతో కలిసి వేరుగా ఉంటున్నాడు. చిన్నకుమారుడు ప్రదీప్(16) మానసిక వికలాంగుడు కావడంతో ఇంట్లోనే ఉంటున్నాడు. కూలీ పనులు చేసుకుంటూ తల్లిదండ్రులే ప్రదీప్ ఆలనాపాలన చూస్తుంటారు. ప్రదీప్‌కు ప్రభుత్వం నుంచి వికలాంగ పింఛను కూడా వస్తోంది. అయితే, ప్రదీప్ మానసిక వైకల్యాన్ని తండ్రి సాయిలు భరించలేకపోతున్నాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి మద్యం మత్తులో ఇంటికొచ్చిన సాయిలు రోకలిబండతో ప్రదీప్‌ను కొట్టాడు. దీంతో ప్రదీప్ అక్కడికక్కడే మరణించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

గోల్కొండలో జెండా ఎగురవేయనున్న సీఎం

నార్సింగ్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల విషయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాజీ సీఎం కేసీఆర్ బాటలోనే నడుస్తున్నారు. ఈనెల 15వ తేదిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను గోల్కొండ కోటలో నిర్వహించనున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు ఈ కార్యక్రమాలు నగరంలో జరిగేవి. అయితే కేసీఆర్ సీఎం అయ్యాక గోల్కొండ కోటలో జెండా ఎగురవేయడం ప్రారంభించారు. ఢిల్లీలో ఎర్రకోటపై ఎగరవేసిన విధంగానే ఇక్కడ గోల్కొండ కోటపై ఎగురవేయాలని ఆయన సంకల్పించి ఈ సంప్రదాయానికి శ్రీకారం చుట్టారు. రేవంత్‌రెడ్డి సైతం దీన్నే కొనసాగించనున్నారు. ఈనేపథ్యంలో బందోబస్తు, ఇతర ఏర్పాట్లలో అధికారులు నిమగ్నమయ్యారు.

బిత్తిరి సత్తిపై సైబర్ క్రైంలో కేసు నమోదు

హిమాయత్‌నగర్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : బిత్తిరి సత్తిపై హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. భగవద్గీతను కించపరిచే విధంగా బిల్లు గీత పేరుతో బిత్తిరి సత్తి వీడియో రూపొందించి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశాడని వానర సేన జాతీయ అధ్యక్షుడు నామ్ రామ్‌రెడ్డి సైబర్ క్రైంలో ఫిర్యాదు చేశారు. ఆ వీడియో హిందువుల మనోభావాలను కించపరిచే విధంగా ఉందని, అతనిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. భారతీయ న్యాయ వ్యవస్థలో గీత కూడా ఒక భాగమని ఆయన లేఖలో తెలిపారు. వానర సేన ఫిర్యాదుతో బిత్తిరి సత్తిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులు తెలిపారు.

భువనేశ్వరి కోసం చీరలు కొన్న చంద్రబాబు

విజయవాడ, ఆగస్టు 7 : నిత్యం బిజీగా ఉండే ఏపీ సీఎం చంద్రబాబు తన సతీమణి కోసం షాపింగ్ చేశారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా విజయవాడలో ఏర్పాటు చేసిన చేనేత స్టాల్స్‌లో భువనేశ్వరి కోసం చేనేత చీరలను కొనుగోలు చేశారు. చేనేత స్టాళ్ల పరిశీలన సందర్భంగా నేతన్నలను అడిగి వారి సమస్యలు తెలుసుకున్నారు. అలా తిలకిస్తూ ముందుకెళ్లిన సీఎం రెండు స్టాల్స్ వెనక్కి వచ్చి 'ఈ చీరలు బాగున్నాయి.. ఎక్కడివి?' అని అడిగారు. ఉప్పాడ హ్యాండ్లూమ్ సొసైటీలో తయారైనవని అక్కడున్న నేత కార్మికుడు చెప్పారు. 'సరే ఆ చీర ఇవ్వు' అంటూ నెమలి రంగు చేనేత పట్టు చీరను కొన్నారు. అనంతరం ఈ విషయాన్ని చంద్రబాబు ప్రసంగంలో ప్రస్తావించారు. 'నా జీవితంలో ఎప్పుడూ చీరలు కొనలేదు. ఇప్పుడు మన చేనేత కళాకారులు తయారు చేసిన చీరలు చూడగానే ఆకట్టుకున్నాయి. అందుకే మా ఆవిడకు రెండు చీరలు కొనుగోలు చేశా. ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలు కొనాలి.' అని ముఖ్యమంత్రి అన్నారు.



జగన్ అక్రమాస్తుల కేసులో.. ఏమిటీ కాలయాపన?

(మొదటి పేజీ తరువాయి)

రఘురామకృష్ణంరాజు సుప్రీంకోర్టులో రెండు వేర్వేరు పిటిషన్లు దాఖలు చేయడం తెలిసిందే. వాటిపై ఈ ఏడాది మే 2న సీబీఐ అఫిడవిట్ వేసింది. 'కేసుల్లో నిందితులుగా ఉన్నవారు ఒకరి తర్వాత మరొకరు డిశ్చార్జ్ పిటిషన్లు వేస్తున్నారు. ట్రయల్ ముందుకు సాగకుండా అడ్డంకులు సృష్టిస్తున్నారు. ఇప్పటివరకు 39 క్వాష్ పిటిషన్లు, 95 డిశ్చార్జ్ పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై తీర్పులు ఇవ్వడానికి ముందే న్యాయాధికారులకు స్థానచలనం కలుగుతోంది. ఈ కేసులో ఉన్న నిందితులంతా శక్తిమంతులే' అని సీబీఐ అందులో పేర్కొంది. దీనిపై బుధవారం జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్‌కుమార్, జస్టిస్ ఆర్.మహదేవన్‌లతో కూడిన త్రిసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. బెంచ్ ముందుకు మొదటి కేసుగా జగన్ అక్రమాస్తుల కేసుపైనే విచారణ జరగాల్సి ఉంది. అయితే.. అదనపు సొలిసిటర్ జనరల్ (ఏఎస్‌జీ) రాజు అందుబాటులో లేకపోవడంతో రెండో కేసు నుంచి విచారణను ప్రారంభించారు. నాలుగో కేసు విచారణ జరుగుతుండగా రాజు వచ్చారు. జగన్ కేసు గురించి ప్రస్తావించారు. ఈ క్రమంలో జస్టిస్ సంజీవ్ ఖన్నా అసహనం వ్యక్తం చేశారు. ఆ ఆర్డర్, ఈ ఆర్డర్ అంటూ పేజీల కొద్దీ అఫిడవిట్ దాఖలు చేశారే తప్ప అందులో విషయమే లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. మధ్యాహ్నం 2 గంటలకు విచారణ చేస్తామని స్పష్టం చేశారు. తిరిగి విచారణకు వచ్చినప్పుడు మళ్లీ రాజు అందుబాటులో లేరని సీబీఐ తరఫు న్యాయవాదులు చెప్పడంతో జస్టిస్ ఖన్నా ఆగ్రహం వ్యక్తం చేశారు. సీబీఐ అఫిడవిట్‌ను ప్రస్తావిస్తూ.. అందులోని అంశాలు ఆశ్చర్యకరంగా ఉన్నాయని తెలిపారు. కోర్టుల ఆదేశాలు తప్పనే సాకుతో కాలయాపన చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. డిశ్చార్జ్ పిటిషన్ల పేరిట గత పదేళ్లుగా సీబీఐ కాలయాపన చేస్తోందని రఘురామ తరఫు న్యాయవాది ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. అయితే.. సుప్రీంకోర్టులో తాము కూడా అనేక పిటిషన్లు విచారించి డిశ్చార్జ్ చేస్తున్నామని.. తమకెలాంటి అవరోధాలు ఎదురు కావడం లేదని ధర్మాసనం తెలిపింది. డిశ్చార్జ్ పిటిషన్లకు, కేసు విచారణకు ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేసింది. ఇటువంటి కేసుల్లో సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం విచారణ చేపట్టాలని సీబీఐని ఆదేశించింది. తదుపరి విచారణను నవంబరు 11వ తేదీకి వాయిదా వేసింది.

తెలంగాణలోనే మొదట ఎస్సీ వర్గీకరణ: సంపత్ కుమార్

- గాంధీభవన్‌లో ఘనంగా చేనేత దినోత్సవం
- '33% రిజర్వేషన్ల' అమలుకు మహిళా కాంగ్రెస్ ఆందోళన

హైదరాబాద్/అఫ్జల్‌గంజ్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): దేశంలో మొదట తెలంగాణలోనే ఎస్సీ వర్గీకరణ అమలు కాబోతుందని ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి వర్గీకరణ చేస్తామని అసెంబ్లీలోనే ప్రకటించారని గుర్తు చేశారు. బుధవారం మాజీ మంత్రి ఎ.చంద్రశేఖర్, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక సభ్యుడు సతీశ్ మాదిగ, ఉస్మానియా వర్సిటీ ఉద్యమకారుడు చారకొండ వెంకటేశ్‌తో ఆయన నివాసంలో సమావేశమై ఎస్సీ వర్గీకరణ అమలుపై చర్చించారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని పీసీసీ రాష్ట్ర చేనేత విభాగం అధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్ నేతృత్వంలో గాంధీభవన్‌లో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి నేతలు పూలమాలలు వేసి చేనేత వృత్తి అభ్యున్నతికి ఆయన సేవలను కొనియాడారు. చేనేత రంగ ప్రముఖులు బావండ్ల వెంకటేశం, నాగరాజు, లింగయ్య (గద్వాల), గజం జనార్దన్ (యాదాద్రి భువనగిరి)ను సన్మానించారు. కాగా, చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని మహిళా కాంగ్రెస్ తలపెట్టిన బీజేపీ కార్యాలయాల ముట్టడి ఉద్రిక్తంగా మారింది. బుధవారం గాంధీభవన్ నుంచి టీపీసీసీ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావు వందలాది మంది మహిళా కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి బీజేపీ కార్యాలయాన్ని ముట్టడించేందుకు బయలుదేరగా.. పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేసి వారిని గేటు వద్దే అడ్డుకున్నారు. ఈ సందర్భంగా సునీతారావు కార్యకర్తలతో కలసి బారికేడ్లు ఎక్కి రోడ్డు మీదికి వచ్చేందుకు ప్రయత్నించడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. అయితే పోలీసులు పెద్దఎత్తున మోహరించడంతో బయటకు వచ్చే మార్గం లేక మహిళా కాంగ్రెస్ కార్యకర్తలు గాంధీభవన్‌లోనే ఆందోళన కొనసాగించారు.

ఫోన్ ట్యాపింగ్ కేసు.. బెయిల్ పిటిషన్లపై ముగిసిన వాదనలు

హైదరాబాద్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ డీఎస్పీ ప్రణీత్ రావు, మాజీ డీసీపీ(ఓఎస్డీ) రాధాకిషన్ రావు బెయిల్ పిటిషన్లపై వాదనలు ముగిశాయి. చంచల్‌గూడ జైల్లో జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న వీరిద్దరూ బెయిల్ కోసం మరోసారి నాంపల్లి కోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. దీనిపై రెండ్రోజుల పాటు విచారణ జరిగింది. పిటిషనర్ల తరఫు న్యాయవాది వాదనలను వినిపిస్తూ.. ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించిన ఆధారాలను ధ్వంసం చేశారనే ఆరోపణలకు ఎలాంటి ఆధారాలు లేవని, దర్యాప్తు అధికారులు రుజువు చేయలేకపోయారని వివరించారు. దర్యాప్తు ముగిసి, చార్జిషీట్ దాఖలు చేశారని, ఈ నేపథ్యంలో బెయిల్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. చార్జిషీట్ దాఖలు తర్వాత దర్యాప్తు చేసేదేమీ ఉండదన్నారు. దర్యాప్తు అధికారుల తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. కేసు దర్యాప్తు కీలక దశలో ఉందన్నారు. ఈ కేసులో ప్రధాన నిందితులుగా ఉండి, విదేశాల్లో ఉన్న వారిని రప్పించేందుకు కేంద్ర దర్యాప్తు సంస్థలు, ఇంటర్‌పోల్ సహకారం తీసుకుంటున్నామని వివరించారు. ఇలాంటి పరిస్థితుల్లో నిందితులకు బెయిల్ మంజూరు చేస్తే దర్యాప్తుకు ఆటంకం ఏర్పడుతుందన్నారు. ఇరు వర్గాల వాదనలను నమోదు చేసుకున్న న్యాయమూర్తి.. తీర్పును వాయిదా వేశారు. కాగా.. దర్యాప్తు అధికారులు చార్జిషీట్‌లో పొందుపర్చిన అన్ని పత్రాలను తమకు ఇవ్వలేదని నిందితుల తరఫు న్యాయవాదుల వ్యాజ్యంపై దర్యాప్తు అధికారులు కౌంటర్ దాఖలు చేశారు. కీలక అంశాలున్నందునే వాటిని గోప్యంగా ఉంచామన్నారు. తదుపరి విచారణను న్యాయస్థానం ఈ నెల 14కు వాయిదా వేసింది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఆమె నిలిచి గెలిచింది!

ఆటల్లో జయాపజయాలు ఉంటాయి, అనిశ్చితి ఆఖరివరకూ వెంటాడుతుంది. చివరి అంకంలో ఆట ఒక్కసారిగా మలుపు తిరగవచ్చు, అంతవరకూ విజేత అనుకున్నవారిని పరాజితులుగా కిందపడవేయవచ్చు. ఊహకు అందనప్పుడూ, ఉత్సాహాలతో ముంచెత్తినప్పుడు, ఉద్వేగాలు రేపినప్పుడు ఆట నిజానికి మరింత అందంగా ఉంటుంది. పరాజయం బాధించని సందర్భాలూ ఉంటాయి. కానీ, ఇప్పుడు జరిగింది అదికాదు. వినేశ్ ఫోగట్ గుండెబద్దలైందీ, కోట్లాదిమంది భారతీయుల ఆశలు ఆవిరైపోయిందీ ఆమె ఇంకా బరిలోకి దిగకముందే, గురిచూసి ప్రత్యర్థిని కూల్చకముందే. పారిస్‌నుంచి బంగారం తెస్తుందనుకున్న ఈ క్రీడాకారిణి కదనరంగం నుంచి ముందే నిష్క్రమించి ఆశలన్నీ అడియాసలు చేసినా దేశం ఆమె కన్నీరు తుడుస్తున్నది, నిలువెత్తు బంగారం నువ్వు అంటూ హారతులు పడుతున్నది. పసిడి పతకం పోరుకు దూరమైనా, అంతవరకూ రావడానికీ, ఆ ఎత్తుకు చేరడానికీ ఆమె పడిన శ్రమ, చేసిన యుద్ధం అసామాన్యమైనది.

ఆమె కుప్పకూలింది, కన్నీరు పెట్టుకుంది, ఆస్పత్రిపాలైంది కూడా. ఆమె గుండెగట్టిది కనుక, పోరాటం ఆమె రక్తంలో ఉన్నది కనుక అంతటి పెను ఉపద్రవాన్ని తట్టుకోగలిగింది. కొద్ది ఘడియలముందు తన చేతుల్లో ఓడిన ఓ క్రీడాకారిణి ఫైనల్‌కు ఎగబాకడం, తాను మాత్రం అనర్హురాలిగా మిగిలిపోవడం విషాదకరమైన పరిణామం. ఆమెకోసం ప్రత్యేకంగా కొందరు శిక్షకులు, నిపుణులు ఉన్నప్పుడు అతి తక్కువ సమయంలో రెండుకిలోల బరువు పెరగడం ఎలా సాధ్యమైందని కొందరి ప్రశ్న. పెరిగిన బరువును వదిలించుకోవడానికి రాత్రంతా ఆమె చేసిన శ్రమ, మహత్తరమైన ఆ పట్టుదల అపూర్వమైనవి. బరువును నియంత్రణలో ఉంచే విషయంలో సిబ్బంది యావత్తూ శ్రద్ధపెట్టివుంటే బాగుండేది. ఇలా అతివేగంగా బరువులో మార్పులు రావడం వల్ల ఆమెపై కుట్ర జరిగిందన్న అనుమానాలు, విమర్శలు వెల్లువెత్తాయి. ఇది సాంకేతిక అంశమనీ, కుట్రకోణాలు వెతకవద్దనీ, రాజకీయం చేయకూడదనీ ఎందరెందరో హితవులు చెబుతున్నారు కానీ, అనుమానాలు ఆగడం లేదు. భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్ తమను లైంగిక వేధింపులకు గురిచేస్తున్నాడనీ, అతడిని పదవినుంచి తప్పించాలని రెజ్లర్లంతా ఏడాదిపాటు రోడ్డునపడి చేసిన పోరాటం, అతడికి ఆఖరువరకూ అండగా నిలిచిన పాలకపక్షపెద్దలు ఈ క్రీడాకారులతో అమానుషంగా వ్యవహరించిన గతం ఇప్పుడు అందరికీ గుర్తుకువస్తున్నది. సాటి మహిళా క్రీడాకారుల పక్షాన వినేశ్ ఫోగట్ చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది. ఆ సందర్భంలో ఎదుర్కొన్న అవమానాలు, ఛీత్కారాలు ఇప్పుడు దేశం గుర్తుచేసుకుంటోంది. నిరసన శిబిరాలనుంచి ఆమెను ఈడ్చివేసిన దృశ్యాలు, గంగలో పతకాలు నిమజ్జనం చేయడానికి సిద్ధపడిన ఘట్టాలు తిరిగి ప్రచారంలోకి వస్తున్నాయి. తమ గోడు ఏమాత్రం పట్టించుకోని పాలకులపట్ల ఆగ్రహంతో, ఆవేదనతో ఆమె అప్పట్లో ఆటలమీద విరక్తిని ప్రదర్శించినప్పటికీ, తరువాత మనసు మార్చుకొని, ఒలింపిక్స్ కోసం సర్వసన్నద్ధమైంది, దేశం కోసం సర్వశక్తులూ ఒడ్డింది. రాష్ట్రపతి, ప్రధాని, విపక్షనేత, విభిన్నరంగాలకు చెందిన ప్రముఖులు ఇచ్చిన సందేశాలు ఈ సమయంలో ఆమెకు ఎంతో ఉపశమనం ఇస్తాయి. పారిస్ ఒలింపిక్స్ శిక్షణ కోసం ఆమెమీద డెబ్బయ్ లక్షలకుపైగా ఖర్చుచేశామని కేంద్ర క్రీడామంత్రి పార్లమెంటులో ప్రకటించడం ఆత్మరక్షణ కోసం కావచ్చునేమో కానీ, ఆమెనూ, అభిమానులనూ గిల్లడమే. గతంలో మోదీకి వ్యతిరేకంగా నిలబడి నినదించినా, ఆమెను ఒలింపిక్స్‌కు పంపి తమ పెద్దలు ఎంతో ఉన్నతంగా వ్యవహరించారన్నట్టుగా మరో నాయకురాలు వ్యాఖ్యానించారు. కానీ, సమస్త వ్యవస్థలు తనకు వ్యతిరేకంగా ఉన్నా తోటి మహిళాక్రీడాకారుల కోసం వినేశ్ ఫోగట్ అప్పట్లో బరికి ఆవల పాలకులతో పోరాడారు, ఇప్పుడు బరిలో కడవరకూ నిలిచి పోరాడి చూపించారు. ఆఖరుక్షణాల్లో ఓ వందగ్రాముల్లో తేడావచ్చి, ఆమె వెండి బంగారాలతో మెరవకపోవచ్చును గానీ, దేశ ప్రజల హృదయాల్లో ఎప్పటికీ విజేతగా నిలిచిపోవడం కంటే గొప్ప అవార్డులూ రివార్డులు ఇంకేమి ఉంటాయి?

‘నీట్ వద్దు’ సరికాదు!

నీట్ కథ ఈ ఏడాదికి కొలిక్కి వచ్చినట్లే. దేశవ్యాప్తంగా ఉన్న వివిధ కాలేజీల్లో ఎంబీబీఎస్ అలాగే డెంటల్ డిగ్రీ కోర్సుల్లో చేరేందుకు ఉద్దేశించిన ఉమ్మడి ప్రవేశ పరీక్ష నీట్. ఒక దేశం – ఒకే పరీక్ష అవసరాన్ని నొక్కి చెప్పిన సుప్రీంకోర్టు మొత్తమ్మీద సమస్యను సముచితంగా పరిష్కరించే ప్రయత్నమే చేసింది. పరీక్షకు ముందే పేపర్ లీక్ కావడంపై ఆగ్రహం వ్యక్తం చేసిన సర్వోన్నత న్యాయస్థానం, రాసిన విద్యార్థులు నష్టపోకుండా ఉండేందుకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చిందని చెప్పాలి. నీట్‌కు హాజరైన ఇరవై నాలుగు లక్షల పైచిలుకు విద్యార్థుల భవితవ్యాన్ని ఇబ్బందుల్లోకి నెట్టకూడదన్న ఒకే ఒక్క లక్ష్యంతో వ్యవహరించినట్లుంది. కొద్దిమంది చేసిన పాపం అందరిపాలిట శాపంగా మారకూడదని భావించింది.

నిజానికి ఈ ఏడాది తలెత్తిన సంక్షోభం మన దేశాన్ని కుదిపేసింది. నీట్ నుంచి తమ రాష్ట్రాన్ని మినహాయించాలని తమిళనాడు ఎప్పటినుంచో డిమాండ్ చేస్తోంది. తాజాగా ఇప్పుడది మరిన్ని రాష్ట్రాలకు పాకింది. నీట్ రద్దు సమంజసం అనుకుంటే దానికి ముందు మరికొన్ని అంశాలపై దృష్టి సారించడం అవసరం.



నేషనల్ పూల్‌కు తెలుగు రాష్ట్రాలు సీట్లు ఇవ్వని రోజుల్లో స్థానికంగా ఉన్న సీట్లు మాత్రమే అందుబాటులో ఉండేవి. ఇప్పుడు నేషనల్ పూల్‌కు ఇచ్చిన సీట్ల కంటే పోటీ పడేందుకు పెరిగినవి ఎక్కువ. నేషనల్ పూల్‌లో చేరడంతో ఒక్క నీట్‌తోనే మన విద్యార్థులకు మెడిసిన్‌లో చేరే సీట్ల సంఖ్య, తదనుగుణంగా అవకాశాలు పెరిగాయి. నీట్ వద్దనుకున్నప్పుడు వీటినీ దృష్టిలో పెట్టుకోవాల్సి ఉంటుంది. నీట్‌ను కాదనుకోవడం ఒక్కటే సమస్యకు పరిష్కారం కూడా కాబోదు.

తెలుగు రాష్ట్రాల్లో కొద్దికాలం క్రితం వరకు ఎంసెట్‌లో సాధించిన ర్యాంకు ఆధారంగా మెడిసిన్, డెంటల్ సీట్లను భర్తీ చేసేవారు. అప్పట్లో ఆ పరీక్ష చుట్టూ నెలకొన్న వివాదాలు తెలిసినవే. ఎప్పుడైతే మెడిసిన్, డెంటల్‌ను దాని నుంచి విడదీశారో ఒక్కసారి ఆ టెస్టు ప్రాముఖ్యం కోల్పోయింది. ఎంసెట్ పేరు మారినప్పటికీ అది పెద్ద చర్చనీయాంశం కాలేదు. అసలా పరీక్ష నిర్వహణ, ఫలితాల ప్రకటన కూడా యథావిధిగా జరిగే తంతుగా మారి చాలాకాలమైంది. తెలుగు రాష్ట్రాల్లోని ఇంజనీరింగ్ సీట్లకు కొద్దిగా అటూయిటూగా అర్హులు లెక్క తేలుతున్నారు. తెలంగాణలో ఇటీవలి కౌన్సెలింగ్ తీరును ఒకసారి పరిశీలిస్తే తొలి వెయ్యి ర్యాంకర్లలో చాలా మంది సదరు ప్రక్రియకే దూరంగా ఉన్నారు. ఐఐటీ, ఎన్ఐటీ, ఐఐఐటీ సహా పలు ప్రసిద్ధ ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలు ఉన్నత ప్రమాణాలతో ఇంజనీరింగ్ కోర్సులు అందిస్తున్నాయి. తెలివితేటలు ఉంటే మంచి ర్యాంకుతో తాము కోరుకున్న కాలేజీలో సీటు పొందుతున్నారు. లేదంటే మంచి ప్రైవేటు కాలేజీలో తగు రుసుము చెల్లించి సీటు కొనుక్కుంటున్నారు. మరికొంత మంది ఏదో కాలేజీలో వచ్చిన సీటుతో సరిపెట్టుకుంటున్నారు. అంతేతప్ప ఇంజనీరింగ్ చదువుకు మాత్రం దూరం కావడం లేదు. డిమాండ్‌కు మించి సీట్లు అందుబాటులో ఉండటం ఇక్కడ ఉన్న పెద్ద వెసులుబాటు. అదే మెడిసిన్ విషయానికి వస్తే డిమాండ్‌కు తగ్గట్టు సీట్లు అందుబాటులో లేకపోవడం దురదృష్టకరం. ప్రైవేటు మెడికల్ కాలేజీలో సీటు అంటే లక్షలతో వ్యవహారం. అదే నీట్ విషయంలో అడ్డదారులు తొక్కేందుకు దోహదపడుతోంది. ఫలితంగా ఈ డొంక తిరుగుడు మార్గాలను అవలంబిస్తున్నారంటే అతిశయోక్తి కాదు. ఎప్పటికప్పుడు కొత్త కుయుక్తులను పన్నుతుండటమూ తెలిసిందే.

నీట్ ఉనికిలో లేనప్పుడు మెడిసిన్‌పై ఆసక్తి ఉన్న అభ్యర్థులు వేర్వేరు నేషనల్ లెవెల్ టెస్టులు రాస్తుండేవారు. ఎంతలేదన్నా రెండు, మూడు ఎంట్రెన్స్ టెస్టులకు హాజరయ్యేవారు. ఢిల్లీలోని ఎయిమ్స్, వార్ధాలోని ఎంజీఐఎంఎస్, పుణెలోని ఏఎఫ్ఎంసీ, రాయవెల్లూరు, లుధియానాల్లోని సీఎంసీ, బెంగళూరులోని సెయింట్ జాన్స్, మణిపాల్ మెడిసిన్‌కు వేర్వేరు టెస్టులు ఉండేవి. ఇది కాకుండా పొరుగున ఉన్న కర్ణాటకలోని ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో సీట్ల కోసం కొమెడ్ రాయాల్సి వచ్చేది. బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీకి తోడు మెడికల్ కాలేజీ ప్రమాణాలను అనుసరించి అదనంగా కరెంట్ అఫైర్స్ కూడా ఉండేది. కొన్ని చోట్ల ఇంగ్లీష్ ఒక టాపిక్‌గా ఉండేది. వీటన్నింటికీ ప్రిపరేషన్ కూడా వేర్వేరుగా ఉండేది. అలాగే నేషనల్ పూల్‌కు తెలుగు రాష్ట్రాలు సీట్లు ఇవ్వని రోజుల్లో స్థానికంగా ఉన్న సీట్లు మాత్రమే అందుబాటులో ఉండేవి. ఇప్పుడు నేషనల్ పూల్‌కు ఇచ్చిన సీట్ల కంటే పోటీ పడేందుకు పెరిగినవి ఎక్కువ. ఈ పరీక్షలు అన్నింటినీ రాయడం ఒక ఎత్తు. వీటికి కట్టాల్సిన ప్రవేశ పరీక్ష ఫీజులు, దరఖాస్తు సమర్పణ మరొక ఎత్తు. అదేవిధంగా నేషనల్ పూల్‌లో చేరడంతో ఒక్క నీట్‌తోనే మన విద్యార్థులకు మెడిసిన్‌లో చేరే సీట్ల సంఖ్య, తదనుగుణంగా అవకాశాలు పెరిగాయి. నీట్ వద్దనుకున్నప్పుడు వీటినీ దృష్టిలో పెట్టుకోవాల్సి ఉంటుంది.

ఈ నేపథ్యంలో నీట్‌ను కాదనుకోవడం ఒక్కటే సమస్యకు పరిష్కారం కూడా కాబోదు. ఒనగూరుతున్న ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుంటే పరిష్కారాలు, ప్రత్యామ్నాయాలు కూడా కనిపిస్తాయి. టోఫెల్, జీఆర్ఈ, జీమ్యాట్ వంటి పరీక్షలు ప్రపంచవ్యాప్తంగా పకడ్బందీగా జరుగుతున్నాయి. అత్యున్నత స్థాయి పరీక్షల నడగ్గ జేఈఈ అడ్వాన్స్‌డ్, క్యాట్ వంటి వాటి నిర్వహణలో ఎలాంటి ఆటంకాలు ఎదురుకావడం లేదు. నిజానికి ఈ పరీక్షలను నిర్వహించే ఐఐటీ లేదంటే ఐఐఎంలు ఏటా మారుతుంటాయి కూడా. అంతవరకు ఎందుకు – నీట్‌ను నిర్వహిస్తున్న ఎన్‌టీఏ ఇటీవలి కాలంలో ఇంజనీరింగ్‌లో ప్రవేశాలకు ఉద్దేశించిన జేఈఈ మెయిన్ ఎగ్జామ్‌ను ఎంతగానో మెరుగుపర్చింది. కొవిడ్ సమయంలో నాలుగు పర్యాయాలు నిర్వహించి బెస్ట్ స్కోర్ ఆధారంగా ర్యాంకులను నిర్ణయించింది. అలాగే ఇటీవలి కాలంలో జనవరిలో ఒకసారి, ఏప్రిల్‌లో మరోసారి అంటే ఇంటర్ సెకండియర్ పరీక్షలకు ముందు, తదుపరి నిర్వహించి బెస్ట్ స్కోర్ ఆధారంగా ర్యాంకులను నిర్ధారిస్తోంది. అది కూడా కంప్యూటర్ ఆధారిత టెస్టును జరుపుతోంది. అంతర్జాతీయ ప్రమాణాలను పాటించి మరీ ర్యాంకులను తేలుస్తోంది. అదే ఒరవడిని నీట్‌కూ నిర్దేశించుకోవచ్చు.

• మద్దిపట్ల మణి

ప్రచ్ఛన్న హస్తం కాదు, అది ప్రజల పిడికిలి!





■ కె. శ్రీనివాస్

సందర్భం

బంగ్లాదేశ్ ఏర్పడిన రోజులు మసకగా అయినా గుర్తున్నవారికి, ఆ దేశపు అర్ధశతాబ్ది స్వతంత్ర ప్రయాణం విచారం కలిగిస్తుంది. బ్రిటిష్ వలసపాలన నాటినుంచి బెంగాల్ మీద ప్రయోగాలు జరుగుతూనే ఉన్నాయి. మొగ్గ తొడుగుతున్న జాతీయోద్యమాన్ని విచ్ఛిన్నం చేయడానికి బెంగాల్‌ను చీల్చినప్పుడు తీవ్రంగా ప్రతిఘటించిన ప్రజలు, తరువాత దేశవిభజన సమయంలో తామే మతప్రాతిపదికగా వేరయ్యారు, నెత్తుటి వరదలుగా కలహించుకున్నారు. పాకిస్థాన్ దుష్పరిపాలన, వివక్షలతో విసిగిపోయిన తూర్పు పాకిస్థాన్ భాషా ప్రాతిపదికన తిరుగుబాటు చేసి బంగ్లాదేశ్ అయింది. ఆ పరిణామంలో భారత్ సైనికపాత్ర కీలకమయినది. అంతర్జాతీయ రాజకీయాలు ఆ సమయంలో ఉపఖండంలో మోహరించాయి. అవి ప్రాంతీయ, స్థానిక పరిణామాలైనా ప్రత్యక్ష పాత్రధారులతో పాటు, పరోక్ష సూత్రధారులు లేకుండా జరగలేవు.

అభ్యుదయ, లౌకికవాది అయిన ముజిబుర్ రెహ్మాన్ సారథ్యంలో బంగ్లాదేశ్ ముందుకు వెడుతుందనుకుంటే, దేశం ఏర్పడిన నాలుగేళ్లకే ఆయన సైన్యం చేతిలో హత్యకు గురి అయ్యారు. నాటి నుంచి సైనిక పాలనలు, హత్యలు, అడపాదడపా ఎన్నికలు, తిరిగి కూల్చివేతలతో సంక్షోభంలోనే బంగ్లాదేశ్ ప్రయాణిస్తూ వచ్చింది. వీటన్నిటి మధ్యనే అనేక తరాల ప్రజలు జీవనం సాగించారు, కొంత పురోగతి పొందారు, అప్పుడప్పుడు నిస్పృహ చెందారు, పోరాడారు, అణచివేతలు ఎదుర్కొన్నారు. తాజాగా ఇప్పుడు అక్కడ జరిగిన పరిణామంలో, మొదటిసారిగా, జనసామాన్యం తమ గొంతు బలంగా వినిపించే, తమ అభీష్టాన్ని నెరవేర్చుకునే ప్రయత్నం చేసింది. క్రూరమైన నియంతృత్వాన్ని చెలాయించి, బతుకుజీవుడా అంటూ భారత్‌కు పారిపోయిన షేక్ హసీనా, బంగ్లాదేశ్ వ్యవస్థాపకుడు, బంగబంధు ముజిబుర్ రెహమాన్ కుమార్తె కావడం విషాదం. ఈమె సమకూర్చుకున్న అప్రదిష్ట, తండ్రి స్మారకాల మీద కూడా దాడులకు కారణమయింది.

పొరుగింటికి నిప్పు అంటుకున్నప్పుడు, అందులోని మనుషులకు ఏమి జరిగిందో అన్న ఆవేదనతో పాటు, అది తమ ఇంటిని కూడా కాలుస్తుందేమోనన్న భయం కూడా ఇరుగింటివారికి కలుగుతుంది. బంగ్లాదేశ్ పరిణామాల విషయంలో భారత్ కలవరానికి అర్థం ఉంది. హింసా విధ్వంసాలు ఎటు మలుపు తిరుగుతాయో, ఆ దేశంలో మైనారిటీల మీద దాడులు జరుగుతాయో, ఫలితంగా దేశంలోకి శరణార్థులు వెల్లువలా వచ్చిపడతారేమో, అన్న ఆందోళనలు కలగడంలో ఆశ్చర్యం లేదు. ఇక, దక్షిణాసియా, గ్లోబల్ రాజకీయాల నేపథ్యంలో అర్థం చేసుకోవలసిన అంశాలు మరికొన్ని ఉన్నాయి. షేక్ హసీనా భారత్‌తో స్నేహసంబంధాలలో ఉండేవారు. ఆమె చిరకాల ప్రత్యర్థి ఖలీదా జియా భారత్ వ్యతిరేక ధోరణిలో ఉండేవారు. ఈశాన్య భారతంలోని తిరుగుబాటుదారులకు ఖలీదా ఆశ్రయం ఇచ్చి ప్రోత్సహించేవారు. పాకిస్థాన్, చైనా, అమెరికాలతో స్నేహంగా ఉండేవారు. మిలిటెంట్ ఇస్లామ్ వాదం ప్రభావం బంగ్లాదేశ్ మీద కూడా పడింది. ఆ వైపు నుంచి కూడా భారతదేశానికి సమస్య ఏర్పడింది. మిలిటెంట్లను హసీనా అదుపు చేసినంతగా, ఖలీదా చేయలేదు.

బలహీనంగా ఉన్న బంగ్లాదేశ్‌ను తమ అదుపులోకి తెచ్చుకోవడానికి చైనా చిరకాలంగా ప్రయత్నిస్తోంది. తానే బలహీనపడిపోయి ఉన్న పాకిస్థాన్ ఇంకా పాత పరాభవాన్ని మరచిపోలేక, సైన్యం ద్వారా, కొన్ని రాజకీయ మత సంస్థల ద్వారా తన ప్రభావాన్ని వేస్తోంది. చైనా, పాక్ ఈ విషయంలో పరస్పరం సహకరించుకుంటున్నాయని భారత్ భావిస్తోంది. సుదూరాన ఉన్న అమెరికాకు, దక్షిణాసియా ఎంతో కీలకమయిన ప్రాంతం. చైనాను అదుపు చేసే స్నేహాల కోసం, స్థావరాల కోసం వెదుకుతూ వస్తోంది. తమ సైనిక కేంద్రం పెడతామని అమెరికా అడిగిందని, అందుకు తాను అంగీకరించలేదని హసీనా ఈ మధ్య అన్నారు. చైనాను బలహీనపరచాలనే అమెరికా ప్రాజెక్టులో చేతులు కలపడానికి ఉత్సాహపడుతున్నప్పటికీ, ఉపఖండ భూభాగం మీద అమెరికాకు చోటు ఇచ్చే ప్రతిపాదనకు మాత్రం భారత్ అంగీకరించదు.

మరి బంగ్లాదేశ్ విషయంలో భారత్ ఏమి కోరుకుంటోంది? అక్కడి ప్రజలకు రుచించని సాహస నిర్ణయాలేవీ తీసుకోవాలనుకోదు. హసీనాకు తాత్కాలిక ప్రాతిపదికన ఆశ్రయం ఇచ్చాము కానీ, ఆమెను ఇక్కడే కొనసాగించే ఉద్దేశం లేదని భారత విదేశాంగ మంత్రి సూచిస్తూనే ఉన్నారు. అక్కడి పరిస్థితులు చక్కబడాలని కోరుకోవడంతో పాటు, కొత్తగా ఏర్పడే తాత్కాలిక ప్రభుత్వంలో భారత వ్యతిరేక శక్తులది పైచేయి కాగూడదని ఆశిస్తోంది, బహుశా అందుకు ప్రయత్నం కూడా చేస్తూ ఉండవచ్చు. ఇక్కడ భారత వ్యతిరేక శక్తులంటే, జమాతే ఇస్లామీ, ఖలీదాజియా నాయకత్వంలోని బీఎన్‌పీ, అక్కడి సైన్యంలోని చైనా, పాకిస్థాన్ అనుకూల అధికారులు!

బంగ్లాదేశ్ పరిణామాలను భారత ప్రభుత్వ విదేశాంగ దృక్పథం నుంచి మాత్రమే అర్థం చేసుకోవడం సరి అయినదేనా? ఒక ప్రజావ్యతిరేక పాలన మీద అపూర్వమైన తిరుగుబాటుగా గుర్తించడంలో సంకోచం ఎందుకు? భారతీయ మీడియా, ముఖ్యంగా అధికార పీఠాల ఆలింగనంలో ఉన్నదనుకుంటున్న జాతీయ ఆంగ్ల, హిందీ మీడియా, ఎందుకు బంగ్లా పరిణామాలలో కొంత కుట్రకోణాన్ని, కొంత టెర్రరిజాన్ని, మరికొంత హిందూ వ్యతిరేకతను మాత్రమే చూస్తున్నది? రాజకీయకారణాలతోనే తిరుగుబాటు జరిగినా, బంగ్లాదేశ్‌లో కల్లోలం అక్కడి మైనారిటీలలో ఎంతో కొంత భయాందోళనలను కలిగించింది. పెద్దసంఖ్యలో ప్రజలు, ఒక సంస్థాగత నిర్మాణంలో కాకుండా, యథేచ్ఛగా ఆందోళనలకు దిగినప్పుడు, విద్యార్థులు, ప్రవాస బంగ్లాదేశీయులు మాత్రమే కాక, విస్తృత ప్రజాశ్రేణులు అందులో భాగం అయినప్పుడు, అక్కడక్కడ అరాచకం, హింసాదోరణి కనిపించడం సహజం! ప్రతిఘటించలేక చతికిలపడిన పాత ప్రతిపక్షం కూడా ప్రజల ఉద్యమానికి మద్దతు ఇచ్చింది. ప్రస్తుత సందర్భంలో హసీనా పార్టీ ‘అవామీలీగ్’ కార్యాలయాల మీద, కార్యకర్తల వ్యాపారాల మీద దాడులు ఎక్కువగా జరిగాయి. దహనకాండలో అనేకమంది ప్రాణాలు కోల్పోయారు కూడా. కానీ, ఆ దేశంలో జరిగిన పరిణామాల తీవ్రతను దృష్టిలో పెట్టుకుంటే, ప్రాణనష్టం తక్కువేనని చెప్పాలి. హిందూ మైనారిటీల ఆస్తులపై, దైవస్థలాలపై జరిగిన దాడులు కూడా తొందరలోనే తగ్గుముఖం పట్టాయి. అవామీలీగ్ కార్యకర్తలుగా, నాయకులుగా ఉన్న హిందువులు రాజకీయ కారణాల వల్లే లక్ష్యంగా మారారు. హింసను విరమించుకోవాలని ఉద్యమనాయకులు, వివిధ రాజకీయనేతలు పదే పదే విజ్ఞప్తి చేస్తున్నారు. హసీనా వ్యతిరేక పోరాటంలో ముందుభాగాన ఉన్న విద్యార్థి నాయకులు, సైనిక పాలనకు తాము వ్యతిరేకమని, విశ్వసనీయత ఉన్న ప్రజారంగ వ్యక్తి ఆధ్వర్యంలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటు చేయాలని కోరడం విశేషం. వారు కోరినట్టుగానే నోబెల్ బహుమతి గ్రహీత, సూక్ష్మపొదుపు ఉద్యమాన్ని నిర్వహించిన మహమ్మద్ యూనస్ బంగ్లా ప్రభుత్వ బాధ్యతలు చేపట్టబోతున్నారు. హసీనా ప్రభుత్వం వల్ల తీవ్రమైన వేధింపులను ఎదుర్కొన్న యూనస్ పశ్చిమదేశాలకు అనుకూలుడని చెబుతారు. భారత్‌తో సత్సంబంధాలు ఎంతటి కీలకమైనవో యూనస్‌కు తెలుసును కాబట్టి, ఆయన వైఖరి సానుకూలంగా ఉండవచ్చునని భారత్ ఆశిస్తోంది.

భారత్‌తో స్నేహంగా ఉండడంతో పాటు, షేక్ హసీనా హయాం లౌకిక విధానాలతో కొనసాగింది. మత ఉద్రిక్తతలు చాలా తక్కువ. వస్త్ర పరిశ్రమకు ప్రపంచంలో మార్కెట్‌ను విస్తరింపజేసి, దేశంలో ఉపాధిని పెంచారు. దీర్ఘకాలం ‘సుస్థిరత’ కొనసాగింది. ఇవన్నీ నిజమే కావచ్చు. కానీ, 17 కోట్ల జనాభాలో 3 కోట్లమంది నిరుద్యోగులు. బంగ్లాదేశ్ కరెన్సీ ‘టాకా’ విలువ 28 శాతం తగ్గింది. మూడేళ్లలో విదేశీ మారక నిల్వలు 44 శాతం తగ్గాయి. 2021లో 5.51 శాతం ఉన్న ద్రవ్యోల్బణం 2024లో 9.73 శాతానికి చేరింది. వీటన్నిటి ప్రతిఫలనాలు జనజీవనంలో వ్యక్తమయ్యాయి. ప్రజలు తమ అవసరాలను, అసమ్మతిని చెప్పుకోవడానికి ఆస్కారం లేకుండా పోయింది. ప్రతిపక్షం అణగారిపోయింది. నిర్బంధం తారస్థాయికి చేరింది. అక్రమనిర్బంధాలు, చట్టవ్యతిరేక కాల్చివేతలు ప్రపంచ ప్రఖ్యాతి పొందాయి. తమ అసహనానికి ప్రాతినిధ్యం వహించే రాజకీయ శక్తే లేకపోయిన ప్రజలు తామే వీధుల్లోకి వచ్చారు. ఇందుకు ఏ కుట్రా, ప్రచ్ఛన్నహస్తమూ అవసరం లేదు. హసీనా, బంగ్లా పాలకవర్గాలూ చేజేతులా తెచ్చుకున్న దుస్థితే ఇది. భారత ప్రతిపక్షాలు బుధవారం నాడు పార్లమెంటులో బంగ్లా పరిణామాలు ఇస్తున్న రాజకీయ సందేశాన్ని వక్కాణించాయి. భారతదేశంలోని రాజకీయార్థిక పరిస్థితులను బంగ్లా పరిణామాలతో పోల్చారు. పైపైన అంతా బాగానే కనిపిస్తున్నా, లోలోపల ముదురుతున్న సంక్షోభాన్ని గుర్తించకపోతే, భారత ప్రభుత్వానికి కూడా ముప్పు తప్పదన్నట్టు వారు హెచ్చరించారు. మరి ఎందుకు, ఘనత వహించిన ప్రసార, సమాచార సాధనాలు, బంగ్లాదేశ్‌లో జరుగుతున్నదంతా భారత్‌కు వ్యతిరేకంగానే అన్నట్టుగా, హసీనా అపరాధం ఏమీ లేనట్టుగా చిత్రిస్తున్నాయి? ఇస్లామిస్టు అరాచక శక్తుల ఇష్టారాజ్యం నడుస్తోందని, హిందువుల మీద హత్యాకాండ జరుగుతోందని ఇంటెలిజెన్స్ వర్గాలను ఉటంకిస్తూ జాతీయ చానెళ్లు ఎందుకు ప్రసారాలు చేస్తూ భయపెడుతున్నాయో తెలియడంలేదు.

హసీనా వ్యతిరేక పోరాటంలో ముందుభాగాన ఉన్న విద్యార్థి నాయకులు, సైనిక పాలనకు తాము వ్యతిరేకమని, విశ్వసనీయత ఉన్న ప్రజారంగ వ్యక్తి ఆధ్వర్యంలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటు చేయాలని కోరడం విశేషం. వారు కోరినట్టుగానే నోబెల్ బహుమతి గ్రహీత, సూక్ష్మపొదుపు ఉద్యమాన్ని నిర్వహించిన మహమ్మద్ యూనస్ బంగ్లా ప్రభుత్వ బాధ్యతలు చేపట్టబోతున్నారు.

యూనస్ చేతికి ప్రభుత్వం వచ్చినంత మాత్రాన, మంత్రం వేసినట్టు పరిస్థితి మారిపోదు. రేపటికి పరిస్థితులు మారి, విచ్ఛిన్న శక్తులు దేశాన్ని అతలాకుతలం చేసే హింసకు పాల్పడవచ్చు, చెప్పలేము. కానీ, ఇప్పటికి అయితే, బంగ్లాదేశ్‌లో చాలా వేగంగా పరిస్థితులు కుదురుకుంటున్నాయి. గురువారం నాడు తాత్కాలిక ప్రభుత్వం ప్రమాణం తరువాత, శాంతిభద్రతలు సాపేక్షంగా మెరుగుపడే ఒక వాతావరణం ఏర్పడుతుంది. మౌలిక జీవన పరిస్థితులు మెరుగుపడితే తప్ప, అశాంతి తగ్గదు. ఆ దిశగా ప్రయాణం మొదలయిందని ఒక సూచన వ్యక్తమైతే ప్రజలు సహనంతో ఎదురుచూస్తారు.

తమ బెంగాలీ అస్తిత్వాన్ని కాపాడుకోవడానికి పాకిస్థాన్‌తో తెగదెంపులు చేసుకున్నవారు బంగ్లాదేశీయులు. వారి జాతీయ గీతం ‘అమర్ సోనార్ బంగ్లా’ కర్త రవీంద్రనాథ్ టాగోర్. హసీనాకు వ్యతిరేకంగా చేసిన పోరాటంలో ఆందోళనకారులకు ప్రేరణ, ఉత్సాహం ఇచ్చిన పద్యం ద్విజేంద్రలాల్ రాయ్ 20వ శతాబ్ది తొలిసంవత్సరాలలో రాసిన ‘ధనో ధాన్యో పుష్పో భరా’ అన్న బెంగాలీ గీతం. “ధనధాన్యాలతో, పుష్పాలతో నిండిన మాతృభూమీ, స్వప్నాలలో పుట్టి, స్మృతులతో నిండిన తల్లీ, నీవంటి నేల ఇంకెక్కడన్నా ఉందా; నా మాతృభూమీ, రాజ్యాలన్నిటికీ రాణీ”.. అంటూ కీర్తించే ఈ పాటలో మాతృదేశం ఆనాటి ఉమ్మడి భారతదేశం. ఇప్పుడు బంగ్లాదేశ్‌ను ఉద్దేశించి కూడా అక్కడి పోరాటవాదులు అదే పాడుకుంటున్నారు. భాషతో, నేలతో ముడిపడిన ఆ మమకారాన్ని బంగ్లాదేశ్ కొనసాగించి తీరుతుంది!

తమ బెంగాలీ అస్తిత్వాన్ని కాపాడుకోవడానికి పాకిస్థాన్‌తో తెగదెంపులు చేసుకున్నవారు బంగ్లాదేశీయులు. వారి జాతీయ గీతం ‘అమర్ సోనార్ బంగ్లా’ కర్త రవీంద్రనాథ్ టాగోర్. హసీనాకు వ్యతిరేకంగా చేసిన పోరాటంలో ఆందోళనకారులకు ప్రేరణ, ఉత్సాహం ఇచ్చినది ద్విజేంద్రలాల్ రాయ్ 20వ శతాబ్ది తొలిసంవత్సరాలలో రాసిన “ధనో ధాన్యో పుష్పో భరా” అన్న బెంగాలీ గీతం. “ధనధాన్యాలతో, పుష్పాలతో నిండిన మాతృభూమీ, స్వప్నాలలో పుట్టి, స్మృతులతో నిండిన తల్లీ, నీవంటి నేల ఇంకెక్కడన్నా ఉందా; నా మాతృభూమీ, రాజ్యాలన్నిటికీ రాణీ”.. అంటూ కీర్తించే ఈ పాటలో మాతృదేశం ఆనాటి ఉమ్మడి భారతదేశం. ఇప్పుడు బంగ్లాదేశ్‌ను ఉద్దేశించి కూడా అక్కడి పోరాటవాదులు అదే పాడుకుంటున్నారు. భాషతో, నేలతో ముడిపడిన ఆ మమకారాన్ని బంగ్లాదేశ్ కొనసాగించి తీరుతుంది!

బీసీల సహనాన్ని పరీక్షించకండి

కులగణన చేయకుండా, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వకుండా రేవంత్ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లోకి పోతే బీసీలు తమ హక్కుల సాధన శంఖారావం పూరిస్తారు. 1947 నుంచి 2024 ఎన్నికల దాకా బీసీలకు అన్ని పార్టీలు చేయని వాగ్దానాలు లేవు. కానీ ఏ పార్టీ ఏం చేసిందో ఆచరణలో చూస్తే బీసీలకు సున్నకు సున్నగా మిగిలింది. కులగణనకు ప్రభుత్వం 150 కోట్లు కేటాయించింది, కానీ పని మొదలుపెట్టలేదు. మమ్మల్ని ఇంకెంతకాలం మోసం చేస్తారని అడిగేదాకా వచ్చారంటే అది బీసీల చైతన్యస్థాయికి తార్కాణం. గ్రామచావళ్ల దగ్గర్నుంచి సెక్రటేరియట్ ప్రాంగణాల దాకా బీసీలు తమ రిజర్వేషన్ల విషయంపై అడుగుతున్నారు. స్థానిక సంస్థల్లో సమవాటా అంటే 12769 పంచాయతుల్లోకి, స్థానిక సంస్థల్లోకి సగం మంది బీసీలు వస్తారు. బీసీలు హక్కుల్ని సాధించుకునేదాకా తమ ఇళ్లపై ఉద్యమ జెండాలు ఎగురవేసి తీరుతారు, తమ ఇళ్ల గోడలమీద ‘మా వాటా మాకే’ అని రాసిపెడతారు. బీసీలు సంపన్నులు కాదు, ఎంబీసీలు అత్యంత దారుణంగా జీవిస్తున్నారు. సంచార, అర్ధసంచార జాతులు పొట్టచేత పట్టుకుని తిరుగుతున్నారు. బీసీలు డబ్బులేని వాళ్లు, భారీ సభలు పెట్టడానికి కోట్లు వెచ్చించలేరు. అన్ని కార్యక్రమాలకు సన్నాయిలు వూదినోళ్లు ఇపుడు తమ గొంతుల్ని ఉద్యమ స్వరాలుగా మార్చుతున్నారు. వూరు మకిలంతా కడిగి బట్టలుతికిన బీసీలు చాకలి బండల మీద మా వాటా మాకేననే ఉద్యమశ్వాస తీసుకుని నినదిస్తున్నారు. చెరువుల మత్తళ్ల కాడ ఎగిరే తెల్లటి సందమామ చేపల గుంపుల్లా ముదిరాజులు పిడికిళ్లు బిగించి ‘మావాటా మాకెంతో’ చెప్పాలని ఉద్యమ అలుగువుతున్నారు. వడ్రంగులంతా ఆధిపత్య రాజకీయాలను దూగోళపట్టి అడుగుతున్నారు. విశ్వరహస్యాలు తెలిసిన యాదవులు, జ్ఞానసుధలైన గొల్లసుద్దుల ద్వారా బీసీలను ఐక్యం చేసే చైతన్య గీతాలవుతున్నారు. కాపులు నాగళ్లు భుజానేసుకుని కదం తొక్కి కదులుతున్నారు. తాళ్ళనెక్కే గీత కార్మికుడు, ఒంటికి బట్టనిచ్చే నేత కార్మికుడు, బండలు పగులకొట్టే ఉక్కు కండరాలు, సబ్బండవర్ణాల సబ్బండ వర్గాల బీసీలంతా గొంతెత్తి అడుగుతున్నారు. ఈ నేలమీద జరిగిన ఏ విప్లవంలోనైనా పారిన నెత్తురంతా బీసీలదే, ఏ ఉద్యమంలోనైనా నేలకొరిగిన వీరులంతా బీసీలే. ఎన్నెన్నో విప్లవాలు, ఉద్యమాలు విజయవంతం కావటానికి ఎన్నెన్నో త్యాగాలు చేసి ఎరువులైన రెండు కోట్లమంది బీసీలు రెండు చేతులెత్తి ‘మా వాటా మాకే’నని నినదిస్తే, అది 4 కోట్ల పిడికిళ్ళుగా మారి మహోద్యమ రూపం అవుతుంది. ఇప్పటిదాకా చచ్చింది చాలు, ఇక బీసీ తల్లుల గర్భశోకాలను ఈ నేల భరించలేదు. అంబేడ్కర్ చెప్పినట్లుగా మన ఇంటి గోడ మీద మన ఉద్యమ డిమాండ్‌ను రాసుకుందాం. ఇళ్ల ముందు బీసీ తల్లులు ఉద్యమ ముగ్గేసి నిరసన తెలిపితే సరిపోతుంది. పాఠాలు చెప్పే బీసీ ఉపాధ్యాయులు, పలు శాఖల్లో ఉద్యోగులు, లక్షలాది మంది ఒక్కసారి అందరూ అనుకుని వృత్తికి ఆటంకం లేకుండా ఎన్నెన్నో రూపాల్లో తమ నిరసనను తెలియజేయడానికి సిద్ధమవుతున్నారు. సంచారజాతులు తమ వాటా తమకేనన్న ఉద్యమ యక్షగానాలు అనువుగా అల్లి వూరూరా పాడతారు. గంగిరెద్దోళ్లు బీసీ ఉద్యమ డిమాండ్‌ను వూరూరా చాటింపు వేస్తారు. బీసీ కులాల వాళ్లు స్థానిక అధికారులు, మండలాధికారులు, ఆర్డీవోలు, కలెక్టర్లకు తమ బాధను లక్షలాది వినతిపత్రాలై వినిపిస్తారు. 130 బీసీ కులాలు ఒక్కటై నిలుస్తున్నాయి. అన్ని రాజకీయ పార్టీలలోనున్న బీసీలంతా ఒక తాటిపైకి వచ్చి నిలుస్తారు. ఇది ఏ అగ్రవర్ణానికో, ఏ అగ్రకులానికో వ్యతిరేక ఉద్యమం కాదు. ఇది ఏ రాజకీయ పార్టీకో వ్యతిరేక ఉద్యమం అసలు కాదు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ సాక్షిగా, రాహుల్‌గాంధీ చెప్పినట్లుగా కులగణన, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం వాటా ఇస్తామన్న వాగ్దానాన్ని రేవంత్ రెడ్డి అమలు చేయాలని మాత్రమే బీసీలు డిమాండ్ చేస్తున్నారు. మహాత్మా జ్యోతిబాపూలే, ఛత్రపతి సాహూ మహరాజ్, డాక్టర్ బిఆర్ అంబేడ్కర్, రామస్వామి పెరియార్, నారాయణగురులు చేసిన మహోజ్వల పోరాటాలకు కొనసాగింపుగానే బీసీలు ‘మావాటా మాకే’నన్న ఉద్యమాన్ని ఉధృతం చేసి తీరుతారు. సమవాటా ఉద్యమాన్ని శాంతియుతంగా ముందుకు తీసుకుపోతారు. బీసీల ఆకాంక్షల ఆత్మగౌరవ సమరాన్ని అడ్డుకునే కుట్రలు మానుకుని వారి వాటా వారికివ్వాలి. బీసీల హక్కుల సాధనకు ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు అండగా నిలుస్తారు. అగ్రవర్ణాలలో వున్న ప్రజాస్వామికవాదులు, పౌర సమాజాలు, మానవహక్కుల వేదికలు బీసీల హక్కులకు మద్దతుగా నిలవాలి. ఉత్పత్తి శక్తులకు అన్ని రంగాలలో వాళ్ళకు దక్కాల్సిన వాటా దక్కి తీరాలి. బీసీ విద్యార్థి, యువత, కార్మిక, కర్షక, విద్యావంతులు, ఉద్యోగులు, అన్ని బీసీ కులాలు, కులసంఘాలు బీసీ హక్కుల సమరాన్ని కొనసాగించాలి.



○ జూలూరు గౌరీశంకర్
తెలంగాణ రాష్ట్ర తొలి బీసీ కమిషన్ సభ్యులు

ఫిరాయింపులపై బీఆర్ఎస్ మాట్లాడొచ్చా?

‘నేటి ఫిరాయింపులే రేపు ఫిరంగులై పేలుతాయి’ (ఆంధ్రజ్యోతి, జూన్ 9, 2019) వ్యాసంలో నేను చెప్పిన మాటలే నేడు నిజమయ్యాయి. నాడు ఫిరాయింపులను ప్రోత్సహించిన బీఆర్ఎస్ నాయకులు నేడు మాట్లాడుతున్న తీరును చూస్తుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉంది. ఇటీవల కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ అంశంపై మాట్లాడుతూ, “పార్టీ ఫిరాయింపులకు పునాదులు వేసింది ఎవరు? 61 మంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను తీసుకున్నారు. మా ప్రభుత్వం వచ్చి నెల తిరగక ముందే ‘కాంగ్రెస్ ప్రభుత్వం పడిపోతుంది, వంద రోజులు కూడా పనిచేయదు’ అని కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు అన్నారు. దానికి వంత పాడింది బీజేపీ. వాళ్లు అన్న మాటలను గాలికి వదిలేయాలా,” అన్నారు. ఏ రాజకీయ నాయకుడికైనా తన రాజకీయ పార్టీని, ప్రభుత్వాన్ని కాపాడుకోవడం ముఖ్యం. హుందాగా ఉండాల్సిన ప్రతిపక్షాలు ప్రభుత్వాలను పడగొట్టాలని చూస్తే ఏ రాజకీయ పార్టీ నాయకుడికైనా ఫిరాయింపులే శరణ్యమవుతాయి.



ఎన్నికల్లో ఒక రాజకీయ పార్టీ మ్యానిఫెస్టోపై, గుర్తుపై గెలిచిన అనంతరం పదవుల కోసం అధికారంలో ఉన్న పార్టీలోకి సదరు నాయకుడు జాయినవ్వడం రాజ్యాంగ వ్యవస్థలపై కొంత అపనమ్మకాన్ని కల్గిస్తోంది. పార్టీ ఫిరాయింపులు ప్రాంతీయ పార్టీలకే కాదు జాతీయ పార్టీలకు సైతం ఇబ్బందులు కలుగజేస్తున్నాయి. పార్టీ ఫిరాయింపులను నివారించడానికి మొదటిసారిగా 1985లో అప్పటి ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ చట్టాన్ని రూపొందించారు. 52వ రాజ్యాంగ సవరణ ద్వారా ‘పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం’ పేరుతో 10వ షెడ్యూల్‌లో చేర్చారు. 2003లో 91వ రాజ్యాంగ సవరణ ద్వారా 10వ షెడ్యూల్‌లోని పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టానికి కొన్ని మార్పులు చేశారు.


ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో ఉన్న ఏ పార్టీ కూడా బీఆర్ఎస్‌లా ఫిరాయింపులకు పాల్పడలేదు. మొట్టమొదటి తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం నిర్మల్ నియోజకవర్గం నుంచి బీఎస్పీ ఎమ్మెల్యేగా గెలిచిన ఇంద్రకరణ్ రెడ్డి, సిర్పూర్ కాగజ్‌నగర్ నియోజకవర్గం బీఎస్పీ ఎమ్మెల్యే కొనేరు కొనప్పను టీఆర్ఎస్‌లో చేర్చుకుని ఫిరాయింపులకు నాంది పలికారు. టీడీపీ తరఫున గెలిచిన 11 మంది ఎమ్మెల్యేలను తన పార్టీలో చేర్చుకుని, తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు మంత్రి పదవి ఇచ్చి, టీడీపీ పార్టీని తెలంగాణలో లేకుండా చేశారు. 2014 నుంచి 2018 వరకు నలుగురు ఎంపీలు, 25 ఎమ్మెల్యేలు, 18 మంది ఎమ్మెల్సీలు మొత్తం 47 మంది అధికార ప్రతినిధులను తన పార్టీలో చేర్చుకుని రాజకీయ పదవులను కట్టబెట్టారు. రెండోసారి సంపూర్ణ మెజార్టీతో 88మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు గెలిచినా ప్రతిపక్ష హోదా కాంగ్రెస్ పార్టీకి ఉండకూడదన్న అహంకార ధోరణితో కాంగ్రెస్ నుంచి గెలిచిన 22 మంది ఎమ్మెల్యేలను రాజ్యాంగ స్ఫూర్తికే విరుద్ధంగా పార్టీ ఫిరాయింపులకు పాల్పడేలా ప్రోత్సహించారు. ఎమ్మెల్యేలనే కాదు, గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి దాకా సర్పంచ్, జడ్పీటీసీ, ఎంపీటీసీ, మున్సిపల్ కౌన్సిలర్లు, కార్పొరేటర్లు ఇలా ఆయా స్థాయి నాయకులను టీఆర్ఎస్‌లో చేర్చుకుని రాజకీయ పరిహాసమాడిన సంగతి బీఆర్ఎస్ నాయకులు మరిచిపోయినట్టు ఉన్నారు. 2018 ఎన్నికల్లో 88 సీట్లు వచ్చినా, ఈసారి 100 సీట్లు గెలుస్తామని ప్రగల్భాలు పలికి, కేవలం 100 ఎమ్మెల్యేల సంఖ్యా బలం చూయించుకోవడానికే కాంగ్రెస్ ఎమ్మెల్యేలను నయానో భయానో తన పార్టీలో చేరేలా ఫిరాయింపులు చేపట్టారు.


ప్రభుత్వంలో ఉండగా ఏనాడూ ఎమ్మెల్యేలను, మంత్రులను కలవని కేసీఆర్ ప్రస్తుతం ఫాంహౌస్‌కు పిలిపించుకుని మరీ ఎమ్మెల్యేలతో మంతనాలు చేస్తున్నారు. పార్టీ ఫిరాయింపులపై స్పీకర్‌కు వినతి పత్రాలు ఇవ్వటం, గవర్నర్‌కు ఫిర్యాదు చేయడం, హైకోర్టులో కేసులు వేయడం చూస్తే రాష్ట్ర ప్రజలకు బీఆర్ఎస్ కుటిల రాజకీయాలు అర్థమవుతున్నాయి. కేసీఆర్ నియంతృత్వ ధోరణికి విసిగిపోయి, కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరు నచ్చి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరుతున్నారు. రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా తమంత తాముగా వచ్చే నాయకులను కాంగ్రెస్‌లోకి స్వాగతిస్తున్నదే తప్ప ప్రతిపక్ష పార్టీలు లేకుండా చేయాలని ఎంతమాత్రం కాదు.

కాంగ్రెస్ పార్టీలో ఎమ్మెల్యేల చేరికలను లక్ష్యంగా చేసుకుని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వరరెడ్డి విమర్శనాస్త్రాలు సంధించడంపై ఆత్మవిమర్శ చేసుకోవాలి. దేశంలో దాదాపు ఎనిమిది రాష్ట్రాల్లో పార్టీ ఫిరాయింపులతో ప్రభుత్వాలనే పడగొట్టిన ఘనత బీజేపీకి దక్కుతుందన్న విషయం ఆ పార్టీ నాయకులు తెలుసుకోవాలి. మహారాష్ట్రలో పార్టీ ఫిరాయింపులతో ప్రభుత్వాన్ని పడగొట్టి ఏక్‌నాథ్ షిండేను సీఎం చేసిన సంగతిని రాష్ట్ర బీజేపీ నాయకులు అప్పుడే మరిచిపోయారా? భారతదేశమంతా కాషాయమయం కావాలని కుటిల రాజకీయాలతో పార్టీలకు పార్టీలనే బీజేపీలో కలుపుకున్న ఘటనలూ ఉన్నాయి.

ఇక గత పదేళ్లల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకున్న అత్యంత కీలక నిర్ణయాలు, విధానాలపై చర్చ జరుగుతుండగా అసెంబ్లీకి హాజరవ్వకుండా సమావేశాలకే ముఖం చాటేయడం కేసీఆర్ రాజనీతిజ్ఞతకే వదిలేయాలి. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రతిపక్షాలకు కనీస సమయం ఇవ్వకుండా అపహాస్యం చేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్షాలకు సమయాన్ని కేటాయిస్తూ, అర్ధరాత్రి దాటినా సమావేశాలు నిర్వహిస్తోంది. ప్రజా ప్రభుత్వం, ప్రజాపాలన అంటే ఏంటో నిరూపిస్తూ నేడు కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో కంటే భిన్నంగా సమావేశాలు నిర్వహిస్తోంది. ఇది ప్రజాస్వామ్యానికి శుభ సూచిక.

■ ఇందిరా శోభన్
రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు





పల్లెలపై.. పట్టింపేదీ?

చిల్లి గవ్వ లేక గ్రామపంచాయతీల నిర్వహణ అస్తవ్యస్తం

హనుమకొండ టౌన్, ఆగస్టు 7: దేశానికి పట్టు కొమ్మలైన పల్లెల్లో అభివృద్ధి కుంటుపడుతోంది. పంచాయతీలకు నిధుల్లేక పల్లెలన్నీ అస్తవ్యస్తంగా తయారయ్యాయి. పల్లెల అభివృద్ధిపై ప్రభుత్వానికి పట్టింపులేక పోవడంతో ప్రగతికి దూరంగా మగ్గుతున్నాయి. సర్పంచ్‌ల పదవీకాలం పూర్తయిన నాటి నుంచి పంచాయతీలకు కష్టాలు మొదలయ్యాయి. గ్రామపంచాయతీని నమ్ముకున్న వారంతా రోడ్డున పడ్డారు. కార్మికులతో పాటు సర్పంచ్‌లు తమకు రావాల్సిన పెండింగ్ వేతనాలు, బకాయిల కోసం ప్రభుత్వానికి మొరపెట్టుకుంటున్నారు. అయినా ఇవేమీ పట్టించుకోని ప్రభుత్వం.. గ్రామాల అభివృద్ధికి నిధులు ఇవ్వకుండానే పనులు చేయాలని పంచాయతీ రాజ్ శాఖకు ఆదేశాలు జారీ చేస్తోంది. దీంతో కిందిస్థాయిలో ఉన్న కార్యదర్శులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. మరోపక్క నిధులలేమి కారణంగా గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ సమస్య జటిలమై.. ప్రజలు దోమకాటుకు గురై మంచాన పడుతూ ఆస్పత్రుల ఖర్చులు భరించలేక చివరికి ప్రాణాలు వదులుతున్నారు.

నిధులకు మంగళం

పల్లెల్లో ఏ అభివృద్ధి చేపట్టాలన్న కార్యదర్శులు గ్రామ ఆదాయాన్ని నమ్ముకొని పనులు చేయాలి. గతంలో రాష్ట్ర ప్రభుత్వం నిధులను నిలిపివేసినప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులతో సర్పంచ్, కార్యదర్శులు పంచాయతీని నెట్టుకొచ్చేవారు. ప్రస్తుతం సర్పంచ్‌ల పదవీకాలం ముగిసి ఎనిమిది నెలలు కావస్తుండటంతో మార్చి నెల నుంచి కేంద్రం కూడా నిధులివ్వడం ఆపేసింది. దీంతో గ్రామ ఆదాయమే పంచాయతీలకు ఏకైక దిక్కుగా మారింది. ఖర్చులు ఎక్కువ, ఆదాయం తక్కువ కావడంతో అభివృద్ధిని గాడిలో పెట్టడం కార్యదర్శులకు సవాల్‌గా మారింది. పంచాయతీల్లో యేటా వచ్చే ఆదాయం రెండు, మూడు నెలలకు కూడా సరి పోవడం లేదని కార్యదర్శులు వాపోతుంటే.. మాతృశాఖేమే జేబులో నుంచి పెట్టుకోవాలని ఒత్తిడి పెంచడం గమనార్హం.

ఉమ్మడి జిల్లాలోని గ్రామపంచాయతీలు

వరంగల్	323
హనుమకొండ	208
భూపాలపల్లి	241
ములుగు	174
మహబూబాబాద్	461

స్వచ్ఛదనం-పచ్చ'ధనం'కు నిల్

సర్పంచ్‌ల పదవీకాలం ముగిసినప్పటి నుంచి కార్యదర్శులు గ్రామాభివృద్ధికి తమ జేబులో నుంచి పెట్టుబడి పెట్టుకుంటూ వస్తున్నారు. సర్పంచ్‌లు ఉన్నంతసేపు వారే పెట్టుబడి పెట్టి పల్లెలను ప్రగతి పథాన నడిపించారు. అలా తాము పెట్టిన సొమ్ములను తిరిగి ఇవ్వలేదని సర్పంచ్‌లు, పని చేయించుకుంటూ పైసలు ఇస్తలేరని పంచాయతీ కార్మికులు వివిధ రూపాల్లో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. ఇవన్నీ తెలిసినా ప్రభుత్వం మాత్రం ఎలాంటి బడ్జెట్‌ను విడుదల చేయకుండా కొత్తగా స్వచ్ఛదనం- పచ్చదనం పథకాన్ని తీసుకొచ్చి కార్యదర్శులపై ఒత్తిడిని పెంచింది. ఐదు రోజుల కార్యక్రమాన్ని రూపొందించి ఒక్క పైసా విడుదల చేయకుండా కార్యదర్శులను మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నట్టు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాగా, కార్యదర్శులు సైతం చేసేదేమీ లేక పల్లెల్లో నలుగురిని కలుపుకొని తూతూమంత్రంగా కార్యక్రమాన్ని నిర్వహించి ఐదు రోజుల కార్యక్రమంలో ఏ రోజుకారోజు మమ అనిపిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం పైసలు ఇవ్వకపోతే పాపం కార్యదర్శులు మాత్రం ఏం చేస్తారని ప్రజలు సానుభూతి వ్యక్తం చేస్తున్నారు. ఇక మాజీ సర్పంచులేమో తమ పెండింగ్ వేతనాలు, బిల్లులు చెల్లించకుండా ప్రభుత్వం జాప్యం చేస్తుండటంతో తాము అప్పులు తెచ్చిన చోట వడ్డీలు పెరుగుతున్నాయని వాపోతున్నారు.



- నిధులను నిలిపివేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు
- పైసలు రాక పనులు చేయడంలో ఇబ్బందులు
- 'స్వచ్ఛదనం- పచ్చదనం'కు డబ్బుల కొరత
- పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేక రోగాల బారిన ప్రజలు
- మంత్రి సీతక్క చొరవ తీసుకోవాలని విన్నపం

ముందు పెట్టండి.. తర్వాత వస్తాయి..

8నెలల నుంచి పంచాయతీల్లోని చిన్న చిన్న అవసరాలకు కార్యదర్శులు వారి జేబుల్లో నుంచి డబ్బులు పెట్టుకుంటూ ఆర్థికంగా చతికిలపడతూ వస్తున్నారు. తాజాగా ఆగస్టు 5 నుంచి స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమం చేపట్టి ఐదు రోజుల్లో ఒకొక్కరోజు ఒక కార్యక్రమం చేపట్టాలని ఆదేశించారు. కానీ పనులు చేసేందుకు మాత్రం పైసలు లేవు.. మీరే జేబుల్లో నుంచి పెట్టండి.. తర్వాత మీ అకౌంట్స్‌కు జమ చేస్తామని ఉన్నతాధికారులు ఆదేశాలు ఇస్తుండటంతో కార్యదర్శుల పరిస్థితి మూలిగే నక్కమీద తాటికాయ పడ్డ చందంగా మారింది. స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమానికి ముందు జిల్లా పంచాయతీ అధికారి నిర్వహించిన జూమ్ మీటింగ్‌లో పలువురు కార్యదర్శులు తమ బాధలను విన్నవించుకున్నప్పటికీ.. తాను చేసేది ఏమీ లేదని, ఏమైనా ఉంటే కలెక్టర్‌కు చెప్పుకోండి.. అంటూ దాటేసినట్టుగా సమాచారం. జిల్లా పంచాయతీ అధికారి నుంచే సరైన మద్దతు లేనప్పుడు తమకు దిక్కెవరని కార్యదర్శులు ఆందోళన చెందుతున్నారు.

పల్లెల్లో రోగాల విజృంభణ

నిధుల లేమితో పల్లెల్లో దోమల నివారణకు పిచికారి, చెత్త సేకరణ అరకొరగా చేస్తున్నారు. కార్మికులకు సకాలంలో జీతాలు అందక నిరసన బాట పట్టడం ఒకపక్క అయితే.. మరోపక్క చెత్త తరలించేందుకు ట్రాక్టర్లలో డీజిల్ పోయలేక మరోపక్క పల్లెల్లో శానిటేషన్ దుర్భరంగా తయారైంది. వర్షాకాలం నేపథ్యంలో మొక్కలు, గడ్డి ఏపుగా పెరిగి చెత్తంతా జమై పల్లెల్లో దోమలు విజృంభిస్తున్నాయి. దీంతో దోమకాటుకు ప్రజలు మంచాన పడుతున్నారు. దీంతో ఇటీవల పల్లెల్లో జ్వరాలు పెరిగి డెంగీతో మరణించిన సందర్భాలు ఉన్నాయి. గ్రామాల అభివృద్ధికి సరిపడా నిధులను సమకూర్చి పల్లెల్లో ఆరోగ్య వాతావరణం కల్పించేలా పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క చొరవ తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అడకత్తెరలో..



- నిధుల లేమితో గ్రామ కార్యదర్శుల ఇబ్బందులు
- అప్పులు చేసి గ్రామాలను నెట్టుకొస్తున్న వైనం
- ఒక్కో కార్యదర్శికి రూ.లక్షకు పైగా ఖర్చు
- ప్రత్యేక పాలన ఆరంభం నుంచి ఇదే దుస్థితి

వర్ధన్నపేట రూరల్, ఆగస్టు 7: ఓ వైపు పని ఒత్తిడి.. మరో వైపు నిధుల లేమి.. అయినా తప్పదు గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి బాధ్యత మీదే అంటూ ప్రభుత్వ ఆదేశాలు.. వెరసి గ్రామ కార్యదర్శుల పరిస్థితి 'అడకత్తెరలో పోకచెక్క'లా తయారైంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో భారమంతా కార్యదర్శులపైనే పడుతోంది. ప్రత్యేక పాలన ప్రారంభమైన నాటి నుంచి నేటి వరకు గ్రామంలో ఎలాంటి సమస్యలు వచ్చినా వారి సొంతడబ్బు పెట్టుకుని పనులు చేయాల్సిన దుస్థితి నెలకొంది. ఇక మైనర్ గ్రామ కార్యదర్శుల పరిస్థితి మరింత దయనీయంగా తయారైంది. దీనికి తోడు ప్రభుత్వం స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమం నిర్వహిస్తుండటంతో ఇబ్బందులు రెట్టింపయ్యాయి. కొన్నిచోట్ల కార్యదర్శులతో పాటు స్పెషల్ ఆఫీసర్లు కూడా వారి సొంత డబ్బులు పెట్టుకుని మరీ కార్యక్రమాలను నెట్టుకొస్తున్నట్లు సమాచారం.

నిర్వహణ భారం

ఏడు నెలల నుంచి గ్రామ పంచాయతీల నిర్వహణ బాధ్యత పూర్తిగా కార్యదర్శులపైనే పడింది. గ్రామంలో ఏ పనిచేయాలన్నా డబ్బులు లేకపోతే అంతే పరిస్థితి. వస్తున్న పన్నులు కార్యాలయ నిర్వహణ, సిబ్బంది జీతాలకే చాలడం లేదు. దీంతో కొన్ని నెలలుగా సిబ్బంది జీతాలు సైతం లేక విల విలలాడుతున్నారు. నీటి సరఫరా మొదలు.. పారిశుధ్యం, వీధిదీపాలు, చెత్త వాహనాల నిర్వహణ, ట్రాక్టర్ల ఈఎంఐలు ఇలా ఎన్నో ఇబ్బందులు పడుతూ పంచాయతీ పాలనను ముందుకు తీసుకెళ్తున్నారు. బోరు మోటార్లు బాగు చేయించడం, కల్వర్టులను శుభ్రం చేయించడం,

మిగతా 7వ పేజీలో..

నిధులు లేక ఇబ్బందులు పడుతున్నాం..

'ప్రత్యేక పాలన నుంచి పంచాయతీల్లో నిధుల కొరత ఉంది. ప్రస్తుతం జరుగుతున్న స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమానికి సైతం ప్రత్యేక నిధులేమి లేవు. జీపీ నుంచి అన్ని కార్యక్రమాలకు డబ్బులు వెచ్చిస్తున్నాం. ఎలాంటి కార్యక్రమాలకైనా కార్యదర్శులమే జేబుల్లో నుంచి పెట్టుబడి పెడుతున్నాం. బ్యాంకుల్లో చెక్కులు కూడా పాస్ కావడం లేదు. ఇలా దాదాపు మేజర్, మైనర్ గ్రామ పంచాయతీల్లో రూ.లక్షకు పైగా డబ్బులు ఖర్చు చేసి ఉన్నాం' అంటూ ఓ పంచాయతీ కార్యదర్శి తన ఆవేదన వ్యక్తం చేశారు.

ఇబ్బందులు లేకుండా పనులు జరుగుతున్నాయి..

- లక్ష్మీరమాకాంత్, జిల్లా పంచాయతీ అధికారి



స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ఐదురోజుల పాటు గ్రామాలల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి పల్లెలను శుభ్రంగా తయారుచేయాలని ప్రభుత్వం ఆదేశించింది. దానిలో భాగంగా ఈ నెల 5 నుంచి 3 రోజులుగా రోజుకొక్క కార్యక్రమంతో గ్రామాల్లో ఎలాంటి అటంకాలు లేకుండా కార్యదర్శులు విజయవంతంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గ్రామాల్లోకి వెళ్లి పరిశీలిస్తే కార్యక్రమం ఏ విధంగా జరుగుతుందనేది అర్థమవుతుంది.

కేయూ డిగ్రీ విద్యార్థులకు ఇన్‌స్టంట్ అవకాశం

- 6వ సెమిస్టర్ ఏదైనా ఒక్కపేపర్ తప్పిన వారికే..
- 12 వరకు ఫీజు గడువు.. 17న పరీక్ష..

7



రెడ్ క్రాస్ ఆవరణలో మొక్కలు నాటుతున్న మున్సిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

నాటిన మొక్కలను సంరక్షించాలి

- మునిసిపల్ కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే

సుబేదారి, ఆగస్టు 7: మొక్కలను నాటి వాటిని సంరక్షిస్తే అవి ఎదిగి భావితరాలకు ఫలసహాయాన్ని అందిస్తాయని వరంగల్ మునిసిపల్ కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంలో భాగంగా బుధవారం హనుమకొండ సుబేదారి క్రాస్‌రోడ్డులోని రెడ్‌క్రాస్ సొసైటీ ప్రాంగణంలో రెడ్‌క్రాస్ పాలకవర్గంతో కలిసి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా అశ్వినితానాజీ వాకడే మాట్లాడుతూ.. కాలుష్య నివారణ కోసం ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలని కోరారు. తలసేమియా సెంటర్‌లోని బాధితులకు ఉచిత రక్తంతోపాటు రెడ్ క్రాస్ నిర్వహిస్తున్న రక్త కేంద్రం, జనరిక్ మందుల షాపు, టైలరింగ్ ట్రెయినింగ్ సెంటర్, డిసాస్టర్ మేనేజ్ మెంట్, జూనియర్, యూత్ రెడ్ క్రాస్‌తో చేస్తున్న సామాజిక సేవలకుగాను రెడ్ క్రాస్ సొసైటీ పాలకవర్గాన్ని అభినందించారు. అనంతరం రెడ్ క్రాస్ సొసైటీ పాలకవర్గం మునిసిపల్ కమిషనర్‌ను శాలువా కప్పి షీల్డు బహూకరించి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, రాష్ట్ర పాలక వర్గ సభ్యులు ఈవీ శ్రీనివాస్‌రావు, జిల్లా పాలక వర్గ సభ్యులు పుల్లూరు వేణుగోపాల్, డాక్టర్ ఎం.శేషుమాధవ్, పొట్లపల్లి శ్రీనివాస్‌రావు, రెడ్‌క్రాస్ డాక్టర్లు కిషన్‌రావు, మధన్‌మోహన్‌రావు, మొహమ్మద్ తహర్ మసూద్‌తో పాటు రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

స్థానిక సంస్థల బలోపేతానికి ప్రభుత్వం కృషి

- రాష్ట్ర ఆర్థిక సంఘం కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య
- కలెక్టరేట్‌లో ఉమ్మడి జిల్లా 2వ ఆర్థిక సంఘం సమీక్షా సమావేశం



మాట్లాడుతున్న సిరిసిల్ల రాజయ్య, పక్కన స్మితసబర్వాల్, కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ కలెక్టరేట్, ఆగస్టు7: స్థానిక సంస్థల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర ఆర్థిక సంఘం కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య అన్నారు. హనుమకొండ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బుధవారం ఉమ్మడి వరంగల్ జిల్లా 2వ ఆర్థిక సంఘం సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సిరిసిల్ల రాజయ్య మాట్లాడుతూ.. గ్రామీణ స్థానిక సంస్థలు, పట్టణ స్థానిక సంస్థల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచేందుకు రాష్ట్ర ఆర్థిక సంఘాన్ని ఏర్పాటు చేశారన్నారు. గ్రామీణ, పట్టణ సంస్థల అభివృద్ధికి కావాల్సిన నిధులను సమకూర్చుకునేందుకు కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం మన రాష్ట్ర స్థానిక సంస్థల అభివృద్ధికి నిధుల మంజూరులో జాప్యం లేకుండా సిఫారసు చేసిన నిధులను మంజూరయ్యేలా ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. 73, 74 రాజ్యాంగ సవరణల ద్వారా స్థానిక సంస్థలకు నిధులు కేటాయించామన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 243 ఎల్, 243వై ఆదేశం ప్రకారం మన రాష్ట్రంలోని అన్ని గ్రామీణ స్థానిక సంస్థలు, పట్టణాల ఆర్థిక స్థితిగతులను సమీక్షించడానికి, ఆర్థిక వనరుల పంపిణీ సిఫారసు చేయడానికి రాష్ట్ర ఆర్థిక సంఘాన్ని ఏర్పాటు చేసిందన్నారు. గ్రామ పంచాయతీల అధికారుల విధులు తెలంగాణ పంచాయతీరాజ్ చట్టంలోని సెక్షన్ 52 ప్రకారం గ్రామ పంచాయతీల విధులు, బాధ్యతలు మరిచిపోవద్దని రాజయ్య పేర్కొన్నారు. ప్రతీ గ్రామానికి అవసరమయ్యే అభివృద్ధి పనుల వివరాలు పూర్తి సమాచారం భద్రపరుచుకునేలా చర్యలు తీసుకోవాలని, రాష్ట్రంలోని ఆస్తి పన్నుపై మళ్లీ పూర్తి సమీక్ష చేయాలన్నారు. విద్యుత్ చార్జీల అధిక బారం పడకుండా ప్రతీచోట సోలార్ పవర్ ప్లాంట్లను నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ప్రతీ గ్రామ పంచాయతీలో క్రమం తప్పకుండా ప్రతీ 60 రోజుల్లో గ్రామసభ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. గ్రామాల్లో పారిశుధ్య, ఇతర అభివృద్ధి పనులకు సకాలంలో నిధులు అందుబాటులో ఉన్నట్లయితే ప్రతీ పనిని త్వరితగతిన పూర్తి చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. ఆ దిశగా ఆర్థిక సంఘం జిల్లాలకు స్పెషల్ ఫండ్స్ మంజూరు చేయాలని కోరారు. బకాయిలు ఉన్న ప్రతీ గ్రామపంచాయతీకి ప్రభుత్వ పనుల చెల్లింపులు వాటికి అయిన నిధులు వెంటనే మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక సంఘం మెంబర్ సెక్రెటరీ స్మితా సబర్వాల్ మాట్లాడారు. ఈ సమావేశంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, మమబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్, ఆర్థిక సంఘం సభ్యులు రమేష్ నాయక్, నెహ్రూనాయక్, హనుమకొండ, వరంగల్ జిల్లాల స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు, మునిసిపల్ కమిషనర్, జిల్లా పరిషత్ సీఈవోలు, మండల అభివృద్ధి అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా ఆండాళ్ తిరునక్షత్రోత్సవం

హనుమకొండ కల్చరల్, ఆగస్టు 7: పవిత్ర శ్రావణమాస బుధవారం వైష్ణవ ఆలయాల్లో ఆండాళ్ తల్లి, గోదాదేవి తిరునక్షత్రోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి. ఆలయాల్లో భక్తులు ముఖ్యంగా మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి నిరాజనాలు అర్పించారు. కలియుగంలో ప్రజలను భక్తి మార్గం వైపు మళ్లించడానికి స్వయంగా లక్ష్మీదేవి, భూదేవి అంశంగా ఆండాళ్ తల్లిగా అవతరించి, పరమాత్మను చేరుకోవడం కోసం తాను స్వయంగా వ్రతం ఆచరించి భగవత్ సాన్నిత్యాన్ని పొంది ప్రజలకు భక్తి వైపు మార్గ దర్శనం చేసిన ఆండాల్ తల్లిని మహిళలు భక్తిశ్రద్ధలతో కొలిచారు. ముఖ్యంగా హనుమకొండ రాగన్న దర్వాజలోని శ్రీగోదా రంగనాయక స్వామి ఆలయంగా ప్రసిద్ధి చెందిన పెద్ద కోవెలలో, సీతారామచంద్ర స్వామి ఆలయంగా పేరుగటించిన చిన్న కోవెలలో ఆండాళ్ తిరునక్షత్రోత్సవ వేడుకలు కన్నుల పండువగా జరిగాయి. పెద్ద కోవెలలో కలకోట రాఘవాచార్య, నర్సింహచార్య, చిన్న కోవెలలో చెరుకుపల్లి నర్సింహచార్య ఆధ్వర్యంలో జరిగిన వేడుకలలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అదాలత్ సమీపంలోని వెంకటేశ్వరాలయంలో నేత్రపర్వంగా అమ్మవారి జన్మదిన వేడుకలు జరిగాయి. ఆండాళ్ తల్లికి సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. అదే విధంగా రెవెన్యూ రామాలయంలో శ్రీకాంతాచార్య ఆధ్వర్యంలో, ఎక్సైజ్ కాలనీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో అనంత శర్మ ఆధ్వర్యంలో, కాజీపేటలోని శ్వేతార్క మూల ఆలయంలో ఆండాళ్ తల్లికి తిరునక్షత్రోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహించారు. కర్కటే పూర్వ ఫల్గున్యాం అంటూ గోదా స్తుతిని భక్తులు ముక్తకంఠంతో అనుసంధానం చేశారు. ప్రతీ ఇంటా మహిళలు పేరంటాలు నిర్వహించారు.



అదాలత్ వెంకటేశ్వర ఆలయంలో ఆండాళ్ అమ్మవారికి అభిషేకం చేస్తున్న అర్చకులు

చెరువుల్లో గుర్రపు డెక్కలు తొలగించాలి

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 7: గ్రేటర్ వరంగల్ పరిధిలోని 9 చెరువులు, కుంటలలో గుర్రపు డెక్కలు పెరిగి పరిసరాలు కలుషితమవుతున్నాయని, చెరువుల్లో మొలిచిన గుర్రపు డెక్కలను వెంటనే తొలగించాలని చెరువులు, ఆక్రమణ ఏరియాల పరిరక్షణ సొసైటీ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు పెరుమాళ్ల లక్ష్మణ్ వెల్లడించారు. బుధవారం బల్దియా కార్యాలయంలో కమిషనర్ అశ్విని తానాజీ వాకడేను కలిసి వినతి పత్రం సమర్పించారు. కమిషనర్‌ను కలిసిన వారిలో సంఘం నాయకులు నగేశ్, వెంకటేశ్వర్లు, క్రాంతి ఉన్నారు.

అడకత్తెరలో 'కార్యదర్శి'

(5వ పేజీ తరువాయి)

పైపులైన్ లీకేజీలు అరికట్టడం, చేతిపంపులు పాడైతే సరిచేయడం, నీటి ట్యాంకుల శుభ్రత, బ్లీచింగ్, ఇలా గ్రామంలో తర చూ ఏర్పడే సమస్యలనీ కార్యదర్శులే సొంత డబ్బులు పెట్టుకొని చేయాల్సి వస్తోంది. నిధులు జీపీలో లేకపోవడం వల్ల ఈ సమస్య ఉందని చెప్పకనే చెబుతున్నారు. ఈ వెతలు ప్రభుత్వం నియమిం చిన ప్రత్యేకాధికారులకు సైతం కొన్ని చోట్ల లేకపోలేదు. తమ జీతాల్లో నుంచి ప్రతీ నెలా జీపీకి ఖర్చుపెట్టే వారు కూడా ఉన్నారు.

మార్చిలో కేంద్ర నిధులు

ప్రత్యేక పాలన ప్రారంభమైన తర్వాత ఈ ఏడాది మార్చి నెలలో కేంద్రం జీపీలకు నిధులు విడుదల చేసింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు మళ్లీ కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన 15వ ఫైనాన్స్ కమిషన్ నిధులు విడుదల కాలేదు. ఇక రెండేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన స్టేట్ ఫైనాన్స్ కమిషన్ నిధులు కూడా అందకపోవడంతో గ్రామ పంచాయతీలు నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్నాయి. కొన్ని నెలల పాటు మార్చిలో వచ్చిన కేంద్ర నిధులతో పంచాయతీలు నడిచినప్పటికీ, ముఖ్యంగా మైనర్ పంచాయతీలకు ఇబ్బందులే తలెత్తాయి. మేజర్ గ్రామ పంచాయతీలకు కొంత మేర డబ్బులు ఎక్కువగా విడుదల కావడంతో ఊపిరి పీల్చుకున్నారు. కానీ, ప్రస్తుతం ఇప్పుడు అందరి పరిస్థితి అగమ్య గోచరంగా తయారైంది.

భారమైన స్వచ్ఛదనం-పచ్చదనం

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమం గ్రామాల్లో ఈనెల 9వరకు జరగనుంది. ఈ కార్యక్రమాలను గ్రామ పంచాయతీ కార్యదర్శులే తమ భుజస్కంధాలపై వేసుకున్నారు. ఉదయం లేచిన నుంచి సాయంత్రం వరకు కార్యక్రమాల్లో పాల్గొనడమే కాకుండా వాటికి అయ్యే ఖర్చులు పూర్తిగా భరించడం వారి బాధ్యతే. ఇప్పటికే నిధులు లేక ఇబ్బందులు పడుతున్న సెక్రటరీలకు ఈ ప్రోగ్రామ్ పెద్ద సవాల్‌గా మారింది. ఏ పనులు చేయాలన్నా డబ్బులతో ముడిపడి ఉన్న అంశం కావడంతో కార్యదర్శులు తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారు. ప్రత్యేక అధికారుల పర్యవేక్షణ, జిల్లా ఉన్నతాధికారుల విజిటింగ్, కార్యక్రమాలు చేసేందుకు ప్రజలను తీసుకురావడం, పనులు చేసేందుకు ప్రైవేటు వ్యక్తులను కూలీకి తీసుకురావడం, మిషనరీ ఏర్పాటు, దోమల మందులు, బ్లీచింగ్, డోజర్ కిరాయిలు ఇలా ఎన్నో పనులకు డబ్బులు కార్యదర్శులు పెట్టుకోవాల్సి వస్తోంది.

రూ.లక్షకు పైగా ఖర్చు

మేజర్ గ్రామ పంచాయతీలతో పాటు మైనర్ గ్రామ పంచాయతీల ఖర్చులు కొంచెం అటు ఇటుగా ఉన్నా వసతుల కల్పనలో సమానంగా ఉంటున్నారు. దీంతో జీపీ కోసం పెట్టే ఖర్చు ఇప్పటికే ఒక్కో కార్యదర్శికి రూ. లక్షకు పైగా దాటిందని తెలుస్తోంది. కొన్ని పనులకు ఎంబీ రికార్డులు చేయించి మరీ సిద్ధంగా ఉన్నారు. కానీ, గ్రామంలో మౌలిక వసతుల కల్పన కోసం పెట్టే ఖర్చులు రాసి పెట్టుకుంటున్నారు. దీంతో తమ జీతాలే కాకుండా బయట తెలిసిన వ్యక్తుల వద్ద అప్పులు చేసి గ్రామాలను నెట్టుకొస్తున్నారు. వీరికి సహకారంగా కొన్ని చోట్ల ప్రత్యేక అధికారులు చేదోడు వాదోడుగా ఉంటున్నారు.

ఖాతాల్లో డబ్బులు ఫ్రీజ్

కొన్ని గ్రామపంచాయతీల్లో నిధులు ఉన్నప్పటికీ వాటిని విడుదల చేసేందుకు ఇబ్బందులు తప్పడం లేదు. ఖాతాల్లో ఉన్న డబ్బులు తీసేందుకు చెక్కులతో బ్యాంకుకు వెళ్తే పాస్ కావడం లేదు. దీనిపై అధికారికంగా జిల్లా పంచాయతీ అధికారులు ధ్రువీకరించనప్పటికీ ప్రస్తుతం కార్యదర్శులు ఎదు ర్కొంటున్న సమస్యలు ఇవే. డబ్బులు ఉన్నట్లు చూపుతున్న ప్పటికీ వాటిని డ్రా చేసేందుకు మాత్రం వీలు లేదు. దీంతో మరింత ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. గతంలో గ్రామంలో కొన్ని పనులు చేసి వాటిని తీసుకోని సదరు కాంట్రాక్టర్లు, మాజీ ప్రజాప్రతినిధులకు సైతం ఈతిప్పలు తప్పడం లేదు.

రాజకీయ ఒత్తిడి

ప్రత్యేక పాలన ప్రారంభమైన నాటి నుంచి కార్యదర్శులకు రాజకీయ ఒత్తిడి కూడా ఎక్కువైందనే చెప్పాలి. సర్పంచ్ లేకపోవడంతో ఏ చిన్న సమస్య ఏర్పడినా ఇటు ప్రజలతో పాటు ఇతర అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామా ల్లో చోటామోటా నాయకులు కార్యదర్శినే ప్రశ్నిస్తున్నారు. తమ కాలనీకి నీళ్లు రావడం లేదనో, స్ట్రీట్ లైట్ వెలగడం లేదనో, దోమల మందు కొట్టడం లేదనో ఏదో విధంగా కార్యదర్శిని ఏకంగా బెదిరింపులకు సైతం దిగుతున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ దృష్టి సారించి ప్రత్యేక నిధులు అందించి ఇబ్బందులు లేకుండా చేస్తే బాగుంటుందని కోరుతున్నారు.

రేపు జాబ్ మేళా

వరంగల్ ఎడ్యేకేషన్, ఆగస్టు 7: హనుమకొండ ములుగురోడ్‌లోని జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎం.మల్లయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని అపోలో ఫార్మసీలో 50 ఉద్యోగాల ఎంపికకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఫార్మసీ, ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ చదివిన 18 నుంచి 30 యేళ్ల వయస్సుగల నిరుద్యోగులు అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు సర్టిఫికెట్ల జిరాక్స్‌లతో ఉపాధి కల్పన కార్యాలయానికి ఉదయం 11 గంటల వరకు హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 7893394393లో సంప్రదించాలన్నారు.

తెలుగులో సంపత్‌రెడ్డికి డాక్టరేట్



కేయూ క్యాంపస్, ఆగస్టు 7: కాకతీయ విశ్వవిద్యాలయం తెలుగు విభాగం పరిశోధకుడు వంగాల సంపత్‌రెడ్డి డాక్టరేట్ సాధించారు. ఈ మేరకు బుధవారం కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి సంపత్‌రెడ్డికి డాక్టరేట్ ప్రకటించినట్లు తెలిపారు. 'చెరబండరాజు నవలలు, కథలు - తెలంగాణ జనజీవితం' అనే అంశంపై కేయూ మాజీ ఆర్ట్స్ డీన్ ప్రొఫెసర్ కాత్యాయని విద్మహే పర్యవేక్షణలో వంగాల సంపత్‌రెడ్డి పరిశోధన పూర్తి చేశారు. వరంగల్ జిల్లా వర్ధన్నపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. వీరు అనేక అంతర్జాతీయ, జాతీయ సదస్సులలో పరిశోధన పత్రాలు సమర్పించారు. డాక్టరేట్ సాధించిన వంగాల సంపత్‌రెడ్డిని నర్సంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల హిందీ లెక్చరర్ కొమురారెడ్డితో పాటు పలువురు అభినందించారు.

అంతర్జాతీయ సెమినార్‌కు సంకినేని వెంకట్



కేయూ క్యాంపస్, ఆగస్టు 7: కాకతీయ యూనివర్సిటీ రాజనీతి శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ సంకినేని వెంకట్‌కు ఈనెల 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ వర్సిటీలో జరిగే అంతర్జాతీయ సదస్సుకు ఆహ్వానం అందింది. ఈ మేరకు బుధవారం సెమినార్ నిర్వాహకులు వెంకట్‌కు ఆహ్వానం పంపినట్లు తెలిపారు. 'ట్రైబల్ లైవ్‌లీ వుడ్ పార్స్‌న్స్ ఇష్యూష్ స్ట్రాటజీస్ ఫర్ ఇంపవర్‌మెంట్' అనే అంశంపై జరిగే సదస్సులో డాక్టర్ సంకినేని వెంకట్ 'డెమోక్రటైజేషన్ ఇన్ ట్రైబల్ ఏరియాస్ అండ్ చాలెంజెస్' అనే అంశంపై పరిశోధన పత్రాన్ని సమర్పిస్తారు. ఈ సందర్భంగా వెంకట్‌ను కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, రాజనీతిశాస్త్ర అధ్యాపకులు అభినందించారు.

డాక్టర్ అడ్లూరికు భారత్ సేవా పరస్కారం



హనుమకొండ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ గణిత శాస్త్రవేత్త, గణిత అవధాని డాక్టర్ అడ్లూరు నర్సింహమూర్తికి బెంగుళూరుకు చెందిన వెయిల్ ఫౌండేషన్ ఇండియా భారత సేవా పురస్కారానికి ఎంపిక చేసింది. నాలుగు దశాబ్దాలుగా గణిత రంగంలో చేసిన విశేషసేవలకు, చూపిన ప్రతిభకు గుర్తింపుగా ఆయన ప్రతిష్ఠాత్మకమైన ఈ పురస్కారానికి ఎంపికయ్యారు. డాక్టర్ అడ్లూరు గణితంపై రాసిన పదమూడు పరిశోధనా వ్యాసాలు వివిధ అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి. ఆయనను ఇప్పటికే పలు అవార్డులు వరించాయి. ముంబైకి చెందిన ఎంపీఎల్‌ఏ ట్రస్ట్ రాష్ట్రీయ ఆచార్య శిరోమణి అవార్డును, కిందటేడు గోవా విశ్వవిద్యాలయం గౌరవ డాక్టర్‌ను ప్రదానం చేశాయి. గణిత అష్టావధానాలతో గుర్తింపు పొందిన డాక్టర్ నర్సింహమూర్తి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్సులో చోటు దక్కించుకున్నారు. మదర్ థెరిస్సా అవార్డును అందుకున్నారు.

'సినారె' పురస్కారానికి మహేందర్ ఎంపిక



హనుమకొండ కల్చరల్, ఆగస్టు 7: హనుమకొండ జిల్లాకు చెందిన ప్రముఖ కవి, రచయిత, ప్రభుత్వ ఉపాధ్యాయుడు బిల్ల మహేందర్‌కు రాష్ట్ర స్థాయిలో అందించే సినారే పురస్కారం-2024కు ఎంపికయ్యారని సంస్థ అధ్యక్షుడు మడకెల్లి రాములు, నిర్వాహకులు డాక్టర్ పోరెడ్డి రంగయ్య ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని మహాకవి సినారే కళాపీఠం యేటా డాక్టర్ సి.నారాయణరెడ్డి జన్మదినోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయిలో సాహిత్య రంగంలో విశేషకృషి చేసిన వారిని ఎన్నికచేసి ఈ పురస్కారాన్ని అందిస్తున్నారు. దానిలో భాగంగా జిల్లా నుంచి మహేందర్‌కు ఈ యేడు పురస్కారం లభించింది. పదిహేనేళ్లుగా మహేందర్ వివిధ ప్రక్రియలో సాహిత్య సేవ చేస్తున్నారు. ఇప్పటి వరకు వివిధ సామాజిక, సమకాలిన అంశాలపై ఆరు కవితా సంపుటాలతో పాటుగా తన సంపాదకత్వంలో నాలుగు సంకలనాలను అచ్చు వేశారు. ఈ నెల 10న హైదరాబాద్‌లో సినారే కళా పీఠం వారి ఆధ్వర్యంలో తెలంగాణ తొలి సాహిత్య అకాడమీ పూర్వ అధ్యక్షుడు డాక్టర్ నందిని సిధారెడ్డి అధ్యక్షతన జరిగే కార్యక్రమంలో అతిథుల చేతుల మీదుగా ఈ సత్కారం జరుపబడుతుందని నిర్వాహకులు తెలియజేశారు. మహేందర్‌కు పురస్కారం లభించడంపై ఓరుగల్లు కవులు, రచయితలు, ఉపాధ్యాయులు సంతోషంతో పాటు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



మంత్రి నాగేశ్వర్‌రావు చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సామల సదానందం



మంత్రి నాగేశ్వర్‌రావు చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ఆడెపు శ్రీనివాస్

ఇద్దరు నేతన్నలకు రాష్ట్ర స్థాయి అవార్డులు

హైదరాబాద్‌లో అందజేసిన మంత్రి తుమ్మల

ఆటోనగర్ (వరంగల్), ఆగస్టు 7: జాతీయ చేనేత కార్మిక దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులోని పీపుల్స్ ప్లాజాలో బుధవారం వేడుకలను నిర్వహించింది. ఈ కార్యక్రమానికి చేనేత జౌళి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు హాజరయ్యారు. ఈ క్రమంలో వరంగల్ 23వ డివిజన్ కొత్తవాడకు చెందిన ఇద్దరు చేనేత కార్మికులు సామల సదానందం, ఆడెపు శ్రీనివాస్‌కు ఆయన కొండా లక్ష్మణ్ బాపూజీ రాష్ట్ర స్థాయి అవార్డులతో పాటు రూ.25వేల నగదు బహుమతిని చెక్కుల రూపంలో అందజేశారు. ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి చేనేత కార్మికుల పోటీల్లో సామల సదానందం(సీఎం రేవంత్‌రెడ్డి బొమ్మ), ఆడెపు శ్రీనివాస్(మహాత్మా గాంధీ బొమ్మ)ల డిజైన్లను నేసి ప్రదర్శించినందుకు గాను ఈ అవార్డులకు ఎంపికయ్యారు. అనంతరం వరంగల్ కార్పెట్లను వివిధ దేశాలకు, దేశంలోని వివిధ రాష్ట్రాలకు సొంత మార్కెట్ వ్యవస్థను నెలకొల్పి చేనేత కార్మికులకు నూతన డిజైన్ల ఆర్డర్లను ఇప్పిస్తూ చేనేత కార్మికులకు పనికల్పిస్తున్న వరంగల్ కొత్తవాడకు చెందిన యువకుడు చిప్ప కిరణ్‌కుమార్ నేతను మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అభినందించారు. కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ మేయర్ గుండు సుధారాణి, చేనేత జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజరామయ్యర్, రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ పప్పుల వెంకటేశం, డిప్యూటీ డైరెక్టర్ ఇందుమతి, టీపీసీసీ చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్ప వెంకటేశ్వరు, పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కమర్తపు మురళి, నాయకులు ఎం.రవికుమార్, వరలక్ష్మి, రూప తదితరులు పాల్గొన్నారు.

17 నుంచి ఎస్డీఎల్‌సీఈ ఎంఎస్‌డబ్ల్యూ పరీక్షలు

కేయూ క్యాంపస్, ఆగస్టు7: కాకతీయ యూనివర్సిటీ మాస్టర్ ఆఫ్‌సోషల్ వర్క్ (ఎంఎస్‌డబ్ల్యూ) ఫైనల్ ఇయర్ పరీక్షలు ఈనెల 17 నుంచి నిర్వహిస్తున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి శ్రీరామోజు నరసింహాచారి, ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎ.నరేందర్ బుధవారం ఒక ప్రకటనలో రివైజ్డ్ పరీక్షల షెడ్యూల్‌ను వెల్లడించారు. ఆగస్టు 17, 20, 24, 28, 30, సెప్టెంబరు 2వ తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షల జరుగుతాయని వెల్లడించారు. అభ్యర్థులకు క్యాంపస్‌లోని ఎడ్యుకేషన్ కళాశాలలో పరీక్షలకేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఇతర వివరాలకు దూరవిద్య కేంద్రంలో సంప్రదించాలని కోరారు.

13 నుంచి దూరవిద్య బీఎల్ఐఎస్సీ పరీక్షలు

ఈనెల 13 నుంచి బ్యాచ్‌లర్ ఆఫ్ లైబ్రరీ ఇన్ఫర్మేష న్ సైన్స్ (బీఎల్ఐఎస్సీ) ఎక్స్‌అభ్యర్థుల రివైజ్డ్ పరీక్షల షెడ్యూల్‌ను అధికారులు విడుదల చేశారు. ఆగస్టు 13, 16, 19, 21, 23, 27, 29 తేదీల్లో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగు తాయని పేర్కొన్నారు. అలాగే ఆగస్టు 30న మధ్యాహ్నం ప్రాక్టికల్స్ పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. కేయూ క్యాంపస్‌లోని బీఈడీ కళాశాలలో పరీక్షల కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు.

13 నుంచి బీఎల్ఐఎస్సీ మొదటి సెమిస్టర్ పరీక్షలు


ఈనెల 13నుంచి కేయూ బీఎల్ఐఎస్సీ మొదటి సెమిస్టర్ పరీక్షలు జరుగుతాయి. ఆగస్టు 13, 16, 19, 21 తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. క్యాంపస్‌లోని ఎడ్యుకేషన్ కళాశాల, కోఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాలల్లో పరీక్షల కేంద్రాలను ఏర్పాటు చేశారు.

కేయూ పీజీ సెమిస్టర్ పరీక్షలు షురూ

కేయూ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలోని పీజీ కోర్సుల ఎంఏ, ఎంకామ్, ఎమ్మెస్సీ (రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంట్) రెండో సెమి స్టర్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. పరీక్షలు ఆగస్టు 7, 9, 12, 14, 16, 19 తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. వర్సిటీ పరిధిలో 5,150 మంది పరీక్షలు రాయనున్నారు. బుధవారం పరీక్షల నిర్వహణను పరీక్షల నియంత్రణాధికారులు పరిశీలించారు.



నిండుకుండలా లక్నవరం చెరువు



మత్తడి దుంకుతున్న లక్నవరం జలాలు


లక్నవరం చెరువుకు మత్తడి

గోవిందరావుపేట, ఆగస్టు 7: ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలోని ప్రఖ్యాత లక్నవరం చెరువు మత్తడి పోస్తోంది. 33.6 అడుగుల నీటినిల్వ సామర్థ్యం కలిగిన చెరువు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకోగా ఎగువ నుంచి పెద్దఎత్తున వరద పోటెత్తడంతో బుధవారం ఉదయం నుంచి 5 సెంటీమీటర్ల ఎత్తులో జలాలు మత్తడి దునుకుతున్నాయి. దీంతో దయ్యాలవాగులో ప్రవాహం పెరిగింది. కొత్తగూడ, గంగారం అటవీ ప్రాంతం నుంచి, బొగ్గుల వాగు నుంచి లక్నవరానికి వరద కొనసాగుతోంది.

నిండా నీటితో కళకళలాడుతున్న లక్నవరం పర్యాటకులను ఆకట్టుకుంటోంది. తేలికపాటి వర్షాలు కురుస్తుండటం, సందర్శనకు ఆంక్షలు లేకపోవడంతో చెరువులో బోటింగ్ చేస్తూ ప్రకృతి అందాలను తిలకించేందుకు టూరిస్టులు తరలిరానున్నారు.



జలకళతో పాకాల సరస్సు



మత్తడికి చేరువైన నీరు

మత్తడికి చేరువలో పాకాల చెరువు

ఖానాపురం, ఆగస్టు 7: వరంగల్ జిల్లాలోనే సాగునీటి వనరుల్లో పెద్దదైన పాకాల సరస్సు పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరుకుంది. సరస్సు జలకళను సంతరించుకొని మత్తడికి చేరువలోకి వచ్చింది. ఇటీవల కురుస్తున్న వర్షాలతో పాకాల సరస్సు బుధవారం నాటికి 29.8 అడుగుల నీటిమట్టానికి చేరుకుని నిండు కుండలా ఉంది. సరస్సు పూర్తి నీటి సామర్థ్యం 30.2 అడుగులు కాగా, మరో ఆరు ఇంచుల నీరు చేరితే మత్తడితో పరవళ్లు తొక్కనుంది. పాకాల ఆయకట్టులో వరినాట్లు జోరుగా సాగుతున్న తరుణంలో ఆయకట్టు రైతులు జలకళను సంతరించుకున్న పాకాల సరస్సును సందర్శించి సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



గూడూరు మండలం భీమునిపాదం జలపాతం వద్ద సందడి చేస్తున్న పర్యాటకులు

ఉప్పొంగుతున్న భీమునిపాదం

జలపాతం వద్ద పర్యాటకుల సందడి

గూడూరు (మహబూబాబాద్ జిల్లా), ఆగస్టు 7 : ఎత్తైన గుట్టలు, అరుదైన వృక్షాలు, అబ్బురపరిచే భీమునిపాదం జలపాతం వద్ద పర్యాటకుల సందడి పెరిగింది. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం సీతానగరం శివారు కొమ్ములవంచ సమీప అటవీప్రాంతంలో ఉన్న భీమునిపాదం జలపాతం 70 ఫీట్ల ఎత్తునుంచి వాటర్‌ఫాల్స్ జాలువారుతున్నాయి. రెండ్రోజులుగా కురుస్తున్న వర్షానికి భీమునిపాదంలో వాటర్‌ఫాల్స్ ఉధృతంగా జాలువారుతున్నాయి. పచ్చని ప్రకృతి నడుమ, ఆహ్లాదకరమైన వాతావరణంలో వాటర్‌ఫాల్స్ కింద తడుస్తూ పర్యాటకులు కేరింతలు కొడుతున్నారు. భీమునిపాదంలో పచ్చని ప్రకృతిని ఆస్వాదించడానికి వాచ్‌టవర్ కూడా నిర్మించిన విషయం విదితమే. బుధవారం కురిసిన వర్షానికి భీముని పాదంలో వాటర్‌ఫాల్స్ భారీస్థాయిలో జాలువారుతుండడంతో ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల నుంచి పర్యాటకుల సంఖ్య పెరుగుతోంది. హన్మకొండ నుంచి భీమునిపాదంకు కేవలం 70 కిలోమీటర్లు, మహబూబాబాద్ నుంచి 40 కిలో మీటర్లు ఉంటుంది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు, అటవీశాఖసిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

కేయూ డిగ్రీ విద్యార్థులకు ఇన్‌స్టంట్ అవకాశం

- 6వ సెమిస్టర్ ఏదైనా ఒక్కపేపర్ తప్పిన వారికే..
- 12 వరకు ఫీజు గడువు.. 17న పరీక్ష..

కేయూ క్యాంపస్, ఆగస్టు 7: కాకతీయ యూనివర్సిటీ డిగ్రీ విద్యార్థులకు వర్సిటీ అధికారులు సువర్ణ అవకాశాన్ని కల్పించారు. ఇటీవల నిర్వహించిన డిగ్రీ 6వ సెమిస్టర్‌లో ఏదైనా ఒకే ఒక్క పేపర్ తప్పిన విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ కోసం ప్రత్యేకంగా ఇన్‌స్టంట్ పరీక్షను నిర్వహిస్తారు. వర్సిటీ పరిధిలోని బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, బీసీఏ తదితర కోర్సుల్లో ఆఖరు సెమిస్టర్‌లో ఏదైనా థియరీ పేపర్‌లో తప్పిన అభ్యర్థులు ఆగస్టు12 వరకు ఫీజులు చెల్లించుకోవాలని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ తిరుమలదేవి బుధవారం తెలిపారు. బీఏ, బీకామ్, జనరల్ (బీఏ లాంగ్వేజేస్) అభ్యర్థులు రూ.450, బీఏ, బీబీఏ, బీకాం, బీఎస్సీ, కంప్యూటర్ అభ్యర్థులు రూ. 550, బీసీఏ అభ్యర్థులు రూ. 650, బీకామ్ వొకేషనల్ రూ. 720 కళాశాలలో చెల్లించుకోవాలని తెలిపారు. ఫీజులు చెల్లించుకున్న అభ్యర్థులకు ఆగస్టు 17న మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తామని వెల్లడించారు. కాగా, కేయూ పరిధిలోని ఉమ్మడి వరంగల్‌లో ఎల్బీ కళాశాల, హనుమకొండలో వాగ్దేవి డిగ్రీ కళాశాల, ఉమ్మడి ఆదిలాబాద్ మంచిర్యాలలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నిర్మల్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల (బాయ్స్) ఉమ్మడి ఖమ్మంలో పాల్వంచ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఖమ్మంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల గర్ల్స్ కళాశాలలో పరీక్షల కేంద్రాలను ఏర్పాటు చేశారు.



చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి



మృతిచెందిన యాచకుడు

కాజీపేట, ఆగస్టు 7: రైల్వే స్టేషన్ సమీపంలో అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తిని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాజీపేట పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాజీపేట రైల్వే స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని వ్యక్తి మంగళవారం అపస్మారక స్థితిలో ఉండగా స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వగా పోలీసులు ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి వయస్సు 50 నుంచి 60 వరకు ఉంటుంది. తెలుపు రంగు ముఖం, తెల్లటి గుబురు పిల్లి గడ్డం, గోదుమ రంగుషర్ట్, కాకి రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడు. మృతుడి వద్ద గుర్తించడానికి ఎలాంటి ఆనవాళ్లు లేవు. ఆనవాళ్లను బట్టి చూస్తే యాచకుడిగా భావిస్తున్నామని, ఆచూకీ తెలిసిన వారు 87126 85008, 87126 85122 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని పోలీసులు తెలిపారు.

మెట్టురామలింగేశ్వరస్వామికి రాజయ్య పూజలు



పూజలు నిర్వహిస్తున్న సిరిసిల్ల రాజయ్య, డైరెక్టర్లు

మడికొండ, ఆగస్టు 7: మడికొండలోని మెట్టుగుట్టను బుధవారం రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, డైరెక్టర్లు సందర్శించారు. స్వయంభూ మెట్టురామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి పంచామృతాలతో అభిషేకం చేశారు. అనంతరం సీతారామచంద్రస్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక అర్చనలు చేశారు. అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వచనం చేసి స్వామి వారికి శేషవస్త్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఈవో శేషుభారతి, చైర్మన్ ఫైడిపాల రఘుచందర్, అర్చకులు రాగిచేడు అభిలాష్‌శర్మ, పరాశరం విష్ణువర్ధనాచార్యులు, పారుపెల్లి సత్యనారాయణశర్మ ధర్మకర్తలు దండిగం శ్రీనివాస్, భైరి రాజు, రొడ్డ దయాకర్, వస్కుల ఉమ, బోగి కేదారి, మాడిశెట్టి జ్ఞానేశ్వరి, ఆలయ సిబ్బంది భాస్కర్, రణధీర్, అనిల్, కుమార్, సురేష్, రాజమణి, వెంకటలక్ష్మి, భక్తులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం అందజేత



పులి వీరారెడ్డికి విరాళం అందజేస్తున్న మందల నర్సింహారెడ్డి

వడ్డెపల్లి, ఆగస్టు 7: హనుమకొండ ఎన్జీవోస్‌కాలనీ రోడ్డులోని వికాస్‌నగర్‌లో నిర్మిస్తున్న వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి రిటైర్డ్ సింగరేణి ఉద్యోగి మందల నర్సింహారెడ్డి తన జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని రూ.లక్ష విరాళాన్ని వికాస్‌నగర్ కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పులి వీరారెడ్డికి బుధవారం ఆలయ ప్రాంగణంలో అందజేశారు. రూ.లక్ష విరాళాన్ని అందజేసిన మందల నర్సింహారెడ్డిని కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు అభినందించారు. కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు మందడి యాదగిరిరెడ్డి, నైనకంటి జనార్ధన్‌రెడ్డి, దొండపాటి రత్నాకర్‌రెడ్డి, ఎస్‌వీ పాపారావు, వర్ధం జయపాల్‌రెడ్డి, చిన్న పాపారావు పాల్గొన్నారు.

లంచం అడిగితే సమాచారం ఇవ్వండి

హనుమకొండ సర్కిల్ కార్యాలయంలో వెలసిన పోస్టర్



ఎస్ఈ కార్యాలయంలో అతికించిన పోస్టర్

హనుమకొండ టౌన్, ఆగస్టు 7: అవినీతి రహిత వ్యవస్థ ఏర్పాటు కోసం హనుమకొండ సర్కిల్ పరిధిలోని అన్ని కార్యాలయాలతో పాటు సబ్‌స్టేషన్‌లల్లో లంచం ఇవ్వకండి.. మాకు సమాచారం ఇవ్వండి, లంచం ఇవ్వడం తీసుకోవడం చట్టరిత్యా నేరమని తెలిసేలా వాల్ పోస్టర్స్, బోర్డులను ఏర్పాటు చేసినట్లు టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ సర్కిల్ సూపరింటెండెంట్ కె.వెంకటరమణ తెలిపారు. వినియోగదారులు అవినీతి రహిత వ్యవస్థ ఏర్పాటుకు సహకరిస్తూ ఫిర్యాదులను ఫోంబోర్డు, వాల్‌పోస్టర్స్‌పై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి లేదా టోల్ ఫ్రీ నెంబర్ 1064 నంబర్‌కు లేదా మొబైల్ నెంబర్ 9281033233కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు.

దారులన్నీ బురదమయం

చెరువులను తలపిస్తున్న 9వ డివిజన్‌లోని అంతర్గత రోడ్లు
పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
ఇబ్బందుల్లో స్థానికులు, వాహనదారులు



9వ డివిజన్ న్యూరాయపుర కోహినూర్ ఫంక్షన్‌హాల్ సమీపంలో చెరువులను తలపిస్తున్న అంతర్గత రోడ్లు



రోడ్లపై నిలిచి వర్షపు నీటి వద్ద ఆందోళన చేస్తున్న న్యూరాయపుర కాలనీవాసులు

హనుమకొండ చౌరస్తా, ఆగస్టు 7: 9వ డివిజన్ న్యూరాయపుర కోహినూర్ ఫంక్షన్‌హాల్ పక్క వీధి నుంచి అలంకార్ జంక్షన్ సమీపంలోని వైశ్రాయ్‌కి వెళ్లే అంతర్గత ప్రధాన రోడ్డు అధ్వానంగా తయారైంది. ఈ మట్టి రోడ్డును బీటీ రోడ్డుగా మార్చేందుకు గత ప్రభుత్వంలో రూ.1కోటీ పది లక్షల నిధులను మంజూరు చేశారు. రోడ్డు నిర్మాణ పనుల దక్కించుకున్న గుత్తేదారు నేటికీ పనులు చేపట్టకపోవడంతో వానాకాలం లో రహదారులపై పెద్దఎత్తున వరద నీరు చేరుతోంది. దీంతో రోడ్లన్నీ బురదమయంగా మారడంతో కాలనీ వాసులు బయటకు వెళ్లలేని దుస్థితి నెలకొంది. దాదాపు 9 నెలల కిందట ఈ రోడ్డు నిర్మాణం కోసం శంకుస్థాపన చేశారు. అయితే పనులు ప్రారంభించకుండా కాంట్రాక్టర్ కాలయాపన చేస్తున్నాడు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా డివిజన్ పరిధిలో పలు కాలనీలలో రోడ్లన్నీ అధ్వానంగా మారాయి. దీంతో రాకపో కలకు అంతరాయం కలగడమే కాకుండా వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపై వరదనీరు చేరడంతో రోడ్లన్నీ చెరువులను తలపిస్తున్నాయి. బురదమయంగా మారిన రోడ్లపై సర్కస్ ఫీట్లను చేస్తూ ప్రయాణం చేయాల్సి వస్తోందని కాలనీవాసులు గగ్గోలుపెడుతున్నారు. గుంతలమయంగా మారిన రోడ్డుపై ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా ఎక్కడ ప్రమాదాల బారిన పడాల్సి వస్తుందోమోనని జంకుతున్నారు. అయితే కాంట్రాక్టర్‌పై సంబంధిత అధికారులు చర్యలు ఎందుకు తీసుకోవడం లేదనే విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి.

గతంలో ఈ రోడ్డు దుస్థితి గురించి మేయర్, మునిసిపల్ కమిషనర్, ప్రజాప్రతినిధులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసిన ఫలితం లేకుండా పోయిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు స్థితిగతులపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేయగా, నెల కిందట మేయర్, కమిషనర్ తమ కాలనీలోని రోడ్లను సందర్శించి త్వరితగతిన నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినా పట్టించుకోవడం లేదని ఆందోళన చెందుతున్నారు. కాలనీ సమీపంలో ఉన్న ఓవర్ హెడ్‌వాటర్ ట్యాంకుకు అనుసంధానంగా పైపులైన్ల కోసం తవ్వకాలు చేపట్టారు. దీంతో పనిముగిశాక తవ్విన మట్టిని ప్రధానరోడ్డుపై పోయడంతో వర్షానికి ఆ మట్టి కుంగిపోయి పెద్ద పెద్ద గోతులు ఏర్పాడి వరద నీరు నిలిచి ఈగలు, దోమలు స్వైర విహారం చేయడంతో రోగాల బారిన పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా స్థానిక ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు తమ గోడును ఆలకించి వెంటనే రోడ్డు మరమ్మతులు చేపట్టాలని వేడుకుంటున్నారు.

ప్రమాదాలకు గురవుతున్నారు



వర్షాల కారణంగా ప్రధాన రోడ్డు మార్గం వరద నీరుతో నిండిపోయింది. దీంతో ప్రయాణం చేయడం కష్టంగా మారింది. వివిధ పనుల నిమిత్తం ఈ రోడ్డుపై వాహనదారులు ప్రయాణం కొనసాగించాల్సి ఉంటుంది. రోడ్డుపై వరద నీరు చేరి మోకాళ్లలోతు గుంతలు ఏర్పడటంతో అటుగా వెళ్లే వాహనదారులు అందులో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. వృద్ధులు, స్కూల్‌లకు వెళ్లే విద్యార్థులు ఈ రోడ్డు వెంబడి వెళ్లాలంటే ఎక్కడ ఏ ప్రమాదం జరుగుతుందోనని భయం భయంగా ప్రాణాలను అర చేతులో పెట్టుకొని వెళుతున్నాం.

- అబ్బోజు రవిందర్, రిటైర్డ్ ఏడీఈ, ట్రాన్స్‌కో

అధికారుల కారణంగానే పనుల్లో జాప్యం



నిత్యం వందలమంది ప్రయాణం కొనసాగించే ఈ రోడ్డు నిర్మాణం పనులు చేపట్టాల్సిన కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా పనుల్లో జాప్యం అవుతోంది. దాదాపు 9నెలల కిందట శంకుస్థాపన చేసినప్పటికీ నేటివరకు పనులు చేపట్టనే లేదు. అభివృద్ధి పనులను పర్యవేక్షించాల్సిన అధికారులు.. అదిశగా ప్రయత్నాలు చేయకపోవడంతో పనులు సక్రమంగా జరగడం లేదు. ఏదైనా విపత్తు జరిగినప్పుడు హడావుడి చేసే అధికారులు ముందుస్తు ప్రణాళికలు రూపొందించి ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాల్సి ఉంది.

- ఖాజా సిరాజోద్దీన్, మాజీ డిప్యూటీ మేయర్

మొక్కలు నాటి సంరక్షించడం సామాజిక బాధ్యత

మామునూరు ఏసీపీ బి. తిరుపతి



కేజీబీవీలో మొక్కలు నాటుతున్న ఏసీపీ తిరుపతి, ఎస్సై శ్రీనివాస్

ఐనవోలు, ఆగస్టు 7: భావి తరాలకోసం ప్రతీ ఒక్కరు సామాజిక బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని మామునూరు ఏసీపీ బి.తిరుపతి పిలుపునిచ్చారు. స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ఐనవోలు కేజీబీవీ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అదేవిధంగా పాఠశాల విద్యార్థినుల సూచన మేరకు పాఠశాల ఆవరణలోకి ద్విచక్రవాహనాలు రాకుండా టోల్ గేట్(కంచె)ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. మొక్కలు నాటడం నాకేమవసరం అనుకోకుండా మన పిల్లల కోసమైన నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతీ పౌరుడు పాటుపడాల్సిన అవసరం ఉందన్నారు. పోలీసులు సామాజిక బాధ్యతగా ప్రతీ సంవత్సరం మొక్కలు నాటడమే కాకుండా అనేక చైతన్య కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐనవోలు ఎస్సై పస్తం శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది, కేజీబీవీ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిశోధనలో పారదర్శకతే ప్రామాణికం



మాట్లాడుతున్న ప్రొఫెసర్ విద్యాసాగర్‌రెడ్డి

కేయూ క్యాంపస్, ఆగస్టు 7: పరిశోధనలో పారదర్శకతే ప్రామాణికమని కేయూ ప్రొఫెసర్ ఎం.విద్యాసాగర్‌రెడ్డి అన్నారు. కేయూ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, ఎంహెచ్ఆర్ఎం విభాగంలో విభాగాధిపతి ప్రొఫెసర్ పెదమళ్ల శ్రీనివాసరావు అధ్యక్షతన పరిశోధన పద్ధతులు అనే అంశంపై పరిశోధక విద్యార్థులకు సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ విద్యాసాగర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. సామాజిక శాస్త్రాల పరిశోధన స్వభావం, ప్రాముఖ్యత గొప్పదన్నారు. సామాజిక శాస్త్రాల పరిశోధనలు క్లిష్టమైనవని చెప్పారు. మానవ ప్రవర్తనా సరళిని అంచనా వేయడం చాలా కష్టంగా మారిందన్నారు. సామాజిక శాస్త్ర పరిశోధకులు పరిశోధనలో పారదర్శకంగా నిష్పాక్షపాతంగా ఉండాలని చెప్పారు. శాస్త్రీయ పద్ధతుల ఆధారంగా సమస్యలకు పరిష్కార మార్గాలను అన్వేషించాలని చెప్పారు. ఈ సమావేశంలో ప్రభుత్వ పాలన విభాగం సీనియర్ ప్రొఫెసర్ తోపుచర్ల యాదగిరిరావు, అధ్యాపకులు డాక్టర్ ఆకుతోట శ్రీనివాసులు, డాక్టర్ చీకటి శ్రీను, డాక్టర్ బుర్రి ఉమాశంకర్, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వస్తువుల పంపిణీ



విద్యార్థులకు వాటర్ బాటిల్స్ అందజేస్తున్న ఉపాధ్యాయులు

ఐనవోలు, ఆగస్టు 7: ఐనవోలు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు వాటర్ బాటిల్స్, నోట్‌బుక్స్‌ను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ పాఠశాలలో విధులు నిర్వహించి పదోన్నతిపై వెళ్లిన నం దనంకు చెందిన ఉపాధ్యాయుడు మాచవరం మధుకర్ 90 మంది విద్యార్థులకు రూ.3600 విలువచేసే వాటర్ బాటిల్స్‌ను సొంత డబ్బులతో అందజేశారు. అదేవిధంగా ఇదే పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు 90 మంది విద్యార్థులకు ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా రూ.3500 విలువచేసే తెలుగు, ఇంగ్లీష్ హాండ్ రైటింగ్ నోట్ బుక్స్‌ను సొంత డబ్బులతో ఖరీదు చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పదోన్నతిపై వెళ్లిన ఉపాధ్యాయుడు మధుకర్‌ను సన్మానించారు. విద్యార్థులకు వాటర్‌బాటిల్స్, నోట్ బుక్స్ అందించడంపై హెచ్ఎం వెంకటేశ్వర్‌రావు, కాంప్లెక్స్ హెచ్ఎం వెంకటేశ్వర్లులు ఉపాధ్యాయులను అభినందించారు. ఉపాధ్యాయులు భీమళ్ళ సారయ్య, లక్ష్మి, విజయ, మహేందర్‌రెడ్డి, ఎస్ఎంసీ మాజీ చైర్మన్ బరిగెల కుమారస్వామి, కొట సారయ్య తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ క్రీడను మరింత బలోపేతం చేయాలి



జగదీష్‌యాదవ్‌ను కలిసిన కబడ్డీ అసోసియేషన్ జిల్లా బాధ్యులు

వరంగల్ స్పోర్ట్స్, ఆగస్టు 7: హనుమకొండ, వరంగల్ జిల్లాలో కబడ్డీ క్రీడను మరింత బలోపేతం చేయాలని రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, ఒలంపిక్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగదీష్‌యాదవ్ సూచించారు. హనుమకొండ జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులుగా ఇటీవల ఏకగ్రీవంగా నియమితులైన మహ్మద్ అజీజ్‌ఖాన్, సారంగపాణి, నూతన కార్యవర్గంతో పాటు వరంగల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రాంరెడ్డి, ఎం.డి. అబ్దుల్లా జగదీష్‌యాదవ్‌ను బుధవారం హైదరాబాద్‌లోని ఒలంపిక్ అసోసియేషన్ భవన్‌లో మర్యద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జగదీష్‌యాదవ్ నూతనంగా ఎన్నికైన హనుమకొండ, వరంగల్ జిల్లాల నూతన కార్యవర్గాన్ని అభినందించి, శాలువాలతో సన్మానించారు. జగదీష్‌యాదవ్‌ను కలిసిన వారిలో కబడ్డీ అసోసియేషన్ జిల్లా బాధ్యులు కందుల సృజన్‌కాంత్, మల్లికార్జున్‌గౌడ్, ఎం.డి. అక్తర్, మహేందర్‌రెడ్డి, రెండు జిల్లాల కమిటీ సభ్యులు ఉన్నారు.

కాళోజీ కళాక్షేత్రం పనులు
20 లోపు పూర్తి చేయాలి

బాలసముద్రం, ఆగస్టు 7: కాళోజీ కళాక్షేత్రం నిర్మాణ పనులు ఆగస్టు 20 లోపు పూర్తి చేయాలని కలెక్టర్ పి.ప్రావీణ్య నిర్మాణ సంస్థ ప్రతినిధులను కోరారు. బుధవారం అధికారులతో కలిసి పనులు పరిశీలించి మాట్లాడారు. అనంతరం నిర్మాణ సంస్థ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎక్కువ పని సిబ్బందిని పెట్టి నిబంధనల మేరకు పనులు పూర్తి చేయాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్వినితానాజీ వాకాడే అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హనుమకొండ టౌన్, ఆగస్టు 7: విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా గురువారం హనుమకొండలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గోపాల్‌పూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని అమరావతినగర్, వెంకటేశ్వరకాలనీ, శ్యామలగార్డెన్, వాటర్ ట్యాంకు, ఆర్ఈసీ సబ్‌స్టేషన్ పరిధిలోని ప్రగతినగర్, రెవెన్యూకాలనీ, రామకృష్ణ కాలనీ, నాగేంద్రనగర్ ఏరియాలో ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, నక్కలగుట్ట సబ్‌స్టేషన్ పరిధిలోని నక్కలగుట్ట, భవానీనగర్, వినాయకనగర్, గోకుల్‌నగర్, పోలీస్‌హెడ్‌క్వార్టర్స్, రాంనగర్ ఏరియాలో ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా జరగదని డీఈ తెలిపారు.

ఎస్సీ వర్గీకరణపై మాలకుల సంక్షేమ సంఘం నిరసన



నిరసన తెలుపుతున్న నాయకులు

కాజీపేట, ఆగస్టు 7: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు సానుకూలత నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ బుధవారం కాజీపేట చౌరస్తాలో తేజోమయి మాలకుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు మర్యాల కృష్ణ మాట్లాడుతూ.. ఎస్సీలను విడదీసి బీజేపీ రాజకీయ ప్రయోజనం పొందే కుట్రలు చేస్తోందన్నారు. ఎస్సీలను వర్గీకరణ పేరుతో విభజించే కుట్రలను తిప్పికొడుతామన్నారు. బీజేపీ కుట్రల్ని రాబోయే ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి బండి విజయ్, నాయకులు పప్పుల గోవర్ధన్, సీహెచ్ కొమ్మాలు, కేంద్ర నర్సింగరావు, సత్యనారాయణ, జి.కుమారస్వామి, బి.రాంచందర్,శేఖర్, యాదగిరి ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో 9 మందికి గాయాలు




ప్రమాదానికి గురైన ఆటో

ఐనవోలు, ఆగస్టు 7: ఆగి ఉన్న ట్రాక్టర్ ఇంజన్‌ను ఆటో ఢీకొట్టిన ప్రమాదం లో 9 మందికి గాయాలైన సంఘటన పంథిని గ్రామంలో బుధవారం రాత్రి జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. వర్ధన్నపేట మండలం కట్ర్యాల గ్రామానికి చెందిన 8 మంది వ్యవసాయ మహిళా కూలీలు పనికి వెళ్లి ఆటోలో తిరుగుప్రయాణం అయ్యారు. పంథిని పెట్రోల్ బంక్ ముందు రోటవేటర్ కలిగిన ట్రాక్టర్ ఇంజన్ రోడ్డు పక్కన నిలిపి ఉంది. ఆటో ఆగి ఉన్న ట్రాక్టర్ రోటోవేటర్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో సట్ల వరలక్ష్మి, చెంగల మౌనిక, స్వరూప, యాదలక్ష్మి, యాకమ్మ, ఎల్లమ్మ, సునిత, రజితతోపాటు ఆటో డ్రైవర్ ఎలికట్టే కరుణాకర్‌కు గాయాలయ్యాయి. డ్రైవర్ పక్కన కూర్చున నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. మిగిలిన వారికి స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వారిని హుటాహుటిన ఎంజీఎంకు తరలించారు.

తడిబట్ట వానాయే..

వరి సాగుకు ప్రతికూలమాయే..

- చినుకు పడిని రోజు లేదు.. చెరువులో నీరు చేరలేదు..
- ఐనవోలు మండలంలో విచిత్ర పరిస్థితి



సాగుకు నోచుకోని చెరువు కింది ఆయకట్టు



నిండని పున్నేలు ఎల్లమ్మ చెరువు

ఐనవోలు, ఆగస్టు 7: రోజూ కురుస్తున్న తడిబట్ట వర్షం.. వరి సాగుకు ప్రతికూలంగా మారుతోంది. ఒక వైపు వానకాలం వరినాట్లు పూర్తిచేసే సమయం దగ్గర పడుతుండటం మరో వైపు చెరువులు, కుంటల్లోకి వరద నీరు చేరక రైతులు ఆందోళనకు చెందుతున్నారు. మండల వ్యాప్తంగా చెరువులు, కుంటలు, బోరుబావుల కింద 10వేల ఎకరాల్లో వరిపంట సాగవుతోంది. చెరువులు, కుంటల్లో నీరు లేకపోవడంతో ఆయకట్టు సాగుకు నోచుకోలేదు నార్లు ముదిరి పోతున్నాయి. బోరు బావుల కింద అరకొర నీటి వసతి ఉన్న రైతులు మాత్రమే ఇప్పటి వరకు 6 వేల ఎకరాల్లో వరి నాట్లు వేశారు. అడుగంటిన భూగర్భ జలాలు పెరుగని కారణంగా వరి పంట చేతికి అందుతుందోలేదోనని రైతులు వాపోతున్నారు. కిందటేడు జూలై 20వరకు చెరువులు, కుంటలు నిండుకుండలా మారి మత్తళ్లు పరవళ్లు తొక్కాయి. ఆకేరు వాగు ఉగ్రరూపంతో ప్రవహించింది. కానీ ఈ యేడు జూన్, జూలై, ఆగస్టు 7 వరకు సాధారణ వర్షపాతం కంటే లోటు వర్షపాతం నమోదైనట్లు ఏఎస్‌వో జగన్ తెలిపారు.

మెట్ట పంటలకు సానుకూలం.. వరి పంటకు కట కట..

మండలంలో పత్తి 12వేలు, మొక్కజొన్న 3 వేలు, కంది పంట 250 ఎకరాలు, ఇతర పప్పుదినుసులు 250 ఎకరాల చొప్పున రైతులు మెట్ట పంటలను సాగుచేస్తున్నారు. ప్రస్తుతానికి మెట్ట పంటలు ఆశాజనకంగా ఉన్నట్లు రైతులు చెబుతున్నారు. ఈ నెలలోనైన జల్లులు కాకుండా గట్టి వర్షాలు కురిస్తేనే చెరువులు, కుంటల్లోకి నీరు చేరి వానాకాలం, యాసంగి పంటలకు నిరందుతుందని రైతులు ఆశగా ఉన్నారు.

వర్షాల కోసం రైతుల ఎదురుచూపులు

చెరువులు, కుంటల్లోకి నీరు రాలేదు. నీటి వసతి ఉన్న రైతులు బోరుబావుల కింద నాట్లు వేస్తున్నారు. పూర్తిస్థాయిలో నాట్లువేయడానికి నార్లు పోసుకొని సిద్ధంగా ఉన్నారు. ఇప్పటి వరకు మెట్ట పంటలు ఆశాజనకంగా ఉన్నాయి. మండలంలో ఇప్పటి కంటే సాధారణం కంటే తక్కువ వర్షాపాతం నమోదైంది.

- అడెపు కవిత, ఏవో ఐనవోలు

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
గురువారం • 8 ఆగస్టు 2024



కౌన్సెలింగ్

డాక్టర్! దోమలు కుట్టకుండా ఉండడం కోసం మస్కిటో కాయిల్స్ వెలిగిస్తున్నాం. వీటితో దోమల బెడద వదులుతున్నా, మా మూడేళ్ల అమ్మాయి దగ్గు పెరుగుతోంది. ఇలా ఎందుకు జరుగుతోంది?

- ఓ సోదరి, హైదరాబాద్



కాయిల్స్ పొగ ప్రమాదకరం

దోమలను వదిలించుకోవడం కోసం మస్కిటో కాయిల్స్, మ్యాట్స్ వెలిగించినప్పుడు వాటి నుంచి వెలువడే పొగలో విషపూరిత, హానికారక రసాయనాలుంటాయి. వాటిని పీల్చుకోవడం ప్రమాదకరం. మరీ ముఖ్యంగా ఊపిరితిత్తులు బలహీనపడిన వారు, పుట్టినప్పటి నుంచి అలర్జీ తత్వం కలిగి ఉన్న పిల్లలకు ఈ పొగ వల్ల ఆస్తమా, బ్రాంకైటిస్ సమస్యలు తీవ్రమవుతాయి. కాబట్టి దోమలను దూరం చేసుకోవడం కోసం దోమ తెరలు వాడుకోవాలి. లేదంటే దోమల బ్యాట్స్ వాడుకోవాలి. మీ మూడేళ్ల పాప దగ్గుకు మస్కిటో కాయిల్స్ నుంచి వెలువడే పొగ ప్రధాన కారణం. కాబట్టి వీటి వాడకం వెంటనే మానేయండి. ఘాటైన వాసనలు, పొగలు వెలువరించే దోమల మందుల వాడకం పూర్తిగా మానేయండి. పాపకు ఉన్న అలర్జీని తగ్గించుకోవడం కోసం వైద్య నిపుణులను కలిసి ఇన్‌హేలర్స్ వాడుకోండి. అలాగే దోమలు పెరగకుండా ఉండడం కోసం ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటూ, నీళ్లు నిల్వ ఉండే వీలు లేకుండా చూసుకోవాలి. కొబ్బరి చిప్పలు, టైర్లు, రాలి పడిన చెట్ల ఆకులు, కొమ్మలు, విరిగిపోయిన కుర్చీలు లాంటి పనికిరాని వస్తువులు పరిసరాల్లో లేకుండా చూసుకోవాలి.

- డాక్టర్ రాజు
జనరల్ ఫిజీషియన్,
హైదరాబాద్

పాప్ సింగర్‌గా, ఆధ్యాత్మిక గాయనిగా, నటిగా, సౌందర్య వస్తువుల వాణిజ్యవేత్తగా స్మిత తెలుగువారికి సుపరిచితురాలు. వంటింట్లో దొరికే దినుసులతో తయారు చేసిన... మన అమ్మమ్మల కాలం నాటి అనేక సౌందర్య ఉత్పత్తులను, సేవలను అందించటానికి ఆమె ఒక బ్రాండ్‌ను కూడా ప్రారంభించారు. రకరకాల రాళ్ల (క్రిస్టల్స్)తో కూడిన ఆయిల్స్‌ను ఉపయోగించే 'క్రిస్టల్ ఆయిల్ థెరపీ'ని ప్రత్యేకంగా ప్రవేశపెట్టారు. వీటి గురించి స్మిత మాటల్లోనే..



ఆ వారసత్వాన్ని వదలకూడదని

"ఒకప్పుడు సౌందర్యసాధనాలను ఇళ్లలోనే తయారుచేసుకొనేవారు. వాటి వల్ల ఎటువంటి దుష్ఫలితాలు ఉండేవి కావు. వంటింట్లో దొరికే పసుపు, తేనె, శనగపిండి, శీకకాయ లాంటి వాటితోనే వీటిని తయారుచేసేవారు. కనీసం వారానికి ఒకసారైనా నూనె రాసుకొని.. నలుగు పెట్టుకొని స్నానం చేసేవారు. దీని వల్ల శరీరంలో మలినాలన్నీ తొలగిపోయేవి. కేవలం శారీరక సౌందర్యం పెరగటమే కాదు, ఏవైనా ప్రతికూల ఆలోచనలున్నా తొలగిపోయేవి. దీనికి కారణం- మనం ఉపయోగించే పదార్థాలలో ఉన్న స్వచ్ఛత. ఆ తర్వాత కాలంలో రసాయనాలతో చేసిన సౌందర్యసాధనాలను వాడటం మొదలుపెట్టాం. వీటిని ఉపయోగించటం సులభం కాబట్టి ఎక్కువ మంది వీటివైపే మొగ్గు చూపించటం మొదలుపెట్టారు. కానీ మనకు కొన్ని వేల సంవత్సరాల నుంచి వచ్చి వారసత్వాన్ని వదలుకోకూడదనే ఉద్దేశంతో... సుమారు ఏడు సంవత్సరాల క్రితం నుంచి - 'ఓల్డ్ స్కూల్' అనే బ్రాండ్‌తో సౌందర్యసాధనాలు అమ్ముతున్నాం. ఇక్కడ ఇంకో విషయం కూడా చెప్పాలి. ఒకప్పుడు మా అమ్మమ్మ కూడా నాకు నలుగు పెట్టి స్నానం చేయించేది. నా చర్మానికి, జుట్టుకు ఎటువంటి హాని కలగకుండా చూసుకొనేది. అప్పుడు ఆవిడ ఉపయోగించిన దినుసులు, పద్ధతులు నాకు ఇప్పటికీ జ్ఞాపకమే. అవన్నీ నన్ను ఇప్పటికీ వెంటాడుతూనే ఉంటాయి. అందుకే నేను తయారుచేసే ఉత్పత్తులన్నీ సంప్రదాయబద్ధంగానే ఉంటాయి. అయితే అందరికీ వీటిని ఉపయోగించటానికి సమయం లేకపోవచ్చు. అందుకోసం నేను 'డే స్పా బృందావనం' ప్రారంభించాను. మన పూర్వీకుల పద్ధతిలో నలుగు పెట్టి స్నానం చేయించి, చివరగా సాంబ్రాణి పొగతో జుట్టును ఆరబెట్టే విధానాలన్నీ ఇక్కడ ఉంటాయి. అంతేకాకుండా- ఇక్కడ క్రిస్టల్ ఆయిల్ థెరపీ అనే కొత్త పద్ధతిని కూడా ప్రవేశపెట్టాం. ఈ తరహా విధానం ప్రపంచంలో మరెక్కడా లేదు.



రాళ్లతో...

కొన్ని వేల సంవత్సరాల నుంచి మన పూర్వీకులు రకరకాల రాళ్ల (క్రిస్టల్స్) సౌందర్య ఉత్పత్తుల్లో వాడుతూ వస్తున్నారు. ఇక్కడ ఒక విషయాన్ని మనం తెలుసుకోవాలి. ముత్యాలు, పగడాలు, వజ్రాలు, రత్నాలు వంటి వాటిని ఆభరణాలు తయారుచేయటానికి ఉపయోగిస్తారు. వీటి కన్నా తక్కువ విలువ ఉన్న రోజ్ క్వార్ట్జ్, అమెథిస్ట్, క్లియర్ క్వార్ట్జ్ (స్ఫటిక) , బ్లాక్ ఆనెక్స్ వంటి రాళ్లను ఆభరణాలలోను, వస్తువుల తయారీలో మాత్రమే కాకుండా అక్కడక్కడ సౌందర్య సాధనాలలో కూడా వాడతారు. ఈ రాళ్లకు మన చర్మంలో ఉన్న మృతకణాలను తొలగించి కాంతివంతం చేయగలిగిన శక్తి ఉంటుంది. అందువల్ల ఈ రాళ్లను కొన్ని ప్రత్యేకమైన నూనెలలో ఎక్కువ కాలం ఉంచుతాం. దీని వల్ల ఈ రాళ్లలో ఉన్న పోషకాలు ఇతర పదార్థాలు నూనెలోకి చేరతాయి. ఈ నూనెను వాడటం వల్ల శరీరంలో ఉన్న మలినాలు తొలగిపోతాయి. ఇక్కడ మనం ఇంకో విషయాన్ని కూడా చెప్పుకోవాలి. మన దగ్గర అసలు సిసలైన క్రిస్టల్స్ దొరకవు. 90 శాతంపైగా క్రిస్టల్స్‌ను సౌత్ అమెరికా, సౌత్ ఆఫ్రికా, దుబాయ్ వంటి దేశాల నుంచి దిగుమతి చేసుకొని విక్రయిస్తారు. వీటి ధర ఎక్కువగా ఉంటుంది. తక్కువ ధరకు లభిస్తే- అవి నకిలీవనే చెప్పాలి."

అవగాహన పెరిగింది...

సౌందర్య పోషణకు సంబంధించిన పరిశ్రమలో నేను 20 ఏళ్లుగా ఉన్నాను. ఒకప్పుడు రసాయనాలు ఎక్కువగా ఉండే ఉత్పత్తుల పట్ల వ్యతిరేకత ఉండేది కాదు. కానీ ప్రస్తుతం వినియోగదారులందరిలో అవగాహన బాగా పెరిగింది. వీరు తమ ఆరోగ్యానికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. తమకు ఎటువంటి హాని చేయని ఉత్పత్తులనే వాడుతున్నారు. ఇలాంటి వారికి మన పూర్వీకులు సూచించిన పద్ధతులు ఎంతో ఉపకరిస్తాయి. ఈ తరహా ఉత్పత్తులు మరిన్ని రావాలని, మన పూర్వీకుల పద్ధతులు ప్రపంచవ్యాప్తంగా తెలియాలని కోరుకుంటున్నాను.

• సీవీఎల్ఎన్ ప్రసాద్

బిజినెస్

కార్వీ స్టాక్ బ్రోకింగ్‌కు సెబీ నోటీసులు

» 15 రోజుల్లో రూ.25 కోట్లు చెల్లించాలని ఆదేశం

న్యూఢిల్లీ: కార్వీ స్టాక్ బ్రోకింగ్‌కు (కేఎస్‌బీఎల్), దాని సీఎండీ సీ పార్థసారథికి సెబీ మరోసారి షాకిచ్చింది. 15 రోజుల్లో కేఎస్‌బీఎల్ రూ.15.21 కోట్లు, పార్థసారథి రూ9.36 కోట్లు చెల్లించాలని నోటీసులు జారీ చేసింది. లేకపోతే కంపెనీ బ్యాంకు ఖాతాలను జప్తు చేసి; స్థిర, చరాస్తులను అమ్మేస్తామని హెచ్చరించింది. కంపెనీ సీఎండీ పార్థసారథినైతే అరెస్టు చేసి జైల్లో కూడా పెడతామని తెలిపింది. ఖాతాదారుల నుంచి తీసుకున్న పవర్ ఆఫ్ అటార్నీని దుర్వినియోగం చేసి, వారి షేర్లను ఆర్థిక సంస్థల వద్ద కుదువ పెట్టి, ఆ నిధులను తమ అనుబంధ సంస్థల్లోకి మళ్లించుకున్నందుకు సెబీ ఈ చర్య తీసుకుంది.

కిమ్స్ హాస్పిటల్ లాభం రూ.95.1 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): కిమ్స్ హాస్పిటల్ జూన్ త్రైమాసికంలో రూ.95.1 కోట్ల నికర లాభం నమోదు చేసింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది రూ.8.4 కోట్లు ఎక్కువ. ఆదాయం 13.8 శాతం వృద్ధితో రూ.693 కోట్లకు చేరింది. గత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంతో పోల్చినా ఆదాయం 8.7 శాతం పెరిగింది.

సీసీఎల్ ప్రొడక్ట్స్ రూ.2 డివిడెండ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): వర్తమాన ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో సీసీఎల్ ప్రొడక్ట్స్ స్టాండ్ అలోన్ ప్రాతిపదికన రూ.25.14 కోట్ల నికర లాభం నమోదు చేసింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది రూ.2.79 కోట్లు తక్కువ. గత ఏడాది జూన్ త్రైమాసికంతో పోల్చితే కంపెనీ ఆదాయం రూ.372.31 కోట్ల నుంచి రూ.434.11 కోట్లకు చేరింది. గత ఆర్థిక సంవత్సరానికి రూ.2 ముఖ విలువ ఉన్న ఒక్కో షేరుపై రూ.2 చొప్పున తుది డివిడెండ్‌గా చెల్లించాలని కంపెనీ నిర్ణయించింది. ఇందుకు వచ్చే నెల 13ని రికార్డు తేదీగా పరిగణించాలని డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసింది.

దక్షిణాదిలో పెరిగిన బీమా చైతన్యం : పాలసీ బజార్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): దక్షిణాది రాష్ట్రాల్లో బీమా రక్షణపై అవగాహన క్రమంగా పెరుగుతోంది. పెరుగుతున్న ప్రీమియం వసూళ్లే ఇందుకు నిదర్శనం. 2023 సంవత్సరంలో బీమా పాలసీల ప్రీమియం వసూళ్లు తెలంగాణలో 76 శాతం, ఆంధ్రప్రదేశ్‌లో 71 శాతం పెరిగాయని పాలసీబజార్ డైరెక్టర్ సజ్జా ప్రవీణ్ చౌదరి చెప్పారు. గత ఆర్థిక సంవత్సరం పాలసీబజార్ ద్వారా బీమా కంపెనీలకు రూ.20,000 కోట్ల ప్రీమియం వసూలైంది. ఇందులో ఐదు శాతం తెలుగు రాష్ట్రాల వాటా అని చౌదరి చెప్పారు. ఈ సంవత్సరం వసూళ్లు 60 నుంచి 70 శాతం పెరిగే అవకాశం ఉందన్నారు. హైదరాబాద్ పాలసీబజార్ కేంద్రంలో ప్రస్తుతం 450 మంది పని చేస్తున్నారని, 6 నెలల్లో వీరి సంఖ్యను 800కు పెంచబోతున్నట్టు తెలిపారు.

రియల్టీ.. హైదరాబాద్‌లో కాస్ట్లీ!

రెండో అత్యంత ఖరీదైన రెసిడెన్షియల్ మార్కెట్: నైట్ ఫ్రాంక్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఈ ఏడాది ప్రథమార్థానికి దేశంలోని అత్యంత ఖరీదైన రెసిడెన్షియల్ మార్కెట్లలో హైదరాబాద్ రెండో స్థానంలో నిలిచింది. అఫర్డబిలిటీ ఇండెక్స్ పేరుతో నైట్ ఫ్రాంక్ బుధవారం విడుదల చేసిన నివేదిక ఈ విషయాన్ని వెల్లడించింది. గృహ రుణ నెలవారీ కిస్తీ (ఈఎంఐ)- ఆదాయం నిష్పత్తి ఆధారంగా నైట్ ఫ్రాంక్ దేశంలోని 8 ప్రధాన నగరాల వివరాలతో ఈ జాబితాను రూపొందించింది. హైదరాబాద్ రెసిడెన్షియల్ మార్కెట్‌లో ఈ నిష్పత్తి 30 శాతంగా నమోదైంది. 2023, 2022లోనూ నిష్పత్తి 30 శాతంగానే ఉంది. ముంబై 51 శాతం నిష్పత్తితో అత్యంత ఖరీదైన నగరంగా ఉంది. ఇకపోతే, హైదరాబాద్‌లో గృహాల చదరపు అడుగు సగటు ధర 2010లో రూ.2,728 స్థాయిలో ఉండగా.. 2019 నాటికి రూ.4,500 స్థాయికి పెరిగిందని నైట్ ఫ్రాంక్ రిపోర్టు పేర్కొంది. 2024 ప్రథమార్థంలో రూ.5,681కి చేరుకుందని, 2019 నాటి స్థాయితో పోలిస్తే 26 శాతం పెరిగిందని నివేదిక వెల్లడించింది.

'సేవల నాణ్యత'పై రాజీ లేదు

కొత్త నిబంధనల అమలు తథ్యం: ట్రాయ్

టెలిమార్కెటింగ్ కాల్స్‌పైనా దృష్టి



న్యూఢిల్లీ: టెలికం, బ్రాడ్‌బ్యాండ్ సేవల నాణ్యతపై టెలికం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) గట్టి పట్టుదలతో ఉంది. ఇందుకోసం ఇటీవల కొత్తగా జారీ చేసిన నిబంధనలపై పునరాలోచన ప్రసక్తే లేదని స్పష్టం చేసింది. బ్రాడ్‌బ్యాండ్ ఇండియా ఫోరం (బీఐఎఫ్) బుధవారం నిర్వహించిన 'ఇండియా శాట్‌కామ్ 2024' సదస్సులో ట్రాయ్ ఛైర్మన్ అనిల్ కుమార్ లహోటి ఈ విషయం స్పష్టం చేశారు. టెలికం, బ్రాడ్‌బాండ్ కంపెనీలు ఈ విషయంలో ఏ మాత్రం విఫలమైనా, వినియోగదారులకు నష్ట పరిహారం చెల్లించక తప్పదన్నారు. టెలికం వినియోగదారులను విసిగించే అనధికారిక టెలిమార్కెటింగ్ కాల్స్ కట్టడికీ ట్రాయ్ చర్యలు తీసుకుంటుందన్నారు. దీనికి సంబంధించి గట్టి చర్యలు తీసుకోవాలని ఇప్పటికే టెలికం కంపెనీలను కోరినట్టు తెలిపారు.

మరింత భారం: సీఓఏఐ

మరో వైపు సేవలకు సంబంధించి ట్రాయ్ కొత్త నాణ్యతా ప్రమాణాల నిబంధనలపై టెలికం కంపెనీలు ఆందోళన వ్యక్తం చేశాయి. ఏ అభివృద్ధి చెందుతున్న దేశంలోనూ ఇంత కఠినమైన ప్రమాణాలు లేవని తెలిపాయి. ఈ ప్రమాణాల అమలుతో ఖాతాదారులకు పెద్దగా ఒరిగేది లేకపోయినా, తమపై అదనపు ఆర్థిక భారం పడుతుందని రిలయన్స్ జియో, ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా కంపెనీలకు ప్రాతినిధ్యం వహించే సెల్యులార్ ఆపరేటర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (సీఓఏఐ) డైరెక్టర్ జనరల్ ఎస్‌పీ కొచార్ తెలిపారు. ట్రాయ్ తాజా నిబంధనలు వాస్తవ పరిస్థితులను విస్మరించేలా ఉన్నాయన్నారు. ట్రాయ్, ప్రభుత్వం ఎన్ని ఆదేశాలు జారీ చేసినా, ఇప్పటికీ తాము సెల్ టవర్లు, ఫైబర్ ఆప్టిక్ కేబుల్స్ ఏర్పాటులో సమస్యలు ఎదుర్కొంటున్న విషయాన్ని సీఓఏఐ గుర్తు చేసింది. త్వరలోనే ఈ అంశంపై కేంద్ర టెలికమ్యూనికేషన్ల మంత్రి జ్యోతిరాదిత్య సింధియాని కలవాలని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి.

ఇవే కొత్త నాణ్యతా నిబంధనలు

- ఏ జిల్లాలోనూ 24 గంటలకు మించి సేవలకు అంతరాయం ఏర్పడకూడదు.
- 24 గంటలకు మించి అంతరాయం ఏర్పడితే కనీసం రూ.లక్ష నుంచి గరిష్ఠంగా రూ.10 లక్షల వరకు జరిమానా.
- 24 గంటలకు మించి సేవలకు అంతరాయం ఏర్పడితే కంపెనీలు పోస్ట్ పెయిడ్ ఖాతాదారులకు రెంటల్ ఛార్జీల్లో తగ్గింపు ఇవ్వాలి.
- ప్రీపెయిడ్ ఖాతాదారులైతే ఎన్ని రోజులు సేవలకు అంతరాయం ఏర్పడితే అన్ని రోజులు వాలిడిటీ గడువు పొడిగించాలి.
- లాండ్‌లైన్ సేవలకు ఏర్పడే అంతరాయాన్ని మూడు రోజుల్లో పరిష్కరించాలి. లేకపోతే ఖాతాదారులకు నష్టపరిహారం చెల్లించాలి.
- వరుస పెట్టి తప్పులు చేసే కొద్దీ జరిమానా భారం పెరుగుతుంది.
- అక్టోబరు 1 నుంచి కొత్త నిబంధనల అమలు జరుగుతాయి.

వ్యాపారంలో తదుపరి స్థాయి వృద్ధికి

రిలయన్స్ రెడీ!

» ఆర్ఐఎల్ ఛైర్మన్ ముకేశ్ అంబానీ



న్యూఢిల్లీ: వ్యాపార వృద్ధి పథంలో తదుపరి స్థాయికి ఎగబాకేందుకు రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) సంసిద్ధంగా ఉందని కంపెనీ ఛైర్మన్ ముకేశ్ అంబానీ అన్నారు. ప్రపంచం ఒడుదొడుకులు, అనిశ్చితుల్లో కొట్టుమిట్టాడుతుండగా.. భారత్ సుస్థిరత, శ్రేయస్సు దీపస్తంభంగా ప్రకాశిస్తోందని కంపెనీ వార్షిక నివేదికలో అంబానీ పేర్కొన్నారు. ఆర్ఐఎల్ దేశంలోనే అత్యంత విలువైన కంపెనీ. స్టాక్ మార్కెట్లో అత్యధిక వెయిటేజీ ఉన్న కంపెనీ షేరు కూడా. సంప్రదాయ ఆయిల్ అండ్ కెమికల్స్ వ్యాపారం నుంచి టెలికాం, రిటైల్, మీడియా, తాజాగా ఆర్థిక సేవల్లోకీ ప్రవేశించింది. ఇక హరిత ఇంధన రంగంలో భారీ అరంగేట్రానికి బాటలు వేసుకుంటోంది.

2027 నాటికి రూ.118 లక్షల కోట్లకు భారత రిటైల్ మార్కెట్

భారత రిటైల్ మార్కెట్ ప్రపంచంలో అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న మార్కెట్లలో ఒకటని ఆర్ఐఎల్ పేర్కొంది. 2027 నాటికి దేశీయ రిటైల్ మార్కెట్ 1.4 లక్షల కోట్ల డాలర్ల (సుమారు రూ.118 లక్షల కోట్లు)కు చేరుకోవచ్చని అంచనా వేసింది. 2030 నాటికి మూడో అతిపెద్ద రిటైల్ మార్కెట్‌గా అవతరించనుందని అంటోంది.

నాలుగోసారి నిల్ శాలరీ

ముకేశ్ అంబానీ రిలయన్స్ నుంచి వరుసగా నాలుగో ఏడాదీ రూపాయి వేతనం కూడా తీసుకోలేదు. కరోనా సంక్షోభ సమయంలో కంపెనీ వ్యయాలను తగ్గించేందుకు ఆయన తన జీతాన్ని పూర్తిగా వదులుకున్నారు.

డేటా ట్రాఫిక్‌లో జియో వాటా 60 శాతం

గత ఆర్థిక సంవత్సరంలో దేశంలో నమోదైన మొత్తం డేటా ట్రాఫిక్‌లో రిలయన్స్ జియో వాటా 60 శాతానికి పెరిగిందని ఆర్ఐఎల్ వెల్లడించింది. అందరికీ అందుబాటు ధరలో, వేగవంతమైన 4జీ సేవల ద్వారా భారత్‌ను జియో 'డేటా డార్క్' నుంచి 'డేటా సంపన్న' దేశంగా మార్చిందని అంబానీ పేర్కొన్నారు.

మార్కెట్ పునరుజ్జీవం

» సెన్సెక్స్ 875 పాయింట్లు అప్

ముంబై: 3రోజుల వరుస నష్టాల నుంచి ఈక్విటీ మార్కెట్ బయటపడింది. విలువ ఆధారిత కొనుగోళ్లలో బలమైన పునరుజ్జీవం సాధించింది. ఆర్థిక స్థిరత్వం చోటు చేసుకుంటున్న సమయంలో వడ్డీరేట్లు పెంచబోమని బ్యాంక్ ఆఫ్ జపాన్ డిప్యూటీ గవర్నర్ హామీ ఇవ్వడం ప్రపంచ మార్కెట్లను లాభాల బాట పట్టించింది. మెటల్, ఐటీ, ఆయిల్ షేర్లలో విలువ ఆధారిత కొనుగోళ్లు జరిగాయి. దీంతో సెన్సెక్స్ 874.94 పాయింట్లు లాభపడి 79,468.01 వద్ద ముగిసింది. నిఫ్టీ 304.95 పాయింట్లు లాభపడి 24,297.50 వద్ద ముగిసింది. బీఎస్ఈలో లిస్టింగ్ అయిన కంపెనీల మార్కెట్ విలువ రూ.8,97,352.99కోట్లు పెరిగి రూ.4,48,57,306.55 కోట్లకు (5.34లక్షల కోట్ల డాలర్లు) చేరింది.

సరస్వతి శారీ డిపో ఐపీఓ

సోమవారం ఇష్యూకి వస్తున్న సరస్వతి శారీ డిపో తన షేరు ధర పరిధిని రూ.152-160గా ప్రకటించింది. ఇష్యూ ద్వారా రూ.160 కోట్లు సేకరించడం కంపెనీ లక్ష్యం. ఈ ఇష్యూ సోమవారం ప్రారంభమై బుధవారం ముగుస్తుంది.

కోరమాండల్ లాభాలకు గండి

చెన్నై: జూన్ త్రైమాసికంలో కోరమాండల్ ఇంటర్నేషనల్ ఆర్థిక ఫలితాలు మార్కెట్‌ను నిరాశపరిచాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే కంపెనీ కన్సాలిడేటెడ్ నికర లాభం రూ.494 కోట్ల నుంచి రూ.309.24 కోట్లకు పడిపోయింది. ముడి పదార్థాల ఖర్చులు పెరిగి పోవడం, ప్రభుత్వం నుంచి ఎరువులసబ్సిడీ అందక పోవడం ఇందుకు కారణమని కంపెనీ తెలిపింది. కంపెనీ ఆదాయం కూడా రూ.5,737.89 కోట్ల నుంచి రూ.4,782.93 కోట్లకు పడిపోయింది.



టాటా కర్వ్ ఈవీ వచ్చేసింది

ప్రారంభ ధర రూ.17.49 లక్షలు

ముంబై: దేశీయ వాహన తయారీదారు టాటా మోటార్స్ తన ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ కూపే మోడల్ 'కర్వ్ఈవీ'ని బుధవారం మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. దీని ప్రారంభ ధర రూ.17.49 లక్షలు. గరిష్ఠ ధర రూ.21.99 లక్షలు. ఈ కారు రెండు బ్యాటరీ ప్యాక్ ఆప్షన్స్‌లో లభిస్తుంది. 45 కిలోవాట్ బ్యాటరీ ప్యాక్‌తో కూడిన కారు సింగిల్ చార్జ్‌తో 502 కి.మీ వరకు ప్రయాణించగలదు. 55 కిలోవాట్ బ్యాటరీ ప్యాక్‌తో కూడిన కారు పూర్తి చార్జింగ్‌లో 585 కి.మీ వరకు ప్రయాణించగలదని కంపెనీ వెల్లడించింది. ఈ కారు సున్నా నుంచి 100 కి.మీ వేగాన్ని కేవలం 8.6 సెకన్లలో అందుకోగలదని, గరిష్ఠంగా గంటకు 160 కి.మీ వేగంతో ప్రయాణించగలదని టాటా మోటార్స్ తెలిపింది. 12.3 అంగుళాల టచ్ స్క్రీన్, 10.25 అంగుళాల డిజిటల్ డ్రైవర్ డిస్‌ప్లే, పనోరామిక్ సన్‌రూఫ్, 6 ఎయిర్‌బ్యాగ్‌లు, 360 డిగ్రీ వ్యూతో కూడిన కెమెరా, 18 అంగుళాల ఏరోడైనమికల్లీ డిజైన్డ్ అల్లాయ్ వీల్స్, ముందుభాగంలో ఎల్ఈడీ డీఆర్ఎల్ స్ట్రిప్, వెనకభాగంలో కనెక్టెడ్ ఎల్ఈడీ టెయిల్ లైట్స్, అడాస్ వంటి ఫీచర్లను ఈ కారులో పొందుపరిచినట్లు సంస్థ వెల్లడించింది. ఈ కారు ఐదు రంగుల్లో లభించనుంది. కాగా, సంప్రదాయ ఇంజన్‌తో నడిచే టాటా కర్వ్‌ను సంస్థ వచ్చేనెలలో మార్కెట్లోకి విడుదల చేయనుంది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	69,270 ▼	63,500 ▼	87,000 ▼
ముంబై	68,940 ▼	63,150 ▼	79,160 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

8వ తేదీ			
హైదరాబాద్	395	విజయవాడ	430
వరంగల్	397	గోదావరి	426
చిత్తూరు	493	విశాఖపట్నం	430
		డజను గుడ్లు రూ.	66

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	75	విజయవాడ	85
వరంగల్	75	గుంటూరు	85
కరీంనగర్	75	ఒంగోలు	85
మహబూబ్‌నగర్	75	చిత్తూరు	80
కర్నూలు	75	నెల్లూరు	80
విశాఖపట్నం	81	అనంతపురం	85
గోదావరి	85		

మనసుకు అయ్యే గాయాన్ని మాన్పే శక్తి కాలానికి ఉందంటారు. అయితే ఆ గాయాన్ని పదేపదే జ్ఞప్తికి తెస్తుంటే? ఒకవేళ చేయని నేరానికి బలైనవారిని, ఆ నేరం వారు చేయలేదని రుజువైనప్పటికీ ఒకప్పుడు నేరారోపణ చేయబడ్డాడని నిరంతరం ప్రచారం చేస్తుంటే? సదరు వ్యక్తులకు ఉన్న వ్యక్తిగత స్వేచ్ఛను, గోప్యత స్వేచ్ఛను ఉల్లంఘించినట్లు కాదా?

రైట్ టు బి ఫర్గాటెన్
గోప్యత హక్కు!

ఇదే అంశం ఇటీవల ఒక కేసు రూపంలో సుప్రీం కోర్టు ముందుకు వచ్చింది. గతంలో లైంగికదాడి, మోసం కేసులో ఒక వ్యక్తిని దిగువ కోర్టు నేరస్థునిగా పేర్కొంటూ తీర్పుని ఇచ్చింది. అయితే తరువాత కాలంలో అతన్ని ఎగువకోర్టు నిర్దోషిగా ప్రకటించింది. కానీ లీగల్ సెర్చ్ పోర్టల్ 'ఇండియన్ ఖానూన్'లో దిగువకోర్టు ఇచ్చిన తీర్పు వివరాలు ప్రకటితమవుతుండటంతో సదరు వ్యక్తి దరఖాస్తు చేసుకున్న విదేశీ పౌరసత్వ అప్పీలును తిరస్కరించారు. ఈ ప్రకారం అతడు చేయని నేరానికి మళ్లీ మళ్లీ శిక్షించబడుతున్నట్టే. అదే అంశాన్ని ప్రస్తావిస్తూ ఆ వ్యక్తి మద్రాసు హైకోర్టును ఆశ్రయించి రైట్ టు బి ఫర్గాటెన్(మరచిపోవు హక్కు)ను అభ్యర్థించాడు. ఇండియన్ ఖానూన్ పోర్టల్ నుంచి తనకు సంబంధించిన తప్పుడు సమాచారాన్ని తొలగించమని ఆదేశించాల్సిందిగా కోరాడు. ఈ నేపథ్యంలో మద్రాసు హైకోర్టు ఇండియన్ ఖానూన్ సంస్థను సదరు వ్యక్తికి సంబంధించిన సమాచారాన్ని తొలగించమని ఆదేశిస్తూ తీర్పునిచ్చింది. ఇండియన్ ఖానూన్ పోర్టల్ ఈ తీర్పును సుప్రీంకోర్టులో సవాలు చేసింది.


ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

ఇటీవల సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ అధ్యక్షతన ముగ్గురు సభ్యుల ధర్మాసనం ఈ కేసును విచారణకు స్వీకరించడంతో 'రైట్ టు బి ఫర్గాటెన్' అనే హక్కుకు సంబంధించి కొన్ని నిర్ధారణలు వెలువడనున్నాయి. అసలు రైట్ టు బి ఫర్గాటెన్ అనేది ప్రాథమిక హక్కు అవుతుందా? ఒకవేళ అయితే, అది రాజ్యాంగం ప్రసాదించిన ఇతర ప్రాథమిక హక్కులతో ఏవిధమైన సంబంధం కలిగి ఉంటుంది? అనే అంశాలను దేశ అత్యున్నత న్యాయస్థానం పరిశీలించనుంది.

అసలు 'రైట్ టు బి ఫర్గాటెన్' అంటే ఏమిటి? ఎవరికి వర్తిస్తుంది? భారతదేశంలో దానికి గల చట్ట, న్యాయపరమైన పునాదులేవి? సదరు హక్కు లాభ - నష్టాలేమిటి? చూద్దాం.

● 'రైట్ టు బి ఫర్గాటెన్' అంటే?

అనవసరమైన లేదా అసందర్భమైన తన వ్యక్తిగత సమాచారాన్ని బహిరంగ సామాజిక వేదికల నుంచి అంటే ఇంటర్నెట్, సెర్చ్ ఇంజన్లు, డేటాబేస్‌లు, వెబ్‌సైట్లు, ఇతరత్రా ఏదైనా సమాచార మాధ్యమాల నుంచి తీసివేయించడానికి ఒక వ్యక్తికి గల హక్కునే రైట్ టు బి ఫర్గాటెన్ లేదా రైట్ టు బి ఎరేజర్ అంటారు.

ఒక వ్యక్తికి సంబంధించిన వ్యక్తిగత సమాచారాన్ని ఎటువంటి ఆవశ్యకత, చట్టపర అవసరం లేనప్పటికీ, అందరికీ బహిరంగంగా ఆ సమాచారాన్ని అందుబాటులో ఉంచి, అతని గోప్యతా హక్కును ఉల్లంఘించినప్పుడు ఒక వ్యక్తి రైట్ టు బి ఫర్గాటెన్(ర్) ఎరేజర్‌ను ఆశ్రయించే వీలుంది.

భారత్‌లో ఈ హక్కుకు ఇతిమిద్ధ రూపం లేనప్పటికీ, ఈయూ దేశాల్లో వారు తీసుకువచ్చిన 'జనరల్ డేటా ప్రొటెక్షన్ రెగ్యులేషన్(జీడీపీఆర్)' ఈ హక్కును వారికి అందిస్తోంది. అయితే దగ్గర కూడా కొన్ని తీర్పుల్లో, హక్కుల్లో, చట్టాలు, బిల్లుల్లో ఇది ప్రతిఫలిస్తోంది.

● భారతదేశంలో ప్రస్తావనలు

రైట్ టు బి ఫర్గాటెన్ అనే హక్కును, భారత రాజ్యాంగం కల్పిస్తున్న ప్రాథమిక హక్కుల్లోని, జీవించే హక్కు(ప్రకరణ 21)లో అంతర్భాగమైన గోప్యతా హక్కు పరిధిలోకి వచ్చే అంశంగా 'కె.ఎస్.పుట్టస్వామి వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా' కేసు (2017) తీర్పులో ప్రస్తావించింది. అంతేకాక కొన్ని హైకోర్టులు(ఢిల్లీ, కర్ణాటక) కూడా వివిధ కేసుల్లో ఇంచుమించు ఇదేవిధమైన తీర్పులు ఇచ్చి ఉన్నప్పటికీ, సుప్రీం కోర్టు కె.ఎస్.పుట్టస్వామి కేసు తీర్పులో ఇచ్చిన ప్రాథమిక నియమావళి రైట్ టు బి ఫర్గాటెన్‌కు ఒక ప్రాతిపదికను ఏర్పర్చింది. న్యాయవ్యవస్థకు ఒక మార్గదర్శనం చేసింది.

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

ఇక చట్టాలపరంగా తీసుకుంటే 'డిజిటల్ డేటా ప్రొటెక్షన్ యాక్ట్ (2023)'లో రైట్ టు బి ఫర్గాటెన్‌కు ఒక చట్ట ప్రాతిపదిక కనిపిస్తుంది. వ్యక్తుల వ్యక్తిగత సమాచారాన్ని డిజిటల్ స్పేస్‌లో వారు నియంత్రించుకోగల సౌలభ్య అంశం ఈ చట్టంలో ఉంది. ఏ వ్యక్తి గురించిన వ్యక్తిగత సమాచారం డిజిటల్ స్పేస్‌లో అతడి/ఆమె వ్యక్తిగత గోప్యతకు, ప్రతిష్ఠకు, భద్రతకు నష్టం కలిగించేదిగా ఉన్నప్పుడు దానిని తొలగించమని డేటా నిర్వాహకులను కోరవచ్చు. వారు తొలగించని పక్షంలో రెగ్యులేటరీ అథారిటీ(లేదా) న్యాయస్థానాలను ఆశ్రయించవచ్చు. అంతేకాక ప్రతిపాదిత పర్సనల్ డేటా ప్రొటెక్షన్ బిల్లు (2019)లో కూడా రైట్ టు బి ఫర్గాటెన్ గురించిన ప్రతిపాదన ఉంది.

● పరిమితులు

సుప్రీంకోర్టు నిర్దేశనల ప్రకారం, ఒక వ్యక్తి వ్యక్తిగత సమాచారం ఎటువంటి చట్టపరమైన ఆవశ్యకతను కలిగి లేనప్పుడు, అవసరత, సంబంధం కానీ ఇతరత్రా లేనప్పుడు, అసత్యమైనప్పుడు దానిని తొలగించుకునే హక్కును సదరు వ్యక్తి పొందుతాడు.

అయితే భావవ్యక్తీకరణ హక్కుతో ముడిపడినప్పుడు, చట్టపరమైన అవసరాలు గల సమాచారమైనప్పుడు, ప్రజా ప్రయోజనాల సంబంధితమైనప్పుడు రైట్ టు బి ఫర్గాటెన్ వర్తించదని కూడా విస్పష్టం చేయడం జరిగింది.

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/7js5FoHలో చూడండి.

దిక్సూచి



ఢిల్లీ హైకోర్టు వ్యాఖ్యానించినట్లు రైట్ టు ప్రైవసీ(గోప్యతా హక్కు) అనేది రైట్ టు ఇన్ఫర్మేషన్(సమాచార హక్కు)తో సమన్వయం కావాలి. రైట్ టు బి ఫర్గాటెన్' ఎంత ఆవశ్యకమో, సమాచార స్వేచ్ఛ కూడా అంతే అవసరమనే వాద ప్రతివాదనలు ఉన్నాయి.

లాభ నష్టాలు

లాభాలు

- నిరపరాధులు తమ గౌరవాన్ని కాపాడుకోవడానికి వీలవుతుంది.
- సమాచారం తీవ్రంగా దుర్వినియోగం అవుతూ, అసత్యాలు, పాక్షిక సత్యాలు (ఉదా: ఫేక్ న్యూస్, రివేంజ్ పోర్న్, మార్ఫ్‌డ్ కంటెంట్) ప్రచారమవుతున్నఈ డిజిటల్ యుగంలో రైట్ టు బి ఫర్గాటెన్ వంటి హక్కులు వ్యక్తి గౌరవాన్ని, గోప్యతను, ప్రతిష్ఠను రక్షిస్తాయి.
- వ్యక్తిగత భద్రత, స్వేచ్ఛపరంగా అనవసర సమాచారం అందరికీ సులువుగా అందుబాటులో లేకుండా, మోసాలు, ఐడెంటిటీ తెఫ్ట్ వంటి వాటికి గురవకుండా రక్షణ లభిస్తుంది.

నష్టాలు

- రైట్ టు బి ఫర్గాటెన్ ఒక ప్రాథమిక హక్కుగా లభిస్తు, తరచూ మరికొన్ని చట్టబద్ధ/ ప్రాథమిక హక్కులైన సమాచార హక్కు, భావప్రకటన స్వేచ్ఛ, పరిశోధన, పాత్రికేయ స్వేచ్ఛలతో సంఘర్షణ ఏర్పడుతుంది.
- సాంకేతికంగా డిజిటల్ సంస్థలకు ఎన్నో సవాళ్లు ఎదురవుతాయి. భారీఎత్తున సమాచారం నిరంతరం తొలగించాల్సిన పరిస్థితితో ప్రత్యేక యంత్రాంగం, సాంకేతికతల ఆవశ్యకత ఏర్పడుతుంది.
- సెర్చ్ ఇంజన్లు ఇచ్చే సమాచారం విపరీతంగా కుంచించబడుతుంది. ఒక అంశంతో అనేక ఉప అంశాలు ముడిపడి ఉన్నప్పుడు వ్యక్తిగత స్వేచ్ఛ హక్కు కారణంగా అవి తొలగించాల్సి వస్తే సమాచారం అతుకుల బొంతగా తయారవుతుంది.
- బ్లాక్‌చైన్ టెక్నాలజీ నేపథ్యంలో సమాచారాన్ని పూర్తిగా తొలగించడం, పునరావృతం కాకుండా చూడటం దుర్లభం.

ఇలాంటి వాదోపదవాదాల/ లాభ-నష్టాల నేపథ్యంలో ప్రస్తుతం రైట్ టు బి ఫర్గాటెన్ అనేది ప్రాథమిక హక్కుల పరిధిలోకి వస్తుందా? ఒక హక్కుగా స్థిరీకరించి ప్రజలకు అందుతుందా అనే అంశాలతోపాటు ఇతర ప్రాథమిక హక్కుల పరిధిలోకి వెళ్లి సంఘర్షణ ఏర్పడినప్పుడు ఏమి చేయాలనే అంశాలు సుప్రీంకోర్టు పరిశీలనార్థం ఉన్న ఇండియన్ ఖానూన్ కేసు సముఖంగా తేలాల్సిందే.

నవ్య | చిత్రజ్యోతి

ఇన్ ప్రోగ్రెస్



విష్వక్ వినోదం

విష్వక్‌సేన్ హీరోగా నటించే 14వ చిత్రాన్ని బుధవారం ప్రకటించారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. 'జాతిరత్నాలు' చిత్ర దర్శకుడు అనుదీప్ కేవీ ఈ సినిమాకు దర్శకుడు. హిలేరియస్ ఎంటర్‌టైనర్స్ అందించడంలో అనుదీప్‌కు మంచి పేరు ఉంది. అందుకే ఈసారి కూడా ఆయన విష్వక్‌సేన్‌తో నవ్వుల వర్షం సృష్టించనున్నారని నిర్మాత చెప్పారు. భీమ్స్ సిసిరోలియో సంగీతాన్ని, సురేశ్ సారంగం ఫొటోగ్రఫీని అందించనున్నారు. సహ నిర్మాత: వివేక్ కూచిభొట్ల.

థియేటర్లో చూడాల్సిన చిత్రం



నూతన నటులతో తీసిన చిత్రం 'కమిటీ కుర్రోళ్లు'. యదు వంశీ దర్శకత్వంలో నిహారిక కొణిదెల నిర్మించారు. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతోన్న సందర్భంగా దర్శకుడు యదు వంశీ మీడియాతో ముచ్చటించారు. "ఒక ఊరిలో జాతర చుట్టూ జరిగే కథ ఇది. ప్రతీ కుర్రాడు ఈ సినిమాకు రిలేట్ అవుతారు. స్నేహం, రాజకీయాల చుట్టూ తిరిగే ఈ సినిమా అందరినీ అలరిస్తుందనే నమ్మకం ఉంది. అన్ని రకాలుగా ఆకట్టుకునే అంశాలున్న ఈ సినిమాను థియేటర్లో చూస్తేనే బాగుంటుంది" అని చెప్పారు.

నిర్మాత శ్యామ్‌ప్రసాద్‌రెడ్డికి సతీవియోగం

ప్రముఖ నిర్మాత, మల్లెమాల ఎంటర్‌టైన్‌మెంట్స్ అధినేత ఎం.శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి సతీమణి వరలక్ష్మి బుధవారం హైదరాబాద్‌లో కన్ను మూశారు. ఆవిడ వయసు 62 సంవత్సరాలు. క్యాన్సర్ వ్యాధి కారణంగా కన్ను మూసిన వరలక్ష్మి అంత్యక్రియలు గురువారం నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు.



ఆ విషయంలో అమితాబ్ తర్వాత బాలకృష్ణే!

'తాతమ్మ కల' చిత్రంతో తెరంగేట్రం చేసిన నందమూరి బాలకృష్ణ నటుడిగా 50 ఏళ్లు పూర్తి చేసుకుంటున్నారు. ప్రస్తుతం ఆయన నటిస్తున్న 108 వ చిత్రం నిర్మాణంలో ఉంది. ఒక హీరోగా యాభై ఏళ్ల సినీ ప్రయాణం నిజంగా అరుదైన విషయమే. అందుకే బాలకృష్ణ స్వర్ణోత్సవ వేడుకలను సెప్టెంబర్ ఒకటిన తెలుగు చిత్ర పరిశ్రమ భారీ స్థాయిలో నిర్వహించనుంది. బుధవారం జరిగిన ఈ వేడుక సన్నాహక కార్యక్రమంలో నందమూరి మోహనకృష్ణ, రామకృష్ణ పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా మోహనకృష్ణ మాట్లాడుతూ 'మా తమ్ముడు నటుడిగా యాభై ఏళ్లు పూర్తి చేసుకోవడం చాలా గొప్ప విషయం. నాన్నగారికి వారసుడిగా పరిశ్రమలో నిలబడడమే కాకుండా ఎటువంటి పాత్రనైనా చేయగల నటుడిగా నిరూపించుకున్నారు' అన్నారు. 'ఇండియన్ సినిమా హిస్టరీలో అమితాబ్ బచ్చన్ తర్వాత సుదీర్ఘకాలం నటుడిగా ఉంటూ బాలకృష్ణ తన ప్రత్యేకత చాటుకున్నారు. ఇప్పటికీ కుర్ర హీరోలకు ఏ మాత్రం తగ్గకుండా పోటీ ఇస్తున్నారు. పరిశ్రమ అంతా కలసి చేస్తున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి' అని కోరారు తమ్మారెడ్డి భరద్వాజ. నిర్మాతలమండలి కార్యదర్శి తుమ్మల ప్రసన్నకుమార్ మాట్లాడుతూ 'ఈ వేడుక నిర్వహించడానికి మొదట బాలకృష్ణ ఒప్పుకోలేదు. కానీ ఇదొక స్ఫూర్తిదాయక కార్యక్రమంగా ఉంటుందని వివరించడంతో ఆయన అంగీకరించారు' అన్నారు.



రూ.రెండు కోట్ల విరాళం

కేరళలో వయనాడ్ జిల్లాలో కొండ చరియలు విరిగిపడ్డంతో జరిగిన విషాదం అందరికీ తెలిసిందే. ఈ విపత్తు బారిన పడిన బాధితులకు ఇప్పటికే పలువురు సినీ ప్రముఖులు విరాళాలు అందించి తమ వంతు సాయం చేశారు. బుధవారం ప్రభాస్ కేరళ ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.రెండు కోట్ల విరాళం అందించి తన గొప్ప మనసును చాటుకున్నారు. ఇప్పటికే ఈ విపత్తు బారిన పడిన వారి కోసం తెలుగు ఇండస్ట్రీ నుంచి చిరంజీవి, రామ్‌చరణ్ సంయుక్తంగా రూ.కోటి.. అల్లు అర్జున్ రూ.25 లక్షలు అందజేశారు.

సంపదను కాపాడేవాడూ సైనికుడే



'సరిహద్దును కాపాడేవాడే సైనికుడు కాదు.. సంపదను కాపాడేవాడూ సైనికుడే' అంటున్నారు రవితేజ. ఆయన కథానాయకుడిగా నటించిన 'మిస్టర్ బచ్చన్' చిత్రంలోనిది ఈ డైలాగ్. హరీశ్ శంకర్ దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్ నిర్మించారు. ఆగస్టు 15న విడుదలవుతోంది. 'మిస్టర్ బచ్చన్' చిత్రం థియేట్రికల్ ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని యూనిట్ బుధవారం నిర్వహించింది. హరీశ్ శంకర్ మాట్లాడుతూ 'అమితాబ్‌బచ్చన్ గారి 'షోలే' చిత్రం విడుదలైన ఆగస్టు 15న మా సినిమా కూడా విడుదలవడం కాకతాళీయమే. ఈ సినిమాకు 'మిస్టర్ బచ్చన్' టైటిల్‌ను రవితేజ గారు నిర్ణయించారు' అని చెప్పారు.



నీ వెంటే మేమంతా
వినేశ్ ఫొగాట్‌కు సినీతారల మద్దతు

పారిస్ ఒలింపిక్స్‌లో ఫైనల్‌కు చేరిన భారత కుస్తీ క్రీడాకారిణి వినేశ్ ఫొగాట్ పతకం సాధించి మువ్వన్నెల పతాకాన్ని రెపరెపలాడించడం ఖాయమని భావించిన తరుణంలో ఆమె అనూహ్య నిష్క్రమణ దేశవ్యాప్తంగా క్రీడాభిమానులను నిరాశకు గురిచేసింది. వంద గ్రాముల బరువు పెరిగారనే కారణంతో ఒలింపిక్ కమిటీ, రెజ్లింగ్ కమిటీ ఆమెపై అనర్హత వేటు వేయడం సగటు అభిమానితో పాటు సెలబ్రిటీలను కలచివేసింది. దేశవ్యాప్తంగా పలువురు ప్రముఖులు వినేశ్‌కు మద్దతుగా నిలిచారు. ఈ క్రమంలో పలువురు సినీ తారలు సైతం సోషల్ మీడియా ద్వారా వినేశ్‌కు ధైర్య వచనాలు చెప్పారు.

- పతకం గెలిచినా, గెలవకపోయినా మీరు నిజమైన ఛాంపియన్ అని అందరికి చూపించారు. ఫలితాన్ని మీరు స్వీకరించిన తీరు, కష్ట సమయంలో మీరు చూపిన నిబ్బరం మా అందరికీ స్ఫూర్తిదాయకం. మీ స్ఫూర్తి మాలోని ప్రతి ఒక్కరిలో ప్రకాశిస్తోంది. 140 కోట్ల హృదయాలు మీతో ఉన్నాయి.
  - మహేశ్ బాబు
- ఎంత పోరాట పటిమ కనబరిచేవారైనా కొన్నిసార్లు కఠినమైన అడ్డంకులను ఎదుర్కోవాల్సి వస్తుంది. మీరు ఒంటరి కాదు. కష్టసుఖాల్లో మేమంతా మీ వెన్నంటే ఉంటాం. ప్రతికూల పరిస్థితులకు ఎదురొడ్డి నిలబడిన మీ తీరు ప్రశంసనీయం
  - సమంత
- విజయమనే తూనికలో ఇమిడే ప్రతిభ కాదు నీది. నీ ఆటతీరుతో ఎంతోమందిని ప్రభావితం చేశావు. మా మనసుల్లో గొప్ప స్థానం పొందావు. మా అందరి ప్రేమాభిమానాలు నీతోనే ఉంటాయి. గర్వంగా తలెత్తుకొని నిలబడు.
  - నయనతార
- జాతి యావత్తుకు మీరు స్ఫూర్తిగా నిలిచారు. యోధురాలుగా కొన్ని తరాలు మిమ్మల్ని గుర్తుంచుకుంటాయి. ఇలాంటి అడ్డంకులు ఎన్ని వచ్చినా చరిత్ర సృష్టించకుండా విమ్మల్ని ఆపలేదు. పట్టుదలను, ధైర్యాన్ని, కష్టాన్ని మీ నుంచి దూరం చేయలేవు. మీలాంటి వారు మరొకరు లేరు.
  - అలియాభట్
- వినేశ్ నిష్క్రమణ నిరాశ కలిగించింది. ఆమె మనందరి హృదయాలను గెలుచుకున్నారు.
  - తాప్సీ
- వినేశ్ నువ్వే యోధురాలివి. నిన్ను చూసి గర్విస్తున్నా. నువ్వు సాధించింది పతకాల కంటే ఎక్కువ
  - దర్శకురాలు జోయా అక్తర్
- మీరెప్పుడూ ఛాంపియనే
  - సోనాక్షిసిన్హా



వినేశ్ ఫొగాట్‌పై అనర్హత వేటు నేపథ్యంలో నటి, బీజేపీ ఎంపీ హేమమాలిని చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. 'వంద గ్రాముల బరువు పెరిగారనే కారణంతో వినేశ్ అనర్హతకు గురవడం ఆశ్చర్యపరిచింది. క్రీడాకారులు, కళాకారులు తమ బరువును అదుపులో ఉంచుకోవడం ఎంత ముఖ్యమో ఈ సందర్భంగా మనం అర్థం చేసుకోవాలి. ఇది మనందరికీ ఒక పాఠం. ఆమె బరువు తగ్గొచ్చు కానీ పోయినా అవకాశం అయితే మళ్లీ రాదుకదా' అని వ్యాఖ్యానించారు హేమమాలిని. ఒక ప్రజా ప్రతినిధి అయి ఉండి, కష్టకాలంలో క్రీడాకారిణిగా ధైర్యం చెప్పాల్సింది పోయి ఇలా కామెంట్ చేయడం తగదని నెటిజన్లు హితవు పలికారు. అనర్హత అంశం గురించి హేమమాలిని మీడియాతో నవ్వుతూ మాట్లాడారని తప్పుపట్టారు.

సమాజానికి ఉపయోగపడే
సినిమాలే చేస్తా



దర్శకుడు సంపత్ నంది, దాసరి రాజేందర్ రెడ్డి సంయుక్తంగా నిర్మించిన చిత్రం 'సింబా'. మురళి మనోహర్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో జగపతిబాబు, అనసూయ ప్రధాన పాత్రలు పోషించారు. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతున్న సందర్భంగా చిత్ర నిర్మాతల్లో ఒకరైన రాజేందర్ రెడ్డి మీడియాతో ముచ్చటించారు. 'సంపత్ నంది సమాజానికి ఉపయోగపడేలా ఏదైనా చేద్దాం అనే ఉద్దేశంతో ఈ కథ రాసి నా దగ్గరికి వచ్చారు. ప్రకృతి మీద ప్రేమను పెంచేలా.. పర్యావరణ పరిరక్షణపై అవగాహనను కల్పించేలా ఉంటుందీ చిత్రం. జగపతిబాబు, అనసూయ నటన సినిమాకే హైలైట్. ఆగస్టు 9 అంతర్జాతీయ ఆదివాసీల దినోత్సవం కాబట్టి అదే రోజున సినిమాను విడుదల చేస్తున్నాం. ఇకపై నేను చేసే ప్రతీ సినిమాలో ప్రజలకు ఉపయోగపడే అంశాలు ఉంటాయి" అని చెప్పారు.

ప్రొడ్యూసర్ టాక్

విజయదశమికి
'కార్తికేయ 3'ను ప్రకటిస్తాం



'కార్తికేయ', 'సుబ్రమణ్యపురం', 'కథలో రాజకుమారి' చిత్రాలతో మంచి అభిరుచి ఉన్న నిర్మాతగా పేరు తెచ్చుకున్నారు వెంకట శ్రీనివాస్ బొగ్గరం. ఆయన ఇటీవలే మీడియాతో ముచ్చటించి.. అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్న 'కార్తికేయ 3' సినిమా గురించి ఓ ఆసక్తికర అప్‌డేట్‌ను అందించారు.

"కార్తికేయ' మొదటి భాగం విడుదలై పదేళ్లు అవుతున్న సందర్భంగా అక్టోబరులో విజయదశమి రోజున 'కార్తికేయ 3' సినిమాను అధికారికంగా ప్రకటించనున్నాము. ఆ రోజే సినిమా గురించి మరిన్ని వివరాలు వెల్లడిస్తాము. 'కార్తికేయ 2' సంచలన విజయం సాధించడంతో మూడో భాగంపై అంచనాలు ఆకాశాన్నంటుతున్నాయి. అందరి అంచనాలు నిలబెట్టుకోవడానికి స్క్రిప్ట్ విషయంలో చాలా జాగ్రత్తలు పాటిస్తున్నాం. డివోషనల్ టచ్ ఉండేలా హనుమంతుడి స్ఫూర్తితో 'యతి' అనే సినిమాను.. శివుడి స్ఫూర్తితో 'మహాయోగి' అనే మరో సినిమాను నిర్మిస్తున్నాను" అని చెప్పారు.

ఒలింపిక్స్ ముగింపు దశకు వస్తున్నా ఒక్క స్వర్ణ పతకమూ లేదని 140 కోట్ల మంది భారతీయులు ఆవేదన చెందుతున్న తరుణం..అలాంటి సమయంలో అంచనాలను నిలబెట్టుకొంటూ, తన సత్తా, పోరాట పటిమను చాటిచెబుతూ పసిడి పతక పోరుకు దూసుకొచ్చింది..దేశ ప్రజానీకంలో ఆనందోత్సాహాలు నింపింది..వారు గర్వంగా తలెత్తుకొనేలా చేసింది..మరికొద్ది గంటల్లో జరిగే తుది పోరులో కూడా సివంగిలా విజృంభించడం ద్వారా ఈసారి విశ్వక్రీడల్లో స్వర్ణ బోణీ కొడుతుందని దేశ ప్రజలు సంబరపడుతున్న వేళ ఊహించని పరిణామం..100 గ్రాముల బరువు అధికంగా ఉండడంతో స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగట్ అనర్హతకు గురైంది. ఈ హఠాత్పరిణామంతో భారతావని ప్రాన్పడిపోయింది..అంతులేని వేదనలో కూరుకు పోయింది..ప్రధాని మోదీ, ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ సహా దేశం..దేశం..వినేశ్ ఫొగట్‌కు అండగా నిలిచింది..మరోవైపు రెండు కేజీల బరువు తగ్గేందుకు ఆహారం తీసుకోకుండా మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు తీవ్ర వ్యాయామాలతో శ్రమించినా వినేశ్‌కు ఫలితం దక్కలేదు. పైగా అతి వ్యాయామంతో డీహైడ్రేషన్‌కు లోనైన వినేశ్ ఆసుపత్రిలో చేరాల్సి వచ్చింది..క్రీడా గ్రామంలోని పాలీ క్లినిక్‌లో చేరిన ఫొగట్‌ను భారత ఒలింపిక్ సంఘం చీఫ్ పీటీ ఉష కలిసి పరామర్శించింది..

వినేశ్ విలాపం

రెజ్లర్‌పై అనర్హత వేటు

పతకానికి దూరం

నిర్దేశిత బరువుకంటే 100 గ్రా. అదనం

రాత్రంతా తీవ్రంగా శ్రమించినా తగ్గని వైనం



ఆటలో భాగం

వినేశ్ వ్యాఖ్య

తన డిస్‌క్వాలిఫికేషన్‌పై వినేశ్ ఫొగట్ స్పందించింది. 'పతకాన్ని కోల్పోవడం దుర దృష్టకరం. అయితే ఇవన్నీ ఆటల్లో సహజం' అని తనను కలిసిన రెజ్లింగ్ జాతీయ కోచ్ వీరేందర్ దహియాతో వినేశ్ వ్యాఖ్యా నించింది. ఆసుపత్రిలో ఉన్న వినేశ్‌ను పలువురు ఐఓసీ అధికారులు కలిసి అనున యించారు.

కోర్టుకు వినేశ్.. నేడు తీర్పు?

తనపై వేసిన అనర్హత వేటును కొట్టివేయాలని క్రీడల మధ్యవర్తిత్వ న్యాయస్థానాన్ని (సీఏఎస్) వినేశ్ ఫొగట్ కోరింది. అంతేకాదు తనకు రజత పతకం ప్రకటించాలని కూడా విజ్ఞప్తి చేసింది. కాగా..తన తీర్పు ఇచ్చేందుకు న్యాయస్థానం గురువారం వరకు గడువు కోరినట్టు సమాచారం. న్యాయస్థానం కనుక వినేశ్‌కు అనుకూలంగా తీర్పు ఇస్తే..అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ వినేశ్‌కు సంయుక్తంగా రజత పతకం అందజేయాల్సి ఉంటుంది.

'వినేశ్‌పై అనర్హత వేటు నిరాశకలి గిస్తోంది. అయినా కోట్లాది మంది భారతీ యుల చాంపియన్ ఆమెనే'

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

పారిస్: రెజ్లర్ వినేశ్ ఫొగట్ పసిడి పతక పోరుకోసం భారతావని అంతా ఉత్కంఠగా ఎదురు చూస్తోంది. ఫైనల్లోనూ ఆమె అద్భుతంగా రాణించి స్వర్ణ పతకం గెలవాలని ప్రార్థించింది. కొద్ది గంటల్లో జరగబోయే మహిళల 50 కిలోల ఫైనల్ బౌట్‌కోసం ప్రజలంతా ఎదురుచూస్తున్న సమయంలో బుధవారం మధ్యాహ్నం పిడుగులాంటి వార్త వచ్చింది. నిర్ణీత బరువుకంటే వినేశ్ 100 గ్రాములు అదనంగా ఉందని, దాంతో నిబంధనల ప్రకారం నిర్వాహకులు ఆమెపై వేటు వేశార నేది ఆ వార్త. దరిమిలా దేశం మొత్తం షాక్‌కు లోనైంది. బంగారు పతకంతో సగర్వంగా తిరిగొస్తుందని ఆశించిన ప్రజలకు ఆమె రిక్తహస్తాలతో వెనక్కు వస్తోందన్న విషయాన్ని జీర్ణించుకోలేక పోతున్నారు.

ఎందుకిలా..

ప్రపంచ రెజ్లింగ్ పాలక మండలి..యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ (యూడబ్ల్యూడబ్ల్యూ) నిబంధనల ప్రకారం..పోటీకి ముందు ప్రతి రెజ్లర్ బరువును పరిశీలిస్తారు. దానిని 'వే ఇన్' అంటారు. పోటీ రోజు ఉదయం.. పాల్గొనే రెజ్లర్లందరికీ వైద్య పరీక్షలతోపాటు వే ఇన్ నిర్వహిస్తారు. ఈ వే ఇన్ సందర్భంగా ఒక్కో రెజ్లర్‌కు 30 నిమిషాల సమయం ఇస్తారు. ఆలోపు ఎన్నిసార్లయినా బరువును పరీక్షించుకోవచ్చు. రెండోరోజు మాత్రం..ఫైనల్స్‌కు, రెపిచేజ్ రౌండ్‌కు అర్హత సాధించిన రెజ్లర్లకే వే ఇన్ ఉంటుంది. రెండోరోజు వే ఇన్ గడువు 15 నిమిషాలు. మొదటిరోజు కానీ, రెండోరోజుకానీ రెజ్లర్ ఎవరైనా వే ఇన్‌కు హాజరుకాకపోతే వారిని పోటీనుంచి బహిష్కరిస్తారు. వారికి చివరి ర్యాంకింగ్ ఇస్తారు.

బరువు తగ్గేందుకు..

రెండు రోజులపాటు బరువును పరిశీలించనున్న నేపథ్యంలో నిర్దేశిత బరువును కొనసాగించడం రెజ్లర్లకు కత్తిమీదసామే. ఒకవేళ బరువు పెరిగినా దానిని తగ్గించడమూ వారికి సవాలే. బరువు తగ్గడంకోసం ఆహారం మానేస్తారు. నీరు ఎక్కువగా తీసుకోరు. జిమ్‌లలో తీవ్రంగా శ్రమిస్తారు. ఇంకా..ఆవిరి స్నానం చేయడం, జుత్తు కత్తిరించుకోవడం వంటి విధానాలనూ ఆచరిస్తారు. వాస్తవానికి..50 కిలోల విభాగం వినేశ్ రెగ్యులర్‌గా పోటీపడేది కాదు. ఆమెది 53 కేజీల కేటగిరీ. కానీ ఈ విభాగంలో ఒలింపిక్ బెర్త్‌ను అంతిమ్ పంగల్ దక్కించుకొంది. ఫలితంగా వినేశ్ ఫొగట్ 50 కిలోల విభాగానికి మారాల్సి వచ్చింది.



ఆసుపత్రిలో వినేశ్

డీహైడ్రేషన్ వల్ల వినేశ్ స్పృహ కోల్పోవడంతో బుధవారం నాడు హుటాహుటిన ఆసుపత్రిలో చేర్చారు. క్రీడా గ్రామంలోని పాలీ క్లినిక్‌లో ఆమెకు చికిత్స అందిస్తున్నారు. భారత బృందం డాక్టర్ పార్దీవాలా, వినేశ్ కోచ్, ఇతర సహాయ సిబ్బంది ఆమెతో ఉన్నారు. చికిత్స పొందుతున్న వినేశ్‌ను ఐఓఏ అధ్యక్షురాలు పీటీ ఉష కలిసి పరామర్శించింది. ఆమెను అనునయించడంతోపాటు ధైర్యం చెప్పింది.

ఉషకు ప్రధాని మోదీ సూచన

వినేశ్ డిస్‌క్వాలిఫై అయ్యిందని తెలియగానే... ఐఓఏ చీఫ్ పీటీ ఉషతో ప్రధాని మోదీ మాట్లాడారు. వినేశ్‌పై వేటుకు సంబంధించి ఐఓసీ ముందు రివ్యూకు అప్పీల్ చేయాలని సూచించారు. ఆమేరకు బలమైన వాదనలు వినిపించాలని కూడా ఉషను ప్రధాని ఆదేశించారు.

అందుకే బరువు పెరిగింది

పోటీల తర్వాత నిర్దేశిత బరువుకంటే వినేశ్ 2.7 కిలోలు అదనంగా బరువున్నట్టు గుర్తించాం. సాధారణంగా బరువును తగ్గించేందుకు చాలా సమయం పడుతుంది. కానీ మాకు 12 గంటల సమయమే మిగిలింది. వెంటనే కోచ్, సహాయ బృందం అన్ని చర్యలు తీసుకుంది' అని పారిస్‌లో భారత బృందం చీఫ్ మెడికల్ ఆఫీసర్ డా. దిన్షా పార్దీవాలా వివరించారు. 'రాత్రికి రాత్రి రెండు కేజీల బరువు తగ్గడం ఆషామాషీకాదు. బరువు తగ్గించే చర్యలు శక్తి కోల్పోయేలా చేస్తాయి. బౌట్లలో పాల్గొన్న తర్వాత బరువు ఒక్కసారిగా పెరిగే అవకాశాలుంటాయి' అని పార్దీవాలా తెలిపారు. 'వినేశ్ విషయంలో ఒక్కసారి బరువు తగ్గడం మరీ..మరీ..కష్టం. ఎందుకంటే ఆమె సహజ శరీర బరువు 56-57 కిలోలు' అని ఆయన గుర్తు చేశారు.

జుత్తు కత్తిరించుకున్నా..

మంగళవారం జరిగిన తొలి బౌట్‌లో ఒలింపిక్ చాంపియన్ యు యి సుసాకిపై సంచలన విజయం సాధించిన వినేశ్..ఆపై క్వార్టర్స్, సెమీస్‌లోనూ గెలుపొంది పసిడి పతక పోరులో అడుగుపెట్టింది. తొలిరోజు..అంటే మంగళవారం బౌట్లకు ముందు ఆమె 49.9 కిలోలు ఉందని సమాచారం. మూడు బౌట్లతో నీరసించిన ఆమె కొద్దిపాటి ఆహారం తీసుకుంది. సెమీస్ మ్యాచ్ పూర్తయ్యాక వినేశ్ 52.7 కిలోలు ఉందట. దాంతో సెమీఫైనల్ కాగానే వినేశ్ స్కిప్పింగ్ చేస్తున్న దృశ్యాలు ఎక్స్‌లో వైరల్ అయ్యాయి. అలాగే జాగింగ్, సైక్లింగ్, ఆవిరి స్నానం కూడా చేసింది. అంతే కాదు.. ఆహారం తీసుకోకుండా, మంచినీరు తాగకుండా మంగళవారం రాత్రంతా మేల్కొనే ఉంది. ఇంకా జుత్తు కూడా కత్తిరించుకుంది. శరీరంలో కొంత రక్తం కూడా తీయించుకున్నదట. అయితే ఇంతగా కష్టపడినా..బుధవారం ఉదయం వే ఇన్‌కు వెళ్లినప్పుడు ఆమె నిర్ణీత 50 కేజీలకంటే 100 గ్రాముల అదనంగా ఉంది. దరిమిలా వినేశ్‌పై అనర్హత వేటు పడింది.



గతంలో ఇలా జరిగిందా?

ఒలింపిక్స్ ఆసియా క్రీడలు, ఆసియా, వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో ఏ రెజ్లర్‌కైనా నిర్దేశిత బరువుకంటే ఒక్క గ్రాము కన్సెషన్ కూడా ఇవ్వరు. కానీ ర్యాంకింగ్, ఇన్విటేషనల్ ఈవెంట్లకు మాత్రం రెండు కేజీల వరకు మినహాయింపు ఉంటుంది. ఇక..2016 రియో ఒలింపిక్స్ క్వాలిఫయింగ్ ఈవెంట్ సందర్భంగా వినేశ్ 400 గ్రాములు అధికంగా ఉండడంతో అప్పుడూ ఆమెపై వేటు పడింది.

కుట్ర జరిగిందా?

వినేశ్‌పై వేటు వెనుక కుట్ర కోణం ఉందనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) మాజీ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ సింగ్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలు చేస్తూ..అతడిని బహిష్కరించాలనే డిమాండ్‌తో దేశ రెజ్లర్లంతా ఏడాదికిపైగా ఆందోళన నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ ఉద్యమానికి వినేశ్‌తోపాటు ఇతర స్టార్ రెజ్లర్లు బజ్‌రంగ్ పూనియా, సాక్షి మాలిక్ నేతృత్వం వహించారు. తీవ్ర స్థాయికి చేరిన ఆ ఉద్యమం పార్లమెంట్ ముట్టడికి దారి తీయడం..ఆ క్రమంలో వినేశ్ సహా ఇతర రెజ్లర్లను పోలీసులు అరెస్ట్ చేశారు. మరోవైపు భారత రెజ్లింగ్ సమాఖ్యపై యూడబ్ల్యూడబ్ల్యూ వేటు వేసింది. రెజ్లర్ల ఆందోళన ఫలితంగా డబ్ల్యూఎఫ్ఐకి బ్రిజ్‌భూషణ్ రాజీనామా చేయక తప్పలేదు. అలాగే..బ్రిజ్‌భూషణ్ తదితరులపై కేసులు నమోదై కోర్టు విచారణ వరకు వెళ్లింది. కాగా..డబ్ల్యూఎఫ్ఐకి జరిగిన ఎన్నికల్లో బ్రిజ్‌భూషణ్ ప్రధాన అనుయాయి సంజయ్ సింగ్ అధ్యక్షుడిగా ఎన్నికవడం గమనార్హం. సంజయ్ సింగ్ ఎన్నికపై స్టార్ రెజ్లర్లంతా ఇప్పటికీ అసంతృప్తిగానే ఉన్నారంటారు. మొత్తంగా రెజ్లర్ల ఆందోళన దేశ క్రీడా రంగంలో ప్రకంపనలు సృష్టించింది. నాటి ఆందోళనతో రెజ్లింగ్ సమాఖ్య అప్పటి పెద్దలు, ప్రస్తుతం ఉన్నత స్థాయిలో ఉన్న వ్యక్తులు ఇప్పటికీ తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్టు చెబుతున్నారు. ఈనేపథ్యంలో..కీలకమైన ఒలింపిక్స్ 50 కి. ఫైనల్ బౌట్‌కు ముందు వినేశ్ ఫొగట్‌పై వేటు పడడం చర్చకు దారి తీసింది. నాటి ఆందోళనను జీర్ణించుకోలేని సమాఖ్య పెద్దలు కొందరు..ఫొగట్ డిస్‌క్వాలిఫికేషన్ వెనుక ఉన్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధిక క్యాలరీలు ఉన్న ఆహారాన్ని సహాయ సిబ్బందితో వినేశ్‌కు ఇవ్వడం ద్వారా ఆమె బరువు పెరిగేలా కుట్ర పన్నారని వారు ఆరోపిస్తున్నారు. దిగ్గజ బాక్సర్ విజేందర్ సింగ్ కూడా కుట్రకోణం ఉందనడాన్ని వారు ప్రస్తావిస్తున్నారు. 'మన రెజ్లర్లపై ఇది పెద్ద కుట్ర. 100 గ్రాముల బరువు తగ్గేందుకు వినేశ్‌కు మరింత సమయం ఇవ్వాల్సింది. గతం లో ఏ అథ్లెట్‌కు ఇలాంటిది జరగలేదు' అని విజేందర్ ఎక్స్‌లో వ్యాఖ్యానించాడు. ఏమైనా..వినేశ్ ఫొగట్‌పై వేట దేశ క్రీడా రంగంలో మరోసారి ప్రకంపనలు సృష్టిస్తోంది.

అలాంటిదేమీ లేదు: వినేశ్ డిస్‌క్వాలిఫై అంశంలో కుట్రలేదని భారత అథ్లెటిక్ సమాఖ్య (ఏఎఫ్ఐ) స్పష్టంజేసింది. ఈమేరకు వస్తున్న వార్తలను తోసిపుచ్చింది. అది సాంకేతిక అంశమని, దానిని రాజకీయం చేయొద్దని సమాఖ్య అధ్యక్షుడు సుమరివాలా కోరారు.

గాయంతో వైదొలగితే పతకం వచ్చేదా?

గాయం కారణం చూపుతూ ఫైనల్ బౌట్‌నుంచి వినేశ్ వైదొలిగితే కనీసం రజత పతకం లభించేదన్న వాదన వినిపిస్తోంది. యూడబ్ల్యూడబ్ల్యూ నిబంధనలు అందుకు అంగీక రించవు. మొదటి రోజు పోటీ సమయంలో రెజ్లర్ గాయపడితే రెండోరోజు వే ఇన్‌కు హాజరు కానవసరంలేదు. అయితే తొలిరోజు పోటీ అనంతరం రెజ్లర్ గాయపడినా లేదా అనారోగ్యంతో వాకోవర్ ఇవ్వడానికి ముందు కూడా వే ఇన్‌కు రావాల్సిందే. ఇక వినేశ్ మొదటిరోజు పోటీ సందర్భంగా గాయపడలేదు. అందువల్ల ఆమె రెండో రోజు వే ఇన్‌కు తప్పక హాజరు కావాల్సిందే.

విచారణ జరగాలి: డబ్ల్యూఎఫ్ఐ

వినేశ్ అనర్హతకు గురవడంలో ఆమె కోచ్, సహాయ సిబ్బందిదే పూర్తి బాధ్యత అని భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) అధ్యక్షుడు సంజయ్ సింగ్ అన్నాడు. ఈ విషయంలో పూర్తిగా విచారణ జరిపించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన కోరాడు. 'వినేశ్ అదనపు బరువు విషయమై బుధవారం ఉదయం ఫోన్ వచ్చింది. ఆమెకు కొంత సమయం, సడలింపు ఇవ్వాలని అధికారులను అభ్యర్థించినా ఫలితం లేకపోయింది. ఈ విషయంలో వినేశ్ తప్పు ఉందని నేను అనుకోవడం లేదు. మొత్తం బాధ్యతంతా ఆమె కోచ్, సహాయక సిబ్బందిపై ఉంది. ఆమె బరువు ఎలా పెరిగిందనే దానిపై విచారణ జరగాలని ప్రభుత్వాన్ని కోరుతున్నా' అని సంజయ్ వ్యాఖ్యానించాడు.

ఆశలన్నీ చోప్రాపైనే!

నేడే జావెలిన్ త్రో ఫైనల్ రాత్రి 11.55 నుంచి



పారిస్: సెమీస్‌లో హాకీ జట్టు ఓటమి.. వినేశ్ ఫొగట్‌పై అనర్హత వేటుతో.. కోట్లాది మంది భారతీయులు ఆశగా ఎదురుచూస్తున్నది ఒక్కడివైపు.. అతడే బల్లెం వీరుడు నీరజ్ చోప్రా. గురువారం మధ్య రాత్రి జరిగే జావెలిన్ త్రో ఫైనల్లో చోప్రా ఫేవరెట్లలో ఒకడిగా బరిలోకి దిగనున్నాడు. జావెలిన్ త్రో డిఫెండింగ్ చాంప్‌గా పోటీల్లోకి అడుగుపెట్టిన చోప్రా.. క్వాలిఫయర్స్‌లో ఒకే ఒక్క త్రో నేరుగా ఫైనల్‌కు చేరి సత్తాచాటాడు. 84 మీటర్లు ఆటోమేటిక్ క్వాలిఫికేషన్ మార్క్‌గా నిర్ణయించగా.. నీరజ్ తొలి త్రోలోనే 89.34 మీటర్లు విసిరాడు. ఫైనల్ చేరుకొన్న 12 మందిలో చోప్రాదే టాప్ త్రో. అయితే, పతక పోరులో జాకబ్ వాద్లెజ్ (చెక్), అండర్సన్ పీటర్స్ (గ్రెనెడా), జూలియన్ వెబర్ (జర్మనీ), అర్షద్ నదీమ్ (పాక్) నుంచి నీరజ్‌కు గట్టిపోటీ ఎదురయ్యే అవకాశం ఉంది. గత క్రీడల్లో స్వర్ణం గెలిచిన చోప్రా.. ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో దేశానికి తొలి స్వర్ణం అందించాడు. ఆ తర్వాత డైమండ్ లీగ్ చాంప్‌గా నిలిచి.. నిలకడైన ప్రదర్శనతో ఆకట్టుకొన్నాడు. మరోసారి అతడు దేశానికి పసిడి అందించగలడనే అంచనాలు భారీగా ఉన్నాయి. ఇదే జరిగితే ఒలింపిక్స్ చరిత్రలో జావెలిన్ త్రో టైటిల్ నిలబెట్టుకొన్న ఐదో ఆటగాడిగా.. రెండు ఒలింపిక్ స్వర్ణాలు సాధించిన తొలి భారత అథ్లెట్‌గా నీరజ్ సరికొత్త అధ్యాయాన్ని లిఖించనున్నాడు.

రెపిచేజ్‌లో జ్యోతి



మహిళల 100 మీ. హర్డిల్స్‌లో తెలుగమ్మాయి జ్యోతి యర్రాజి నేరుగా సెమీస్‌కు అర్హత సాధించడంలో విఫలమైంది. అయితే, రెపిచేజ్ రూపంలో ఆమెకు మరో అవకాశం లభించనుంది. క్వాలిఫికేషన్ రౌండ్-1 హీట్-4లో జ్యోతి 13.16 సెకన్ల టైమింగ్‌తో ఏడో స్థానంలో నిలిచింది. గురువారం రెపిచేజ్ రౌండ్ జరగనుంది. ఈ ఈవెంట్‌లో ఒలింపిక్స్‌కు అర్హత సాధించిన తొలి భారత్ అథ్లెట్ జ్యోతి.

క్వార్టర్స్‌లో ఓడిన భారత్: టేబుల్ టెన్నిస్‌లో భారత పోరాటం ముగిసింది. మహిళల టీమ్ ఈవెంట్ క్వార్టర్స్‌లో భారత్ 1-3తో జర్మనీ చేతిలో ఓడింది. డబుల్స్‌లో శ్రీజ-అర్చన జోడీ, సింగిల్స్ మ్యాచ్‌ల్లో శ్రీజ, మనికా బాత్రా ఓడగా.. అర్చనా కామత్ మాత్రమే నెగ్గింది.

అంతిమ్ అవుట్..: కచ్చితంగా పతకం తెస్తుందనే భారీ అంచనాలున్న అంతిమ్ పంగల్ రౌండ్-16లోనే నాకౌటైంది. 53 కిలోల విభాగంలో అంతిమ్ 0-10తో యట్గిల్ జెనెప్ (టర్కీ) చేతిలో మట్టికరిచింది. జెనెప్ క్వార్టర్స్‌లో ఓడడంతో పంగల్‌కు రెపిచేజ్ కూడా ఆడే అవకాశం లేకుండా పోయింది. వరల్డ్ చాంపియన్‌షిప్స్ కాంస్య పతక విజేత అయిన అంతిమ్.. రెజ్లింగ్‌లో భారత్‌కు తొలి ఒలింపిక్ బెర్త్ అందించింది.

అన్నూ రాణి విఫలం: మహిళల జావెలిన్ త్రోలో అన్నూ రాణి ఫైనల్‌కు అర్హత సాధించలేక పోయింది. గ్రూప్-ఎలో మూడు ప్రయత్నాల్లో అన్నూ 55.81 మీ., 53.22 మీ., 53.55 మీటర్ల దూరం మాత్రమే విసిరి 15వ స్థానంలో నిలిచింది. ఆటోమేటిక్ క్వాలిఫికేషన్ మార్క్ 62 మీటర్లు కాగా.. టాప్-12లో నిలిచేలా అన్నూ రాణి అత్యుత్తమ త్రో కూడా చేయలేక పోయింది. హైజంప్‌లో సర్వేష్ కుశాలె కూడా ఫైనల్ చేరడంలో విఫలమయ్యాడు. క్వాలిఫికేషన్ మార్క్ 2.29 మీటర్లు కాగా.. గ్రూప్-బిలో సర్వేష్ 2.15 మీటర్ల ఎత్తు మాత్రమే దూకాడు. మూడు ప్రయత్నాల్లోనూ 2.20 మీటర్ల ఎత్తును లంఘించలేక పోయాడు. దీంతో గ్రూప్-బిలో 13వ స్థానంలో నిలిచాడు. మారథాన్ రేస్ వాక్ మిక్స్‌డ్ రిలేలో సూరజ్ పన్వర్-ప్రియాంక గోస్వామి జోడీ రేస్‌ను ముగించలేక పోయింది. ఫైనల్ లెగ్‌లో గోస్వామి తప్పుకొంది.

పతకాల పట్టిక

దేశం	స్వ	ర	కా	మొ
అమెరికా	25	33	32	90
చైనా	24	22	16	62
ఆస్ట్రేలియా	17	12	10	39
ఫ్రాన్స్	13	16	20	49
బ్రిటన్	12	16	20	48
భారత్	0	0	3	3

గమనిక: స్వ=స్వర్ణం, ర=రజతం, కా=కాంస్యం, మొ=మొత్తం.

మోగించాలి.. కంచు మోత

స్పెయిన్‌తో భారత్ కాంస్య పతక పోరు నేడు

సా. 5.30 నుంచి



సెమీస్‌లో ఓడిన భారత హాకీ జట్టు కనీసం పోడియం ఫినిష్ చేయాలని అభిమానులు కోరుకొంటున్నారు. గురువారం జరిగే కాంస్య పోరులో స్పెయిన్‌తో భారత్ తలపడనుంది. టోక్యోలో కంచు పతకం నెగ్గిన టీమిండియా ఈ మ్యాచ్‌లో ఫేవరెట్‌గా కనిపిస్తోంది. ఇటీవలి కాలంలో స్పెయిన్‌తో ఆడిన ఐదు మ్యాచ్‌ల్లో భారత్ నాలుగింటిలో గెలిచింది. కాగా, జర్మనీతో సెమీస్ పోరులో భారత జట్టు దీటుగా పోరాడినా.. పెనాల్టీ కార్నర్లను గోల్స్‌గా మలచడంలో వైఫల్యం దెబ్బకొట్టింది. డ్రాగ్‌ఫ్లికర్ హర్మన్‌ప్రీత్ సింగ్ ఆటలో సృజనాత్మకత లోపించిందనే విమర్శలు కూడా ఉన్నాయి. మరోవైపు డిఫెండర్ల ఏమరపాటు కారణంగా భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది. ఈ మ్యాచ్‌లోనైనా సత్తాకు తగ్గట్టుగా ఆడినా కనీసం కాంస్యంతో సగర్వంగా వెనుదిరుగుతారు. మరోవైపు నెదర్లాండ్స్ చేతిలో ఓడిన స్పెయిన్ కూడా మెరుగైన ఆటనే ప్రదర్శిస్తోంది. క్వార్టర్స్‌లో డిఫెండింగ్ చాంప్ బెల్జియంను నాకౌట్ చేసింది. ఈ నేపథ్యంలో ప్రత్యర్థిని భారత్ ఏమాత్రం తేలిగ్గా తీసుకోకూడదు.

పారిస్‌లో నేటి భారతం



గోల్ఫ్: మహిళల వ్యక్తిగత రెండో రౌండ్ - అదితి అశోక్, దీక్షా డాగర్ (మ. 12.30).

అథ్లెటిక్స్: మహిళల 100 మీటర్ల హర్డిల్స్ రెపిచేజ్ రౌండ్ - జ్యోతి యర్రాజి (మ. 2.05), పురుషుల జావెలిన్ త్రో ఫైనల్ - నీరజ్ చోప్రా (రా. 11.55).

రెజ్లింగ్: పురుషుల 57 కిలోల ఫ్రీస్టయిల్ 1/8 ఫైనల్స్ - అమన్ షెహ్రావత్ (మ. 2.30), మహిళల 57 కిలోల ఫ్రీస్టయిల్ 1/8 ఫైనల్స్ - అన్షూ మాలిక్ (మ. 2.30).

హాకీ: పురుషుల కాంస్య పతక పోరు భారత్ X స్పెయిన్ (సా. 5.30)

ఇతర పతకాంశాలు

మహిళల లాంగ్ జంప్ ఫైనల్- రాత్రి: 11.30 గం.
పురుషుల 200 మీటర్ల ఫైనల్- రాత్రి 12.00 గం.
మహిళల 400 మీటర్ల హర్డిల్స్ ఫైనల్-రాత్రి 12.55 గం.
పురుషుల 110మీటర్ల హర్డిల్స్ ఫైనల్-రాత్రి 1.15 గం.
పురుషుల హాకీ స్వర్ణ పతక పోరు- రాత్రి 10.30
మహిళల ఫుట్‌బాల్ కాంస్య పతక పోరు- రాత్రి 8.30.

లంక..27 ఏళ్ల తర్వాత

భారత్‌పై సిరీస్ విజయం

మూడో వన్డేలో గెలుపు



కొలంబో: టీమిండియాపై లంకేయులు 27 ఏళ్ల తర్వాత ద్వైపాక్షిక సిరీస్ నెగ్గి.. జూలు విదిల్చారు. తొలి వన్డే టైగా ముగియగా మిగిలిన రెండు వన్డేల్లో విజయ ఢంకా మోగించిన శ్రీలంక 2-0తో సిరీస్‌ను కైవసం చేసుకుంది. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా బుధవారం జరిగిన ఆఖరి మ్యాచ్‌లో టీమిండియా 110 పరుగుల తేడాతో చిత్తుగా ఓడింది. టాస్ గెలిచి, తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఆతిథ్య జట్టు 50 ఓవర్లలో 7 వికెట్లకు 248 పరుగులు చేసింది. ఓపెనర్లు అవిష్క ఫెర్నాండో (96), పతుం నిస్సంక (45), వికెట్‌కీపర్ కుశాల్ మెండిస్ (59) రాణించారు. భారత బౌలర్లలో రియాన్ పరాగ్ (3/54)కు మూడు, కుల్దీప్, వాషింగ్టన్, అక్షర్, సిరాజ్‌లకు తలో వికెట్ లభించాయి. ఆఫ్‌స్పిన్నర్ దునిత్ వెల్లలగే విజృంభించడంతో (5/27) ఛేదనలో టీమిండియా 26.1 ఓవర్లలో 138 పరుగులకు ఆలౌటై ఓటమి పాలైంది. కెప్టెన్ రోహిత్ శర్మ (35), టెయిలెండర్లలో వాషింగ్టన్ సుందర్ (30) మినహా మరే ఆటగాడు 30 పరుగులు కూడా చేయకపోవడం గమనార్హం. త్రుటిలో సెంచరీ కోల్పోయిన ఓపెనర్ అవిష్క ఫెర్నాండోకు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు, సిరీస్‌లో 7 వికెట్లు, 108 పరుగులు సాధించిన దునిత్‌కు మ్యాన్ ఆఫ్ ద సిరీస్ అవార్డు లభించాయి. ఇక, ఈ సిరీస్‌లో స్పిన్నర్ల చేతిలో భారత్ 27 వికెట్లు కోల్పోవడం, టీమిండియా బ్యాటింగ్ లైనప్ బలహీనతలను బయటపెట్టింది. ఇప్పటివరకు ఏ ద్వైపాక్షిక సిరీస్‌లోనూ (3 వన్డేలు) స్పిన్నర్లకు భారత్ ఇన్ని వికెట్లు కోల్పోలేదు.

కల్టివేటర్ నాగళ్ల కింద పడి ఏడేళ్ల బాలుడి మృతి

» తండ్రి పొలం దున్నుతుండగా ఘటన

శంషాబాద్ రూరల్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): నాన్న ట్రాక్టర్‌తో పొలం దున్నుతుంటే సరదాగా కల్టివేటర్‌పైన కూర్చొన్న కుమారుడు ప్రమాదవశాత్తు ఆ నాగళ్ల కింద పడి ప్రాణాలు కోల్పోయాడు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం జరిగిన ఈ ఘటనలో ఆశిక్ వర్మ(7) అనే ఏడేళ్ల బాలుడు మరణించాడు. పోలీసుల కథనం ప్రకారం.. శంషాబాద్ మండల పరిధి మదన్‌పల్లి పాత తండాలోని వ్యవసాయ క్షేత్రంలో సంతోష్ వర్మ అనే వ్యక్తి కుటుంబసభ్యులతో కలిసి పని చేస్తున్నాడు. అయితే, వెంకట్‌నాయక్ అనే వ్యక్తి పొలాన్ని ట్రాక్టర్‌తో దున్నేందుకు సంతోష్ వర్మ బుధవారం వెళ్లాడు. సంతోష్ వర్మ ట్రాక్టర్ నడుపుతుండగా దానికి ఉన్న కల్టివేటర్ నాగళ్లపై అతని కుమారుడు ఆశిక్ వర్మ కూర్చున్నాడు. ఈ క్రమంలో నాగళ్ల కింద పడిన ఆశిక్ తీవ్రంగా గాయపడ్డాడు. ఘటనా స్థలి నుంచి ఆస్పత్రికి తరలిస్తుండగా ఆశిక్ మరణించాడు.

రైతుల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం: పొంగులేటి

» పాలేరు జలాశయం నుంచి ఎడమ కాల్వకు సాగర్ జలాల విడుదల


పాలేరు జలాశయం నుంచి నీటిని విడుదల చేస్తున్న మంత్రి పొంగులేటి

కూసుమంచి, ఆగస్టు 7: రైతుల అభివృద్ధే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌తో కలిసి బుధవారం మంత్రి పాలేరు జలాశయం నుంచి నాగార్జున సాగర్ రెండోజోన్ ఆయకట్టుకు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి కృష్ణమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి సారె, చీర సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ, తమ ప్రభుత్వానికి ప్రజాదీవెనలతో పాటు దేవుళ్ల దీవెనలు ఉన్నాయని, అందువల్లే ప్రాజెక్టుల్లోకి సమృద్ధిగా నీరు చేరిందని అన్నారు. సాగర్ జలాల ద్వారా రాష్ట్రంలో 2.55 లక్షలు ఎకరాలు, ఏపీలో 1.25 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. గత సీజన్‌లో సరిపడా నీరులేకపోవడంతో ఒక్కపంటకే నీరందిందని అన్నారు. కృష్ణా పరివాహక ప్రాంతాల్లో నీటి కొరత ఏర్పడిన పక్షంలో సీతారామ ప్రాజెక్టు ద్వారా నీరందించేందుకు వీలైనంత త్వరగా ఆ ప్రాజెక్టును పూర్తిచేస్తామని చెప్పారు. 15 తేదీన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా సీతారామ ప్రాజెక్టు ప్రారంభించబోతున్నట్లు మంత్రి పొంగులేటి తెలిపారు.

భూ తగాదా.. సెల్ఫీవీడియో తీసుకుని రైతు ఆత్మహత్యాయత్నం

» ఖమ్మంలో చికిత్స పొందుతూ మృతి



ఖమ్మం రూరల్, ఆగస్టు 7: కొందరు తన భూమిని ఆక్రమించుకుని ఇబ్బందులకు గురిచేస్తున్నారనే మనస్తాపంతో సెల్ఫీ వీడియో తీసుకుంటూ నాలుగు రోజుల క్రితం పురుగుల మందు తాగిన రైతు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఖమ్మం జిల్లా జాన్‌బాద్‌తండాకు చెందిన ఏలేటి వెంకటరెడ్డి (50)కి గ్రామంలో కొంత భూమి ఉంది. అందులో 26 కుంటల భూమిని అదే గ్రామానికి చెందిన జాటోత్ వీరన్న ఆక్రమించుకుని దున్నుకుంటున్నాడని రైతు వెంకటరెడ్డి ఈ నెల 4వ తేదీన ఆ భూమి వద్దకు వెళ్లి సెల్ఫీ వీడియో తీసుకుంటూ పురుగుల మందు తాగాడు. వెంటనే కుటుంబసభ్యులు అతడిని ఖమ్మం ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. ఆత్మహత్యకు ముందు సెల్ఫీ వీడియో తీసుకున్న రైతు వెంకటరెడ్డి పలువురిపై ఆరోపణలు చేశాడు. గ్రామానికి చెందిన సురేశ్, దేవిక, చిన్ని, ఉపేందర్, మాజీ ఎంపీటీసీ కళింగరెడ్డి, కొందరు పోలీసుల ప్రోద్బలంతోనే జాటోత్ వీరన్న తమ భూమిని ఆక్రమించుకొని సాగు చేసుకోకుండా అడ్డుపడుతున్నాడని ఆరోపించాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా, వెంకట్‌రెడ్డి తమ్ముడు భూపాల్‌రెడ్డి కూడా వీరన్న మూలంగానే ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు.

తెలంగాణలో లంబాడీలకు మంత్రి పదవివ్వండి

» రాహుల్‌గాంధీకి గిరిజన శక్తి వినతి

న్యూఢిల్లీ, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): తెలంగాణ మంత్రివర్గంలో లంబాడీలకు చోటివ్వాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని గిరిజన శక్తి నేతలు కోరారు. బుధవారం పార్లమెంట్ ఆవరణలో రాహుల్‌కు గిరిజన శక్తి జాతీయ, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ వెంకటేష్ చౌహాన్, శరత్ నాయక్‌లు వినతి పత్రం సమర్పించారు. లంబాడీల ఆరాధ్య దైవం సంత్ శ్రీసేవలాల్ మహారాజ్ జయంతిని జాతీయ దినంగా ప్రకటించాలన్న వినతితో తమ ఇతర డిమాండ్లను అందులో తెలిపారు. అలాగే తెలంగాణలో లంబాడీలకు ఎమ్మెల్సీలు, నామినేటెడ్ పోస్టులు, పార్టీ పదవులు ఇవ్వాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో గిరిజన శక్తి రాష్ట్ర చీఫ్ కోఆర్డినేటర్ రమేష్ రాథోడ్, రాష్ట్ర నాయకులు నరేందర్, రాంచందర్, వినోద్, జాయింట్ సెక్రటరీ శివ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

జనగణనలో కులగణన చేపట్టాలి

» కులగణనతోనే బీసీలకు న్యాయం: ఆర్ కృష్ణయ్య

» కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటుకు డిమాండ్

» తెలంగాణ భవన్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన

» ఎంపీ మల్లు రవి, వీ హనుమంతరావు మద్దతు

న్యూఢిల్లీ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): దేశంలో 70 కోట్ల జనాభా ఉన్న బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ లేకపోడం బాధాకరమని, 30 ఏళ్లుగా పోరాడుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆర్. కృష్ణయ్య ఆవేదన వ్యక్తం చేశారు. జనగణనలో కులగణన చేపట్టాలని, పార్లమెంటులో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలని, బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ సంఘాల నేతృత్వంలో ఢిల్లీలో వారంరోజుల నుంచి కార్యక్రమాలు చేపడుతున్నారు. బుధవారం తెలంగాణ భవన్‌లో ఆర్ కృష్ణయ్య, కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ వీ హనుమంతరావు మీడియాతో మాట్లాడారు. ఏపీ, తెలంగాణల్లో తక్షణమే కులగణన చేపట్టాలని ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. కులగణన చేయకపోవడం వల్లనే బీసీలు తీవ్రంగా నష్టపోతున్నారని కాంగ్రెస్ సీనియర్ నేత వీ.హనుమంతరావు అన్నారు. బీసీలందరూ ఏకం కావాలని, కృష్ణయ్యతో కలిసి పోరాడాలని పిలుపునిచ్చారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి హాజరై, మద్దతు తెలిపారు.


4చోట్ల సుప్రీంకోర్టు బెంచ్‌లు ఏర్పాటు చేయాలి

» మాజీ ఎంపీ వినోద్ కుమార్

హైదరాబాద్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): దేశంలో నాలుగు చోట్ల సుప్రీంకోర్టు బెంచ్‌లను ఏర్పాటు చేయాలన్న డిమాండ్ చాలాకాలంగా ఉందని, అందుకు అనుగుణంగా చర్యలు చేపట్టాలని మాజీ ఎంపీ వినోద్‌కుమార్ కోరారు. బెంచ్‌లు విస్తరిస్తే దేశ సమగ్రతకు భంగం కలుగుతుందని కొందరు ఉద్దేశపూర్వకంగా ప్రచారం చేస్తున్నారని, అది ఏమాత్రం నిజం కాదని ఆయన అన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 130 ప్రకారం బెంచ్‌లు ఏర్పాటు చేసే అధికారం సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తికే ఉందన్నారు. ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, చెన్నై లేదా హైదరాబాద్‌లో సుప్రీంకోర్టు బెంచ్‌లు పెట్టాలని లాకమిషన్, పార్లమెంటు స్టాండింగ్ కమిటీ కూడా సూచించాయని వినోద్ తెలిపారు. కేసుల సత్వర పరిష్కారాన్ని దృష్టిలో ఉంచుకొని సుప్రీం బెంచ్‌ల ఏర్పాటుకు, జడ్జిల సంఖ్య పెంచేందుకు చొరవ చూపాలని వినోద్‌కుమార్ కోరారు. కాగా, ఇందిరమ్మ రాజ్యంలో రేవంత్ కుటుంబ పాలన నడుస్తోందని, సీఎం సోదరులు రాజ్యాంగేతర శక్తులుగా వ్యవహరిస్తున్నారని బీఆర్ఎస్ నేతలు బాల్కసుమన్, ఆంజనేయగౌడ్, గెల్లు శ్రీనివాస్ యాదవ్ ఆరోపించారు. రేవంత్ సోదరుడు తిరుపతిరెడ్డి ఏ హోదా లేకున్నా అసెంబ్లీ కమిటీ హాల్లో స్పీకర్ దగ్గర జరిపిన సమీక్షా సమావేశంలో పాల్గొన్నారని తెలిపారు. సీఎం మరో సోదరుడు కొండల్‌రెడ్డికి ఏ హోదా ఉందని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, ప్రభుత్వ అధికారులతో కలిసి ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లారని ప్రశ్నించారు.

గాంధీ, ఉస్మానియా ఆస్పత్రుల్లో 235 వైద్య పోస్టుల భర్తీ

» రేపు వాకిన్ ఇంటర్వ్యూల నిర్వహణ



హైదరాబాద్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): గాంధీ, ఉస్మానియా ఆసుపత్రుల్లో ఖాళీగా ఉన్నా ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను కాంట్రాక్ట్ ప్రాతిపాదికన భర్తీ చేయనున్నారు. ఈమేరకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. మొత్తం 235 మంది వైద్యుల పోస్టులను ఈ నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయనున్నారు. ఉస్మానియా వైద్య కళాశాలలో ప్రొఫెసర్ పోస్టులు-8, అసోసియేట్ ప్రొఫెసర్-23, అసిస్టెంట్ ప్రొఫెసర్లు-111, సీనియర్ రెసిడెంట్ డాక్టర్లు-33 ఉన్నాయి. గాంధీలో ప్రొఫెసర్ పోస్టులు-3, అసిస్టెంట్ ప్రొఫెసర్లు-29, సీనియర్ రెసిడెంట్స్-24, ట్యూటర్లు-4 పోస్టులున్నాయి. ఈ పోస్టులను వాకిన్ ఇంటర్వ్యూ పద్ధతిలో భర్తీ చేయనున్నారు. ఈమేరకు 9న ఈ ఇంటర్వ్యూలను నిర్వహిస్తారు. 12న ధ్రువపత్రాల పరిశీలన, 13న అభ్యంతరాల స్వీకరణ, 14న ఎంపిక ప్రక్రియ ఉంటుందని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఇంటర్వ్యూలను గాంధీ మెడికల్ కాలేజీలో వైద్యవిద్య సంచాలకులు డాక్టర్ వాణి, ఉస్మానియా మెడికల్ కాలేజీలో తెలంగాణ వైద్యవిధాన పరిషత్ కమిషనర్ సమక్షంలో నిర్వహించనున్నారు. ఈ నియామకాలను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని మంత్రి దామోదర రాజనర్సింహా అధికారులను ఆదేశించారు. నియామకాలు పారదర్శకంగా జరిగేలా హైదరాబాద్ జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్, డీఎంఈ, టీవీవీపీ కమిషనర్‌లను నోడల్ అధికారులుగా నియమిస్తూ సర్కారు జీవో జారీ చేసింది.

ఆ ఆస్పత్రుల్లో వైద్యులు పెరిగారు

కాగా వైద్య ఆరోగ్యశాఖలో ఇటీవల చేపట్టిన సాధారణ బదిలీలతో ఉస్మానియా, గాంధీ ఆస్పత్రుల్లో వైద్యుల కొరత నెలకొందన్న వార్తల నేపథ్యంలో వైద్య ఆరోగ్యశాఖ దానిపై స్పష్టతనిచ్చింది. దీర్ఘకాలం ఒకే చోట ఉన్న వారిలో 40 శాతం మందిని బదిలీ చేయాలని జీవో 80 చెబుతోందని, ఆ మేరకే బదిలీలు చేపట్టామని ఉన్నతాధికారులు చెబుతున్నారు. బదిలీలతో గాంధీ, ఉస్మానియా ఆస్పత్రుల్లో రోగులకు అందుతున్న వైద్యసేవలపై ప్రభావం లేదని, ఆ రెండింట్లో గతం కంటే వైద్యులు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది ఉన్నారన్నారు. ఉస్మానియాలో గతేడాది 169 మంది డాక్టర్లు, 247 మంది నర్సులుంటే.. ప్రస్తుతం 266 మంది వైద్యులు, 263 నర్సులున్నారని వైద్య ఆరోగ్య శాఖ తెలిపింది. ఇక గాంధీలో ఇంతకు ముందు 295 మంది డాక్టర్లు, 191 మంది నర్సులుండగా...ప్రస్తుతం 362 మంది వైద్యులు, 287 మంది నర్సులున్నారని వెల్లడించింది.

భూముల సర్వేకు డ్రోన్లు

ప్రత్యేక యాప్‌తో అనుసంధానం.. జియో ట్యాగింగ్‌తో ఫొటోలు

» గంటలో 100 ఎకరాల దాకా కొలతలు

» ఐఐటీ హైదరాబాద్ పరిశోధకుల రూపకల్పన

» దేశంలో తొలి సర్వే డ్రోన్‌గా గుర్తించిన కేంద్ర సర్కారు


గాల్లో ఎగురుతూ ఫొటోలు తీస్తున్న డ్రోన్

కంది, ఆగస్టు 7: భూములను గొలుసులతో కొలవడం సంప్రదాయ పద్ధతి! దీనికి మనుషులు ఎక్కువే అవసరం. సమయమూ బాగానే పడుతుంది. ఎకరం-రెండకాలను కొలిచేందుకు గంటకుపైగా పడుతుంది. డిజిటల్ యంత్రాలు వచ్చేశాయ్.. కాబట్టి మనుషులు తక్కువ అవసరం.. సమయమూ కొంత తగ్గింది! మరి.. ఒకే ఒక గంటలో 100 ఎకరాల భూమిని సర్వే చేయగలిగేలా వ్యవస్థ ఏదైనా అందుబాటులోకొస్తే? అద్భుతమే కదా! ఆ వ్యవస్థ వచ్చేసింది. అదే.. డ్రోన్లద్వారా భూ సర్వే పద్ధతి! సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీ హైదరాబాద్ ఏరోనాటికల్ ఇంజనీరింగ్ పరిశోధకులు భూములను సర్వే చేసేందుకు ప్రత్యేక డ్రోన్లను రూపొందించారు. ఈ డ్రోన్లను మార్కెట్లోకి ప్రవేశపెట్టడానికి ఐఐటీ-హెచ్‌లోని ఇంక్యూబేషన్ విభాగం అధికారులు క్రిస్టల్‌బాల్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెంట్ ప్రైవేట్ లిమిటెడ్‌తో భాగస్వామ్యంతో స్టార్టప్ కంపెనీ ప్రారంభించారు. ఈ డ్రోన్‌లను డీజీసీఏ (డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్) అంగీకరించింది. భూముల సర్వేలో దీని పనితీరు పరిశీలించిన కేంద్ర ప్రభుత్వం ఈ డ్రోన్లను సర్వే డ్రోన్లుగా గుర్తించింది. ఫలితంగా దేశంలోనే తొలి సర్వే డ్రోన్‌గా గుర్తింపు పొందింది. మోడల్-వీ పేరుతో తయారుచేసిన ఈ డ్రోన్లు సెకండ్‌కు 8 మీటర్లు ఎత్తుకు ఎగురుతాయి. ఒకసారి చార్జింగ్ చేస్తే 50 నిమిషాల పాటు గాలిలోనే ఎగరగల సామర్థ్యంతో వీటిని తయారు చేశారు. భూ సర్వేపై రూపొందించిన ఓ ప్రత్యేక యాప్‌ను అనుసంధానం చేస్తే గాల్లోకి ఎగిరి జియో టాగింగ్‌తో ఫొటోలు తీసి సర్వే హద్దుల వివరాలను పక్కాగా వెల్లడిస్తుంది. ఈ డ్రోన్ల తయారీ కోసం 32మంది ఏరోనాటికల్ ఇంజనీరింగ్ విద్యార్థులను ఉద్యోగులుగా నియమించుకున్నారు. ఈ డ్రోన్లతో భూ సర్వేలు అత్యంత వేగంగా చేయవచ్చునని పరిశోధకులు చెబుతున్నారు. వీటితో పాఠశాల విద్యార్థులకు వివిధ రకాలుగా పాఠ్యాంశాలు కూడా బోధించవచ్చునని తెలిపారు. గుజరాత్ ప్రభుత్వం రెండు నెలల క్రితం ఇదే స్టార్టప్ కంపెనీ ద్వారా 100 డ్రోన్లను కొనుగోలు చేసింది. దేశవ్యాప్తంగా ఇప్పటివరకు ఈ సర్వే డ్రోన్లు 300 వరకు అమ్ముడయ్యాయని తెలిసింది. అతి త్వరలోనే గాల్లో గంటసేపు ఎగిరే సామర్థ్యంతో పంట పొలాల్లో మందులు పిచికారి చేసే డ్రోన్లు, సర్వేలెన్స్ డ్రోన్లు అందుబాటులోకి రానున్నాయని పరిశోధకులు వెల్లడించారు. మంగళవారం సంగారెడ్డి పరిధిలోని కందిలో ఈ డ్రోన్లను ఐఐటీ-హెచ్ స్టార్టప్ కంపెనీ ఉద్యోగులు గాల్లోకి ఎగరవేసి వాటి పనితీరును పరీక్షించారు.

డ్రోన్లతో సర్వే ఇలా..

భూ సర్వే కోసం తొలుత ఈ డ్రోన్‌లకు మొబైల్ ఫోన్‌లో 'మిషన్ ప్లానర్' లేదా 'ల్యాండ్ మెజర్‌మెంట్' యాప్‌లను అనుసంధానం చేయాలి. తర్వాత స్థలం యజమాని చూపించే భూమి హద్దులను బట్టి ఆ యాప్ ద్వారా ఒక బెంచ్ మార్కును గీస్తారు. ఆ యాప్‌లోని కేఎంఎల్ (కీహోల్ మార్కప్ లాంగ్వేజ్) ద్వారా హద్దులను గుర్తించి సర్వే చేయాలనుకున్న ప్రదేశాన్ని మొత్తం చతురస్రాకారంలో ఒక రూట్ మ్యాప్ తయారు చేస్తారు. ఆ మ్యాప్‌తో డ్రోన్‌ని గాల్లోకి వదులుతారు. కేఎంఎల్ ఆధారంగా ఆ డ్రోన్ తీసే ఫొటోలకు మిషన్ ప్లానర్ యాప్‌లో గూగుల్‌లోని సర్వే ప్రదేశం ఉన్న విలేజ్ మ్యాప్‌ను అనుసంధానం చేసి రిపోర్ట్ ఇస్తారు. ఈ సాంకేతికతతో గంటకు 100 ఎకరాలు సర్వే చేయవచ్చునని పరిశోధకులు చెబుతున్నారు. ఈ డ్రోన్లతో భూముల సర్వేతో పాటు కొండలు, గుట్టలు, బురద ప్రాంతాలు, నీటి కుంటలు లాంటి ప్రదేశాల్లో సులువుగా కొలతలు తీయొచ్చు. డ్రోన్ కెమెరాల్లో వాడే కెమెరా మ్యాడ్యూల్‌ను బట్టి మైనింగ్‌లలో, పవర్ ప్లాంట్లు, రైల్వే ట్రాక్ కూడా సర్వే చేయొచ్చునని వారు తెలిపారు.

గత సర్కారు నిర్వాకంతో పంచాయతీలకు ఇక్కట్లు

» మీ హయాంలో సర్పంచులు ఆత్మహత్యలు చేసుకున్నారు..

» హరీశ్ మర్చిపోయారా?: మంత్రి సీతక్క



హైదరాబాద్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ నిర్వాకంవల్లే గ్రామ పంచాయతీలకు ఇక్కట్లు ఎదురవుతున్నాయని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంపై మాట్లాడే హక్కు వారికి లేదని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్క ధ్వజమెత్తారు. స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంలో కనీసం పాల్గొనకుండా రాజకీయాలు చేయడం హరీశ్‌రావుకు తగదన్నారు. 'పదే పదే అబద్ధాలు చెబితే ప్రజలు నమ్మరు. మీ ప్రభుత్వ హయాంలోనే సర్పంచ్‌లు ఆత్మహత్యలు చేసుకున్న విషయం మర్చిపోయారా?' అని నిలదీశారు. ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలను బుధవారం మంత్రి సీతక్క ఓ ప్రకటనలో ఖండించారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు రూ.10,170 కోట్లు కేటాయించి రూ.5,988కోట్లే విడుదల చేసిందన్నారు. పంచాయతీలకు 44శాతం నిధులివ్వకుండా గత ప్రభుత్వం సొంత అవసరాలకు వాడుకుందని ఆరోపించారు. నేషనల్ రూర్బన్ (రూరల్ అర్బన్) మిషన్‌కు 2019 నుంచి బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారం కోల్పోయేనాటికి రూ.1,200 కోట్లు చెల్లించకుండా పెండింగ్‌లో పెట్టిందన్నారు. స్వచ్ఛ భారత్ మిషన్ కింద చేయించిన పనులకు సంబంధించి ఆరేళ్లగా రూ.940 కోట్లు, రూరల్ ఇంజనీరింగ్ విభాగానికి రూ.600కోట్ల బిల్లులు చెల్లించలేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 2018 నూతన పంచాయతీ చట్టం ద్వారా అడ్వర్‌టైజింగ్, మైనింగ్ వంటి పన్నులను పంచాయతీలకు రాకుండా చేసిందని, పంచాయతీలను ఆదుకోకపోగా ఆర్థికంగా మరింత దెబ్బతీశారని ఆమె ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సిఫారసుల ప్రకారం పంచాయతీలకు నిధులు కేటాయించలేదన్నారు. కేసీఆర్ జన్మదినం కోసం ఫిబ్రవరిలో మొక్కలు నాటించారని విమర్శించారు. కాగా మూడు రోజుల్లోనే 25 లక్షల మొక్కలు నాటించామని, 29 వేల కిలోమీటర్ల రహదారులు, 18 వేల కిలోమీటర్లకుపైగా డ్రైనేజీ కాలువలను శుభ్రపరిచామని, ఇది బీఆర్ఎస్ నేతలకు కనబడటంలేదని సీతక్క పేర్కొన్నారు.


జనగామ డిపో ఎదుట ఆందోళన చేస్తున్న డ్రైవర్లు, కండక్టర్లు, రాజకీయ పార్టీల నాయకులు

కండక్టర్‌ను అకారణంగా సస్పెండ్ చేస్తారా..?

» జనగామ బస్ డిపో ఎదుట సిబ్బంది ఆందోళన

» 9 గంటల పాటు నిలిచిపోయిన బస్సులు

» దురుసు ప్రవర్తన వల్లే సస్పెండ్: సజ్జనార్

జనగామ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): బస్ కండక్టర్‌ను అకారణంగా సస్పెండ్ చేశారని జనగామ డిపో ఎదుట కండక్టర్లు, డ్రైవర్లు, సిబ్బంది నిరసనకు దిగారు. సస్పెండ్ అయిన కండక్టర్ భార్యా పిల్లలతో కలిసి బుధవారం తెల్లవారుజామున 5.30 గంటలకే డిపోకు చేరుకోగా మిగతా కండక్టర్లంతా కలిసి డిపో ఎదుట బైఠాయించారు. మధ్యాహ్నం 2.30 గంటల వరకు నిరసన చేపట్టారు. ఆందోళనకు కాంగ్రెస్, సీపీఎం, సీపీఐతో పాటు పలు సంఘాలు మద్దతు తెలిపాయి. దీంతో డిపో నుంచి బస్సులు కదలక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ సందర్భంగా బాధిత కండక్టర్ భూక్య శంకర్‌నాయక్ మాట్లాడారు. ఈ నెల 1న హనుమకొండ నుంచి ఉప్పల్ వెళ్లే బస్సు ప్రయాణికులతో నిండి ఉందని, అదే సమయంలో ఓ గర్భిణి ఎక్కిందని తెలిపారు. ఆమెకు సీటు ఇవ్వాలని ప్రయాణికులను కోరానని, ఎవరూ ఇవ్వకపోవడంతో బస్సులో గర్భిణికి రిజర్వ్ చేసిన సీటులో ఉన్న ఓ మహిళను సీటు ఇవ్వాలని సూచించానని చెప్పారు. ఆమె సీటు నుంచి లేవకపోగా తనను దుర్భాషలాడిందని, దీంతో బస్సులో ఉన్న మహిళంతా ఆమెను తలోమాట అనడంతో ఆమె బస్సు దిగి వెళ్లిపోయిందన్నారు. అనంతరం తానే ఆమెను బలవంతంగా బస్సులో నుంచి దించినట్లుగా 'ఎక్స్'లో ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌కు ఫిర్యాదు చేసిందని తెలిపారు. కాగా, వరంగల్ ఆర్ఎం విజయభాను, డిప్యూటీ ఆర్ఎంవో భానుకిరణ్ జనగామకు చేరుకుని ఆందోళనకారులతో చర్చలు జరిపారు. 10, 15 రోజుల్లో పూర్తిస్థాయి విచారణ చేసి నిర్ణయం తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు.

విచారణ జరిపి చర్యలు తీసుకున్నాం: సజ్జనార్

కండక్టర్ల ఆందోళనపై ఆర్టీసీ ఎండీ సజ్జనార్ 'ఎక్స్'లో స్పందించారు. మహిళను ఆమె తల్లి, ఏడాది వయసున్న కుమారుడితో బస్సు దిగి వెళ్లిపోవాలంటూ కండక్టర్ దురుసుగా ప్రవర్తించారని పేర్కొన్నారు. ఆమె తల్లి అనారోగ్యంతో బాధపడుతోందని చెప్పినా వినకుండా మడికొండ వద్ద దించేశారని, ఈ విషయాన్ని బాధిత మహిళ భర్త 'ఎక్స్' ద్వారా ఆర్టీసీ యాజమాన్యం దృష్టికి తీసుకొచ్చిందని చెప్పారు. దీనిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకున్నామని తెలిపారు. కండక్టర్ శంకర్‌పై గతంలో 12 సార్లు ఇలాంటి ఫిర్యాదులే వచ్చాయని, అందులో రెండు సార్లు సస్పెండ్, ఒకసారి ఉద్యోగం నుంచి తొలగించామని తెలిపారు. అయినప్పటికీ మానవతా దృక్పథంతో మళ్లీ పోస్టింగ్ ఇచ్చామని వెల్లడించారు.

ఏపీలో మళ్లీ పాపులర్ బ్రాండ్లు!

మద్యం కంపెనీలకు ప్రభుత్వ ఆహ్వానం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

వైసీపీ ప్రభుత్వంలో కనుమరుగైన పాపులర్ మద్యం బ్రాండ్లను పూర్తిస్థాయిలో తిరిగి ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. వైసీపీ పెద్దల కమీషన్లకు ససేమిరా అన్న కంపెనీలను మళ్లీ రాష్ట్రానికి ఆహ్వానిస్తోంది. ఇకపై ఎలాంటి ఒత్తిళ్లు ఉండబోవని, పాత విధానంలో వ్యాపారం చేసుకోవచ్చని వాటికి భరోసా ఇచ్చింది. జగన్ ప్రభుత్వంలో తీసుకొచ్చిన అనామక బ్రాండ్లతో ప్రజల ఆరోగ్యం దెబ్బతింటున్న విషయం వెలుగులోకి రావడంతో ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టింది. ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించని మద్యాన్ని మాత్రమే రాష్ట్రంలో విక్రయించేలా పక్కా ప్రణాళికను అమలుచేయనుంది. మరోవైపు పేదలు తాగే తక్కువ రకం మద్యం ధరలు తగ్గించాలని ఇప్పటికే నిర్ణయించగా, మీడియం, ప్రీమియం బ్రాండ్ల ధరలూ తగ్గించాలని యోచిస్తోంది. గత ప్రభుత్వంలో ఎడాపెడా పన్నులు వేసి ప్రీమియం బ్రాండ్ల నుంచి చీప్ లిక్కర్ వరకు అన్ని రకాల మద్యం ధరలూ పెంచేశారు. దీంతో పేదల సంపాదనలో ఎక్కువ శాతం తాగుడుకే సరిపోయింది. అలాగే ఎన్‌డీపీఎల్ రూపంలో మీడియం, ప్రీమియం బ్రాండ్లు పొరుగు రాష్ట్రాల నుంచి ఏపీలోకి వస్తున్నాయి. వీటిని అరికట్టేందుకు ధరలు తగ్గించడానికి కసరత్తు మొదలైంది. ప్రభుత్వానికి వచ్చే ఆదాయాన్ని కొంత వదులుకుని అయినా పేదలు తాగే మద్యం మరీ భారం కాకుండా చూడాలని నిర్ణయించింది. గత వైసీపీ ప్రభుత్వం ఎవరికీ తెలియని బ్రాండ్లను మార్కెట్‌లోకి తీసుకొచ్చింది. అయితే ఎన్ని కొత్త బ్రాండ్లు వచ్చినా వినియోగదారులు వారికి కావాల్సిందే కొనుక్కుంటారు. కానీ వారికి ఆ వెసులుబాటు లేకుండా పాత బ్రాండ్లను తరిమేసి, కేవలం కొత్త బ్రాండ్లు షాపుల్లో ఉంచేరు. ఇందుకోసం ప్రభుత్వ మద్యం షాపులను వినియోగించుకున్నారు. వైసీపీ పెద్దలకు నచ్చిన బ్రాండ్లను మాత్రమే ఆ షాపుల్లో ఉంచడంతో వినియోగదారులకు మరో దారి లేకుండా పోయింది. ఇప్పుడు ప్రభుత్వం కొత్త మద్యం పాలసీ తీసుకొస్తోంది. ఇందులో షాపులన్నీ ప్రైవేట్‌వి అయితే లైసెన్సీలు వినియోగదారులు ఇష్టపడే బ్రాండ్లను అందుబాటులో ఉంచుతారు. అప్పుడు వారు తమకు నచ్చిన బ్రాండ్‌నే కొనుగోలు చేస్తారు. దీంతో పాత బ్రాండ్లు క్రమంగా వాటంతటవే కనుమరుగయ్యే పరిస్థితి వస్తుంది.

అందుబాటులోకి ధరలు

కొవిడ్ సమయంలో అప్పటి వైసీపీ ప్రభుత్వం మద్యం ధరలు రెట్టింపు చేసింది. ఆ తర్వాత కొంతమేర తగ్గించినా మద్యం ధరలు ఏపీలో ఎక్కువగానే ఉన్నాయి. దీంతో వాటిని తగ్గించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. 2019కు ముందు చీప్ లిక్కర్ క్వార్టర్ రూ.70కు కూడా దొరికేది. వైసీపీ ప్రభుత్వంలో చీప్ లిక్కర్ క్వార్టర్ ధర రూ.150 దాటింది. మీడియం రకం బ్రాండ్ల ధరలు క్వార్టర్ రూ.200 దాటిపోయాయి. ధరలు పెరిగినా నాణ్యమైన మద్యం విక్రయించకపోవడంతో అటు ఆర్థికంగా, ఇటు అనారోగ్య సమస్యలతో పేదలు ఇంకా నష్టపోయారు. వీటన్నిటినీ దృష్టిలో పెట్టుకుని సరిహద్దు రాష్ట్రాల ధరల స్థాయికి మద్యం ధరలు తీసుకురానున్నారు. అవసరమైతే వాటి కంటే కొంతమేర అదనంగా తగ్గించే ఆలోచనలో ప్రభుత్వం ఉంది.

నూతన ఆర్‌వోఆర్ చట్టంతో సమస్యలకు పరిష్కారం

» రాష్ట్ర రెవెన్యూ సెక్రటరీ, సీసీఎల్ఏ నవీన్ మిత్తల్

» నల్లగొండలోని తిరుమలగిరిలో పైలెట్ ప్రాజెక్టు పనుల పరిశీలన


తిరుమలగిరి(సాగర్), ఆగస్టు 7: నూతన ఆర్‌వోఆర్ చట్టం ద్వారా ధరణి, ఇతర భూసమస్యలకు పరిష్కారం లభిస్తుందని రెవెన్యూశాఖ సెక్రటరీ, భూ పరిపాలనా ప్రధాన కమిషనర్(సీసీఎల్ఏ) నవీన్ మిత్తల్ తెలిపారు. కొత్త ఆర్‌వోఆర్ చట్టాన్ని రూపొందించేందుకు పైలెట్ ప్రాజెక్టుగా వివిధ రకాల భూ సమస్యలున్న నల్లగొండలోని తిరుమలగిరి(సాగర్) మండలాన్ని ప్రభుత్వం ఎంపిక చేసింది. అందులో భాగంగా మండలంలోని చింతలపాలెం గ్రామంలో బుధవారం నిర్వహించిన రైతు గ్రామసభకు ధరణి కమిటీ సభ్యులు భూమి సునీల్, లచ్చిరెడ్డిలతో కలిసి నవీన్ మిత్తల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ధరణిలో అప్పీల్ వ్యవస్థ సరిగ్గాలేదని, భూసమస్యలను పూర్తిగా పరిష్కరించలేకపోయామని తెలిపారు. సుమారు 9 లక్షల సాదాబైనామా దరఖాస్తులు వచ్చినా, అప్పటి చట్టం వల్ల వాటిని పరిష్కరించలేకపోయామని, హైకోర్టులో సాదాబైనామాలకు వ్యతిరేకంగా తీర్పు వచ్చిందని గుర్తుచేశారు. ఈ క్రమంలోనే ప్రభుత్వ ఆదేశాల మేరకు... ఆర్‌వోఆర్-2024 డ్రాఫ్ట్ ముసాయిదాను సిద్ధం చేసి సీసీఎల్ఏ వెబ్‌సైట్‌లో పొందుపరిచామని పేర్కొన్నారు. దీనిపై రైతులు, ప్రజల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించనున్నామని తెలిపారు. కొత్త చట్టం అమలయ్యాక క్షేత్రస్థాయిలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం లభించడంతో పాటు కొన్ని మాడ్యుల్స్ అందుబాటులోకి వస్తాయన్నారు. అదేవిధంగా రాష్ట్ర మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి, ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి సూచనల మేరకే విభిన్న భూసమస్యలున్న తిరుమలగిరి(సాగర్) మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా సీఎం రేవంత్‌రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి ప్రకటించారని తెలిపారు. ఇక్కడి రైతుల అభిప్రాయాలను తెలుసుకున్న తరువాత రెవెన్యూలో ఉండే అన్ని సమస్యలు మండలంలో ఉన్నట్లు గుర్తించామని అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ మండలంలో వచ్చిన ఫలితాలను రాష్ట్రమంతటా అమలు చేయనున్నట్లు చెప్పారు. ఆయన వెంట నల్లగొండ జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్, డీఎఫ్‌వో రాజశేఖర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుబ్రహ్మణ్యం, ఆర్డీవో శ్రీనివాస్‌రావు తదితరులు ఉన్నారు.

స్థానికతపై జీవో 33 సమగ్రంగా లేదు

» కాంగ్రెస్ అనాలోచిత నిర్ణయాలతో తెలంగాణ బిడ్డలకు నష్టం

» కేంద్రం గ్రామాలకు ఇచ్చిన నిధులను దారి మళ్లించారు

» అందుకే రాష్ట్రానికి రావాల్సిన నిధులకు బ్రేక్ పడింది: హరీశ్‌రావు



హైదరాబాద్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలు తెలంగాణ బిడ్డలకు నష్టం కలిగిస్తున్నాయని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. ఎంబీబీఎస్ అడ్మిషన్ల విషయంలో జారీ చేసిన జీవో 33 సమగ్రంగా లేదని, తెలంగాణ బిడ్డలే నాన్ లోకల్ అవుతున్నారన్నారు. బుధవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి సర్కారు గుడ్డెద్దు చేలో పడ్డట్టు వ్యవహరిస్తోందన్నారు. 2024 జూన్ 2 నాటికి తెలంగాణ ఏర్పడి పదేళ్లు పూర్తికావడంతో స్థానికత నిర్ధారణకు సొంత నిబంధనలు రూపొందించుకోవడానికి రాష్ట్రానికి అవకాశం దక్కిందన్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ బిడ్డలకు విద్యా సంస్థల్లో ప్రవేశాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర ఆలోచన చేసి, నిబంధనలు తయారు చేయాల్సి ఉండగా.. అలాంటిదేం లేకుండా ఎంబీబీఎస్ అడ్మిషన్ల కోసం 33 జీవో తెచ్చిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏ అంశంలోనూ సరిగా అవగాహన లేదని, అందుకే 9 నుంచి 12వ తరగతి వరకు ఎక్కడ చదివితే దాన్నే స్థానికతగా నిర్ణయిస్తూ జీవో తెచ్చిందన్నారు. దీని వల్ల తెలంగాణ బిడ్డలు స్థానికేతరులుగా మారే ప్రమాదం ఉందన్నారు. కేసీఆర్ హయాంలో 95 శాతం స్థానికులకు ఉద్యోగాలు దక్కేలా విధానాలు తెచ్చారని, అదే పద్ధతి విద్య విషయంలోనూ అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ వచ్చాక ఏర్పాటుచేసిన వైద్య కళాశాలల్లో స్థానికేతర విద్యార్థులకు రిజర్వేషన్ అమలు చేయలేదని, స్థానికులకే సీట్లు దక్కేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కనీస నిధులైనా ఇవ్వకపోతే పంచాయతీలు స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమం ఎలా నిర్వహిస్తాయని ప్రశ్నించారు. ఉపాధి హామీ, ఆరోగ్య మిషన్ వంటి పథకాల కింద కేంద్రం ఇచ్చిన రూ.2100 కోట్లను గ్రామాలకు ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం దారి మళ్లించిందని, దీంతో కేంద్రం నుంచి రావాల్సిన మరిన్ని నిధులకు బ్రేక్ పడిందన్నారు. కాంగ్రెస్ పాలన చేపట్టిన 8 నెలల్లో పంచాయతీలకు పైసా కూడా ఇవ్వలేదన్నారు. కనీస ఆదాయ వనరుల్లేని పంచాయతీల్లో కార్యదర్శులు రూ.లక్షల్లో అప్పులు చేసి పనులు చేయించారని, వారంతా డబ్బులు వస్తాయో రావోనని అయోమయంలో పడ్డారన్నారు.



దక్షిణ మధ్య రైల్వే జీఎంతో సమావేశమైన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

నూతన రైల్వేలైన్ల అలైన్‌మెంట్ మార్చండి

» దక్షిణమధ్య రైల్వే జీఎంతో మంత్రి పొంగులేటి

హైదరాబాద్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే ఖమ్మం, వరంగల్ జిల్లాల మీదుగా ప్రతిపాదించిన నూతన రైలు మార్గాల్లో మార్పులు చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివా‌స్‌రెడ్డి రైల్వే అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు బుధవారం రైల్ నిలయంలో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్‌తో మంత్రి పొంగులేటి సమావేశమై రైల్వేలైన్ల మార్పులపై చర్చించారు. డోర్నకల్ నుంచి ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం నాయకన్‌గూడెం మీదుగా సూర్యాపేట జిల్లా మోతే నుంచి గద్వాల్ వరకు ప్రతిపాదించిన నూతన రైల్వే మార్గం పాలేరులోని నాలుగు మండలాల మీదుగా వెళుతుండడంతో రైతులు సాగు భూములను కోల్పోవాల్సి వస్తుందని మంత్రి వివరించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాల్ల కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(కుడా) మాస్టర్ ప్లాన్‌ను పరిగణనలోకి తీసుకొని వరంగల్ నగర బైపాస్ రైల్వేలైన్‌ను నిర్మించాలని కోరారు. నష్కల్ నుంచి హసన్‌పర్తి, నష్కల్ నుంచి చింతలపల్లి వరకు కొత్తగా నిర్మించ తలపెట్టిన రైల్వే మార్గాన్ని వరంగల్ మాస్టర్ ప్లాన్‌కు అనుసంధానం చేయాలని కోరారు. ప్రస్తుతం సిద్ధం చేసిన రైల్వే మార్గం వల్ల వరంగల్ మాస్టర్ ప్లాన్ దెబ్బతింటుందని, దీన్ని దృష్టిలో పెట్టుకొని అలైన్‌మెంట్ మార్చాలని మంత్రి పొంగులేటి విజ్ఞప్తి చేశారు.

15న సీతారామ రెండో పంప్‌హౌస్ ప్రారంభం

» 11న ట్రయల్ రన్.. ఏర్పాట్లపై మంత్రి ఉత్తమ్ సమీక్ష

హైదరాబాద్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): సీతారామ ఎత్తిపోతల పథకంలో రెండో పంప్‌హౌస్‌తో పాటు రాజీవ్ కెనాల్‌ను ఈనెల 15న సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు. బుధవారం దీనికి సంబంధించిన ఏర్పాట్లపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులతో సమీక్ష నిర్వహించారు. 15న స్వాతంత్ర్య దినోత్సవాల అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి హెలికాప్టర్‌లో ఖమ్మం జిల్లా వైరాకు చేరుకొని, అక్కడే భోజనాలు చేసుకొని, వైరాలో జరిగే బహిరంగ సభలో పాల్గొంటారని ఉత్తమ్ తెలిపారు. అనంతరం సీతారామ ప్రాజెక్టుకు చెందిన రెండో పంప్‌హౌస్‌తో పాటు రాజీవ్ కెనాల్‌ను ప్రారంభిస్తారని చెప్పారు. కాగా, 11వ తేదీన ఉదయం 10:30 గంటలకు ములకలపల్లిలో ఉన్న రెండో పంప్‌హౌస్ మోటార్ల ట్రయల్ రన్‌ను మంత్రి ఉత్తమ్ నిర్వహించనున్నారు. ఆ తర్వాత మూడో పంప్‌హౌస్ మోటార్ల ట్రయల్ రన్ చేపట్టనున్నారు. అనంతరం వైరాలో సీఎం బహిరంగసభా స్థలిని పరిశీలించనున్నారు. ఆ తర్వాత మిర్యాలగూడలోని అడవిదేవులపల్లి మండలం దున్నపోతుల గండి ఎత్తిపోతల పథకాన్ని మంత్రి ఉత్తమ్ పరిశీలించనున్నారు.

విజిలెన్స్ మ్యాన్యువల్ మార్చాలి: డీజీ సీవీ ఆనంద్

హైదరాబాద్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): దశాబ్దాల కాలం నాటి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ మ్యాన్యువల్‌ను ప్రస్తుత పరిస్థితులు, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా మార్పు చేయాల్సిన అవసరం ఉందని విభాగం డీజీ సీవీ ఆనంద్ అన్నారు. 30 ఏళ్ల క్రితం రూపొందించిన మ్యాన్యువల్‌లో అవసరమైన మార్పులు, చేర్పులతో కొత్త మాన్యువల్ రూపకల్పనకు కమిటీ ఏర్పాటు చేశారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రధాన కార్యాలయంలో విజిలెన్స్ విభాగం రాష్ట్ర స్థాయి సమీక్ష బుధవారం జరిగింది. రాష్ట్ర స్థాయిలో 120 మంది అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల(ఆర్‌వీఈవో) గత మూడేళ్ల పనితీరును డీజీ సమీక్షించారు. ఈ సందర్భంగా విభాగం పనితీరును ప్రతిబింబించేలా నూతన లోగోను సీవీ ఆనంద్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. విజిలెన్స్ అధికారులంతా చిత్తశుద్ధితో పనిచేయాలని, అలా పనిచేసినప్పుడే ప్రభుత్వ ఆదాయానికి రక్షణ ఉంటుందని చెప్పారు.

ధాన్యం కొనుగోలు నిబంధనల మార్పులకు కమిటీ

హైదరాబాద్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు నిబంధనల్లో మార్పులు, చేర్పులు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈమేరకు అవసరమైన సిఫారసులు చేసేందుకుగాను ప్రత్యేకంగా ఓ కమిటీని ఏర్పాటు చేసింది. 17 మందితో కమిటీ వేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి డీఎస్ చౌహాన్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ ప్రియాంక ఆలాతోపాటు పౌర సరఫరాలశాఖ నుంచి 11 మంది సభ్యులు, కార్పొరేషన్ నుంచి ఐదుగురు సభ్యులను నియమించారు. ఈ కమిటీ ఇచ్చే నివేదిక ప్రకారం.. ధాన్యం సేకరణకు విధివిధానాలు ఖరారు చేయనున్నారు. వచ్చే సీజన్ నుంచి కొత్త నిబంధనలు అమలులోకి వచ్చే అవకాశాలున్నాయి.

కేంద్ర సహకారంతో పెద్దవాగు పునర్నిర్మాణం

» మంత్రి తుమ్మలతో జీఆర్‌ఎంబీ చైర్మన్ ఎంకే సిన్హా

హైదరాబాద్, ఖమ్మం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పెద్దవాగు ప్రాజెక్టు పునర్నిర్మాణానికి డ్యామ్ రిహాబిలిటేషన్ ఇంప్లిమెంటేషన్ ప్రాజెక్టు(డ్రిప్) ద్వారా అవసరమైన సహకారం అందిస్తామని గోదావరి నది యాజమాన్య బోర్డు(జీఆర్‌ఎంబీ) చైర్మన్ ముకేష్‌కుమార్ సిన్హా ప్రకటించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో బుధవారం ఆయన హైదరాబాద్‌లో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కొత్తగూడెం జిల్లాలోని పెద్దవాగు ప్రాజెక్టు పునర్నిర్మాణంపై ఇరువురి మధ్య చర్చ జరిగింది. డ్రిప్ ద్వారా ప్రాజెక్టుకు కేంద్రం నుంచి సాయం అందిస్తామన్న జీఆర్‌ఎంబీ చైర్మన్ సిన్హా..ప్రాజెక్టు స్పిల్‌వే సామర్థ్యం పెంచాల్సిన ఆవశ్యకత, ప్రస్తుతమున్న మూడు గేట్లను ఆరుకు పెంచాలని వివరించారు. ప్రాజెక్టును డ్రిప్ పథకంలో చేర్చితే పునర్నిర్మాణానికి కేంద్రం రుణ రూపంలో నిధులు సమకూరుస్తుందని ఎంకే సిన్హా తెలిపారు. అలాగే, ప్రాజెక్టు కాలువలు రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉన్నందున ఇరురాష్ట్రాలు సమన్వయంతో కాలువ మరమ్మతులు చేసుకోవాలని సూచించారు. కాగా, గోదావరి బేసిన్ పరిధిలోని ప్రాజెక్టుల డీపీఆర్‌లకు ఆమోదం వేసి.. గోదావరి జలాల్లో తెలంగాణ హక్కులు కాపాడాలని మంత్రి తుమ్మల కోరారు. అలాగే, తెలుగు రాష్ట్రాల మధ్య ఎలాంటి నీటి సమస్యలు లేకుండా చూడాలని ఎంకే సిన్హాకు విజ్ఞప్తి చేశారు.

30 వేల రైతుల ఖాతాల్లో సమస్యలు!

» అవకతవకలపై చర్యలు: టెస్కాబ్ ఎండీ బి.గోపి

హైదరాబాద్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): పంట రుణమాఫీ పథకం అమలు సమయంలో 30వేల రైతుల ఖాతాల్లో సమస్యలు గుర్తించామని టెస్కాబ్(తెలంగాణ స్టేట్ కో- ఆపరేటివ్ అపెక్స్ బ్యాంకు) ఎండీ డాక్టర్ బి.గోపి తెలిపారు. లోన్ అకౌంట్ మనుగడలో లేకపోవడం, ఆధార్ మ్యాపింగ్ కాకపోవటం, బ్యాంకు ఖాతా- ఆధార్ వివరాలకు పోలికలేకపోవటం లాంటి సమస్యలున్నాయని వివరించారు. ఈ మేరకు రైతుల నుంచి ఫిర్యాదులు కూడా వచ్చాయని బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తొలి విడతలో రూ. 900 కోట్లు, రెండో విడతలో రూ. 678 కోట్లు.. టెస్కాబ్‌కు రుణమాఫీ వచ్చిందని తెలిపారు. 9 డీసీసీబీలు, 376 శాఖలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో అర్హుల జాబితాలు ప్రదర్శించినట్లు చెప్పారు. సంబంధిత డీసీసీబీల నుంచి ఆధార్ జాబితాను తీసుకొని సవరణ చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో 157 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో 3,982 ఖాతాలకు సంబంధించిన పంట రుణాలు మాఫీకాకపోవటానికి బాధ్యులైన కార్యదర్శులపై చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు.

ఆనాడు చేనేతే సాధనం.. ఇప్పుడు ప్రధానం

» సీఎం రేవంత్ చేనేత దినోత్సవ శుభాకాంక్షలు

రాష్ట్రంలోని చేనేతలందరికీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జాతీయ చేనేత దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. స్వాతంత్ర్య సంగ్రామంలో చేనేత ఒక సాధనమైందని.. ఇప్పుడు తెలంగాణ పునర్నిర్మాణంలోనూ ప్రధానంగా నిలిచిందని పేర్కొన్నారు. చేనేతకు పునరుజ్జీవనం కల్పించడాన్ని ప్రజా ప్రభుత్వం బాధ్యతగా భావిస్తున్నట్లు తెలిపారు.

నాలుగు గ్యారంటీలు

(మొదటిపేజీ తరువాయి)

కాలుష్యరహిత విధానాలకు ఉద్దేశించిన నెట్ జీరో విధానాలు, మూసీనది సుందరీకరణ, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, ప్రజారోగ్యానికి సంబంధించి చేపట్టబోయే కార్యక్రమాలు ఉన్నాయి. మూసీ పునరుజ్జీవం, సుందరీకరణ ప్రాజెక్టుతో జల కాలుష్యం తగ్గుతుందని, స్థానికులకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు పెరుగుతాయని సీఎం తెలిపారు. దేశంలోని ప్రధాన నగరాలు ఎదుర్కొంటున్న కాలుష్య సమస్యలకు తమ ప్రభుత్వం కాలుష్యరహిత విధానాలు అమలు చేస్తోందన్నారు. ఇందులో భాగంగా కాలుష్య కారకమవుతుందని భావించే హైదరాబాద్ ఫార్మాసిటీని రద్దుచేసి కాలుష్యరహిత ప్రాజెక్టుగా అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు. హైదరాబాద్ 4.0లో భాగంగా కొత్త నగర నిర్మాణం గురించి సీఎం ప్రస్తావించారు. ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా సాధించిన తెలంగాణలో నిరుద్యోగం పెరిగిందని, ప్రభుత్వ రంగాల్లో ఉద్యోగాల భర్తీతోపాటు ప్రైవేటు రంగాల్లో ఉద్యోగాలు సాధించేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ప్రారంభించామని తెలిపారు. పరిశ్రమలకు కావాల్సిన నైపుణ్యాలు అందించి ఉపాధి అవకాశాలు కల్పించడం ఈ వర్సిటీ లక్ష్యమన్నారు. ప్రజారోగ్యంపై రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న కార్యక్రమాలనూ సీఎం వివరించారు. ఈ నాలుగు ప్రాజెక్టుల గురించి ఆసక్తిగా విన్న ప్రపంచబ్యాంకు అధ్యక్షుడు.. తెలంగాణ ప్రభుత్వానికి భాగస్వామ్యం అందించేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారు. నాలుగు కోట్ల మంది తెలంగాణ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు ఉద్దేశించిన ఈ ప్రాజెక్టులకు ఆర్థిక సహకారం అందించేందుకూ సానుకూలంగా స్పందించారు. ప్రాజెక్టుల అమలుకు త్వరలో సంబంధిత వర్గాల నిపుణులతో ఓ ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేస్తామని చెప్పారు.

జీనోమ్ వ్యాలీలో రూ.400 కోట్ల పెట్టుబడులు..

ప్రముఖ ఫార్మా కంపెనీ వివింట్ హైదరాబాద్‌లోని జీనోమ్ వ్యాలీలో అత్యాధునిక ఇంజెక్టబుల్స్ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. రూ.400 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు ఈ కంపెనీ ముందుకొచ్చింది. దీంతో దాదాపు వెయ్యి మందికి ఉద్యోగాలు లభిస్తాయని పేర్కొంది. అమెరికా పర్యటనలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి బృందం బుధవారం వివింట్ కంపెనీ ప్రతినిధులతో చర్చలు జరిపారు. అనంతరం పెట్టుబడులకు సంబంధించి కీలక ప్రకటన చేశారు. కంపెనీ నిర్ణయంపై సీఎం రేవంత్‌రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. లైఫ్ సైన్సెస్ రంగంలో కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని, అవసరమైన రాయితీలు, మౌలిక సదుపాయాలు కల్పిస్తుందని చెప్పారు. అంకాలజీ, క్రిటికల్ కేర్ విభాగాల్లో అత్యంత నాణ్యమైన ఇంజెక్టబుల్స్ ఔషధాలను ఈ కంపెనీ ఉత్పత్తి చేస్తుంది. మరోవైపు ప్రపంచంలో పేరొందిన కార్నింగ్ ఇన్‌కార్పొరేటెడ్ కంపెనీ కూడా తెలంగాణలో కొత్త ఆవిష్కరణల అభివృద్ధికి ముందుకొచ్చింది. నైపుణ్యాలతోపాటు పరిశ్రమల్లో సాంకేతిక ఆవిష్కరణలను అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని బృందం బుధవారం ఎమర్జింగ్ ఇన్నోవేషన్ గ్రూప్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ రోనాడ్ వెర్క్లిరన్ ఆధ్వర్యంలోని కార్నింగ్ ప్రతినిధుల బృందంతో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో అవగాహన ఒప్పంద పత్రాలపై అధికారికంగా సంతకాలు చేశారు.



వివింట్ కంపెనీ ప్రతినిధులతో సీఎం రేవంత్ రెడ్డి, సీఎస్ శాంతికుమారి

2025 నుంచి కార్నింగ్ వాణిజ్య ఉత్పత్తి..

కార్నింగ్ కంపెనీతో కుదిరిన ఒప్పందం ప్రకారం.. అడ్వాన్స్ మాన్యుఫ్యాక్చరింగ్, కెమికల్ ఇంజనీరింగ్ విభాగాల్లో కార్నింగ్ కంపెనీ తెలంగాణ ప్రభుత్వానికి సహకారం అందిస్తుంది. ఫార్మాస్యూటికల్, కెమికల్ రంగాల్లో అత్యాధునిక పరిశోధన, అభివృద్ధి కేంద్రంగా తెలంగాణను తీర్చిదిద్దడంలో భాగస్వామ్యం పంచుకుంటుంది. 2025 నుంచి తమ వాణిజ్య ఉత్పత్తి ప్రారంభిస్తామని కంపెనీ తెలిపింది. అలాగే తెలంగాణ ప్రభుత్వం, హైదరాబాద్ యూనివర్సిటీ సహకారంతో డాక్టర్ రెడ్డీస్ లిమిటెడ్, లారస్ ఫార్మా లిమిటెడ్ నిర్వహిస్తున్న ఫ్లో కెమిస్ట్రీ టెక్నాలజీ (ఎఫ్‌సీటీ) హబ్‌లోనూ కార్నింగ్ కంపెనీ భాగస్వామ్యం పంచుకుంటుంది. ఈ అత్యాధునిక గ్లాస్ ట్యూబ్ తయారీ కేంద్రం ఫార్మా రంగం అభివృద్ధికి దోహదపడుతుంది. ఈ గ్లాస్ ట్యూబ్‌లను ఔషధాల ప్యాకేజింగ్ పరిశ్రమలో ఉపయోగిస్తారు. వీటి తయారీకి వినూత్నమైన వెలాసిటీ గ్లాస్-కోటింగ్ టెక్నాలజీని కార్నింగ్ కంపెనీ వినియోగిస్తోంది. ఈ కొత్త సదుపాయంతో తెలంగాణలో ఇప్పటికే వేగంగా విస్తరిస్తున్న ఫార్మాస్యూటికల్ రంగంలో ఉత్పాదకత సామర్థ్యం మరింత మెరుగుపడుతుందని ప్రభుత్వం తెలిపింది.

కాగ్నిజెంట్ విస్తరణ ముహూర్తం 14న

శంకుస్థాపనకు హాజరుకానున్న సీఎం

హైదరాబాద్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఐటీ దిగ్గజ సంస్థ కాగ్నిజెంట్ తన విస్తరణ ప్రణాళికను ఈ నెల 14న ప్రారంభించనుంది. ఈ మేరకు కంపెనీ సన్నాహాలు చేస్తోంది. అమెరికా పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ఈ నెల 5న న్యూజెర్సీలోని కంపెనీ ప్రధాన కార్యాలయంలో సీఈవో రవికుమార్‌తో సమావేశమైన విషయం తెలిసిందే. అనంతరం హైదరాబాద్‌లో తన విస్తరణ ప్రణాళికను కంపెనీ ప్రకటించింది. అదనంగా 15 వేల మందికి ఉద్యోగాలు కల్పించేలా తమ ప్రణాళిక ఉంటుందని పేర్కొంది. ఇందుకోసం 10 లక్షల చదరపు అడుగుల్లో కొత్త క్యాంపస్ ఉంటుందని తెలిపింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వంతో పరస్పర అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకున్న పది రోజుల్లోపే కొత్త క్యాంపస్ ఏర్పాటుపై దృష్టి సారించింది. అమెరికా పర్యటన నుంచి ఈ నెల 14వ తేదీ ఉదయం హైదరాబాద్ చేరుకోనున్న ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి.. అదేరోజు జరగనున్న శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొననున్నారు. కాగ్నిజెంట్ సీఈవో రవికుమార్ కూడా దీనికి హాజరు కానున్నారు. కాగా, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, డిజిటల్ ఇంజనీరింగ్, క్లౌడ్ సొల్యూషన్స్‌తో సహా వివిధ అధునాతన సాంకేతికతలపై కొత్త కేంద్రం ప్రత్యేకంగా దృష్టి సారిస్తుందని కాగ్నిజెంట్ ప్రకటించింది. 1994లో చెన్నై కేంద్రంగా పునాది వేసుకున్న ఈ సంస్థ ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా విస్తరించింది. హైదరాబాద్‌లో 2002 నుంచి కార్యకలాపాలు ప్రారంభించగా.. ప్రస్తుతం ఐటీ కారిడార్‌లోని వివిధ ప్రాంతాల్లో ఐదు క్యాంపస్‌లు కలిగి ఉంది. ప్రస్తుతం ఈ కంపెనీకి హైదరాబాద్‌లో దాదాపు 18 వేల మంది ఉద్యోగులున్నారు. నగరంలోనే ఐటీ రంగంలో అత్యధిక ఉద్యోగాలు కల్పిస్తున్న సంస్థగా కాగ్నిజెంట్‌కు పేరుంది.

ఆధార్‌లా 'భూధార్' కార్డు!

భూములకు ప్రత్యేక గుర్తింపు సంఖ్యతో జారీ

ఆర్వోఆర్ చట్టం రాగానే ప్రతి కమతానికీ భూధార్

వ్యవసాయేతర భూములకూ హక్కుల రికార్డు

ఎలక్ట్రానిక్ రూపంలో భూమి సమగ్ర వివరాలు

హైదరాబాద్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ చట్టంలో మొదటిసారిగా 'భూధార్ కార్డు' రాబోతుంది. వ్యక్తులకు ఆధార్ కార్డు మాదిరిగా.. రికార్డులో నమోదు చేసిన భూమికి ప్రత్యేక గుర్తింపు సంఖ్యతో భూధార్ కార్డు జారీ చేయనున్నారు. దీన్ని వ్యవసాయ, వ్యవసాయేతర భూములకు ఇవ్వనున్నారు. దీంతో సంబంధిత భూమి సమగ్ర వివరాలు తెలుసుకోవచ్చు. ఇది ఎలక్ట్రానిక్ రూపంలో ఉంటుంది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం త్వరలో తీసుకురాబోతున్న కొత్త రెవెన్యూ చట్టం (ఆర్వోఆర్)లో భూధార్ కార్డుకు ప్రత్యేక స్థానం కల్పిస్తోంది. ఈ చట్టం అమల్లోకి రాగానే రెవెన్యూ శాఖ రికార్డుల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా ప్రతి కమతాని(భూమి)కి భూధార్ నెంబరు కేటాయించనున్నారు. అయితే ఇది తాత్కాలికంగానే ఉంటుంది. భూములు రీసర్వే చేసిన తర్వాత శాశ్వత గుర్తింపు నెంబరు జారీ చేస్తారు. కొత్త ఆర్వోఆర్-2024 చట్టం అందరికీ ఆమోదయోగ్యంగా ఉంటుందని రెవెన్యూ, న్యాయ నిపుణులు, రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులు పేర్కొంటున్నారు. ప్రజాభిప్రాయ సేకరణ కోసం సీసీఎల్‌ఏలో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేశారు. ఈ-మెయిల్, లేఖల ద్వారా ఈ నెలాఖరు వరకు ప్రజాభిప్రాయాలు సేకరించనున్నారు. వాటిలో వచ్చే అభ్యంతరాలు, సలహాలు, సూచనల మేరకు ముసాయిదాలో మార్పులు చేర్పులు చేస్తారు. అనంతరం అసెంబ్లీ ఆమోదంతో చట్టంగా మారనుంది.

భూధార్‌తో సమగ్ర వివరాలు లభ్యం

స్వాధీనంలో భూమి, చేతిలో పట్టా, రికార్డులో పేరు.. ఈ మూడు ఉన్నప్పుడే ఏ రైతుకైనా సంపూర్ణ భూమి హక్కులు ఉన్నట్లు లెక్క. వీటితో పాటు ప్రభుత్వం జారీ చేసే భూధార్ కార్డు కూడా కీలకం కానున్నది. దీని ద్వారా ఆ భూమి సమగ్ర వివరాలు తెలుసుకునేందుకు వీలుంటుంది. భూమి చిరునామాతో పాటు దాని స్వభావం, ఏ అక్షాంశ రేఖాంశాల మధ్య ఉందో కూడా శాస్త్రీయంగా గుర్తించవచ్చు.

వ్యవసాయేతర భూములకూ హక్కుల రికార్డు

దేశంలో వస్తున్న మార్పులకు, కేంద్ర ప్రభుత్వం తెస్తున్న భూ విధానాలకు అనుగుణంగా కొత్త చట్టం ఉండబోతోంది. ఇప్పటి వరకు వ్యవసాయ, ప్రభుత్వ భూములకు మాత్రమే భూ, హక్కుల రికార్డులు ఉన్నాయి. కొత్త చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత ప్రభుత్వం ఇళ్లు, ఇంటి స్థలాలు, వ్యవసాయేతర భూముల వివరాలను కూడా హక్కుల రికార్డుల్లో నమోదు చేయనుంది. వీటిని ఎలక్ట్రానిక్ రూపంలో, ఆన్‌లైన్ పోర్టల్‌లో అందుబాటులో ఉంచనున్నారు.



రైతన్నకు గడువు!

(మొదటిపేజీ తరువాయి)

పథకాలను అమలు చేయడానికి డిసెంబరు 9కి ప్రాధాన్యమిస్తున్న రేవంత్ సర్కారు.. రుణమాఫీ ప్రక్రియను కూడా అప్పటికే ముగిస్తుందా? లేక 6 నెలల సమయమిచ్చి 2025 ఫిబ్రవరి వరకు గడువు విధిస్తుందా? లేక 2025 మార్చి 31 వరకు డెడ్‌లైన్ పెట్టి రుణమాఫీ ప్రక్రియను పూర్తిచేస్తుందా? అనే చర్చ కూడా వ్యవసాయశాఖలో జరుగుతోంది.

మూడో విడత రుణమాఫీకి రూ.6 వేల కోట్లు!

మూడో విడత రుణమాఫీకి మరో రూ.6 వేల కోట్ల నిధులు అవసరమవుతున్నాయి. లక్షన్నర నుంచి రూ.2 లక్షల బకాయిలున్న 6 లక్షల మంది రైతులకు మూడో విడతలో ఈ నెల 15న రుణమాఫీ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఆర్థిక శాఖ నిధులు సర్దుబాటు చేస్తోంది. గత నెల 23న రూ.3 వేల కోట్లు, 30న రూ.1,000 కోట్ల అప్పును భారతీయ రిజర్వ్ బ్యాంకు నుంచి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంది. తాజాగా ఈ నెల 6న మరో రూ.3 వేల కోట్లను ఆర్‌బీఐ నుంచి వేలంపాట ద్వారా రాష్ట్ర ప్రభుత్వం సేకరించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటన ముగించుకొని రాష్ట్రానికి రాగానే 15న ఖమ్మం జిల్లా వైరాలో నిర్వహించే బహిరంగసభలో మూడో విడత రుణమాఫీని పంపిణీ చేయనున్నారు. కాగా, రెండు విడతల్లో 17.91 లక్షల మంది రైతులకు రూ.12,289 కోట్ల నిధులు సర్దుబాటు చేశారు. మూడో విడతలో 6 లక్షల మంది రైతులకు రూ.6 వేల కోట్ల నిధులు సర్దుబాటు చేయాల్సి వస్తోంది. మిగిలిన రైతులు రూ.2 లక్షలకు మించి అప్పున్న విభాగంలో ఉంటారు.

ప్రతి బిడ్డకూ ఇంగ్లిషు మీడియం చదువు

రాష్ట్రంలో త్వరలో సమీకృత ఆశ్రమ పాఠశాలల ఏర్పాటు.. ప్రతి నియోజకవర్గంలో అంబేడ్కర్ నాలెడ్జ్ కోచింగ్ సెంటర్లు

- » ఇందిరమ్మ ఇంటికి ఎస్సీ, ఎస్టీలకు రూ.6 లక్షల ఆర్థిక సాయం
- » ధరణి పోర్టల్‌పై కమిటీ వేశాం.. ఇంకా విస్తృత చర్చ జరగాలి
- » రాష్ట్రంలో మరో 20 ఏళ్ల పాటు ఇందిరమ్మ రాజ్యమే ఉంటుంది
- » ఆదిలాబాద్ జిల్లా పిప్రి సభలో ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క



ఆదిలాబాద్ జిల్లా పిప్రి గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క

ఆదిలాబాద్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పుట్టిన ప్రతి బిడ్డకూ ఇంగ్లిష్ మీడియంలో చదువుకునే అవకాశం కల్పించేందుకు త్వరలో 'ఇంటిగ్రేటెడ్ ఇంగ్లిష్ మీడియం రెసిడెన్షియల్ స్కూల్స్' ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నాలెడ్జ్ కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు. కోచింగ్ కోసం హైదరాబాద్‌లాంటి దూర ప్రాంతాలకు రాకుండా నియోజకవర్గంలోనే మెరుగైన అవకాశాలు అందిస్తామన్నారు. బుధవారం ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండలం పిప్రి గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం బహిరంగ సభలో మాట్లాడారు. ప్రతి నియోజకవర్గంలో 3,500 ఇందిరమ్మ ఇళ్లు నిర్మించేలా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. మొదటి సంవత్సరమే 4 లక్షల 50 వేల ఇళ్లు కట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ప్రతీ ఇంటికి రూ.5 లక్షలు కేటాయిస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకైతే మరో లక్ష కలిపి రూ.6 లక్షల ఆర్థిక సహాయం అందజేస్తామన్నారు. నిరుద్యోగ యువతకు జాబ్ క్యాలెండర్ ప్రకటించామని, అధికారంలోకి వచ్చిన 3 నెలల్లోనే 35 వేల ఉద్యోగాల నియామక పత్రాలు అందించామన్నారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేసి, ప్రశ్నపత్రాల లీక్ లేకుండా గ్రూప్-1 పరీక్షను పకడ్బందీగా నిర్వహించి చూపించామన్నారు. 'ధరణి'పై కమిటీ వేశామని, మేధావులు అందరితో చర్చించాకే నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. రాష్ట్రంలో మరో 20 ఏళ్ల పాటు ఇందిరమ్మ రాజ్యమే ఉంటుందన్నారు. గత పదేళ్లలో ఐటీడీఏలు నిర్వీర్యమయ్యాయన్నారు. తమ ప్రభుత్వం బడ్జెట్‌లో గిరిజన సంక్షేమానికి రూ.17వేల కోట్లకు పైగా నిధులు కేటాయించిందన్నారు. గిరిజన విద్యార్థుల నైపుణ్యం పెంపొందించేందుకు శిక్షణ ఇప్పిస్తామన్నారు. ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు బడ్జెట్‌లో రూ.35 వేల కోట్లకు పైబడి నిధులు కేటాయించామన్నారు. ఆదిలాబాద్ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులకు సుమారు రూ.400 కోట్లు మంజూరు చేసి పూర్తి చేస్తామన్నారు. బోథ్ నియోజకవర్గ ప్రజల చిరకాల వాంఛ అయిన కుప్టి ప్రాజెక్టును పూర్తిచేసి సాగునీరు అందిస్తామన్నారు. పిప్రిలో కడెం వాగుపై ఎత్తిపోతల పథకానికి రూ.45 కోట్లు మంజూరు చేశామన్నారు. సభలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్యేలు అనిల్ జాదవ్, వెడ్మబొజ్జు, ప్రేమ్‌సాగర్‌రావు, కాంగ్రెస్ నేత మధుయాష్కీ గౌడ్, ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజార్షిషా, ఎస్పీ గౌస్ ఆలం, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి పాల్గొన్నారు.

చేనేత వాడుదాం.. నేతన్నకు అండగా ఉందాం

జాతీయ చేనేత దినోత్సవంలో మంత్రి తుమ్మల పిలుపు.. నెక్లెస్‌రోడ్ పీపుల్స్ ప్లాజాలో చేనేత వస్త్ర ప్రదర్శన ప్రారంభం



పీపుల్స్‌ప్లాజాలో చేనేత వస్త్రాలను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల, తదితరులు

హైదరాబాద్, ఖైరతాబాద్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): చేనత వస్త్రాలను వినియోగిద్దాం.. నేతన్నలకు అండగా ఉందామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రజలకు పిలుపునిచ్చారు. చేనేత రంగం అభివృద్ధికి, నేత కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రకటించారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా హైదరాబాద్, నెక్లెస్ రోడ్‌లో ఏర్పాటు చేసిన చేనేత వస్త్ర ప్రదర్శనను మంత్రి తుమ్మల బుధవారం ప్రారంభించారు. 16వ తేదీ వరకు సాగే ఈ ప్రదర్శనలో ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లలోని వస్త్రాలను చూశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో.. నేతన్న బీమా పథకం అమలుకు సంబంధించి 37 వేల మంది చేనేత కార్మికుల బీమా రెన్యువల్‌కు రూ.6 కోట్ల చెక్కును ఎల్‌ఐసీ అధికారులకు అందజేశారు. అలాగే, కొండా లక్ష్మణ్ బాపూజీ పురస్కారానికి ఎంపికైన 32 మంది చేనేత కళాకారులు ఒక్కొక్కరికి రూ.25వేల నగదు, ప్రశంసాపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. చేనేత కార్మికులకు జాతీయ చేనేత దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. చేనేత వస్త్రాలను ఆదరిస్తామని, వాటిని ధరించి చేనేత కార్మికులకు చేయూత అందిస్తామని అందరితో ప్రతిజ్ఞ చేయించారు. చేనేత రంగం అభివృధికి ప్రభుత్వంతో ఓ ప్రణాళికతో ముందుకు వెళుతుందని తెలిపారు. నేత కళకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తీసుకొచ్చేందుకు శాశ్వత పథకాల రూపకల్పన చేస్తున్నట్టు వెల్లడించారు. 2024-25 బడ్జెట్‌లో 36,133 చేనేత కార్మికులకు లబ్ధి చేకూరేలా రూ.90 కోట్లు కేటాయించామని తుమ్మల పేర్కొన్నారు. నేతన్నల బీమా కోసం ఈ ఆర్థిక సంవత్సరానికి రూ.15 కోట్లు కేటాయించామన్నారు. నేతన్న డెత్ క్లెయిమ్స్ కింద ఇప్పటివరకు 124 మందికి రూ.6.20 కోట్లను వారి నామినీ ఖాతాలకు బదిలీ చేశామని చెప్పారు.నేతన్నల జీవితాల్లో వెలుగులు నింపే బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు.

ఎక్కడ చెట్లు కొట్టేశారో.. అక్కడే మొక్కలు నాటండి!

- అటవీ భూముల ఆక్రమణకు యత్నించిన నిందితులకు హైకోర్టు వినూత్న శిక్ష..

హైదరాబాద్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): అటవీ భూములు ఆక్రమించే ఉద్దేశంతో చెట్లు నరికి అటవీ అధికారులకు దొరికిపోయిన నిందితులకు హైకోర్టు వినూత్న శిక్ష విధించింది. నిందితులు చదును చేసిన అటవీ భూభాగంలోనే మళ్లీ పచ్చదనం పెంచడానికి.. 200 మొక్కలు నాటాలని ఆదేశించింది. మంచిర్యాల జిల్లా జిల్లెడ మండలం నాగారం గ్రామానికి చెందిన మాడె మల్లేశ్, ఇతరులు కుష్నేపల్లి రేంజ్ లింగాల సెక్షన్ గ్గైరెల్లి ఆర్ఎఫ్ బ్లాక్‌లో అటవీ భూములు ఆక్రమించేందుకు దాదాపు రెండెకరాల్లో చెట్లు నరికేశారు. దీంతో అటవీశాఖ అధికారులు కేసులు నమోదు చేయడంతోపాటు పిటిషనర్ ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ నేపథ్యంలోనే తన ట్రాక్టర్ కోసం మల్లేశ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం.. అడవులను ఆక్రమించాలని ప్రయత్నిస్తున్న నేరగాళ్లు, పెద్ద పెద్ద ప్రాజెక్టుల వల్ల అటవీ భూముల విస్తీర్ణం రోజురోజుకీ తగ్గిపోతోందని.. హైకోర్టు, సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలు అమలు కావడం లేదని ఆందోళన వ్యక్తం చేసింది. ఇప్పటినుంచి అటవీ నిర్మూలనకు పాల్పడిన వారే.. అంతేస్థాయిలో అడవి పెరిగేలా మొక్కలు నాటాల్సి ఉంటుందని పేర్కొంది. ఈ మేరకు అటవీ అధికారులు రెండు ఎకరాలకు సరిపోయేలా 200 మొక్కలు పిటిషనర్‌కు అందజేయాలని.. పిటిషనర్ ఆ మొక్కలు నాటాలని ఆదేశించింది. అలాగే తగిన పూచీకత్తు, వాహనం విక్రయించబోననేలా అఫిడవిట్ తీసుకుని ట్రాక్టర్ వదిలేయాలని ఆదేశాలు జారీ చేసింది.

న్యాయవాదులపై దాడి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోండి..

- డీజీపీకి హైకోర్టు బార్ అసోసియేషన్ లేఖ

హైదరాబాద్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జనగామ పోలీస్ స్టేషన్‌లో ఇద్దరు న్యాయవాదులపై దాడి చేసిన పోలీసులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడంతో పాటు సస్పెండ్ చేయాలని కోరుతూ హైకోర్టు బార్ అసోసియేషన్ డీజీపీకి లేఖ రాసింది. ఘటనపై ఎస్పీ స్థాయి అధికారితో విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేసింది. న్యాయవాదులు అమృతరావు, కవితలపై పోలీసుల దాడిని ఖండిస్తూ బుధవారంహైకోర్టు గేటు ముందు బార్ అసోసియేషన్ నిరసన కార్యక్రమం నిర్వహించింది. అనంతరం సర్వ సభ్య సమావేశం నిర్వహించి.. దాడికి పాల్పడిన పోలీసులపై చర్యలు తీసుకోవాలంటూ తీర్మానం చేసింది. కార్యక్రమంలో హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి ఇతర సభ్యులు పాల్గొన్నారు. మరోవైపు, దాడికి బాధ్యులైన పోలీసులపై చర్యలు తీసుకోవాలని బార్ కౌన్సిల్ ఛైర్మన్ నర్సింహారెడ్డి, టీపీసీసీ న్యాయవిభాగం ఛైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్ డీజీపీకి లేఖలు రాశారు.

గైడ్‌కాస్ట్‌లో 2వ ఎపిసోడ్‌ను విడుదల చేసిన నారాయణ

హైదరాబాద్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల మానసిక ఆరోగ్యం మెరుగుదలకు తీసుకుంటున్న చర్యల్లో భాగంగా గైడ్‌కాస్ట్‌లోని రెండవ ఎపిసోడ్‌ను యూట్యూబ్ వేదికగా విడుదల చేసినట్టు నారాయణ విద్యా సంస్థల డైరెక్టర్లు శరణి, సింధూరలు తెలిపారు. ఈ గైడ్‌కాస్ట్‌లో పిల్లల స్నేహాల విషయంలో తల్లిదండ్రుల పాత్ర, గొప్ప స్నేహాలు పెంపొందించటంలో తల్లిదండ్రులు ఎలా సహాయం చేయవచ్చు ? అనే అంశాలపై చర్చించినట్లు వారు చెప్పారు. ఈ గైడ్‌కాస్ట్‌లో ప్రముఖ సైకాలజీ నిపుణురాలు విజయలక్ష్మి తన అభిప్రాయాలను పంచుకున్నట్టు పేర్కొన్నారు. స్నేహాల్లో చాలా భావోద్వేగాలు ఇమిడి ఉంటాయని, కౌమారదశలో భావోద్వేగాల తీవ్రత అధికంగా ఉంటుందని ఆమె వివరించినట్టు తెలిపారు.

10 రోజులు కాకముందే కోర్టుకొచ్చారు!

- బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పిటిషన్లు కొట్టేయండి
- పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల వాదన

హైదరాబాద్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచి కాంగ్రెస్ పార్టీలోకి ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేసేలా శాసనసభ స్పీకర్‌కు ఆదేశాలివ్వాలంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు దాఖలు చేసిన పిటిషన్లపై హైకోర్టులో వాదనలు ముగిశాయి. బీఆర్ఎస్ పార్టీ తరఫున పోటీ చేసి గెలిచిన దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావుపై అనర్హత వేటు వేయాలంటూ ఆ పార్టీ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, కేపీ వివేకానంద్, బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఈ పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై వాదనలు ముగియడంతో తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి బుధవారం ప్రకటించారు. పార్టీ మారిన ఎమ్మెల్యేల తరఫున సీనియర్ న్యాయవాది మయూర్‌రెడ్డి వాదనలు వినిపించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అనర్హత పిటిషన్లు దాఖలు చేసిన పదిరోజులకే హైకోర్టును ఆశ్రయించారని.. స్పీకర్ కార్యాలయం అనర్హత పిటిషన్లు స్వీకరించడం లేదనేది బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ప్రధాన ఫిర్యాదు అని తెలిపారు. కోర్టు జోక్యంతో వారి అనర్హత పిటిషన్లను స్వీకరించిన స్పీకర్ కార్యాలయం.. రశీదులు సైతం ఇచ్చిందని చెప్పారు. దాంతో పిటిషనర్ల ఉద్దేశం నెరవేరిందన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల తరఫు న్యాయవాదులు ఎక్కువగా ప్రస్తావిస్తున్న సుప్రీంకోర్టు తీర్పు కైశం మేఘాచంద్రసింగ్ కేసులో మూడు నెలల గడువు తీరిన తర్వాత పిటిషన్ దాఖలు చేసినట్లు పేర్కొన్నారు. ప్రస్తుత కేసులో 10 రోజులు కూడా గడవకముందే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కోర్టును ఆశ్రయించారని, దురుద్దేశంతో వ్యవహరించిన వారి పిటిషన్లను కొట్టివేయాలని కోరారు. ఇరుపక్షాల వాదనలు ముగియడంతో న్యాయస్థానం తీర్పును రిజర్వ్ చేసింది.

తమ్ముళ్ల వ్యాపారం కోసమే రేవంత్ అమెరికా పర్యటన

- స్వచ్ఛ బయో సంస్థ రేవంత్‌రెడ్డి తమ్ముడిదే
- బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ ఆరోపణ

హైదరాబాద్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటకు వెళ్లింది ఆయన తమ్ముళ్ల వ్యాపారం కోసమేనని బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ ఆరోపించారు. ఈమేరకు బుధవారం తెలంగాణ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో రూ.వెయ్యి కోట్లతో పెట్టుబడి పెడతామంటున్న స్వచ్ఛ బయో కంపెనీ సీఎం తమ్ముడిదేనన్నారు. రేవంత్ తన తమ్ముళ్లను సెటిల్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. 15 రోజుల కిందట పెట్టిన కంపెనీ నుంచి రూ. వెయ్యికోట్ల పెట్టుబడులు తెస్తున్నట్లు చూపిస్తున్నారన్నారు. ఇప్పటికైనా రేవంత్‌రెడ్డి ఫ్రాడ్ పనులు మానుకొని రాష్ట్ర ప్రగతికోసం పాటుపడాలని క్రిశాంక్ సూచించారు.

కాంగ్రెస్ రాజ్యసభ అభ్యర్థి అభిషేక్ సింఘ్వీ!

(మొదటిపేజీ తరువాయి)

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రాజ్యసభ స్థానాలకు ఇవి రెండోసారి ఎన్నికలు. ఇంతకుమందు రెండు రాజ్యసభ స్థానాలు కాంగ్రెస్‌కు దక్కగా.. రెండింటినీ తెలంగాణకు చెందిన నేతలకే ఇచ్చారు. వీరిలో ఒకరు సీనియర్ నాయకులు రేణుకాచౌదరి కాగా, మరొకరు యువనేత ఎం.అనిల్ కుమార్ యాదవ్. అప్పట్లో సామాజిక సమీకరణాల నేపథ్యంలో ఈ రెండు పదవులకు రాష్ట్రానికి చెందిన నేతలనే ఎంపిక చేశారు. తాజాగా భర్తీ చేయనున్న స్థానాన్ని మాత్రం ఏఐసీసీ కోటా కింద తీసుకోవాలని అధిష్ఠానం నిర్ణయించినట్టు తెలిసింది.

10 మంది లోక్‌సభకు ఎన్నిక కావడంతో..

రాజ్యసభకు ఉప ఎన్నికలు జరగనున్న 12 స్థానా ల్లో.. 10 స్థానాలు వివిధ రాష్ట్రాలకు చెందిన సభ్యులు ఇటీవల లోక్‌సభకు ఎన్నికవడంతో ఖాళీ అయ్యాయి. ఇందులో అసోం, హరియాణా, బిహార్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్, త్రిపుర నుంచి ఖాళీ అయిన స్థానాలున్నాయి. ఇక తెలంగాణ నుంచి కేశవరావు రాజీనామాతో ఒక స్థానానికి, ఒడిసాకు చెందిన బీజేడీ సభ్యుడు రాజీనామా చేయడంతో మరో స్థానానికి ఉప ఎన్నికలు వచ్చాయి.

జస్టిస్ పీసీ ఘోష్‌కు ఫైళ్లే కాదు..జీతమూ ఇస్తలేరు



మూణ్నెల్లుగా ఆర్థికశాఖ వద్దే ఆగిన ఫైలు

హైదరాబాద్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ఎత్తిపోతల పథకంపై విచారణ జరుపుతున్న జస్టిస్ పినాకి చంద్ర ఘోష్‌కు మూడు నెలలుగా జీతం చేతికి రాలేదు. ఆయన జీతభత్యాల ఫైలు ఆర్థిక శాఖలో ఆగిపోవడమే దీనికి కారణం. విచారణ విధివిధానాల కోసం జీవో ఇచ్చిన ప్రభుత్వం.. ఆయన జీతభత్యాలకు సంబంధించి కూడా మరో జీవోను జారీచేయాల్సి ఉంది. ఆ జీవో ఆధారంగా జీతాల బిల్లును సిద్ధం చేసి, ట్రెజరీకి పంపాలి. అయితే, ఆ జీవో జారీ చేయాలంటే సంబంధిత ఫైలుకు ఆర్థిక శాఖ ఆమోదం లభించాలి. ఆ ఫైలు కొద్దిరోజుల క్రితమే ఆర్థిక శాఖకు చేరినా.. ఆమోదం మాత్రం పొందలేకపోయింది. కారణాలేవైనాగానీ.. జస్టిస్ పీసీ ఘోష్‌కు మే, జూన్, జూలై నెలల జీతాలు అందలేదు. వెంటపడి అడిగితే తప్ప ఆర్థిక శాఖలో ఏ ఫైలూ ముందుకు కదలదన్న అపప్రథ ఉంది. కానీ, సుప్రీంకోర్టు జడ్జిగా పనిచేసిన జస్టిస్ పీసీ ఘోష్.. దాని గురించి అధికారుల వద్ద ఆరా తీయడం తప్ప ఆర్థిక శాఖ వెంటపడలేరు. ఆయన పదవీ కాలం జూన్ 30తో ముగియగా.. మరో రెండు నెలలపాటు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. అదీ ఆగస్టు నెలాఖరుతో ముగియనుంది. ఆలోగా 3 నెలల జీతం ఆయన చేతికి అందుతుందా? లేదా.. వేచిచూడాల్సిందే.

ఇదీ నిబంధన..

కమిషనర్ ఆఫ్ ఎంక్వయిరీస్ చట్టం ప్రకారం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి లేదా సుప్రీంకోర్టు న్యాయమూర్తిని విచారణ కమిషన్‌కు ఛైర్మన్‌గా నియమిస్తే.. సర్వీసులో ఉండగా అందుకునే మొత్తాన్ని అంటే దాదాపు నెలకు రూ.5.10 లక్షలను వేతనంగా అందించాల్సిన అవసరం ఉంటుంది. పదవీ విరమణ చేసిన తర్వాత ఇవ్వాల్సిన జీతంపై ప్రభుత్వం స్పష్టత ఇచ్చినా ఆర్థిక శాఖ మాత్రం పెండింగ్‌లో పెట్టడం గమనార్హం. కాగా.. విచారణ ప్రారంభమైన నాటినుంచి కూడా అధికారుల తీరుపై జస్టిస్ పీసీ ఘోష్ ఆగ్రహంతోనే ఉన్నారు. విచారణకు సహకరించట్లేదని.. కోరిన ఫైళ్లు ఇవ్వకుండా దాస్తున్నారని ఆయన గుర్తించారు. ఓ దశలో నీటిపారుదల శాఖ అధికారుల తీరుపై తీవ్రస్థాయిలో ఆగ్రహం కూడా వ్యక్తం చేశారు. 'ఫైళ్లు ఇవ్వకూడదని నిర్ణయం తీసుకుంటే... విచారణ బాధ్యతలు ఎందుకు అప్పగించారు' అంటూ మండిపడ్డారు. విచారణకు హాజరైన వారంతా కోటరీగా ఏర్పడి, వాస్తవ సమాచారం కాకుండా ఎంచుకున్న సమాచారమే అందించారని కూడా ఆయన గుర్తించారు. ఇక కమిషన్‌కు సహాయంగా వేసిన నిపుణుల కమిటీ కూడా.. తాము కోరిన సమాచారం శాఖ అందించలేదని కమిషన్‌కు నివేదించిన సంగతి తెలిసిందే.

ఆర్థికవృద్ధిలో గనుల పాత్ర కీలకం

కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి.. మైనింగ్ సంస్థలకు 5 స్టార్ రేటింగ్ ప్రదానం

- తెలంగాణలో 5, ఏపీలో 5 గనులకు అందజేత

న్యూఢిల్లీ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): దేశ ఆర్థికాభివృద్ధిలో గనుల రంగం పోషిస్తున్న పాత్ర కీలకమని, రానున్న రోజుల్లో దేశం గనుల రంగంలో స్వయం సమృద్ధి సాధించే దిశగా మరింత కృషి జరగాలని కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు. దేశంలో ఎక్కువ మందికి ఉపాధి కల్పిస్తున్న రంగాల్లో మైనింగ్ పరిశ్రమ ఒకటని అన్నారు. బుధవారం ఢిల్లీలోని అంబేడ్కర్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో దేశవ్యాప్తంగా అత్యున్నత ప్రమాణాలతో, సుస్థిరాభివృద్ధి నిబంధనలకు అనుగుణంగా మైనింగ్ చేస్తున్న 68 సంస్థలకు కేంద్ర మంత్రి 5 స్టార్ అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడారు. మైనింగ్ వ్యవస్థను మరింత పటిష్ఠం చేసేందుకు ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఓ వర్క్ షాప్ నిర్వహించారని గుర్తు చేశారు. ఆ కార్యక్రమంలో మైనింగ్ పరిశ్రమ ప్రతినిధులు ఇచ్చిన సూచనల ఆధారంగా కొత్త నిబంధలను నిర్దేశించుకుని పనిచేస్తున్నామని చెప్పారు. క్రిటికల్ మినరల్స్‌ను విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నామని, మన దేశంలో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటే దిగుమతి చేసుకోవాల్సిన అవసరం ఉండదని తెలిపారు. కాగా, కేంద్రం నుంచి 5 స్టార్ అవార్డులు పొందిన జాబితాలో తెలంగాణ నుంచి 5, ఆంధ్రప్రదేశ్ నుంచి 5 మైనింగ్ సంస్థలు ఉన్నాయి. ఏపీ నుంచి భారతి సిమెంట్స్ లైమ్ స్టోన్ మైన్(కడప), జేఎస్ డబ్ల్యూ సిమెంట్స్ లైమ్ స్టోన్ మైన్(నంద్యాల), దాల్మియా సిమెంట్స్ నవాబ్‌పేట(తలమంచిపట్నం), అల్ట్రాటెక్(తుమ్మలపెంట), శ్రీ జయజ్యోతి(మైహోం) సిమెంట్స్ (కర్నూల్)ఉన్నాయి. తెలంగాణ నుంచి మైహోం(చౌటుపల్లి-1), టీఎస్ఎండీసీ దేవాపూర్ (మంచిర్యాల), మైహోం (మేళ్ల చెరువు), రైన్ సిమెంట్స్(నల్లగొండ), సాగర్ సిమెంట్స్(నల్లగొండ)ఉన్నాయి.



ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి



మోదీని కలిసిన ఎంపీలు విశ్వేశ్వర్‌రెడ్డి, ఈటల, రఘునందన్, నగేశ్

రాష్ట్రానికి 48 వేల కోట్ల లబ్ధి: రఘునందన్

తెలంగాణకు డైరెక్ట్ ఫండ్ కింద కేంద్రం నుంచి రూ.48 వేల కోట్లు వచ్చాయని, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం తప్పుడు ప్రచారం చేస్తోందని బీజేపీ ఎంపీ రఘునందన్ రావు తెలిపారు. బుధవారం లోక్‌సభలో ఆయన మాట్లాడారు. కేంద్రం ఎన్ని నిధులిచ్చినా గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు చెప్పడం లేదన్నారు. అవి తమ పథకాలుగా ప్రజలను మభ్యపెడుతున్నాయని ఆరోపించారు. గతంలో డబుల్ బెడ్ రూం ఇళ్లు, ఇప్పుడు ఇందిరమ్మ ఇళ్లని చెబుతున్నారని.. వాటికి నిధులు ఇస్తున్నది కేంద్ర ప్రభుత్వమేనని చెప్పారు.

ప్రధానిని కలిసిన రాష్ట్ర బీజేపీ ఎంపీలు

ప్రధాని మోదీని బుధవారం లోక్‌సభలో ఎంపీలు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఈటల రాజేందర్, రఘునందన్ రావు, గొడం నగేశ్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర రాజకీయాల గురించి చర్చించారు. తెలంగాణకు మరింత ఆర్థిక చేయూతనివ్వాలని మోదీని కోరారు. రాష్ట్రంలో బీజేపీని మరింత బలోపేతం చేయాలని ఎంపీలకు మోదీ సూచించారు. రాష్ట్రాభివృద్ధికి సహాయ, సహకారాలు అందిస్తామని చెప్పారు. ధైర్యంగా ఉండాలని, అన్ని వేళలా తాను అండగా ఉంటానని భరోసానిచ్చారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా మోదీని రఘునందన్ రావు నూలు పోగుల దండతో సత్కరించారు.

జేఎన్‌టీయూలో డిజిలాకర్ వ్యవస్థ!

- వర్సిటీ ఉన్నతాధికారులతో డిజిటల్ ఇండియా ప్రతినిధుల భేటీ
- ఫిజికల్ సర్టిఫికెట్ల విధానానికి చెల్లు!

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): చేతిలో ఫైళ్లు, వాటిలో తమ విద్యాభ్యాసానికి సంబంధించిన బోలెడన్ని సర్టిఫికెట్లతో అడ్మిషన్ల కౌన్సెలింగ్‌కు విద్యార్థులు వెళ్తుంటారు. అయితే త్వరలోనే ఈ తరహా (ఫిజికల్ సర్టిఫికెట్ల) విధానానికి స్వస్తి పలికేందుకు జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (జేఎన్‌టీయూ) సిద్ధమవుతోంది. దేశ ంలోని అన్ని ప్రభుత్వ విద్యా సంస్థలను డిజిటలైజ్ చేయడంలో భాగంగా కేంద్ర ఐటీ మంత్రిత్వశాఖ నుంచి వచ్చిన డిజిటల్ ఇండియా ప్రతినిధులు తాజాగా జేఎన్‌టీయూకు వచ్చారు. వర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీ.వి.నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో కంప్యూటర్ సైన్స్ విభాగం ప్రొఫెసర్లు డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ సుప్రీతి, నాగరత్న తదితరులతో డిజిటల్ ఇండియా ప్రతినిధులు కశ్యప్, గౌరవ్ భేటీ అయ్యారు. వచ్చే డిసెంబరులోగా డిజిలాకర్ వ్యవస్థను జేఎన్‌టీయూ అనుబంధ, అఫిలియేటెడ్ కళాశాలల్లో అమలుకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. డిజిలాకర్ విధానంతో ఇకపై వివిధ సంస్థల్లో ఉద్యోగాలు, అడ్మిషన్ల కోసం వెళ్లేటప్పుడు సర్టిఫికెట్లను వెంట తీసుకెళ్లాల్సిన అవసరం ఉండదని అధికారులు పేర్కొన్నారు. దీనివల్ల విద్యా సంస్థల్లో సర్టిఫికెట్ల ముద్రణకు అయ్యే వ్యయప్రయాసలను నివారించవచ్చన్నారు. పలు ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థల్లో ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన, నిర్ధారణ కోసం ఆయా సంస్థలు తమకు పంపుతున్నాయని ప్రిన్సిపాల్ నర్సింహారెడ్డి పేర్కొన్నారు. డిజిలాకర్ వ్యవస్థ అమలైతే వెరిఫికేషన్ కోసం అభ్యర్థులు ఎలాంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం ఉండదన్నారు. వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ బుర్రా వెంకటేశం సూచనల మేరకు డిజిలాకర్ విధానాన్ని ఇంజనీరింగ్ కాలేజీలో వీలైనంత త్వరగా అమలు చేయనున్నట్లు తెలిపారు.

నేడే లోక్‌సభలో వక్ఫ్ బిల్లు

ప్రవేశపెట్టనున్నట్టు బీఏసీ భేటీలో తెలిపిన సర్కారు.. స్థాయీసంఘం పరిశీలనకు పంపాలన్న విపక్షాలు

న్యూఢిల్లీ, ఆగస్టు 7: వక్ఫ్ బోర్డు అధికారాలను పరిమితం చేయడంతోపాటు ముస్లిం మహిళలను, ముస్లిమేతరులనూ అందులో సభ్యులుగా చేసేలా రూపొందించిన 'ద వక్ఫ్ (సవరణ) బిల్లు'ను గురువారం లోక్‌సభలో ప్రవేశపెట్టేందుకు మోదీ సర్కారు సిద్ధమైంది. ఈ విషయాన్ని బుధవారం లోక్‌సభ బిజినెస్ అడ్వైజరీ కమిటీ(బీఏసీ)కి తెలియజేసింది. ఈ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టాక పార్లమెంటరీ స్థాయీసంఘం పరిశీలనకు పంపాలని బీఏసీలో పాల్గొన్న విపక్ష నేతలు గౌరవ్ గొగోయ్ (కాంగ్రెస్), సుదీప్ బందోపాధ్యాయ (టీఎంసీ) తదితరులు డిమాండ్ చేశారు. ఈ బిల్లుపై సభ స్పందన చూశాక దాన్ని స్థాయీ సంఘానికి పంపాలా వద్దా అనే నిర్ణయం తీసుకుంటామని బీఏసీకి ప్రభుత్వం వెల్లడించింది. విపక్షాలతోపాటు, పలు ముస్లిం సంస్థలు కూడా వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో ఈ బిల్లును ప్రభుత్వం పార్లమెంటరీ స్థాయీ సంఘం పరిశీలనకు పంపే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని రాజకీయ నిపుణులు భావిస్తున్నారు. ఎన్డీయేలోని కొన్ని పార్టీలు కూడా ఈ బిల్లుపై కొన్ని అభ్యంతరాలు వ్యక్తం చేసినట్టు విశ్వసనీయ సమాచారం. ఈ బిల్లును రూపొందించే ముందు ప్రభుత్వం పలువురు ముస్లిం మేధావులు, పండితులు, సంస్థలను సంప్రదించి.. వారి సలహాలు, సూచనలతో దాదాపు 44సవరణలు ప్రతిపాదించినట్టు సమాచారం.ఈ బిల్లును ప్రభుత్వం మంగళవారం రాత్రే లోక్‌సభ సభ్యులకు అందజేసింది.

ఇవీ ప్రతిపాదనలు..

బిల్లులోని 'స్టేట్‌మెంట్ ఆఫ్ ఆబ్జెక్ట్స్ అండ్ రీజన్స్' విభాగంలో వక్ఫ్ చట్టంలోని వివాదాస్పద సెక్షన్ 40ని తొలగించాలనే ప్రతిపాదన ఉంది. ఏదైనా ఆస్తిని ఎలాంటి తనిఖీలు, విచారణలు లేకుండానే తనదిగా ప్రకటించుకునే/నిర్ణయించే నిరంకుశ అధికారాన్ని వక్ఫ్‌బోర్డుకు కట్టబెట్టే సెక్షన్ ఇది.

● ప్రస్తుత 'వక్ఫ్ యాక్ట్, 1995' చట్టం పేరును 'యూనిఫైడ్ వక్ఫ్ మేనేజ్‌మెంట్, ఎంపవర్‌మెంట్, ఎఫిషియెన్సీ అండ్ డెవలప్‌మెంట్ యాక్ట్, 1995'గా మార్చేలా కేంద్రం ఈ బిల్లులో ప్రతిపాదన చేసింది.



● వక్ఫ్ చట్టం అమల్లోకి రావడానికి ముందుగానీ, వచ్చిన తర్వాతగానీ ఏదైనా ప్రభుత్వ భూమిని వక్ఫ్ భూమిగా గుర్తించినా, ప్రకటించినా.. ఈ బిల్లులో చేసిన ప్రతిపాదన ప్రకారం దాన్ని వక్ఫ్ ఆస్తిగా పరిగణించరు. అది ఎవరి భూమో తేల్చే అధికారాన్ని కలెక్టర్లకు కట్టబెట్టారు. వారు విచారణ జరిపి నివేదిక ఇచ్చేదాకా అది వక్ఫ్ ఆస్తి కాదు. ఒకవేళ కలెక్టర్ ఆ భూమి ప్రభుత్వానిదే అని నివేదిక ఇస్తే ప్రభుత్వం ఆ నివేదికను వక్ఫ్‌బోర్డుకు పంపుతుంది. బోర్డు తన రికార్డుల్లో దాన్ని ప్రభుత్వ భూమిగా పేర్కొనాల్సి ఉంటుంది. కలెక్టర్ కూడా రెవెన్యూ రికార్డుల్లో దాన్ని ప్రభుత్వ భూమిగా పేర్కొనాలి. ప్రస్తుతం ఉన్న వక్ఫ్ యాక్ట్ 1995 ప్రకారం ఆ భూమి ప్రభుత్వానిదా? వక్ఫ్ బోర్డుదా? అనే విషయాన్ని తేల్చే అధికారం కేవలం వక్ఫ్ ట్రైబ్యునల్‌కు మాత్రమే ఉండేది. ఈ బిల్లు చట్టరూపం దాలిస్తే ఆ అవకాశం ఉండదు.

● చట్టబద్ధంగా తనది కాని ఆస్తులను ఎవరూ వక్ఫ్‌గా దానం చేయకూడదు. అలాగే నోటి మాటగా చేసే దానం చెల్లదు. ఏదైనా ఆస్తిని వక్ఫ్‌గా ఇవ్వాలంటే వక్ఫ్ డీడ్ తప్పనిసరి. ఇస్లామిక్ చట్టాల ప్రకారం నోటిమాటైనా సరిపోతుంది.

● వక్ఫ్ ఆస్తుల వివరాలను బోర్డులు తప్పనిసరిగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక పోర్టల్‌లో ఈ బిల్లు చట్టరూపం దాల్చిన 6 నెలల్లోగా నమోదు చేసుకోవాలి.

● ఇప్పటికే వక్ఫ్ తనవిగా ప్రకటించుకున్న వివాదాస్పద ఆస్తులపై కొత్తగా విచారణ చేయడం తప్పనిసరి. దీంతో భూమియజమానులపై స్పష్టత వస్తుంది.

● వక్ఫ్‌బోర్డుల పనితీరును సంస్కరించేలా వక్ఫ్ చట్టంలోని సెక్షన్9, సెక్షన్14లను సవరించాలని, నిర్ణయాలు తీసుకునే ప్రక్రియలో కేంద్ర వక్ఫ్ మండలిలో, రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల వక్ఫ్ బోర్డుల్లో ఇద్దరు చొప్పున ముస్లిం మహిళలు తప్పనిసరిగా ఉండాలని ప్రతిపాదించారు. బోర్డులో షియా, సున్నీ, బొహ్రా,అగాఖానీ, ముస్లింల్లో ఇతర వెనుకబడిన వర్గాలవారి నుంచి కనీసం ఒక్కొక్కరికి ప్రాతినిధ్యం కల్పించాలని పేర్కొన్నారు. బొహ్రాలు, ఆగాఖానీలకు 'బోర్డ్ ఆఫ్ ఔకాఫ్'ను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు.

వక్ఫ్ అంటే? వక్ఫ్ బోర్డు అంటే?

'ద వక్ఫ్ యాక్ట్, 1995 (2013లో సవరణ)' ప్రకారం.. ఇస్లాం మతాచారాలను, సంప్రదాయాలను పాటించేవారు షరియా గుర్తించిన ఆధ్యాత్మిక, దాతృత్వ, పవిత్ర కార్యకలాపాల నిమిత్తం తమకున్న స్థిర, చరాస్తులను శాశ్వతంగా అంకితం చేస్తే.. అలాంటి ఆస్తులను 'వక్ఫ్'గా వ్యవహరిస్తారు. వక్ఫ్‌కు బహువచనం ఔకాఫ్. అలాంటి ఆస్తులన్నింటినీ నిర్వహించేందుకు ఏర్పాటైనవే వక్ఫ్ బోర్డులు. 1954లో నెహ్రూ ప్రభుత్వం తొలిసారి వక్ఫ్ చట్టం తెచ్చింది. 1964, 1969, 1984 సంవత్సరాల్లో ఆ చట్టానికి సవరణలు చేశారు. 1995లో పీవీ నరసింహారావు హయాంలో ఆ చట్టం స్థానంలో వక్ఫ్ బోర్డులకు మరిన్ని అధికారాలు కట్టబెడుతూ కొత్త చట్టం తెచ్చారు. 2013లో మన్మోహన్ సింగ్ హయాంలో ఒక ఆస్తిని వక్ఫ్ ఆస్తిగా ప్రకటించే హక్కును బోర్డుకు కట్టబెడుతూ సవరణ చేశారు. 1995 వక్ఫ్‌చట్టం ప్రకారం ప్రతి రాష్ట్రం, కేంద్రపాలిత ప్రాంతంలో వక్ఫ్ బోర్డులు ఏర్పాటయ్యాయి. దేశంలో ప్రస్తుతం 30 వక్ఫ్‌బోర్డులున్నాయి. వక్ఫ్ బోర్డులకు దేశవ్యాప్తంగా 9.4 లక్షల ఎకరాల పరిధిలో 8.7 లక్షల ఆస్తులున్నాయి. వాటి విలువ రూ.1.2 లక్షల కోట్లు ఉంటుందని అంచనా.

ప్రైవేటు స్కూళ్లలో పేద విద్యార్థులకు 25 శాతం సీట్లివ్వండి

తెలంగాణ సహా 4 రాష్ట్రాలు ఆర్‌టీఈ నిబంధనను అమలు చేయడంలేదు: కేంద్రం

న్యూఢిల్లీ/హైదరాబాద్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు అన్ ఎయిడెడ్ స్కూళ్లలో పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించింది. విద్యాహక్కు చట్టం (ఆర్‌టీఈ) కింద తప్పనిసరిగా పాటించాల్సిన ఈ నిబంధనను తెలంగాణ, పంజాబ్, కేరళ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో అమలు చేయడంలేదని కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరి రాజ్యసభలో వెల్లడించారు. బుధవారం ప్రశ్నోత్తరాల సమయంలో భాగంగా కాంగ్రెస్ సభ్యుడు ప్రమోద్ తివారీ అడిగిన ప్రశ్నకు మంత్రి ఈ మేరకు సమాధానమిచ్చారు. ఇదే అంశంపై విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ కనీసం 12వ తరగతి దాకా తప్పక చదువుకునే అవకాశాన్ని విద్యాహక్కు చట్టం కల్పిస్తుందని, ఇది ఉమ్మడి జాబితాలోని అంశమే అయినా.. దీనిని అమలు చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలపైనే ఎక్కువగా ఉంటుందని అన్నారు. కాగా, ప్రైవేటు స్కూళ్లలో పేద విద్యార్థులకు 25 శాతం సీట్ల అంశంపై కేంద్రంతో సంప్రదింపులు జరిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం పలుమార్లు ప్రయత్నించినా స్పందన రాలేదని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. ఆర్‌టీఈ నిబంధన ప్రకారం.. ప్రతి కిలోమీటరుకు ఒక పాఠశాల ఉండాలని, ఈ పరిధిలో ప్రభుత్వ పాఠశాల లేనిచోట ప్రైవేటు స్కూల్‌లో 25 శాతం మంది విద్యార్థులను చేర్పించి.. వారి ఫీజును రాష్ట్ర ప్రభుత్వమే ఆయా యాజమాన్యాలకు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొంటున్నారు. అయితే ఈ మొత్తం ఫీజులో 40 శాతాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరిస్తే, 60 శాతం వాటాను కేంద్ర ప్రభుత్వం భరించాల్సి ఉంటుందని చెప్పారు. ఈ వాటాను తిరిగి రాష్ట్రానికి చెల్లించే అంశంపై కేంద్రానికి పలుమార్లు లేఖలు రాసినా స్పందించలేదని, 2010 నుంచి అంశంపై చర్చ జరుగుతూనే ఉందని పేర్కొన్నారు. దీనికితోడు ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాల్సిన అవసరం లేదన్న అభిప్రాయంతో సర్కారు ఉందని అంటున్నారు.

స్థిరాస్తి విక్రయదారులకు ఊరట

- ఎల్‌టీసీజీ పన్నుపై ఊరటనిచ్చిన కేంద్రం

న్యూఢిల్లీ, ఆగస్టు7: రియల్ ఎస్టేట్ రంగానికి సంబంధించి దీర్ఘకాలిక మూలధన లాభాల పన్ను విషయంలో కేంద్ర ప్రభుత్వం ఊరట కల్పించింది. స్థిరాస్తుల (రియల్టీ) అమ్మకంపై వచ్చే లాభాలపై పన్ను చెల్లింపుదారులు కొత్త పన్ను రేటుకు మారడానికి లేదా ద్రవ్యోల్బణం ఆధారితంగా లెక్కించే ఇండెక్సేషన్ ప్రయోజనంతో కూడిన పాత పన్ను విధానం ఎంచుకునే అవకాశం కల్పించింది. ఈ ఏడాది జూలై 23కు ముందు ఇళ్లు కొన్న వ్యక్తులు లేదా హిందూ అవిభాజ్య కుటుంబాలు నూతన విధానం కింద ఇండెక్సేషన్ లేకుండా 12.5% ఎల్‌టీసీజీ పన్ను చెల్లించవచ్చు లేదా ఇండెక్సేషన్ ప్రయోజనంతో 20%పన్నును ఎంచుకోవచ్చు. కాగా బుధవారం ఫైనాన్స్ బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది.

15న నింగిలోకి ఎస్ఎస్ఎల్వీ-డీ3 రాకెట్

- మరో ప్రయోగానికి సిద్ధమైన ఇస్రో

సూళ్లూరుపేట, ఆగస్టు7: ఇస్రో మరో రాకెట్ ప్రయోగానికి సన్నద్ధమవుతోంది. తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని షార్ నుంచి ఈ నెల 15న ఎస్ఎస్ఎల్వీ-డీ3 రాకెట్ ద్వారా భూ పరిశీలన ఉపగ్రహం ఈవోఎస్-08ను నింగిలోకి పంపనుంది. ఇప్పటికే ఈ ప్రయోగానికి సంబంధించిన ఏర్పాట్లలో శాస్త్రవేత్తలు నిమగ్నమయ్యారు. వాతావరణం అనుకూలిస్తే ఈనెల 15న ఉదయం 9.17గంటలకు ఎస్ఎస్ఎల్వీ-డీ3 రాకెట్ ఈవోఎస్-08తో నింగిలోకి ఎగరగనుంది. ఇస్రో రూపొందించిన ఈ ఉపగ్రహం బరువు 175.5 కిలోలు. ఎలక్ట్రో ఆప్టికల్ ఇన్‌ఫ్రారెడ్, గ్లోబల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టమ్-రిఫ్లెక్టోమెట్రీ (జీఎన్ఎస్ఎస్-ఆర్), ఎస్ఐసీ యూవీ డోసిమీటర్ అనే 3 పేలోడ్లను దీనిలో ఏర్పాటు చేశారు.

పాత పింఛను విధానానికి మారే చాన్స్ లేనట్టే

న్యూఢిల్లీ, ఆగస్టు7: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు ఇకపై ఎన్‌పీఎస్(జాతీయ పింఛను విధానం)నుంచి పాత పింఛను విధానంలోకి మారలేరు. ఎన్‌పీఎస్ నుంచి పాత పింఛను విధానంలోకి మారేందుకు ఇచ్చిన గడువును పొడిగించే ప్రతిపాదనలేదని లోక్‌సభలో ఓ ప్రశ్నకు సమాధానంగా కేంద్ర సిబ్బంది వ్యవహారాల శాఖ సహాయ మంత్రి జితేంద్రసింగ్ లిఖిత పూర్వక తెలిపారు. కేంద్ర ఉద్యోగులకు 2004 జనవరి1 తర్వాత కేంద్ర సర్వీసుల్లో చేరే ఉద్యోగులందరికీ (సైన్యంలో చేరేవారు కాకుండా) ఎన్‌పీఎస్‌ను తప్పనిసరి చేశారు. కోర్టు తీర్పులను అనుసరించి ఎన్‌పీఎస్ నోటిఫికేషన్ వెలువడకముందు జారీ అయిన ప్రకటనల ద్వారా ఉద్యోగ నియామకాలు పొందిన వారికి పాత పెన్షన్ విధానంలోకి మారేందుకు అవకాశమిస్తూ 2023 మార్చి3న నోటిఫికేషన్ జారీ అయింది. 2023 ఆగస్టు 21వరకు దరఖాస్తులు స్వీకరించారు. వాటిని పరిశీలించి, తుదినిర్ణయం తీసుకునేందుకు నియామక బోర్డులకు 2023 నవంబరు 30వరకు గడువిచ్చారు. దీన్ని పెంచే ప్రతిపాదనలేదని కేంద్రమంత్రి తెలిపారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి

దిక్సూచి

diksuchi@andhrajyothy.com

హైదరాబాద్ ● గురువారం 8 ఆగస్టు 2024



ఎన్ఎస్‌యూలో పార్ట్ టైం ప్రోగ్రామ్‌లు

తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం(ఎన్ఎస్‌యూ-సెంట్రల్ యూనివర్సిటీ)- పార్ట్ టైం ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. పీజీ డిప్లొమా, డిప్లొమా, సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి.

పీజీ డిప్లొమా

- ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. గరిష్ఠంగా నాలుగేళ్లలో పూర్తిచేయాల్సి ఉంటుంది. స్పెషలైజేషన్‌ను అనుసరించి ఆంగ్లం, సంస్కృతం, తెలుగు మాధ్యమాల్లో బోధన ఉంటుంది. ఉదయం, సాయంత్రం ఆరు గంటల నుంచి ఎనిమిది గంటల వరకు తరగతులు నిర్వహిస్తారు.

స్పెషలైజేషన్‌లు-సీట్లు-అర్హత: యోగా థెరపీ అండ్ స్ట్రెస్ మేనేజ్‌మెంట్, యోగా విజ్ఞాన ప్రోగ్రామ్‌లలో ఒక్కోదానిలో 44 సీట్లు ఉన్నాయి. ఒక్కోదానిలో 22 సీట్లను ఎన్ఎస్‌యూ అభ్యర్థులకు ప్రత్యేకించారు. మిగిలిన సీట్లకు దేశవ్యాప్తంగా అభ్యర్థులందరూ పోటీపడవచ్చు. అభ్యర్థుల వయసు ఆగస్టు 15 నాటికి 40 ఏళ్లు మించకూడదు. ద్వితీయ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. సంస్కృతం ఒక సబ్జెక్ట్‌గా చదివినవారికి/సంస్కృతంలో ప్రావీణ్యం ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది. అభ్యర్థులందరూ ఫిజికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్ సబ్మిట్ చేయాలి. ఎంట్రెన్స్ టెస్ట్, ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. కర్మకాండలో 33, నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్‌లో 22, వెబ్ టెక్నాలజీలో 22 సీట్లు ఉన్నాయి. అకడమిక్ మెరిట్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు. కర్మకాండలో ప్రవేశానికి సంబంధిత డిప్లొమా; నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్‌కు ఆచార్య లేదా సంస్కృతంలో పీజీ పూర్తి చేసి ఉండాలి. వెబ్ టెక్నాలజీకి ఆచార్య/విద్యార్థి చదువుతున్నవారు అప్లయ్ చేసుకోవచ్చు. వయోపరిమితి నిబంధనలు లేవు.

డిప్లొమా

- ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. గరిష్ఠంగా రెండేళ్లలో పూర్తిచేయాలి. అకడమిక్ మెరిట్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు.

స్పెషలైజేషన్‌లు-సీట్లు-అర్హత: టెంపుల్ కల్చర్, యోగా స్పెషలైజేషన్‌లలో ఒక్కోదానిలో 44 సీట్లు ఉన్నాయి. ఒక్కోదానిలో 22 సీట్లను తిరుమల తిరుపతి దేవస్థానం ఉద్యోగులకు ప్రత్యేకించారు. మిగిలిన సీట్లకు దేశవ్యాప్తంగా అభ్యర్థులందరూ పోటీపడవచ్చు. టెంపుల్ కల్చర్‌కు ఏదేని డిగ్రీతోపాటు టెంపుల్ కల్చర్‌లో సర్టిఫికెట్ కోర్సు పూర్తిచేసినవారు లేదా ఏదేని పీజీ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. వయోపరిమితి నిబంధనలు లేవు. యోగాకు ప్రాక్ శాస్త్రి లేదా ఇంటర్ ఉత్తీర్ణులు అర్హులు. అభ్యర్థుల వయసు 17 నుంచి 40 ఏళ్ల మధ్య ఉండాలి. కర్మకాండలో 55 సీట్లు, జ్యోతిషం&వాస్తులో 22 సీట్లు ఉన్నాయి. సంబంధిత సర్టిఫికెట్ ప్రోగ్రామ్ పూర్తిచేసినవారు లేదా ప్రాక్ శాస్త్రి ఉత్తీర్ణులు, సంస్కృతం ఒక సబ్జెక్ట్‌గా ఇంటర్ పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. వయోపరిమితి నిబంధనలు లేవు. ట్రాన్స్‌లేషన్‌లో 22 సీట్లు ఉన్నాయి. ఏదేని డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు సంస్కృతంలో ప్రావీణ్యం ఉన్నవారు/ట్రాన్స్‌లేషన్‌లో సర్టిఫికెట్ ప్రోగ్రామ్ పూర్తిచేసినవారు అప్లయ్ చేసుకోవచ్చు. అభ్యర్థుల వయసు ఆగస్టు 15 నాటికి 20 ఏళ్లు నిండి ఉండాలి. యోగా ప్రోగ్రామ్‌నకు ఉదయం, సాయంత్రం ఆరు నుంచి ఏడు వరకు; మిగిలినవాటికి సాయంత్రం ఆరు నుంచి ఎనిమిది వరకు తరగతులు ఉంటాయి.

సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లు

- ప్రోగ్రామ్ వ్యవధి ఆర్నెల్లు. గరిష్ఠంగా రెండేళ్లలో పూర్తిచేయవచ్చు. వారానికి మూడు రోజులు సాయంత్రం ఆరు గంటల నుంచి ఎనిమిది గంటల వరకు తరగతులు ఉంటాయి. ఆంగ్లం, సంస్కృతం, తెలుగు మాధ్యమాల్లో బోధిస్తారు. అకడమిక్ మెరిట్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు.


స్పెషలైజేషన్‌లు-సీట్లు-అర్హత: టెంపుల్ కల్చర్ ప్రోగ్రామ్‌లో 44 సీట్లు ఉన్నాయి. వీటిలో 22 సీట్లను టీటీడీ ఉద్యోగులకు ప్రత్యేకించారు. ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. కర్మకాండ ప్రోగ్రామ్‌లో 44 సీట్లు ఉన్నాయి. పదోతరగతి ఉత్తీర్ణతతోపాటు సంస్కృతంలో పరిజ్ఞానం ఉన్నవారు అర్హులు. జ్యోతిషం, ట్రాన్స్‌లేషన్, మ్యూజిక్(ఓకల్), డ్యాన్స్(భరతనాట్యం), సితార్ ప్రోగ్రామ్‌లలో ఒక్కోదానిలో 22 సీట్లు; కమ్యూనికేటివ్ అండ్ ఫంక్షనల్ శాంస్క్రిట్‌లో 55 సీట్లు ఉన్నాయి. పదోతరగతి ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. వయోపరిమితి నిబంధనలు లేవు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.300
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 12
- **వెబ్‌సైట్:** www.nsktu.ac.in, nsktuadmission.samarth.edu.in

బిట్స్ పిలాని హైదరాబాద్‌లో రీసెర్చ్ ఎక్సలెన్స్ సెంటర్

బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్(బిట్స్) హైదరాబాద్ క్యాంపస్‌లో కొత్తగా జాతీయ భద్రతకు సంబంధించిన రీసెర్చ్ ఎక్సలెన్స్ సెంటర్ ప్రారంభం అయింది. దేశీ సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించడం ద్వారా జాతీయ భద్రతలో స్వావలంబన సాధించే దిశగా డీఆర్‌డీవో, ఇస్రో, డీఏఐ, త్రివిధ దళాలు, పారామిలిటరీ దళాలు, పోలీస్, రక్షణ శాఖకు చెందిన సంస్థలతో కలిసి ఈ సెంటర్ క్రియాశీల పాత్ర పోషించనుంది. ఇందులో భాగంగా మూడు దశల్లో శిక్షణ ఉంటుంది. ఈ శిక్షణ హైబ్రిడ్ విధానం(ఆన్‌లైన్/ఆఫ్‌లైన్)లో ఉంటుంది. మొదటి దశలో భాగంగా జాతీయ భద్రత విభాగంలోని వారికి నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ ఇస్తారు. రెండో దశలో సర్వీస్ పర్సనల్స్‌కి ప్రాక్టికల్ సొల్యూషన్స్‌పై పరిశోధన కార్యక్రమాలు ఉంటాయి. మూడోదశలో భాగంగా రక్షణ, అంతరిక్ష, వ్యూహాత్మక విభాగాల్లో స్టార్టప్‌లను ప్రోత్సహిస్తూ నూతన ఆవిష్కరణకు అవకాశం కల్పిస్తారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో మాజీ ఛైర్మన్ జీ.సతీష్‌రెడ్డి, డిఫెన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ బిహెచ్‌వీఎస్.నారాయణమూర్తి, బిట్స్ పిలాని వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ వి.రాంగోపాల్ రావు తదితరులు పాల్గొన్నారు.



ఎన్‌జీ రంగా వర్సిటీలో బీఎస్సీ ఆనర్స్

గుంటూరులోని ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ(ఏఎన్‌జీఆర్ఏయూ)- బీఎస్సీ ఆనర్స్ కమ్యూనిటీ సైన్స్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తు గడువు పొడిగించింది. ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. అకడమిక్ మెరిట్ ఆధారంగా లాంలోని కాలేజ్ ఆఫ్ కమ్యూనిటీ సైన్స్‌లో అడ్మిషన్స్ ఇస్తారు. ఈ కాలేజీకి ఐకార్ గుర్తింపు ఉంది. మొత్తం 83 సీట్లు ఉన్నాయి. ఈడబ్ల్యూఎస్ అభ్యర్థుల కోసం 10 శాతం సూపర్ న్యూమరరీ సీట్లు నిర్దేశించారు. గ్రామీణ అభ్యర్థుల కోసం 40 శాతం సీట్లు ప్రత్యేకించారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన పురుషులు, మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చు. హాస్టల్ సౌకర్యం ఉంది.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి బైపీసీ/ఎంపీసీ/ఎంబైపీసీ గ్రూప్ సబ్జెక్టులతో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి.

- మూడేళ్ల వ్యవధి గల డిప్లొమా(హోం సైన్స్) ఉత్తీర్ణులైన అభ్యర్థుల కోసం పది శాతం సూపర్ న్యూమరరీ సీట్లు(ఎనిమిది సీట్లు) ప్రత్యేకించారు. గ్రామీణ అభ్యర్థులకు కేటాయించిన సీట్లకు అప్లయ్ చేసుకోవాలంటే ఒకటోతరగతి నుంచి ఇంటర్ స్థాయి వరకు కనీసం నాలుగేళ్లు గ్రామ పాఠశాలల్లో చదివి ఉండాలి. సంబంధిత ధ్రువపత్రాన్ని సబ్మిట్ చేయాల్సి ఉంటుంది.
- అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 17 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 25 ఏళ్లు; దివ్యాంగులకు 27 ఏళ్లు మించకూడదు.
- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.2,000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000
- **పోస్ట్ ద్వారా దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** ఆగస్టు 13
- **చిరునామా:** రిజిస్ట్రార్, ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, లాం, గుంటూరు - 522034
- **వెబ్‌సైట్:** angrau.ac.in

రైట్ టు బి ఫర్గాటెన్ గోప్యత హక్కు!

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

మనసుకు అయ్యే గాయాన్ని మాన్పే శక్తి కాలానికి ఉందంటారు. అయితే ఆ గాయాన్ని పదేపదే జ్ఞప్తికి తెస్తుంటే? ఒకవేళ చేయని నేరానికి బలైనవారిని, ఆ నేరం వారు చేయలేదని రుజువైనప్పటికీ ఒకప్పుడు నేరారోపణ చేయబడ్డాడని నిరంతరం ప్రచారం చేస్తుంటే? సదరు వ్యక్తులకు ఉన్న వ్యక్తిగత స్వేచ్ఛను, గోప్యత స్వేచ్ఛను ఉల్లంఘించినట్లు కాదా?

ఇదే అంశం ఇటీవల ఒక కేసు రూపంలో సుప్రీంకోర్టు ముందుకు వచ్చింది. గతంలో లైంగికదాడి, మోసం కేసులో ఒక వ్యక్తిని దిగువ కోర్టు నేరస్థునిగా పేర్కొంటూ తీర్పునిచ్చింది. అయితే తదనంతర కాలంలో అతన్ని ఎగువకోర్టు నిర్దోషిగా ప్రకటించింది. కానీ లీగల్ సెర్చ్ పోర్టల్ 'ఇండియన్ ఖానూన్'లో దిగువకోర్టు ఇచ్చిన తీర్పు వివరాలు ప్రకటితమవుతుండటంతో సదరు వ్యక్తి దరఖాస్తు చేసుకున్న విదేశీ పౌరసత్వ అప్పీలును తిరస్కరించారు. ఈ ప్రకారం అతడు చేయని నేరానికి మళ్లీ మళ్లీ శిక్షించబడుతున్నట్లే. అదే అంశాన్ని ప్రస్తావిస్తూ ఆ వ్యక్తి మద్రాసు హైకోర్టును ఆశ్రయించి రైట్ టు బి ఫర్గాటెన్(మరచిపోవు హక్కు)ను అభ్యర్థించాడు. ఇండియన్ ఖానూన్ పోర్టల్ నుంచి తనకు సంబంధించిన తప్పుడు సమాచారాన్ని తొలగించమని ఆదేశించాల్సిందిగా కోరాడు. ఈ నేపథ్యంలో మద్రాసు హైకోర్టు ఇండియన్ ఖానూన్ సంస్థను సదరు వ్యక్తికి సంబంధించిన సమాచారాన్ని తొలగించమని ఆదేశిస్తూ తీర్పునిచ్చింది. ఇండియన్ ఖానూన్ పోర్టల్ ఈ తీర్పును సుప్రీంకోర్టులో సవాలు చేసింది.

ఇటీవల సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ అధ్యక్షతన ముగ్గురు సభ్యుల ధర్మాసనం ఈ కేసును విచారణకు స్వీకరించడంతో రైట్ టు బి ఫర్గాటెన్ అనే హక్కుకు సంబంధించి కొన్ని నిర్ధారణలు వెలువడనున్నాయి. అసలు రైట్ టు బి ఫర్గాటెన్ అనేది ప్రాథమిక హక్కు అవుతుందా? ఒకవేళ అయితే, అది రాజ్యాంగం ప్రసాదించిన ఇతర ప్రాథమిక హక్కులతో ఏవిధమైన సంబంధం కలిగి ఉంటుంది? అనే అంశాలను దేశ అత్యున్నత న్యాయస్థానం పరిశీలించనుంది.

ఈ తరుణంలో అసలు రైట్ టు బి ఫర్గాటెన్ అంటే ఏమిటి? ఎవరికి వర్తిస్తుంది? భారతదేశంలో దానికి గల చట్ట, న్యాయపరమైన పునాదులేవి? సదరు హక్కు లాభ - నష్టాలేమిటి? అనే అంశాలను పరిశీలిద్దాం.



● 'రైట్ టు బి ఫర్గాటెన్' అంటే?

అనవసరమైన లేదా అసందర్భమైన తన వ్యక్తిగత సమాచారాన్ని బహిరంగ సామాజిక వేదికల నుంచి అంటే ఇంటర్నెట్, సెర్చ్ ఇంజన్లు, డేటాబేస్‌లు, వెబ్‌సైట్లు, ఇతరత్రా ఏదైనా సమాచార మాధ్యమాల నుంచి తీసివేయించడానికి ఒక వ్యక్తికి గల హక్కునే రైట్ టు బి ఫర్గాటెన్ లేదా రైట్ టు బి ఎరేజర్ అంటారు.

ఒక వ్యక్తికి సంబంధించిన వ్యక్తిగత సమాచారాన్ని ఎటువంటి ఆవశ్యకత, చట్టపర అవసరం లేనప్పటికీ, అందరికీ బహిరంగంగా ఆ సమాచారాన్ని అందుబాటులో ఉంచి, అతని గోప్యతా హక్కును ఉల్లంఘించినప్పుడు ఒక వ్యక్తి రైట్ టు బి ఫర్గాటెన్(రీ) ఎరేజర్‌ను ఆశ్రయించే వీలుంది.

భారతదేశంలో ఈ హక్కుకు ఇతిమిద్ధ రూపం లేనప్పటికీ, యురోపియన్ యూనియన్ దేశాల్లో వారు తీసుకువచ్చిన 'జనరల్ డేటా ప్రొటెక్షన్ రెగ్యులేషన్(జీడీపీఆర్)' ఈ హక్కును యూరప్ ప్రజలకు అందిస్తోంది. అయితే భారతదేశంలో కూడా కొన్ని కోర్టు తీర్పుల్లో, హక్కుల్లో, చట్టాలు, బిల్లుల్లో ఈ హక్కు ప్రతిఫలిస్తోంది.

● భారతదేశంలో ప్రస్తావనలు

రైట్ టు బి ఫర్గాటెన్ అనే హక్కును, భారత రాజ్యాంగం కల్పిస్తున్న ప్రాథమిక హక్కుల్లోని, జీవించే హక్కు(ప్రకరణ 21)లో అంతర్భాగమైన గోప్యతాహక్కు పరిధిలోకి వచ్చే అంశంగా 'కె.ఎస్.పుట్టస్వామి వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా' కేసు (2017) తీర్పులో ప్రస్తావించింది. అంతేకాక కొన్ని హైకోర్టులు(ఢిల్లీ, కర్ణాటక) కూడా వివిధ కేసుల్లో ఇంచుమించు ఇదేవిధమైన తీర్పులు ఇచ్చి ఉన్నప్పటికీ, సుప్రీంకోర్టు కె.ఎస్.పుట్టస్వామి కేసు తీర్పులో ఇచ్చిన ప్రాథమిక నియమావళి రైట్ టు బి ఫర్గాటెన్‌కు ఒక ప్రాతిపదికను ఏర్పర్చింది. న్యాయవ్యవస్థకు ఒక మార్గదర్శనం చేసింది.

ఇక చట్టాలపరంగా తీసుకుంటే 'డిజిటల్ డేటా ప్రొటెక్షన్ యాక్ట్ (2023)'లో రైట్ టు బి ఫర్గాటెన్‌కు ఒక చట్ట ప్రాతిపదిక కనిపిస్తుంది. వ్యక్తుల వ్యక్తిగత సమాచారాన్ని డిజిటల్ స్పేస్‌లో వారు నియంత్రించుకోగల సౌలభ్య అంశం ఈ చట్టంలో ఉంది. ఏ వ్యక్తి గురించిన వ్యక్తిగత సమాచారం డిజిటల్ స్పేస్‌లో అతడి/ఆమె వ్యక్తిగత గోప్యతకు, ప్రతిష్ఠకు, భద్రతకు నష్టం కలిగించేదిగా ఉన్నప్పుడు దానిని తొలగించమని డేటా నిర్వాహకులను కోరవచ్చు. వారు తొలగించని పక్షంలో రెగ్యులేటరీ అథారిటీ(లేదా) న్యాయస్థానాలను ఆశ్రయించవచ్చు. అంతేకాక ప్రతిపాదిత పర్సనల్ డేటా ప్రొటెక్షన్ బిల్లు (2019)లో కూడా రైట్ టు బి ఫర్గాటెన్ గురించిన ప్రతిపాదన ఉంది.

● పరిమితులు

సుప్రీంకోర్టు నిర్దేశనల ప్రకారం, ఒక వ్యక్తి వ్యక్తిగత సమాచారం ఎటువంటి చట్టపరమైన ఆవశ్యకతను కలిగి లేనప్పుడు, అవసరత, సంబంధం కానీ ఇతరత్రా లేనప్పుడు, అసత్యమైనప్పుడు దానిని తొలగించుకునే హక్కు ను సదరు వ్యక్తి పొందుతాడు.

అయితే భావవ్యక్తీకరణ హక్కుతో ముడిపడినప్పుడు, చట్టపరమైన అవసరాలు గల సమాచారమైనప్పుడు, ప్రజా ప్రయోజనాల సంబంధితమైనప్పుడు రైట్ టు బి ఫర్గాటెన్ వర్తించదని కూడా విస్పష్టం చేయడం జరిగింది.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

లాభ-నష్టాలు

ఢిల్లీ హైకోర్టు వ్యాఖ్యానించినట్లు రైట్ టు ప్రైవసీ(గోప్యతా హక్కు) అనేది రైట్ టు ఇన్ఫర్మేషన్(సమాచార హక్కు)తో సమన్వయం కావాలి. జ్యుడీషియల్ రికార్డుల్లో పారదర్శకత ఉండాలి. అయితే ఇలాంటి సమన్వయం, పారదర్శకత సాధించడం కత్తి మీద సామే. కానీ వ్యక్తి శ్రేయస్సు దృష్ట్యా రైట్ టు బి ఫర్గాటెన్ ఎంత ఆవశ్యకమో, సమాచార స్వేచ్ఛ కూడా అంతే అవసరమనే వాద ప్రతివాదనలు కొన్ని లాభ-నష్టాలను బేరీజు వేస్తున్నాయి.

లాభాలు


- ★ నిరపరాధులు తమ గౌరవాన్ని కాపాడుకోవడానికి వీలవుతుంది.
- ★ సమాచారం తీవ్రంగా దుర్వినియోగం అవుతూ, అసత్యాలు, పాక్షిక సత్యాలు (ఉదా: ఫేక్ న్యూస్, రివేంజ్ పోర్న్, మార్ఫ్‌డ్ కంటెంట్) ప్రచారమవుతున్న నేటి డిజిటల్ యుగంలో రైట్ టు బి ఫర్గాటెన్ వంటి హక్కులు వ్యక్తి గౌరవాన్ని, గోప్యతను, ప్రతిష్ఠను రక్షిస్తాయి.
- ★ వ్యక్తిగత భద్రత, స్వేచ్ఛపరంగా అనవసర సమాచారం అందరికీ సులువుగా అందుబాటులో లేకుండా, మోసాలు, ఐడెంటిటీ తెఫ్ట్ వంటి వాటికి గురవకుండా రక్షణ లభిస్తుంది.
- ★ తమ వ్యక్తిగత అంశాలకు సంబంధించి నిజాలు, తాజా పరిణామాలు వ్యక్తులు ప్రకటించడానికి, తద్వారా వారి భావప్రకటన స్వేచ్ఛ పరిరక్షించడానికి, వ్యక్తిగత నష్టాలు నివారించడానికి, ప్రజలు తప్పుడు వార్తలతో ప్రభావం కాకుండా ఉండటానికి కూడా అవకాశం ఉంటుంది.

నష్టాలు

- ★ రైట్ టు బి ఫర్గాటెన్ ఒక ప్రాథమిక హక్కుగా లభిస్తు, తరచూ మరికొన్ని చట్టబద్ధ/ ప్రాథమిక హక్కులైన సమాచార హక్కు, భావప్రకటన స్వేచ్ఛ, పరిశోధన, పాత్రికేయ స్వేచ్ఛలతో సంఘర్షణ ఏర్పడుతుంది.
- ★ సాంకేతికంగా డిజిటల్ సంస్థలకు ఎన్నో సవాళ్లు ఎదురవుతాయి. భారీఎత్తున సమాచారం నిరంతరం తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడి ప్రత్యేక యంత్రాంగం, సాంకేతికతల ఆవశ్యకత ఏర్పడుతుంది.
- ★ సెర్చ్ ఇంజన్లు ఇచ్చే సమాచారం విపరీతంగా కుంచించబడుతుంది. ఒక అంశంతో అనేక ఉప అంశాలు ముడిపడి ఉన్నప్పుడు వ్యక్తిగత స్వేచ్ఛ/ రైట్ టు బి ఫర్గాటెన్ హక్కు కారణంగా అవి తొలగించాల్సి వస్తే సమాచారం అతుకుల బొంతగా తయారవుతుంది. సమాచారంలో నిరాటంకత లోపిస్తుంది.
- ★ బ్లాక్‌చైన్ టెక్నాలజీ వంటి అనేక అధునాతన సాంకేతికతల నేపథ్యంలో సమాచారాన్ని పూర్తిగా తొలగించడం, పునరావృతం కాకుండా చూడటం దుర్లభం.

ఇలాంటి వాదోపవాదాల/ లాభ-నష్టాల నేపథ్యంలో ప్రస్తుతం రైట్ టు బి ఫర్గాటెన్ అనేది ప్రాథమిక హక్కుల పరిధిలోకి వస్తుందా? ఒక హక్కుగా స్థిరీకరించి ప్రజలకు అందుతుందా అనే అంశాలతోపాటు ఇతర ప్రాథమిక హక్కుల పరిధిలోకి వెళ్లి సంఘర్షణ ఏర్పడినప్పుడు ఏమి చేయాలనే అంశాలు సుప్రీంకోర్టు పరిశీలనార్థం ఉన్న ఇండియన్ ఖానూన్ కేసు సముఖంగా తేలాల్సిందే. అయితే ప్రాథమిక హక్కుల పరిధి పెరుగుతున్న కొద్దీ వాటి మధ్య సంఘర్షణల విస్తృతి కూడా పెరుగుతుండటం గమనార్హం. ఇలాంటి సంఘర్షణలు నివారించాలంటే ప్రత్యేక చట్టాలు పట్టాలకెక్కాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.


లిటిల్స్




ప్రతిఫలాపేక్ష

ఒక రాజ్యంలో వేదమిత్రుడనే కవి ఉండేవాడు. అతను గొప్ప కవిత్వం రాసేవాడు, మంచి పండితుడు కూడా, కానీ అతను చాలా పేదవాడు. ఒకరోజు భట్టు అనే అతని స్నేహితుడు 'వేద మిత్రా.. నీ కవిత్వం అద్భుతంగా ఉంది. నువ్వు దీన్ని ఈ దేశపు రాజు గారికి వినిపిస్తే, నీకు పేదరికం అన్న మాటే తెలియదు' అన్నాడు. ఆ మాటలు విన్న వేద మిత్రుడు రాజుగారిని దర్శనం చేసుకుని, తన కవిత్వం వినిపించాడు. దానికి రాజుగారు మెచ్చి ఎన్నో బహుమానాలు ఇవ్వడమే కాకుండా, తన ఆస్థానంలో ఉద్యోగం కూడా ఇచ్చాడు. అలా కొన్నాళ్లు గడిచిన తర్వాత తనకు రాజాశ్రయం కోరమని సలహా ఇచ్చిన భట్టును కలిసి వేద మిత్రుడు ఇలా అన్నాడు 'మిత్రమా.. నేను రాజుగారి కొలువులో చేరిన తర్వాత ఇంతకుముందులాగా కవిత్వం రాయలేక పోతున్నాను అంటున్నారు. నాకు కూడా అలాగే అనిపిస్తోంది. ఎందుకంటావు? అని అడిగాడు. దానికి భట్టు 'వేద మిత్రా.. రాజు గారి వద్ద ఉద్యోగం రాక ముందు నువ్వు విలువైన బహుమానాలు కోసం లేదా ఒకరి మెప్పు కోసం కవిత్వం రాయలేదు. నీ కవిత్వాన్ని సరస్వతీ దేవిని ధ్యానించి దేవికి పూజలాగా భావించి రాశావు. కానీ ఇప్పుడు నీ దృష్టి అంతా ఎలాంటి కవిత్వం రాస్తే రాజుగారు ఎంత గొప్ప బహుమానాలు ఇస్తారా అనే దాని మీదే ఉంది. చేసే పని నిరంతరం ప్రతిఫలం ఆశించి చేస్తూ ఉంటే దాని నాణ్యత తగ్గిపోతుంది' అని చెప్పాడు. ఆ తర్వాత కొద్ది రోజులకే వేద మిత్రుడు మరలా మునుపటిలాగా సరస్వతీ దేవిని ధ్యానిస్తూ మంచి కవిత్వం రాశాడు.

సరైన నీడ ఏది?




10 తేడాలను కనుక్కోండి



ఎన్ని ఆవులు, ఎద్దులు ఉన్నాయి?



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 378

			5		
6				3	
	2			4	1
1	6			2	
	5				4
		6			

సుడోకు - 377 సమాధానం

1	4	3	2
3	2	4	1
4	1	2	3
2	3	1	4

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.